SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

**Digitized in 2006**
**by**
**Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.**
(http://www.thrinaina.com)

From the original owned by
**Sundarayya Vignana Kendram**
**and its partner Institutions**

as part of the
**British Library Endangered Archives Programme**
supported by the
**Lisbet Rausing Charitable Fund**

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

**Sundarayya Vignana Kendram,**
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

# COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

వాగ్భట

రసరత్నసముచ్ఛయము

బెజవాడ,1924

Record no. 1623

Vāgbhaṭa

Rasaratnasamucchayamu

Bejavāḍa, 1924

Record no. 1623

**SUNDARAYYA VIGNANA KENDRAM**
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

వాగ్భట.
రసరత్నసముచ్చయము / ఆంధ్రవ్యాఖ్యానకర్త చివుకుల సత్యనారాయణశాస్త్రి.- బెజవాడ : ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల,1924.
2, 4, iv, 269, 3 p. ; 21 cm.
Record no. 1623

Vāgbhaṭa.
Rasaratnasamucchayamu / Āṃdhravyākhyānakarta Civukula Satyanārāyaṇaśāstri.- Bejavāḍa : Āṃdhragranthālaya Mudrākṣaraśāla,1924.
2, 4, iv, 269, 3 p. ; 21 cm.
Record no. 1623

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB  Date filming began:

Sl no 301

Acc 8072

రసరత్న సముచ్ఛయము

వైద్య గ్రంథ

1623

032

ఆయుర్వేద గ్రంథరత్నములు:—తృతీయరత్నము

సంపాదకుఁడు: చి. సత్యనారాయణశాస్త్రి

30 MAY 1924

శ్రీమద్వాగ్భటాచార్య విరచిత

# రసరత్నసముచ్చయము

ఆంధ్ర వ్యాఖ్యానకర్త:

చిఫుకుల సత్యనారాయణశాస్త్రి,

నూజివీడు.

ఆయుర్వేద గ్రంథరత్నములు: — తృతీయరత్నము
సంపాదకుఁడు: చి, సత్యనారాయణశాస్త్రి.

శ్రీమద్వాగ్భటాచార్య విరచిత

# రసరత్నసముచ్చయము.

శ్రీమదుయ్యూరు సంస్థానపండితుఁడగు
చివుకుల సత్యనారాయణ శాస్త్రిగారిచే
వ్రాయబడిన ఆంధ్రవ్యాఖ్యాన సంకలితము.

నూజివీడు.

30 MAY 1924
1032

బెజవాడ:
ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాల (లిమిటెడ్) యందు
క. కోదండరామయ్యగారిచే
ముద్రింపబడియె.

1924

సర్వస్వామ్య సంకలితము] [వెల రు. 2-8-0.

S.no. 301
Acc 8072

శ్రీ శారదాంబాయై నమః

# విజ్ఞప్తి

వైద్యవిద్వాంసులారా!

నాప్త మిత్రులును, ఆంధ్రవైద్య సమ్మేళనపత్రికాసంపాదకులును నగు శ్రీమాన్ ప్రతివాది భయంకర కృష్ణమాచార్యులవారి యాజ్ఞానుసారముగ నేనీ రసరత్నసముచ్చయమునకు తెనుగువివరణము వ్రాయబూనితిని. నా కీగ్రంథరచనయందు అనేకసంశయములు, ఆటంకములు వాటిల్లినవి. కాని, ధన్వంతరికృపచే నెట్లో పూర్తియైనది.

ఈ గ్రంథమందు వాదవిద్యకు సంబంధించిన విషయములును, వైద్యవిద్యకు సంబంధించిన విషయములును కలిసియుండుటచే స్వయముగ కొన్ని ప్రక్రియలను చేసిచూచినగాని సంశయమువిడలేదు. మరికొన్ని వృద్ధులవలనను, కొన్నిటిని తంత్రాంతరములవలనను తీర్చుకొనదగిన సంశయములున్నవి. ఇందు కొంతవరకు శ్రీమాన్ ఆచార్యులవారు నాకు చాల సహాయమొనరించినందుల కనేకవందనములు

మనదేశమున వాదవిద్యయందు పనిచేసినవారును, చేయుచున్నవారును, ఆసక్తికలవారును కలరు. కాని సంపూర్ణసిద్ధినిబడసిన వారెవ్వరైన నుందురో! యేమొ! కారణమేమన, కొందరు తామ్రాదులందు రంగును కల్గించగలరు. మరికొందరు బరువెక్కించగలరు. మరికొందరు ద్రవకమున కాగునట్లు చేయగలరు. మరికొందరు గీటు తెప్పించగలరు. కాని అందరకు అన్నియును దెలియవు. ఒకరికి తెలిసినదానినొరులకు వారు చెప్పరు. అందుచే నీ విద్య యెవరికిని సాధ్యపడుచుండుట లేదని నా యభిప్రాయము. అందుచే నా యెరింగినంతవరకు పెద్దయుపదేశములును, స్వానుభూత ప్రక్రియలును అచ్చుపడక మూల

మూలలదాగిన "వాదమంజరి" మున్నగు గ్రంథస్థములగు కొన్ని విషయములను యీ గ్రంథమునం దచ్చటచ్చట వ్రాసినాడను. దీనివలన వాదజ్ఞుల కత్యంతసహాయము కలుగగలదని నానమ్మకము. మరియు నీ గ్రంథముయొక్క తాత్పర్యరచనయందు నా శ్రమము కెంత సార్థకతగలదో వైద్యపండితలోకమే నిర్ణయించవలెను.

ఈ గ్రంథముద్రణసమయమున ముద్రాశాలయందు నే నుండకపోవుటచే కొన్ని స్ఖాలిత్యములు పడినవి. అపార్థములనిచ్చు తప్పులను మాత్రమే శుద్ధపత్రికయందు జేర్చితిని. చదువరులు ముందుగా గ్రంథమును సవరించుకొన బ్రార్థించెదను.

ఇందలి యంత్రముల చిత్రములను వ్రాసియిచ్చిన నా మిత్రుడు ఆది వీరాస్వామికి కృతజ్ఞుడను. ఇందలి దోషములను తజ్జ్ఞులగువారు నాకు దెలిపినచో వందనములతో దిద్దుకొందును.

ఇట్లు వైద్యవిధేయుడు,

నూజివీడు
10—5—24

చి. సత్యనారాయణశాస్త్రి.
గ్రంథకర్త.

---

రసరత్నసముచ్చయమువిషయమై విద్వద్వైద్యుల

# యభిప్రాయములు

1-12-23 న ఏలూరుపురమున జరిగిన "ఆంధ్రవిద్వద్వైద్య పరిషత్తు" వారొసంగిన యభిప్రాయము.

"ఆంధ్రవిద్వద్వైద్య పరిషత్, ఏలూరు, 1-12-23.

గ్రంథవిమర్శనము:—రసరత్న సముచ్చయము.

30 MAY 1924

ఆంధ్రతాత్పర్యకర్త:—చివుకుల సత్యనారాయణశాస్త్రిగారు నూజవీడు.

ఈగ్రంథకర్తయగు చివుకుల సత్యనారాయణశాస్త్రిగారు తా యాంధ్రతాత్పర్యముగల "రసరత్నసముచ్చయ"మను గ్రంథమును యీపరిషత్తులో చక్కగా చదివిరి. సంశయముల నడిగినవారికి తగు సమాధానముల నిచ్చుచు చదివిరి. ఈగ్రంథము రసగ్రంథములలో నుత్తమమైనది. ఈగ్రంథ మిదివరలో గీర్వాణభాషయందుండుటచే నాంధ్రులకంతగా నుపయోగములోనికి రాలేదు. వీరు మూలమునకు సాధ్యమగునంతవరకు క్రమముగనే యాంధ్రతాత్పర్యమును వ్రాసిరి. కొన్ని ప్రకరణములయందు తాము స్వయముగా పరిశోధనగావించిన విషయములనుగూడ వివరించిరి. ఈగ్రంథమం దనేక సంశయములు కలవు. ఆ సంశయములనుగూర్చి చాలవరకు శ్రమచేసి వివరించిరి. మరియు నీగ్రంథమందు రసవాదవిషయమైన ప్రక్రియలను అనుభూతమైనవి యనేకము లిందు వ్రాయబడినవి. ఔషధపాకముల కుపయోగించు యంత్రముల చిత్రముల నిందువ్రాసిరి. పుటప్రకరణములు, పరిభాష చక్కగా విమర్శించిరి. కావున నీయాంధ్ర తాత్పర్యముగల రసరత్నసముచ్చయము ఆంధ్రలోకమునకు మిక్కిలి సహకారియగునని తలంచుచున్నాము.

బ్రహ్మ:—(Sd) విద్వాన్ కే. శేషశాస్త్రి,
ఆయుర్వేద రత్న ఇత్యాది-శృంగేరి.

పరీక్షకవర్గము:—

" 1. పప్పు పార్వతీశం M. A., B. S. C.
(శ్రీ గాంధి ఆంధ్రజాతీయ మహావిద్యాలయాచార్యులు.)

" 2. వైద్యరాజ ద్విభాష్యం వెంకటేశ్వర్లు.

" 3. వైద్యనిష్ణాత మర్ల నారాయణశాస్త్రి

" 4. ములుగు రామలింగయ్య,
ఆంధ్రాయుర్వేద మండలి మంత్రి.

" 5. రాజవైద్య అగ్నిహోత్రం విజయసారథిఆచార్యులు,
ఆంధ్రాయుర్వేద విద్యాపీఠ ఉపాధ్యక్షులు.

## సుప్రసిద్ధాయుర్వేద వైద్యులగు బ్రహ్మశ్రీ ప్రాణాచార్య చీమలకొండ సూర్యనారాయణ శాస్త్రిగారొసంగిన యభిప్రాయము.

"శ్రీవేదమూర్తులైన బ్రహ్మశ్రీ చివుకుల సత్యనారాయణశాస్త్రి గారికి— చీమలకొండ సూర్యనారాయణశాస్త్రి నమస్కారపూర్వకముగ వ్రాయువిజ్ఞాపనము.

ఆర్యవర్యా!

తాము లిఖించిన "రసరత్న సముచ్చయ" పూర్వభాగటీకను జూచితిని. పరిభాషాది ప్రకరణములకు శాస్త్రీయముగా రచించిన టీకనుజూడ మీసామర్థ్యము నొకరు వివరించ నవసరముండదు. ఇట్టి ప్రాచీనగ్రంథమును ఆంధ్రలోకమునకు సులభముగ దెలియునట్లు జేసినందున ఆంధ్రదేశమంతయు తమయెడల కృతజ్ఞులై యుందురని యే నాయభిప్రాయము.

3—12—23, తాడేపల్లిగూడెం } ఇట్లు, (Sd) చీమలకొండ సూర్యనారాయణశాస్త్రి."

---

## ఆంధ్రసాలగ్రామనిఘంటుకారులగు తిరుపూరు వెంకటాద్రిగారి యభిప్రాయము.

"బ్రహ్మశ్రీ వేదమూర్తులైన చివుకుల సత్యనారాయణ శాస్త్రిగారిచే ఆంధ్రవ్యాఖ్య వ్రాయబడిన వాగ్భటవిరచిత రసరత్నసముచ్చయమును చూచితిని. ఇందు మహారస, ఉపరస, సాధారణరస, ధాతు, శోధనమారణాదులు, యంత్రములు బాగుగా వ్రాయబడినవి. మరియు సాంప్రదాయభేదముల గుర్తెరుగుటకై సూతేంద్రసిద్ధి, రసార్ణవము, రససంకేతకలిక, రససారము, రసహృదయము, ఆయుర్వేద ప్రకాశము, రసమంజరి, రసరాజలక్ష్మి, రసేంద్రభాస్కరము, సిద్ధలక్ష్మీశ్వరతంత్రము, రసపద్ధతి, యోగమతము, రసేంద్రచింతామణి, రసేంద్రచూడామణి, రసరత్నాకరము, వాదమంజరి, నాగార్జునతంత్రము మొదలగు గ్రంథములనుండి అవసరమగు విషయములు గ్రహించి వ్రాయబడినవి. వైద్యమునకు వాదమునకు చాల యుపయోగముగానున్నది. అనేక గ్రంథములను చర్చించియుండుటచే అత్యుత్తమగ్రంథమని చెప్పుట కేమభ్యంతరము నుండదు. రససంబంధములు బహుబాగుగా చేర్పబడినవి. ఈరసరత్నసముచ్చయమునకు ఒక ఘూర్జరవ్యాఖ్య గాక మరియొక భాషలో వ్యాఖ్య కనుపించుటలేదు. అగస్త్య సంప్రదాయ గ్రంథములలో ఆంధ్రమునందు దీనినిబోలిన గ్రంథము మరియొకటిలేదు

నూజవీడు. (Sd) తిరుపూరు వెంకటాద్రి."

---



"శార్ఙ్గధరత్రిశతి" "ఆయుస్సాధనము" మొదలగు అనేకాయుర్వేదగ్రంథకర్తలును, సత్కవులును, పండితులును అగు వైద్యశాస్త్రి ఈశ్వర సత్యనారాయణశర్మగారి యభిప్రాయము.

ఓమ్

"విద్వద్వైద్యులును చక్రదత్తాంధ్రటీకా, వైద్యకల్పద్రుమేత్యాదిగ్రంథకర్తలును అగు బ్రహ్మశ్రీ చివుకుల సత్యనారాయణశాస్త్రిగారి రసరత్నసముచ్చయాంధ్రవ్యాఖ్య విశేషవిషయ భూషితమై ప్రమాణవాక్యబద్ధమై సయంత్రచిత్రమై సుబోధకమై యుండుట జూడ నది గ్రంథరత్నమన దగియున్నది.

ఆయుర్వేదమున నిట్టిగ్రంథము వెలువడుట యాంధ్రలోకము పుణ్యమని యది లెస్సగా జూచిన నాతలంపు.

(Sd) వైద్యశాస్త్రి, ఈశ్వర సత్యనారాయణశర్మ,
ప్రధానపండితుడు, మ్యునిసిపల్ హైస్కూలు, శ్రీకాకుళం,
గంజాంజిల్లా."

---

పూనా, లాహోరు, ఢిల్లీ, కలకత్తా మొదలగు మహాపట్టణములయందు జరిగిన ఆల్ యిండియా ఆయుర్వేదిక్ మహామండలి సంమేళనములయందు బంగారు, వెండి పదకములను మొదటితరగతి సర్టిఫికెట్టులను పొందినట్టియు, ఆంధ్రాయుర్వేద వైద్యమండలి కధ్యక్షులైనట్టియు, శృంగేరి శంకరపీఠ వైద్యులైనట్టియు, ఆయుర్వేదభిషక్వాద అయుర్వేదరత్నమ్ ఇత్యాది అనేక బిరుదాంకితులైనట్టియు విద్వాన్ కే. శేషశాస్త్రిగారొసగిన యభిప్రాయము:

"ఇహాఖిలసమాకలయం శ్రీమద్భిః పండితమండలీప్రకాండైః చివుకుల సత్యనారాయణశాస్త్రిభి రాంధ్రీకృతాం రసరత్నసముచ్చయస్య టీకాం, దర్శం దర్శమిమాం టీకా మమితానంద కందళిత స్వాంత శ్శాస్త్రిమహాశయ స్యాస్య పరిశ్రమం సర్వథా శ్లాఘయామి. శాస్త్రిమహోదయోఽయం స్వానుభవ విజ్ఞాతోదాహరణ పురస్సరం సయంత్రరచనా చిత్రప్రదర్శనం సవాదవిషయ మిమం గ్రంథ మరచయదితి బతామితానందాస్పదం! అయం గ్రంథ స్సర్వథా ప్యాంధ్రవైద్యవిద్యార్థినా ముపాకరోతీత్యత్ర నాత్ర విశయావసరః। అచిరా దయంగ్రంథః ప్రకాశ ముపేయాదితి సానంద మాశాసే."

స్థానం: ఏలూరు, కృష్ణాజిల్లా. } భవదీయః (Sd.) విద్వాన్ కే. శేషశాస్త్రి, ఆయుర్వేద రత్నేత్యాది.

ఆయుర్వేదభవనస్థాపకులును, మద్రాసు, పూనా, లాహోరు పట్టణములందు జరిగిన నిఖిలభారత వైద్య మహాసమ్మేళనములందు బంగారు వెండిపతకములను మొదటి తరగతి యోగ్యతాపత్రికలను పొందినవారును ఉయ్యూరు అండ్ మేడూరు యెస్టేట్లకు మెడికల్ అడ్వైజరుగానున్నట్టియు సుప్రసిద్ధాయుర్వేదవైద్యులును అగు అఖండం శ్రీరామశాస్త్రిగారిచ్చిన యభిప్రాయము:

"నేను శ్రీ వేదమూర్తులైన చివుకుల సత్యనారాయణశాస్త్రిగారిచే వ్రాయబడిన "రసరత్నసముచ్చయము" అను గ్రంథరాజమును సాంగముగా జూచితిని. ఇందు రస, ఉపరస, సాధారణరస రత్న ధాతు శోధనమారణ సత్త్వపాతన ద్రుతిప్రక్రియలును పారదశోధనాదులును బహువిపులముగ చక్కగ వ్రాయబడినవి. వీరి ఆంధ్రవ్యాఖ్యయందు వాదఖండమునకును రసాయనఖండమునకును సంబంధించిన అనేకవిషయములు మూడుసంవత్సరములు విశేషకృషిచేసి వివిధగ్రంథములనుండి క్రోడీకరించియున్నారు. ఆంధ్రమున నింతటి విపులమైన రసశాస్త్రములేదు. సూతేంద్రసిద్ధి, వాదమంజరి, నాగార్జునతంత్రము మొదలైన అముద్రిత గ్రంథములనుండి వీరు గ్రహించిన విషయములు రసవాదులకును వైద్యులకును అత్యంత సంతోషదాయకముగ నుండగలవని దృఢముగ చెప్పగలను.

మరియు నిందలి పరిభాషలును యంత్రములు నున్నగువాని చిత్రపటములు వైద్యులకెంతయు నుపయోగకారిగనున్నవి. వేయేల! ఆంధ్రదేశవైద్యులకు రసశాస్త్రవిషయమున కొరవుదీరినదనియును, యిట్టి గ్రంథరాజమును ప్రఖ్యాతిగాంచనున్న ప్రతివైద్యుడును చదివితీరవలెననియును సంతోషపూర్వకముగ జెప్పుచున్నాను.

10—4—23.
శేలంగి.

(Sd.) అఖండం శ్రీరామశాస్త్రి"

---

# విషయసూచిక


| | పేజి. |
|---|---|
| రససిద్ధనమస్కారము | 1 |
| పారదోత్తమత | 4 |
| మూర్ఛితాది పారద గుణములు | 5 |
| రసము జరామరణముల లేకుండజేయును | 6 |
| సకలౌషధములు రసముందైక్యమందును | ,, |
| రసరాజమువలన బ్రహ్మత్వముకల్గును | 7 |
| బ్రహ్మప్రాప్తివలని యానందము | ,, |
| రసోత్పత్తి | 9 |
| రసభేదములు | 10 |
| పంచపారదములకు శబ్దార్థనిర్వచనము | 11 |
| రసమందలి కంచుకాదిదోషములు | ,, |
| పూర్వము రసరసేంద్రముల నాకర్షించు పద్ధతి | 13 |
| మహారసములు | 14 |
| అభ్రికసామాన్య గుణము | ,, |
| ఉత్తమాభ్రికము | 15 |
| అభ్రికభేదములు | ,, |
| శ్వేతాదిచతుర్విధాభ్రికోపయోగము | 16 |
| అభ్రికగుణ-దోషములు | ,, |
| అభ్రికశోధనము-భస్మము | 17 |
| ధాన్యాభ్రికవిధి-భస్మము | ,, |
| అభ్రికసత్త్వపాతనము | 19 |
| అభ్రకద్రుతి | 20 |
| సత్త్వాభ్రకరసాయనము | 21 |
| అభ్రకభస్మవిధి | 22 |
| దివ్యాభ్రకరసాయనము | ,, |
| వైక్రాంతపరీక్ష | 23 |
| వైక్రాంతగుణములు | 24 |
| వైక్రాంతోత్పత్తి-భేదము | ,, |
| వైక్రాంతశోధనము | 25 |
| వైక్రాంతభస్మవిధి | 26 |
| వైక్రాంతసత్త్వపాతనము | ,, |
| వైక్రాంతరసాయనము | 27 |
| స్వర్ణమాక్షికోత్పత్తి-లక్షణము-గుణము | 28 |
| స్వర్ణమాక్షికశోధన-మారణములు | 29 |
| స్వర్ణమాక్షిక సత్త్వపాతనము | ,, |
| స్వర్ణమాక్షిక రసాయనము | 30 |
| స్వర్ణమాక్షికద్రుతి | 31 |
| విమలము | ,, |
| విమలశోధన-మారణ-సత్త్వపాతములు | ,, |
| విమలరసాయనము | 32 |
| శిలాజతు | 33 |
| శిలాజతుగుణములు | 34 |
| శిలాజతుశుద్ధి-భస్మము | 35 |
| శిలాజతురసాయనము | ,, |
| శిలాజతు సత్త్వపాతనము | 36 |
| కర్పూరశిలాజతు | ,, |
| మైలతుత్థము | ,, |
| మైలతుత్థముశుద్ధి-భస్మము | 37 |
| తుత్థసత్త్వపాతనము | 38 |
| తుత్థముద్రిక | 39 |
| చపలశుద్ధి-భస్మము | 40 |
| రసకము | 41 |
| కఫరిశుద్ధి | ,, |
| కఫరిసత్త్వపాతనము | 42 |
| కఫరిసత్త్వపాతన-భస్మములు | 43 |
| కఫరిరసాయనము | 44 |
| ఉపరసములు | 46 |
| గంధకోత్పత్తి | ,, |
| గంధకభేదములు | 47 |
| గంధకగుణములు | 48 |
| గంధకశుద్ధి | ,, |
| గంధకద్రుతి | 50 |
| గంధకప్రయోగములు | 51 |
| కండూహరప్రయోగము | 52 |
| గంధకతైలము | 53 |
| గైరికము | ,, |
| కాసీసము | 54 |

| | పేజి. |
|---|---|
| కాంక్షి | 55 |
| హరితాళకము | 57 |
| హరితాళశుద్ధి | ,, |
| తాళకభస్మము | 58 |
| హరితాళసత్త్వము | 59 |
| మణిశిల | 63 |
| అంజనములు | 65 |
| కంకుష్ఠము | 67 |
| సాధారణరసములు | 69 |
| కంపిల్లము | ,, |
| గౌరీపాషాణము | ,, |
| నవాసాగరము | 71 |
| కపర్దము | 72 |
| అగ్నిజారము | 73 |
| సిందూరము | 74 |
| ఇంగిలీకము | ,, |
| మృద్దారుశృంగము | 75 |
| రాజావర్తము | 78 |
| రత్నములు | 80 |
| మాణిక్యము | 81 |
| ముత్యము | 82 |
| ప్రవాళము | 83 |
| గరుడపచ్చ | 84 |
| పుష్పరాగము | 85 |
| వజ్రము | 86 |
| వజ్రశోధనము | 88 |
| వజ్రభస్మము | ,, |
| వజ్రరసాయనము | 90 |
| నీలమణి | 91 |
| గోమేదకము | 92 |
| వైదూర్యము | 93 |
| సర్వరత్నశుద్ధి | ,, |
| సర్వరత్నభస్మవిధి | 94 |
| రత్నద్రుతి | ,, |
| వైక్రాంతద్రుతి | 95 |

| | పేజి. |
|---|---|
| రత్నసాధారణగుణములు | 96 |
| ధాతువులు | 97 |
| సువర్ణము | ,, |
| స్వర్ణగుణము | ,, |
| స్వర్ణశోధనము | 99 |
| సువర్ణభస్మము | 100 |
| సువర్ణద్రుతి | 102 |
| రజతము | ,, |
| రౌప్యశోధనము | 103 |
| రౌప్యభస్మము | 104 |
| రౌప్యరసాయనము | 105 |
| రౌప్యద్రుతి | ,, |
| తామ్రము | 106 |
| తామ్రగుణము | ,, |
| అశుద్ధతామ్రగుణము | 107 |
| తామ్రశుద్ధి | ,, |
| తామ్రమారణము | 108 |
| సోమనాథీయ తామ్రభస్మవిధి | 109 |
| లోహము | 110 |
| ముండలోహము | ,, |
| తీక్ష్ణలోహము | 111 |
| కాంతలోహము-భేదములు | 113 |
| కాంతలోహలక్షణము | 114 |
| సర్వలోహశుద్ధి | 115 |
| సర్వలోహభస్మవిధి | 116 |
| లోహభస్మముల గుణములు | 121 |
| లోహద్రుతి | 122 |
| అపరిశుద్ధ లోహదోషములు | 123 |
| లోహతారతమ్యములు | 124 |
| మండూరము | ,, |
| వంగము-శుద్ధి | 125 |
| వంగభస్మము | 126 |
| వంగరసాయనము | 127 |
| నాగము-దానిగుణము | ,, |
| నాగశుద్ధి | 128 |





| | పేజి. |
|---|---|
| నాగభస్మము | 128 |
| నాగరసాయనము | 130 |
| రీతి-పిత్తలశోధనము-గుణము | 131 |
| పిత్తళిభస్మము | 132 |
| పిత్తళిరసాయనము | ,, |
| పిత్తలద్రుతి | 133 |
| ఘోషము | ,, |
| వర్తలోహము | 134 |
| లోహములు రససిద్ధికరములనుట | 135 |
| భూనాగసత్త్వపరమావశ్యకత | 136 |
| భూనాగసత్త్వము | ,, |
| భూనాగముద్రిక | 138 |
| తైలపాతనవిధి | ,, |
| శిష్యోపనయనము | 141 |
| రసవిద్యాగురులక్షణము | ,, |
| శిష్యలక్షణము | 142 |
| అనుచరలక్షణము | ,, |
| అయోగ్యశిష్యలక్షణము | ,, |
| రససాధన - రసశాలా - రసమంటపములు | 143 |
| రసలింగస్థాపనాదికము | 144 |
| కుంభస్థాపనాదిశిష్యదీక్షావిధానము | 146 |
| రససిద్ధ్యర్హపదార్థతత్త్వాజాదికథనము | 148 |
| రససిద్ధేశ్వర బ్రాహ్మణాది పూజాక్రమము | 149 |
| పారదసిద్ధికర్త్రయోగ్యత–రససిద్ధి | 151 |
| రసశాల | 153 |
| రససాధనీయపదార్థములు | 154 |
| రసకర్మయందర్హులైన వైద్యులు–పరిజనము | 156 |
| సోమనాథసిద్ధపరిభాష | 159 |
| ధన్వంతరిభాగము | ,, |
| రుద్రభాగము | ,, |
| కజ్జలీలక్షణము | 160 |
| రసపంకము-రసపిష్టి-పాతనపిష్టి | ,, |

| | పేజి. |
|---|---|
| హేమకృష్టి–తారకృష్టి | 161 |
| హేమరక్తి-తారరక్తి | ,, |
| దళలక్షణము | ,, |
| శుల్బనాగము | 162 |
| పింజరీలక్షణము | ,, |
| చంద్రార్కలక్షణము | 163 |
| నిర్వాపణలక్షణము | ,, |
| వారితర-రేఖాపూర్ణలక్షణములు | ,, |
| అపునర్భవ లక్షణము | 164 |
| ఉత్తమపరీక్ష | ,, |
| నిరుత్థలక్షణము | ,, |
| బీజలక్షణము | ,, |
| తాడనలక్షణము | 165 |
| ధాన్యాభ్రక లక్షణము | ,, |
| సత్త్వలక్షణము | ,, |
| ఏకకోలీసక లక్షణము | 166 |
| స్వేదనాద్యర్హకాష్ఠములు | ,, |
| హింగుళాకృష్టరసము | ,, |
| ఘోషాకృష్టతామ్రము | ,, |
| వరనాగలక్షణము | ,, |
| ఉత్థాపనము | 167 |
| ఢాలనలక్షణము | ,, |
| నాగచపలము | ,, |
| వంగచపలము | ,, |
| వంగచపలబద్ధ రసోపయోగము | 168 |
| ధాతలక్షణము | ,, |
| ద్వంద్వానలక్షణము | ,, |
| భంజనీలక్షణము | ,, |
| ఘుల్లికాలక్షణము | 169 |
| పతంగీరాగము | ,, |
| ఆవాపలక్షణము | ,, |
| అభిషేకలక్షణము | ,, |
| స్నపనలక్షణము | ,, |
| ప్రతీవాపాహ్వాకాలము | ,, |
| సత్త్వనిర్గమకాలము | 170 |

| | పేజి. |
|---|---|
| బీజావర్తలక్షణము | 170 |
| స్వాంగశీతలలక్షణము | ,, |
| బహిశ్శీతము | ,, |
| స్వేదనసంస్కారలక్షణము | ,, |
| మర్దనసంస్కారలక్షణము | 171 |
| మూర్ఛనసంస్కారలక్షణము | ,, |
| ఉత్థాపనసంస్కారలక్షణము | ,, |
| నష్టపిష్టిత్వనిర్వచనము | ,, |
| పాతనసంస్కారలక్షణము | 172 |
| రోధనసంస్కారలక్షణము | ,, |
| నియమనసంస్కారలక్షణము | ,, |
| దీపనసంస్కారలక్షణము | ,, |
| గ్రాసమానము | ,, |
| చారణాదివివరణము | 173 |
| జారణద్వైవిధ్యము | ,, |
| రాక్షసముఖరసము | ,, |
| చారణాలక్షణము | 174 |
| గర్భద్రుతిలక్షణము | ,, |
| బాహ్యద్రుతిలక్షణము | ,, |
| ద్రుతిలక్షణము | ,, |
| ద్రుతికిలక్షణాంతరము | ,, |
| జారణాలక్షణము | 175 |
| బిడలక్షణము | ,, |
| రంజనలక్షణము | 177 |
| సారణాలక్షణము | ,, |
| వేధలక్షణము | ,, |
| లేపాదివేధలక్షణములు | ,, |
| ఉద్ఘాటనలక్షణము | 178 |
| స్వేదలక్షణము | ,, |
| సన్న్యాసలక్షణము | ,, |
| స్వేద-సన్న్యాసాధిక్యత | 179 |
| పరిభాషావశ్యకత | ,, |
| యంత్రములు | 180 |
| దోలాయంత్రము | ,, |
| స్వేదనయంత్రము | 181 |

| | పేజి |
|---|---|
| పాతనయంత్రము | 182 |
| అధఃపాతనయంత్రము | 183 |
| కచ్ఛపయంత్రము | 184 |
| దీపికాయంత్రము | 185 |
| డేకయంత్రము | ,, |
| జారణయంత్రము | 186 |
| విద్యాధరయంత్రము | 188 |
| సోమానలయంత్రము | ,, |
| గర్భయంత్రము | ,, |
| హంసపాకయంత్రము | 189 |
| వాలుకాయంత్రము | ,, |
| లవణయంత్రము | 190 |
| నాళికాయంత్రము | 191 |
| భూధరయంత్రము | ,, |
| పుటయంత్రము | 192 |
| కోష్ఠీయంత్రము | ,, |
| వలభీయంత్రము | 193 |
| తిర్యక్పాతనయంత్రము | 194 |
| పాలికాయంత్రము | 195 |
| ఘటీయంత్రము | ,, |
| ఇష్టికాయంత్రము | ,, |
| హింగుళాకృష్టి విద్యాధరయంత్రము | 196 |
| డమరుయంత్రము | 197 |
| నాభీయంత్రము | ,, |
| గ్రస్తయంత్రము | 199 |
| స్థాలీయంత్రము | ,, |
| ధూపయంత్రము | 199 |
| కందుకయంత్రము | 200 |
| ఖల్వయంత్రము | 201 |
| సాధారణమానపరిభాష | 203 |
| మూష, కోష్ఠీ, పుటాదిప్రకరణము | 204 |
| వజ్రమూస | 205 |
| యోగమూస | ,, |
| వజ్రద్రావిణీమూస | 206 |
| గారమూస | ,, |





| | పేజి. |
|---|---|
| వరమూస | 206 |
| వర్ణమూస | 207 |
| రూప్యమూస | ,, |
| బిడమూస | ,, |
| వజ్రద్రావణమూస | 208 |
| వృంతాకమూస | ,, |
| గోస్తనీమూస | ,, |
| మల్లమూస | 209 |
| పక్వమూస | ,, |
| గోళమూస | ,, |
| మహామూస | ,, |
| మండూకమూస | 210 |
| ముసలమూస | ,, |
| మూసాప్యాయనము | 210 |
| కోష్ఠి | 211 |
| అంగారకోష్ఠి | ,, |
| పాతాళకోష్ఠి | 212 |
| గారకోష్ఠి | 213 |
| మూసాకోష్ఠి | ,, |
| పుటము | 214 |
| మహాపుటము | 215 |
| గజపుటము | ,, |
| వరాహపుటము | ,, |
| కుక్కుటపుటము | ,, |
| కపోతపుటము | 216 |
| గోవరపుటము | ,, |
| భాండపుటము | ,, |
| వాలుకాపుటము | ,, |
| భూధరపుటము | ,, |
| లావకపుటము | 217 |
| పిష్టకనామములు | ,, |
| సహజ-కృత్రిమలోహములు | ,, |
| లవణములు-క్షారములు | ,, |
| మధురత్రయము | 219 |
| తైలమును దీయదగిన బీజాదులు | 220 |

| | పేజి. |
|---|---|
| వసాగణము | 220 |
| మూత్రవర్గము | ,, |
| పంచమాహిష-పంచఛాగలములు | 221 |
| ఆమ్లవర్గము | ,, |
| ఆమ్లవర్గమున ప్రశస్తద్రవ్యములు | ,, |
| పంచమృత్తికలు | 222 |
| విషవర్గము | ,, |
| ఉపవిషవర్గము | 224 |
| దుగ్ధవర్గము | 225 |
| విడ్గణము | ,, |
| రక్తవర్గము | ,, |
| పీతవర్గము | 226 |
| శ్వేతవర్గము | ,, |
| కృష్ణవర్గము | ,, |
| రక్తవర్గాద్యుపయోగములు | ,, |
| శోధనీయగణము | ,, |
| లోహకాఠిన్య నాశకగణము | 227 |
| ద్రావణగణము | ,, |
| క్షారాద్యుపయోగములు | ,, |
| ఏకాదశాధ్యాయము-మానపరిభాష | 229 |
| ప్రాతవిగ గ్రహింపదగినవస్తువులు | 230 |
| పచ్చివిగ గ్రహింపదగినవస్తువులు | ,, |
| పైపొట్టుతీసియు తీయకయు నుపయోగింపదగినవి | 231 |
| ఔషధవీర్యహీనకాలము | 232 |
| స్వరసకల్పన | ,, |
| భావనావిధి | 233 |
| తండులోదకవిధి | ,, |
| ఆరనాళవిధి | 234 |
| ధాన్యామ్లము | ,, |
| కాంజికవిధి | 235 |
| మృద్భాండదృఢీకరణము | 236 |
| అష్టాదశసంస్కారములు | ,, |
| పారదదోషములు | ,, |
| స్వేదనసంస్కారము | 239 |

| | పేజి. | | పేజి. |
|---|---|---|---|
| మర్దనసంస్కారము | 240 | నిర్జీవబంధము | 253 |
| మూర్ఛనసంస్కారము | 242 | సజీవబంధము | 254 |
| ఉత్థాపనసంస్కారము | 243 | శృంఖలాబంధము | ,, |
| పాతనసంస్కారము | 244 | ద్రుతిబంధము | ,, |
| నిరోధనసంస్కారము | 245 | బాలబంధము | ,, |
| నియామనసంస్కారము | 246 | కుమారబంధము | 255 |
| దీపనసంస్కారము | 247 | తరుణబంధము | ,, |
| రసమూలికావర్గము | 248 | వృద్ధబంధము | ,, |
| హఠబంధము | 251 | మూర్తిబంధము | 258 |
| ఆరోటబంధము | ,, | జలబంధము | 259 |
| ఆభాసబంధము-క్రియాహీనబంధము | ,, | అగ్నిబంధము | ,, |
| పిష్టికాబంధము | 252 | సుసంస్కృతబంధము | ,, |
| క్షారబంధము | ,, | మహాబంధము | 260 |
| ఖోటబంధము | ,, | పారదభస్మము | 261 |
| పోటబంధము | ,, | పారదభస్మసేవయందుపథ్యము | 265 |
| కల్కబంధము | ,, | డిటో అపథ్యము | 266 |
| కజ్జలీబంధము | 253 | పారదవికారమందుపాయములు | 267 |
| సజీవబంధము | ,, | జలూకాబంధము | 268 |


శ్రీరస్తు

# రసరత్న సముచ్చయము

## ప్రథమాధ్యాయము

శ్లో॥ యస్యానందభవేన మంగళకలా సంభావితేన స్ఫుర
ద్ధామ్నా సిద్ధరసాత్మనా తేన కరుణాపీక్షా సుధాసింధునా।
భక్తానాం ప్రభవ ప్రసంసృతి జరారాగాదిరోగాః క్షణా
చ్ఛాంతిం యాంతి జగత్త్రయాభిషజే తస్మై పరస్మై నమః॥

తా॥ మంగళకరంబును కాంతివంతంబును సిద్ధరసస్వరూపంబును అమృతమయంబును కరుణారసామృతార్ద్రంబును జన్మజరామరణ భవపాపరోగనిరాకరణ సమర్థంబును భక్తజనాభీష్టసిద్ధిదంబును అగు దివ్యదృష్టిగల జగదేకవైద్యశిఖామణియగు శ్రీమద్ధన్వంతరికొరకు నమస్కారము.

### రససిద్ధ నమస్కారము

మూ. ఆదిమశ్చంద్రసేనశ్చ లంకేశశ్చ విశారదః
కపాలీమత్తమాండవ్యౌ భాస్కర శ్శూరసేనకః॥
రత్నకోశశ్చ శంభుశ్చ సాత్వికో నరవాహనః
ఇంద్రదో గోముఖశ్చైవ కలంబిర్వ్యాడ రేవచ॥
నాగార్జున స్సురానందో నాగబోధీ యశోధనః
ఖండఃకాపాలికో బ్రహ్మ గోవిందో లంపకో హరిః॥
సప్తవింశతి సంఖ్యాకా రససిద్ధిప్రదాయకాః
రసాంకుశో భైరవశ్చ నందీ స్వచ్ఛందభైరవః॥

మంథానభైరవశ్చైవ కాకచండీశ్వరస్తథా
వాసుదేవ ఋషిశ్శృంగః క్రియాతంత్ర సముచ్చయీ॥
రసేంద్రతిలకో యోగీ భాలుకీ మైథిలాహ్వయః
మహాదేవో నరేంద్రశ్చ వాసుదేవో హరీశ్వరః॥
ఏతేషాం క్రియతేన్యేషాం తంత్రాణ్యాలోక్య సంగ్రహః
రసానా మథ సిద్ధానాం చికిత్సార్థోపయోగినాం॥
సూనునా సింహగుప్తస్య రసరత్నసముచ్చయః
రసోపరసలోహానాం యంత్రాదికరణానిచ॥
శుద్ధ్యర్థమపి లోహానాం తంత్రాదికరణానిచ
శుద్ధిస్సత్వం దృతిర్భస్మకరణంచ ప్రవక్ష్యతే॥

తా॥ ఆదిమ చంద్రసేన లంకేశ విశారద కపాలీ మత్తమాండవ్య భాస్కర శూరసేనక రత్నకోశ శంభు సాత్విక నరవాహన ఇంద్రదత్త గోముఖ కలంబి యాడి నాగార్జున సురానంద నాగబోధి యశోధన ఖండ కాపాలికా బ్రహ్మ గోవింద లంపక హరులను యిరువదియేడుగురు రచించినట్టియు, రసాంకుశభైరవ నందీ స్వచ్ఛందభైరవ మంథానభైరవ కాకచండీశ్వర వాసుదేవ ఋషిశృంగ రసేంద్రతిలకయోగి భాలుకి మైథిల మహాదేవ నరేంద్ర వాసుదేవ హరీశ్వరులు రచించినట్టియు రసతంత్రములను బాగుగ పరిశీలించి కేవల చికిత్సామాత్రోపయోగములగు రసోపరస సాధారణరస లోహరత్నాదులయొక్క శుద్ధి, భస్మసిందూర సత్వపాతన ద్రుతికరణప్రక్రియలును, వానికి గావలసిన యంత్రములును, మూసలు, పుటములు మొదలగునవియును వాని స్వరూపములును తన్నిర్మాణపద్ధతులును మొదలగు విషయముల నన్నిటిని సింహగుప్తుని కుమారుడును వాగ్భటాచార్య నామదును అగు నేను వచించుచున్నాను. అని తాత్పర్యము.

మూ. అస్తి నీహారనిలయో మహానుత్తరదిఙ్ముఖే
ఉత్తుంగశృంగసంఘాత లంఘితాభ్రో మహీధరః॥
విశ్రామాయ నియన్మార్గ విలంఘన ఘనశ్రమః
అవతీర్ణా ఇవక్షోణీం శరదంబుముచాంగణాః॥
రాశీకాశీవిషాధీశ ఫణాఫలకరోచిషాం
భిత్వా భువ మివోత్తీర్ణో యో విభాతి భృశోన్నతః॥



జ్వలదౌషధయో యస్య నితంబమణి భూమయః
నక్తముద్భాసితటితా మనుకుర్వంతి వార్ముచాం॥
కటకే సంచరంతీనాం యస్య కిన్నరయోషితాం
పాదేషు ధాతురాగేణ లాక్షాకృత్య మనుష్ఠితం॥
అవతంసిత శీతాంశు రాచ్ఛాదిత దిగంబరః
యో గుహాధిగతో లోకై గ్గిరీశ ఇతిగీయతే॥
నిమీలితదృశో నిత్యం మునయో యస్య సానుషు
ప్రత్యక్షయంతి గిరిశ మవాఙ్మానసగోచరం॥
శిలాతలప్రతిహతై ర్యస్య నిర్ఝరశీకరైః
అహాన్యపి నిరీక్షంతే యక్షా స్తారాంకితం నభః॥
నీహారపవనోద్రేక నిస్సహా యత్ర నిర్జరాః
నిజస్త్రీణాం నిషేవంతే కుచోష్మాణం నిరంతరం॥
సంచరన్ కటకే యస్య నిదాఘేపి దివాకరః
ఉద్దామహిమరుద్ధోష్మా న శీతాంశో ర్విభిద్యతే॥
గుహాగతేషు కస్తూరీ మృగనాభి సుగంధిషు
గాయంతి యత్ర కిన్నర్యః గౌరీపరిణయోత్సవం॥
చకాస్తి తత్ర జగతా మాదిదేవో మహేశ్వరః
రసాత్మనా జగత్త్రాతుం జాతో యస్మాన్మహారసః॥

తా॥ ఆకాశమందు మిక్కిలిగ సంచారముచేయుటచే నలసి అన్నియుంగలిసి భువికిందిగి యొక్కచో విశ్రమించిన తెల్లని శరత్కాలమేఘమండలమో యనను త్తరపు దిక్కునందు హిమాలయమను నొకపర్వతముకలదు. దానిశిఖరము లాకాశమునొరయుచుండును. పాతాళమందలి సర్వనాగలోకముయొక్క ఫణికాంతులు భూమిని బద్దలుగావించి పైకివచ్చినవోయనునట్లాపర్వతము భాసిల్లుచుండును. మెరుపుదీవియలవలె మణిమయమగు నాపర్వతభూమింగల యోషధులు రాత్రులందు ప్రకాశించుచుండును. కిన్నరయువతులానగమందలి గైరికాదిధాతువులచే పాదములకు పారాణిపెట్టుకొందురు. అట్టియాభూధరమున దిగంబరుడై చంద్రకళాధరుడై సర్వలోకరక్షకుండగు పరమేశ్వరుడు వసించుచుండును. అచ్చట మునులు ప్రతిదినము అవాఙ్మానసగోచరుండగు పరశివుని సేవించుచుందురు. రాళ్లపైబడి పైకెగసిన కొండకాలువలనీటితుంపరలచే పగటియందు గూడ ఆకాశము నక్షత్రములంగలదిగ దోచుచుండును. చలిగాలికి తాళక విద్యాధరా

దులు కొందరు తమతమ భాగ్యలను కౌగలించుకొని యానందింతురు. ఎత్తుగనుండు నా కొండయొక్క ప్రాంతభూముల దిరుగు సూర్యుడు మంచుచే నావరింపబడియుండుటం బట్టి చంద్రుడువోలె దర్శనీయుడైయుండును. కస్తూరిమృగము లందందు సంచరించుచుండుటచే పరిమళభరితములగు రాళ్లపైగూర్చుండి కిన్నరులు గౌరీవివాహకథను పాటలుగ బాడుచుందురు. పరమానందకరమైన యట్టిచోట మహాదేవుడు రసస్వరూపుడై ప్రజాపతిరక్షణార్థమై నివాసము ననుగ్రహించెను. ఆతనివలన నమృతస్వరూపంబగు రసంబు పుట్టెను.

## —♦పారదోత్తమత♦—

మూ. శతాశ్వమేధేన కృతేనపుణ్యం గోకోటిభి స్స్వర్ణసహస్రదానాత్
నృణాం భవేత్సూతకదర్శనేన యత్సర్వతీర్థేషు కృతాభిషేకాత్।
విధాయ రసలింగం యో భక్తియుక్తస్సమర్చయేత్
జగత్త్రితయలింగానాం పూజాఫల మవాప్నుయాత్॥
భక్షణం స్పర్శనం దానం ధ్యానంచ పరిపూజనం
పంచధా రస పూజోక్తా మహాపాతక నాశనీ
హంతి భక్షణమాత్రేణ పూర్వజన్మాఘ సంభవం
రోగసంఘ మశేషాణాం నరాణాం నాత్రసంశయః॥
పూర్వజన్మ కృతంపాపం సద్యోనశ్యతి దేహినాం
సుగంధపిష్టసూతేన యది శంభు ర్విలేపితః
అభ్రకం తృటిమాత్రం యో రసేన పరిజారయేత్
శతక్రతుఫలం తస్య భవేది త్యబ్రవీ చ్ఛివః॥
యశ్చ నిందతి సూతేంద్రం శంభోస్తేజః పరాత్పరం
స పతేన్నరకే ఘోరే యావత్కల్ప వికల్పనా॥

తా॥ నూరు అశ్వమేధములు, కోటిగోదానములు, అనేకస్వర్ణదానములు, సకల పుణ్యతీర్థస్నానములు చేసినఫలము కేవలరసదర్శనముచే కలుగును. రసలింగమును భక్తితో పూజించువానికి త్రిలోకములలోని శివలింగముల నన్నిటినిపూజించిన ఫలముకల్గును. భక్షణము, స్పర్శనము, దానము, ధ్యానము, పూజనము అని రసపూజ అయిదు విధములుగ నున్నది. రసమునుభక్షించినచో పూర్వజన్మ పరిపాకములవలన గలిగిన రోగములును పాపములుగూడ నశించును. సుగంధద్రవ్యముల చేర్చి నూరిన రసమును శివలింగమునకు లేపనముచేసినచో సకల పాపములును రోగములు నశించును. తృటిమాత్ర మభ్రకమునైనను రసమందు జారణము గావించినయెడల నూరుక్రతువులు చేసిన ఫలమబ్బును. ఇది శివవాక్యము. శంభువీర్యము నెవరు దూషింతురో అట్టినీచులు మహానరకంబునంబడి దుఃఖింతురు.



మూ॥ రోగిభ్యో యో రసం దత్తే శుద్ధిపాక సమన్వితం
తులాదానాశ్వమేధానాం ఫలంప్రాప్నోతి శాశ్వతం॥
సిద్ధే రసే కరిష్యామి నిర్దారిద్ర్య మిదంజగత్
రసధ్యాన మితిప్రోక్తం బ్రహ్మహత్యాది పాపనుత్
అభ్రగ్రాసోహి సూతస్య నైవేద్యం పరికీర్తితం॥
రసస్యైత్యర్చనం కృత్వా ప్రాప్నుయాత్క్రతుజం ఫలం।
ఉదరే సంస్థితే సూతే యస్యోత్క్రామతి జీవితం
స ముక్తో దుష్కృతాద్ఘోరా త్ప్రయాతి పరమంపదం॥

తా॥ శాస్త్రీయముగ శుద్ధిపాకములం జేసిన రసమును రోగులకిచ్చినచో తులాదాన, అశ్వమేధఫలములు సిద్ధించును. రససిద్ధి కలిగినచో జగత్తు దారిద్ర్యశూన్యమగును. రసధ్యానమువలన బ్రహ్మహత్యాది మహాపాపములు తొలగును. అభ్రకమును రసమందు జారణముచేయుటయే రసమునకు నైవేద్యమగును. రసార్చనమువలన క్రతుఫలముకల్గును. రసము హృదయమందుండగా నెవడుమరణించునో వానికి పునరావృత్తిరహిత మోక్షము ప్రాప్తించును.

## —♦ మూర్ఛితాది పారదగుణములు ♦—

మూ. మూర్ఛిత్వా హరతిరుజం బంధనమనుభూయ ముక్తిదో భవతి
అమరీకరోతిహి మృతః కోన్యః కరుణాకరః సూతాత్॥
సురగురు గో ద్విజహింసా పాపకలాపోద్భవం కిలాసాధ్యం
శ్విత్రం తదపిచ శమయాతి యస్తస్మాత్కః పవిత్రతర స్సూతాత్
రసబంధఏవ ధన్యః ప్రారంభే యస్య సతతమపి కరుణా
సేత్స్యతి రసేకరస్యే మహీమహాం సిద్ధరామరణాం॥

రసమునకు మూర్ఛనసంస్కారము జేసినచో సది రోగముల బోగొట్టును. రసమును బంధనమును చేసిన ముక్తినిచ్చును. మరణమును పొందిన సూతము మృతిలేకుండ జేయును. దేవ గురు గో బ్రాహ్మణ హత్యలవలన గలుగు పాపముల పరిణామ

రూపమైన శ్విత్రమును (బొల్లిని) పోగొట్టును. రసబంధనముజేసినచో జరామరణ రహితమై జగత్తు పాలుపారును.

—♦ రసము జరామరణముల లేకుండజేయును ♦—

మూ॥ సుకృతఫలం తావదిదం సుకులే యజ్జన్మ ధీశ్చ తత్రాపి
సాపిచ సకలమహీతల తులనఫలా భూతలంచ సువిధేయం॥
భూతలవిధేయతాయాః ఫలమర్థాస్తేచ వివిధభోగఫలాః
భోగాస్సంతి శరీరే తదనిత్యం మతో వృథాసకలం॥
ఇతి ధనశరీరభోగా న్మత్వాఽనిత్యాన్సదైవ యతనీయం
ముక్తౌ సాచ జ్ఞానాత్ తచ్చాభ్యాసాత్సచ స్థిరేదేహే॥
తత్ స్థైర్యే న సమర్థం రసాయనం తదపి మూలలోహాది
స్వయ మస్థిరస్వభావం దాహ్యం క్లేద్యంచ శోష్యంచ॥

తా॥ సత్కులమందు జన్మించుట పూర్వజన్మసుకృతమునకు నిదర్శనము. అందును ధర్మబుద్ధి కలుగుటయు, దానిచే ప్రపంచవశీకరణము జేసికొనుటయు దుర్లభము. దానికి ధనముండవలెను. ఉన్నను దానికి తగిన యనుభవము కలుగవలెను. అట్టి యనుభవము నిరోగశరీరము నపేక్షించును. అట్టిదేహము అనిత్యము గనుక పై ఫలములన్నియు నిష్ఫలములు. కాన నిత్యమైన ముక్తికొరకు ప్రతిమానవుడును యత్నించవలెను. ముక్తి జ్ఞానము వలన గలుగును. జ్ఞాన మభ్యాసవశముచే నలవడును. దానికి స్థిరదేహ మావశ్యకము. దేహస్థిరతకు స్వయముగ నస్థిరస్వభావములును, దహింపదగినవియు, క్లేదనముచేయదగినవియు, శోషించదగినవియు నగు మూలికలు, లోహములు మున్నగు వానితో చేసిన రసాయనములు ఉపయుక్తములుగ నుండవు.

—♦ సకలౌషధములు రసముం దైక్యమందును. ♦—

మూ. కాష్ఠౌషధ్యో నాగే నాగో వంగేథ వంగమపి శుల్బే
శుల్బంతారే తారం కనకే కనకంచ లీయతే సూతే॥
అమృతత్వం హి భజతే హరమూర్తౌ యోగినో యథాలీనాః
తద్వత్కవళిత గగనే రసరాజే హేమలోహాద్యాః॥
పరమాత్మనీవ సతతం భజతి లయో యత్ర సర్వసత్వానాం॥
ఏకోసౌ రసరాజ శ్శరీర మజరామరం కురుతే॥



స్థిరదేహేఽభ్యాసవశా త్ప్రాప్య జ్ఞానం గుణాష్టకోపేతం
ప్రాప్నోతి బ్రహ్మపదం నపున ర్భవవాసజన్మదుఃఖాని॥

తా॥ మూలికలన్నియు సీసమందును,సీసము వంగమందును,వంగము రాగియందును, రాగి వెండియందును, వెండి బంగారమందును, బంగారము సూతమందును లీనమగును. పరమాత్మయందు పరమయోగులువలె అభ్రకజీర్ణమగు రసమందు సమస్తలోహాది సత్త్వములును లీనములగును. అభ్రకాది జీర్ణరసము శరీరమును జరామరణ రహితముగ జేయును. రసరాజమును ప్రతిదినమును సేవించువారలకు అణిమాద్యష్టసిద్ధులును ఆత్మజ్ఞానమును, తన్మూలకమైన పునరావృత్తిరహిత బ్రహ్మప్రాప్తియు గల్గును.

—♦ రసరాజము వలన బ్రహ్మత్వము కలుగును ♦—

మూ. ఏకాంశేన జగ ద్యుగప దవష్టభ్యావస్థితం పరంజ్యోతిః
పాదై స్త్రిభి స్తదమృతం సులభం న విరక్తిమాత్రేణ॥
నహి దేహేన కథంచి ద్వ్యాధిజరామరణదుఃఖవిధురేణ
క్షణభంగురేణ సూక్ష్మంత ద్బ్రహ్మోపాసితుం శక్యం
నామాపి దేహసిద్ధేః కో గృహ్ణీయా ద్వినా శరీరేణ,
తద్యోగగమ్య మమలం మనసోపి న గోచరం తత్వం॥
యజ్ఞా ద్దానా త్తపసో వేదాధ్యయనా ద్దమా త్సదాచారాత్
అత్యంతభూయసీ కిల యోగవశా దాత్మసంవిత్తిః॥

తా॥ ఒకపాదము సకల బ్రహ్మాండములుగ తక్కిన మూడుపాదములు అమృతస్వరూపవిభూతిగ ప్రకాశించు పరంజ్యోతిని కేవలసంసారవిరాగబలముచేతనే సాధింపవలనుపడదు. వ్యాధి జరామరణ దుఃఖములకు వశమై అనిత్యముగ నుండు నీదేహముతో బ్రహ్మసాక్షాత్కారమును కలిగించుకొనుట దుర్ఘటము. మనస్సునకు గూడ నగోచరమగు తత్వమును యజ్ఞదాన తపో వేదాధ్యయన సదాచారాదులచే కనుగొన శక్యముకాదు. అది యోగగమ్యము. (అట్టి యోగసిద్ధి రసరాజసేవవలన గలుగుచున్నదని తాత్పర్యము.)

—♦ బ్రహ్మప్రాప్తివలని యానందము ♦—

మూ॥ భ్రూమధ్యగతం యచ్ఛిఖి విద్యుత్సూర్యేందువ జ్జగ ద్భాతి
కేషాంచి త్పుణ్యవశా దున్మీలతి చిన్మయం పరంజ్యోతిః.
పరమానందైకరసం పరమం జ్యోతి స్స్వభావ మవికల్పం
విగళితసకలక్లేశం జ్ఞేయం శాంతం స్వసంవేద్యం॥

తస్మిన్నాధాయ మనః స్ఫురదఖిలం చిన్మయం జగత్పశ్యన్
ఉత్పన్నకర్మబంధో బ్రహ్మత్వ మిహైవ చాప్నోతి॥
రాగద్వేషవిముక్తా స్సత్యాచారా మృషారహితాః
సర్వత్రనిర్విశేషా భవంతి చిద్బ్రహ్మ సంస్పర్శాత్॥
తిష్ఠంత్యణిమాదియుతాః విలసద్దేహా స్సదోదితానందాః
బ్రహ్మస్వభావ మమృతం సంప్రాప్తాశ్చైవ కృతకృత్యాః॥

తా॥ రససిద్ధిగలమహాత్ముడు విద్యుత్సూర్యచంద్రప్రభలతో జగత్తులను ప్రకాశింప జేయునట్టియు భ్రూమధ్యమందలి ద్విదళపద్మమున పుణ్యాత్ములకు సాక్షాత్కరించునట్టియు చిదానందైకస్వరూపమైనట్టియు స్వతస్సిద్ధ నిర్వికల్ప క్లేశరహిత పరమజ్యోతీ రూపశోభితంబైన పరబ్రహ్మమందు మనసునిలిపి మాయాతత్కార్య వికారముల నంటక సర్వమును చిన్మయముగ జూచుచు జీవన్ముక్తినందును. అణిమాద్యష్టసిద్ధులు అతనికి వశమైయుండును. నిత్యానందము ననుభవించును.

మూ. ఆయతనం విద్యానాం మూలం ధర్మార్థకామమోక్షాణాం
శ్రేయః పరం కిమన్యచ్ఛరీర మజరామరం విహాయైకం॥
ప్రత్యక్షేణ ప్రమాణేన యో జానాతి నసూతకం
అదృష్టవిగ్రహం దేవం కథం జ్ఞాస్యతి చిన్మయం॥
యజ్జరయా జర్జరితం కాసశ్వాసాది దుఃఖవివశంచ
యోగ్యం తన్నసమాధౌ ప్రతిహత బుద్ధీంద్రియప్రసరం॥

తా॥ విద్యలను, ధర్మార్థకామమోక్షము లనుపురుషార్థములను సాధించుటకు ముఖ్యసాధనమైన అజరామరణదుఃఖముగు దేహముకన్న వేరు శ్రేయస్సాధనమేమున్నది? మరియు ప్రత్యక్షముగ గనబడు రసమునే భజింపలేనివాడు అవాఙ్మానసగోచర పరంజ్యోతి స్వరూపమగు పరమాత్మనెట్లుపాసించి ముక్తినొందగలడు? కాని జరాజర్జరితమై శ్వాసకాసాదిరోగపీడితమగుచు దుఃఖభాజనమైన దేహము మాత్రము సమాధికి పనికిరాదు. కావున జరామరణరహిత దేహత్వమునకై యత్నించవలెను.

మూ. బాల షోడశవర్షో విషయరసాస్వాదలంపటః పరతః
యాతవివేకో వృద్ధో మర్త్యః కథమాప్నుయాన్ముక్తిం
అస్మిన్నేవశరీరే యేషాం పరమాత్మనో నసంవేదః
దేహత్యాగా దూర్ధ్వం తేషాం తద్బ్రహ్మ దుస్తరం



బ్రహ్మాదయో యతంతే తస్మిన్ దివ్యాం తనుం సమాశ్రిత్య॥
జీవన్ముక్తాశ్చాన్యే కల్పాంతస్థాయినో మునయః॥
తస్మాజ్జీవన్ముక్తిం సమీహమానేన యోగినా ప్రథమం॥
దివ్యా తను ర్విధేయా హరగౌరీసృష్టిసంయోగాత్॥

తా॥ పదునారు సంవత్సరముల వయసువచ్చువరకు బాల్యము. పిదప యౌవనమున స్త్రీలోలత్వము పారమార్థికమును చూడనీయదు. ఇక వార్ధకమున వివేకము, ఇంద్రియపటుత్వము నశించును. కాన జీవితమున పరమార్థచింతకు తావులేదు. దేహత్యాగానంతరమున దొరకునని నిశ్చయములేదు. దొరకిన యీదేహమును ప్రత్యక్షమైన రసరాజసేవచే పరిశుద్ధముగావించి దివ్యదేహులై కల్పాంతస్థాయులై బ్రహ్మాదులవలె జీవన్ముక్తులై తరించవలెను. శివపార్వతీ సృష్టిసంయోగము వలన దివ్యదేహసిద్ధిని బడయవలెను.

## —♦రసోత్పత్తి♦—

మూ. శైలేస్మిన్ శివయోః ప్రీత్యా పరస్పరజిగీషయా
సంప్రవృత్తేచ సంభోగే త్రిలోకీ క్షోభకారిణి
వినివారయితుం వహ్నిః సంభోగం ప్రేషిత స్సురైః॥
కాంక్షమాణై స్తయోః పుత్రం తారకాసురమారకం
కపోతరూపిణం ప్రాప్తం హిమవత్కందరేనలం
అపక్షిభావ సంక్షుబ్ధం స్మరలీలావిలోకినం
తం దృష్ట్వా లజ్జిత శ్శంభు ర్విరత స్సురతాత్తదా॥
ప్రచ్యుత శ్చరమో ధాతు ర్గృహీత శ్శూలపాణినా
ప్రక్షిప్తో వదనే వహ్నేః గంగాయామపి సోఽపతత్
బహిః క్షిప్త స్తథా సోపి పరిదందహ్యమానయా
సంజాతా స్తన్మలా నానా ధాతవః సిద్ధిదాయకాః॥
యావదగ్నిముఖా ద్రేతో న్యపత ద్భువి సర్వతః
శతయోజననిమ్నా స్తే జాతాః కూపాస్తు పంచచ
తదాప్రభృతి కూపస్థం తద్రేతః పంచధాభవత్॥

తా॥ పై శ్లోకములలో శివవీర్యము (పాదరసము) కారణాంతరములచే అయిదు కూపములలో అయిదు విధములుగనున్నదని ముఖ్యతాత్పర్యము నెరుంగునది.

## రసభేదములు

మూ. రసో రసేంద్రః సూతశ్చ పారదో మిశ్రక స్తథా
ఇతి పంచవిధో జాతః క్షేత్రభేదేన శంభుజః॥
రసో రక్తో వినిర్ముక్తః సర్వదోషై రసాయనః
సంజాతా స్త్రిదశా స్తేన నీరుజా నిర్జరామరాః॥
రసేంద్రో దోషనిర్ముక్తః శ్యావో రూక్షోఽతిచంచలః
రసాయినోభవంస్తేన నాగా మృత్యువివర్జితాః
దేవై ర్నాగైశ్చ తౌ కూపౌ పూరితౌ మృద్భి రశ్మభిః
తదాప్రభృతి లోకానాం తౌ జాతా వతిదుర్లభౌ॥
ఈషత్పీతశ్చ రూక్షాంగో దోషముక్తశ్చ సూతకః
దశాష్టసంస్కృతై స్సిద్ధో దేహం లోహం కరోతి సః
అథాన్య త్కూపజః కోపి స చల శ్శ్వేతవర్ణవాన్
పారదో వివిధై ర్యోగైః సర్వరోగహరోహి సః॥
మయూరచంద్రికాచ్ఛాయః సరసో మిశ్రకోమతః
సో ప్యష్టాదశసంస్కారయుక్త స్స్యాతీవసిద్ధిదః
త్రయ స్సూతాదయ స్సూతాః సర్వసిద్ధికరా అపి
నిజకర్మవినిర్మాణై శ్శక్తిమంతోఽతిమాత్రయా॥

తా॥ ఆశివవీర్యము క్షేత్రభేదముచే రసము, రసేంద్రము, సూతము, పారదము, మిశ్రకము అని అయిదువిధములుగ నున్నది. అందు రసము దోషరహితమై యెఱ్ఱని రంగు కలిగి అమృతసమానమైయుండును. దీనిని దేవతలుసేవించి మరణమును నిగ్రహించిరి. రసేంద్రము నల్లనిదై జిడ్డులేక మిక్కిలి చంచలముగ నుండును. నాగలోక మీ రసేంద్రమును సేవించి దేహసిద్ధిని బడసిరి. రస రసేంద్రములు నూతులకంటిని దేవతలును నాగులును రాళ్ళు, మన్నుపోసి పూడ్చిరి. కాన నవి మనకిపుడు దొరకవు. సూతము కొంచెము పచ్చనిరంగుగలిగి జిడ్డులేనిదై దోషరహితమైయుండును. అష్టాదశసంస్కారములంజేసినచో నిది దేహమును లోహసమానముగ జేయును. పారదము తెల్లనిరంగు గలిగి చలనస్వభావముగలదై వివిధయోగములచే సర్వరోగములను పోగొట్టును. మిశ్రకము నెమలిపురివలె అనేకరంగులుకలిగి అష్టాదశసంస్కారములనందెనేని సర్వసిద్ధుల నొసంగజాలినదిగ నుండును. సూతము, పారదము, మిశ్రకము ననునవిమూడును సూతము



లనిపిలువబడును. (మనకిప్పుడు దొరకు రసము ఈ మూడుజాతులలో చేరినది. దీనికి కంచుకాదిదోషము లుండును గావున సంస్కరించి వాడుకొనవలెను.)

## పంచపారదములకు శబ్దార్థ నిర్వచనము

మూ. ఏతాం రససముత్పత్తిం యో జానాతి స ధార్మికః
ఆయురారోగ్యసంతానం రససిద్ధించ విందతి
రసనా త్సర్వధాతూనాం "రస" ఇత్యభిధీయతే॥
జరారుజ్మృత్యునాశాయ రస్యతే రసోఽమృతః
రసోపరసరాజత్వా "ద్రసేంద్ర" ఇతి కీర్తితః
దేహలోహమయీం సిద్ధిం సూతే "సూత" ఇతి స్మృతః
రోగపంకాబ్ధిమగ్నానాం పారదానాచ్చ "పారదః"॥
సర్వధాతుగతం తేజో మిశ్రితం యత్ర తిష్ఠతి
తస్మాచ్చ "మిశ్రకః" ప్రోక్తో నానారూపఫలప్రదః॥

తా॥ పైజెప్పిన రసోత్పత్తికథను వినినవారికి ఆయువు, ఆరోగ్యము, సంతతి, రససిద్ధికల్గును. "రసతి సర్వధాతూనితి రసః." అనగా సర్వధాతువులను తినునుగనుక రసమునకు రసమని పేరు. లేక 'రస్యతే రోగశాంత్యై ఇతిరసః' అనగా జరామరణరోగనాశమునకై తినబడునదిగనుక రసమనబడును. 'రసానాంరాజా' అనగా రసోపరస సాధారణరసములకు రాజుగనుక రసేంద్రమని పేరు. 'కాయసిద్ధిం సూతే ఇతి సూతః' అనగా దేహమును లోహసమానముగ జేయుసిద్ధినిచ్చునుగాన సూతమనబడును. 'పారందదాతి రోగపంకాబ్ధేరితి' పారదః అనగా రోగపంకసముద్రమును దాటించి దరిజేర్చునదిగాన పారదమనబడును. 'సర్వధాతుతేజసాం సమ్మిశ్రణమత్రేతి మిశ్రకః' అనగా సర్వధాతుగతమైన తేజస్సులును కలిసియుండుండునుగాన మిశ్రకమనబడును.

## రసమందలి కంచుకాది దోషములు

మూ. ఏవంభూతస్య సూతస్య మర్త్యమృత్యుగదచ్ఛిదః
ప్రభావా న్మానుషా జాతా దేవతుల్యబలాయుషః
తాః- దృష్ట్వాఽభ్యర్థితో రుద్ర శ్శక్రేణ తదనంతరం
దోషైశ్చ కంచుకాభిశ్చ రసరాజో నియోజితః।
తదాప్రభృతి సూతోఽసౌ నైవసిద్ధ్య త్యసంస్కృతః
జలగో జలరూపేణ త్వరితో హంసగో భవేత్

మలగో మలరూపేణ సధూమో ధూమగో భవేత్
అన్యా జీవగతి ర్దైవీ జీవోఽండాదివ నిష్క్రమేత్
సతాంశ్చ జీవయే జ్జీవాన్ తేన జీవో రసస్స్మృతః॥
చతస్రో గతయో దృశ్యాః అదృశ్యా పంచమీగతిః
మంత్రధ్యానాదినా తస్య రుధ్యతే పంచమీగతిః
ఇతి భిన్నగతిత్వాచ్చ రసరాజస్య దుర్లభః
సంస్కార స్తస్య భిషజా నిపుణేన తు రక్షయేత్.

తా॥ మానవులయొక్క సమస్తరోగములనుహరింపగల యీసూతమును సేవించి తత్ప్రభావమువలన దేవతలతో తుల్యమగు ఆయుర్బలములం బొందిన మానవులంజూచి దేవేంద్రుడు సహించక రుద్రునికడకరిగి నరులకు రసము దుర్లభమగునట్లుచేయుమని ప్రార్థింప రుద్రుడు రసమును కంచుకాదిదోషములతో గూర్చెను. అదిమొదలు సంస్కారములందక రసము సిద్ధింపదు. సంస్కారములను చేయుటకు పూర్వము రసమునకు కల గతులను తెలిసికొనవలెను. జలగతి, హంసగతి, మలగతి, ధూమగతి, జీవగతియని రసమునకు అయిదుగతులుగలవు. జలరూపముగ నుండుటంబట్టి జలగతియు, చాంచల్యమునుబట్టి హంసగతియు, మాలిన్యవంతమై యుండుటంబట్టి మలగతియు, నిప్పుపై వేసినచో ధూమాకృతిని దాల్చుటంబట్టి ధూమగతియు తెలిసికొనబడుచున్నది. అయిదవదియగు జీవగతి అండమునుండి జీవము వెడలునట్లు వెడలునదియై సమస్తజీవులను జీవింపజేయునదిగనుండును. కాన జీవగతిగల రసము జీవరసమని చెప్పబడును. సాధారణముగ పైజెప్పిన అయిదుగతులలో మొదటి నాలుగుగతులు మాత్రమే మనకు దృశ్యములగును. జీవగతిని మంత్రధ్యానాదులచే నరికట్టవలెను. ఇట్లు పారదము భిన్నగతికలదిగనుక వైద్యుడు జాగ్రత్తవహించి సంస్కారములం జేసి సిద్ధిని బడయవలెను. "మధ్యమానస్య శ్వేన సంభవేద్ధి గతిత్రయం, జలేగతి ర్మలగతిః పున ర్హంసగతి స్తతః॥ హేమదత్త్వాతత శ్శుద్ధం తత్తు స్తంభే న్నియామకే నియామకగణౌషధ్యా రసం దత్త్వా విపాచయేత్॥ నియమితో నప్రయాతి తథాధూమగతి శ్శివే॥" (రసార్ణవము) అనగా మర్దన సంస్కారోక్తమైన యౌషధకల్కములతో మర్దన చేయబడినయెడల రసముయొక్క జలగతి మలగతి హంసగతియను మూడుగతులు స్తంభించును. నియామక గణద్రవ్యములతో జేర్చి రసమును సంప్రదాయానుసారముగ పాకముచేసినయెడల ధూమగతికూడ స్తంభించి రసము అగ్నియందుంచబడినను పొగలేవక స్థిరముగనుండును.



—♦ పూర్వము రసరసేంద్రముల నాకర్షించుపద్ధతి ♦—

మూ॥ ప్రథమే రజసి స్నాతాం హయారూఢాం స్వలంకృతాం
వీక్షమాణాం వధూం దృష్ట్వా జిఘృక్షుః కూపగో రసః
ఉద్గచ్ఛతి జవా త్సాపి తం దృష్ట్వా యాతి వేగతః
అనుగచ్ఛతి తాం సూతం సీమానం యోజనోన్మితాం॥
ప్రత్యాయాతి తతః కూపం వేగత శ్శివసంభవః
మార్గనిర్మితగర్తేషు స్థితం గృహ్ణంతి పారదం
పతితో దరదేదేశే గౌరవా ద్వహ్నినక్త్రతః
సరసో భూతలే లీనః తత్తద్దేశనివాసినః
తాం మృదం పాతనాయంత్రే క్షిప్త్వా సూతం హరంతిచ॥

తా॥ పైజెప్పిన పంచపారదములంగల యందదేశమున ప్రథమరజస్వలయై స్నానముచేసిన కన్యకను అకూపములయొద్దకు గుఱ్ఱముపై నెక్కించి పంపి సూతులయొక్క లోభాగములను చూచునట్లుచేసి మరల వెంటనే వెనుకకుదిరిగి పారిపోవునట్లు చేయుదురు. అప్పుడు కూపస్థమైన రసము ఆస్త్రీ నాకర్షించుటకై నాలుగుక్రోసులవరకు వచ్చి మరల వెనుకకుబోవును. మార్గమధ్యమునం దంతకుమున్న త్రవ్వినగోతులలో అణగియుండు రసముతోగూడిన మంటిని పాతనాయంత్రమున వండి రసమును గ్రహింతురు.

శ్రీమత్కృష్ణా గోదావరీమధ్య విద్యోతమాన నూజవీణ్ణనగరీప్రభువర శ్రీమదయ్యూరు
మేడూరు నిడదవోలు ప్రముఖసంస్థానాధీశ్వర ఆంధ్రకవితాధురంధర పండితకవి
పోషక శ్రీ శ్రీ రాజా వేంకటాద్ర్యప్పారాయ ప్రభుపుంగవాస్థాన
పండిత భారద్వాజసగోత్రపవిత్ర వేంకటసుబ్బావధాని సత్పుత్ర
సకలపండితకవి సద్వైద్యవిధేయ సత్యనారాయణశాస్త్రి
నామధేయాంధ్రీకృత రసరత్నసముచ్చయమునందు
ప్రథమాధ్యాయము సమాప్తము.
శ్రీశారదాంబార్పణమస్తు.

శ్రీరస్తు

# రసరత్న సముచ్చయము

## ద్వితీయాధ్యాయము

—♦ మహారసములు ♦—

మూ. అభ్రవైక్రాంతమాక్షిక విమలాద్రిజసస్యకం
చపలో రసకశ్చేతి జ్ఞాత్వాష్టౌ సంగ్రహేద్రసాన్॥

తా॥ అభ్రకము, వైక్రాంతము, మాక్షికము, విమలము, శిలాజతు, తుత్థము, చపలము, కఘరి అను నెనిమిది మహారసములని యెఱుంగునది.

—♦ అభ్రక సామాన్యగుణము ♦—

మూ. గౌరీతేజః పరమ మమృతం వాతపిత్తక్షయఘ్నం
ప్రజ్ఞాబోధి ప్రశమితరుజం వృష్యమాయుష్యమగ్ర్యం
బల్యం స్నిగ్ధం రుచిద మకఫం దీపనం శీతవీర్యం
తత్తద్యోగైస్సకలగదహృత్ వ్యోమ సూతేంద్రబంధి॥

తా॥ అభ్రకము అమృతమువంటిది. వాత పిత్త క్షయలను హరించును. బుద్ధిబలము నిచ్చును. రోగములను సంహరించును. వీర్యవృద్ధిని ఆయుష్షును పెంపొందించును. బలకరముగను స్నిగ్ధముగను కాంతిజనకముగను కఫములేనిదిగను దీపనకారిగను శీతవీర్యముకలదిగను ఆయావస్తుసంపుటితో సర్వరోగముల బోగొట్టునదిగను రసబంధమును జేయునదిగను ఉండును.





—♦ ఉత్తమాభ్రకము ♦—

మూ. రాజహస్తా దధస్తాద్య త్సమానీతం ఘనం ఖనేః
భవేత్తదుక్తఫలదం నిస్సత్వం నిష్ఫలం భవేత్॥

తా॥ మూరంబాతిక లోతునుంచి తీసినయభ్రకము శ్రేష్ఠము. అదియే పైగుణములను గల్గియుండునుగాని తదితరమైనది సత్త్వహీనమై నిష్ఫలముగ నుండును. ఆయుర్వేద ప్రకాశమునందు "రాజహస్తః = సపాదకరః" అనివ్రాసియున్నది. అనగా మూరంబాతికయని యర్థమగుచున్నది. పారదసంహితయందు ముప్పదియారు అంగుళములని వ్రాయబడినది. అట్టిచో హస్తమనగా చేతిపొడుగును గ్రహించవలెను. రాజహస్తశబ్దమునకు ముందుగూడ యిట్లే అర్థమును గ్రహింపవలెను.

—♦ అభ్రక భేదములు ♦—

మూ. పీనాకం నాగం మండూకం వజ్రమి త్యభ్రకం మతం
శ్వేతాదివర్ణ భేదేన ప్రత్యేకం తచ్చతుర్విధః॥
పీనాకం పావకోత్క్షిప్తం విముంచతి దళోచ్చయం
తత్సేవితం మలంబధ్వా మారయత్యేవ మానవం
నాగాభ్రం నాగవత్కుర్యా ద్ధ్వనిం పావక సంస్థితం
తద్భుక్తం కురుతే కుష్ఠం మండలాఖ్యం నసంశయః॥
ఉత్ప్లుత్యోత్ప్లుత్యమండూకం ధ్మాతంపతతి చాభ్రకం
తత్కుర్యా దశ్మరీ రోగ మసాధ్యం శస్త్రతోన్యథా
వజ్రాభ్రం వహ్నిసంతప్తం విముక్తాశేషవైకృతం
దేహలోహకరం తచ్చ సర్వరోగహరం పరం॥

తా॥ పినాకము, నాగము, మండూకము, వజ్రము అని అభ్రకము నాల్గువిధములు. అందు తెలుపు, యెరుపు, పసుపు, నలుపు రంగుల భేదముచే ప్రత్యేకము నాల్గువిధములు. అందు పినాకాభ్రకమును నిప్పులోనుంచిన పొరలులేచి నశించును. దానిని సేవించిన మలబద్ధముచేసి మరణమునుకల్గించును. నాగాభ్రకమును నిప్పులలోనూదిన పామువలె బుసకొట్టును. దానిని సేవించినచో మండలకుష్ఠుపుట్టును. మండూకాభ్రకమును నిప్పులలో కాల్చినచో కప్పవలెదుముకులాడును. దానినిసేవించిన శస్త్రాదిచికిత్సలకు గూడ సాధ్యముకాని యశ్మరీరోగమునుపుట్టించును. వజ్రాభ్రకమును నిప్పులలో వైచి కాల్చినచో పైవికారముల వేనిని బొందక చక్కని తెల్లని కాంతి గలిగియుండును,

—◆ శ్వేతాది చతుర్విధాభ్రకోపయోగము ◆—

మూ. శ్వేతం రక్తంచ పీతంచ కృష్ణమేవం చతుర్విధం
శ్వేతం శ్వేతక్రియాసూక్తం రక్తాభం రక్తకర్మణి
పీతాభ మభ్రకం యత్తు శ్రేష్ఠం తత్పీత కర్మణి
చతుర్విధం పరం వ్యోమ యద్యప్యుక్తం రసాయనే॥
తథాపి కృష్ణవర్ణాభ్రం కోటి కోటి గుణాధికం
స్నిగ్ధం పృథుదళం వర్ణసంయుక్తం భారతోధికం
సుఖనిర్మోచ్యపత్రంచ తదభ్రం శస్తమీరితం॥

తా॥ శ్వేతాభ్రకము రజతయోగమందును, రక్తాభ్రకము రసరంజనాదులందును పీతాభ్రకము హేమవిద్యయందును కృష్ణాభ్రకము రసాయనములందును శ్రేష్ఠము. పైనాల్గువిధముల అభ్రకములును రసాయనోపయుక్తములని శాస్త్రమునందు చెప్పబడినను, నునుపుగల గొప్పరేకులును, మంచిరంగును బరువును గలిగి, సులభముగ విడదీయదగిన రేకులుగల కృష్ణాభ్రకమే రసాయనములయందు ఉత్తమమని తెలియవలెను.

"రక్తం పీతంచ హేమార్థే కృష్ణం హేమశరీరయోః। తారకర్మణి శుక్లంచ కాచ కిట్టం పదాత్యజేత్॥" రక్తపీతాభ్రకములు హేమవిద్యయందును, కృష్ణాభ్రకము హేమవిద్యా-శరీరరక్షణములందును, శ్వేతాభ్రకము రజతవిద్యయందును, ఉపయోగించుననియు గాజుకిట్టమువంటి యభ్రకము నిరుపయోగమైనదనియు రసార్ణవమున కొంచెము విశేషము చెప్పబడినది.

—◆ అభ్రకగుణ-దోషములు ◆—

మూ. సచంద్రికంచ కిట్టాభం వ్యోమ న గ్రాసయేద్రసం
గ్రసితశ్చ నియోజ్యోసౌ లోహేచైవ రసాయనే
నిశ్చంద్రికం మృతం వ్యోమ సేవ్యం సర్వగదేషుచ
సేవితం చంద్రసంయుక్తం మేహం మందానలం చరేత్॥
యైరుక్తం యుక్తినిర్ముక్తైః పత్రాభ్రకరసాయనమ్
తైర్దిష్టం కాలకూటాఖ్యం విషం జీవనహేతవే
సత్త్వార్థం సేవనార్థంచ యోజయేచ్ఛోధితాభ్రకం
అన్యథాత్వగుణం కృత్వా వికరోత్యేవ మానవం॥



తా॥ తళుకుగల అభ్రకము రసమందు లీనముకాదు. జీర్ణాభ్రకరసమునే లోహరసాయనాదులందు జేర్చవలెను. మరియు నిశ్చంద్రికమైన యభ్రకమే సర్వరోగహరము. తళుకుగల యభ్రకమును సేవించిన మేహరోగము కలుగును. అగ్నిమాంద్యమును చేయును. కొందరు పత్రాభ్రకరసాయనమని యభ్రకపురేకులతో చేయుప్రక్రియను బోధించియున్నారు. వారిమతమున కాలకూటవిషము అమృతతుల్యమని చెప్పదగియున్నది. అనగా సచంద్రికాభ్రకము విషతుల్యమనియు దానిని సేవింపగూడదనియు భావము. సత్వము దీయుటకుగాని మారణము చేయుటకుగాని గ్రహింపబడు అభ్రకమును ముందు గాశుద్ధిచేయవలెను. లేనిచో వికటించును.

—◆ అభ్రకశోధనము-భస్మము ◆—

మూ. ప్రతప్తం సప్తవారాణి నిక్షిప్తం కాంజికేభ్రకం
నిర్దోషం జాయతే నూనం ప్రక్షిప్తం వాపి గోజలే
త్రిఫలా క్వథితేవాపి గవాం దుగ్ధే విశేషతః
తతో ధాన్యాభ్రకం కృత్వా పిష్ట్వా మత్స్యాక్షికా రసైః॥
చక్రీంకృత్వా విశోష్యాథ పుటే దర్ధేభ కేపుటే
పుటేదేవం హి షడ్వారం పౌనర్నవరసైస్సహ
కలాంశ టంకణేనాథ సంమర్ద్య కృత చక్రికం
అర్ధేభాఖ్యపుటైస్తద్వత్ సప్తవారం పుటేత్ఖలు॥
ఏవం వాసారసేనాపి తండులీయరసేనచ
ప్రపుటేత్సప్తవారాణి పూర్వప్రోక్త విధానతః॥
ఏవం సిద్ధం హతం సర్వరోగేషు వినియోజయేత్॥

తా॥ అభ్రకమును కొలిమిలో కాల్చి కాంజికము, గోమూత్రము, త్రిఫలాకషాయము, ఆవుపాలు అనువానిలో దేనియందైన ఏడుసారులు చల్లార్చిన పరిశుద్ధమగును. పిదప ధాన్యాభ్రకము జేసి దానిని పొన్నగంటియాకురసముతో నూరి బిళ్లలుచేసి యెండించి అర్ధగజపుటమును వేయునది. ఇట్లు తెల్లగలిజేరు రసముతో ఆరుపుటములు వేసి అభ్రకమునకు 16 వ వంతు వెలిగారమును జేర్చి మర్దించి బిళ్లలుచేసి యేడుపుటములు వేయునది. ఇట్లుచేసిన అభ్రకము నిశ్చంద్రికమై సర్వరోగములందు వాడుటకర్హమైయుండును.

—◆ ధాన్యాభ్రకవిధి-భస్మము ◆—

మూ. చూర్ణాభ్రం శాలిసంయుక్తం వస్త్రబద్ధం హి కాంజికే
నిర్యాతం మర్దనాద్వస్త్రాద్ధాన్యాభ్రమితి కథ్యతే

ధాన్యాభ్రం కాసమర్దస్య రసేన పరిమర్దితం
పుటితం దశవారేణ మ్రియతే నాత్రసంశయః॥
తద్వన్ముస్తారసేనాపి తండులీయ రసేనచ
పీతామలక సౌభాగ్య పిష్టం చక్రీకృతాభ్రకం
పుటితం షష్టివారాణి సిందూరాభం ప్రజాయతే
క్షయా ద్యఖిలరోగఘ్నం భవే ద్యోగానుపానతః॥
వటమూల త్వచః క్వాథైః తాంబూలీ పత్రసారతః
వాసామత్స్యాక్షికాభ్యాం వా మీనాక్ష్యా సకటిల్లయా
పయసా వటవృక్షస్య మర్దితం పుటితం ఘనం
భవే ద్వింశతివారేణ సిందూరసదృశప్రభం॥

తా॥ శుద్ధిచేసిన యభ్రకమును మెత్తగా నలియగొట్టి కాంజికములో నానబెట్టి అందు వరిధాన్యమును కలిపి గొంగళిగుడ్డలోకట్టి గట్టిగ మెలివేయుచు పిసుకుచు నున్నయెడల సన్నని అభ్రకపుచూర్ణము క్రిందికిదిగును. అదియే ధాన్యాభ్రక మనబడును. ధాన్యాభ్రకమును కసివెందరసముతో మర్దించి పదిపుటములు వేసిన నిశ్చంద్రికముగ భస్మమగును. మరియు ముస్తలు, చిర్రి, ఉశిరిగపండ్లు, కారుమునగచెక్క అనువాని రసములతో ప్రత్యేకముగ మర్దనచేసి వెనుకటివలె అరువదిపుటములు వేసిన నిశ్చంద్రికముగ సిందూరించును. దీనిని అనుపానభేదముతో క్షయాదిరోగములందు వాడనగు. మర్రియూడలరసము, తమలపాకురసము, అడ్డసరము, పొన్నగంటి రెండును కలిపితీసిన రసము, పొన్నగంటి, కాకరకలిపితీసినరసము, మర్రిపాలు అనువాని రసములచే మర్దించి యిరువది సారులు పుటము వేసినచో అభ్రకము సిందూరించును.

రసపద్ధతిగ్రంథమునందు:—సిందూరీకరణము.

"అథ నాగబలా భద్రముస్తా దుగ్ధం వటస్యచ। యద్వా వటజటాతోయం హరిద్రావారణా పుటేత్। మంజిష్ఠాక్వాథతోయేన సర్వైరేభి ర్యథాక్రమం। పుటితం భావనాయోగా చ్చరమే పుటనే ముహుః॥ జాయతే హ్యరుణం చాతి భస్మవజ్రాభ్రకోద్భవం॥"

(నాగముత్తవపులగము, భద్రముస్తలు, మర్రిపాలు లేక మర్రియూడలకషాయము, పచ్చిపసుపురసము, మంజిష్ఠాకషాయము అనువానితో క్రమముగ భావనచేయుచు పుటములు వేసినచో వజ్రాభ్రకము సిందూరించును.)



అమృతీకరణము:—"త్రిఫలాయాః కషాయస్య పలాన్యాదాయ షోడశ, గోఘృతస్య పలాన్యష్టౌ మృతాభ్రస్య పలాన్ దశ। ఏకీకృత్య లోహపాత్రే పాచయే న్మృదువహ్నినా। తదేవ జీర్ణమాదాయ సర్వరోగేషు యోజయేత్॥"

"అనుపానం వినాప్యభ్రం జరామృత్యు రుజాపహం
యోజయే దనుపానైర్వా తత్తద్రోగహరం పరం॥" (వైద్యచింతామణి)

(పదహారు పలముల త్రిఫలాకషాయము, యెనిమిదిపలముల ఆవునేయి, పదిపలముల అభ్రకభస్మము వీనిని లోహపాత్రలోపోసి ద్రవము యింకువరకు కాచవలెను. దీనికి అమృతీకరణమనిపేరు. ఇట్లు అమృతీకరణము గావించిన యభ్రకమును అనుపానములేకయే సేవించిన ముదిమిని, మృత్యువును రోగములను హరించును. అని తాత్పర్యము.)

## —◆ అభ్రకసత్వపాతనము ◆—

మూ. పాదాంశటంకణోపేతం ముసలీ పరిమర్దితం
రుంధ్యా త్కోష్ఠ్యాం దృఢం ధ్మాతం సత్వరూపం భవేద్ఘనం
కాసమర్దఘనాధాన్య వాసానాంచ పునర్నవః
మత్స్యాక్ష్యాః కాకవల్ల్యాశ్చ హంసపాద్యా రసైః పృథక్॥
పిష్ట్వాపిష్ట్వా ప్రయత్నేన శోషయే ద్ఘర్మయోగతః
పలం గోధూమచూర్ణస్య క్షుద్రమత్స్యాశ్చటంకణం
ప్రత్యేక మష్టమాంశేన దత్త్వా రుద్ధ్వా విమర్దయేత్
మర్దనే మర్దనే సమ్యక్ శోషయే ద్రవిరశ్మిభిః
పంచాజం పంచగవ్యంచ పంచమాహిషమేవచ॥
క్షిప్త్వా గోళాన్ ప్రకుర్వీత కించి త్తిందుకతోధికాన్
అధఃపాతనకోష్ఠ్యాంహి ధ్మాత్వా సత్త్వం నిపాతయేత్
కోష్ఠ్యాకిట్టం సమాహృత్య విచూర్ణ్య గవకాన్ హరేత్
తత్కిట్టం స్వల్పటంకేన గోమయేన విమర్ద్య చ
గోలాన్విధాయ సంశోష్య ధమే ద్భూయోపి పూర్వవత్
భూయః కిట్టం సమాహృత్య మృదిత్వా సత్వమాహరేత్
అధస్తత్త్వకణాం స్తాంస్తు క్వాథయిత్వామ్లకాంజికైః
శోధనీయగణోపేతం మూషామధ్యే నిరుధ్య చ

సమ్యగ్ద్రుతం సమాహృత్య ద్వివారం ప్రథమే ఘనం॥
ఇతి శుద్ధం భవేత్సత్వం యోజ్యం రసరసాయనే॥

తా॥ వజ్రాభ్రకమును నాల్గవపాలు వెలిగారమును చేర్చి నేలతాడిగడ్డలరసముతో మర్దించి చిన్నయుండలుగజేసి యెండించి సత్వపాతనమూసలోపోసి కొలిమిలోపెట్టి గాఢముగ నూదినయెడల అభ్రకమునుండి సత్వము వెడలును.

ధాన్యాభ్రకముతో నాల్గవవంతు వెలిగారమును చేర్చి దానిని కసివెందరసము తుంగగడ్డల కషాయము, ధనియాలకషాయము, అడ్డసరము, తెల్లగలిజేరు, పొన్నగంటి, కాకర, హంసపాది వీనియాకులరసములతో ప్రత్యేకముగ నూరి బిళ్లలు చేసి యెండించవలెను. ఇట్లు మర్దించినపిదప ఒకపలము గోధుమచూర్ణము, అభ్రకమునకు యెనిమిదవవంతు చిన్నచేపలను, వెలిగారమును చేర్చి పంచాజము (మేకనేయి, మేకపాలు మేక పెరుగు, మేకమూత్రము, మేక పెంటికలు) పంచగవ్యము (ఆవునేయి, పాలు పెరుగు, మూత్ర పురీషములు) పంచమాహిషము (గేదెనేయి, పాలు, పెరుగు, మూత్ర పురీషములు) అనువానితో ప్రత్యేకముగ మర్దించి, విషముష్టిగింజలకన్న కొంచెము పెద్దవియగు బిళ్లలను చేసి యెండించి కొలిమిలోబెట్టి యూదినచో నందుండు సత్వము వెడలును. మూసలోపైభాగమునందు కిట్టమునుగ్రహించి, చూర్ణించి యందుండు అభ్రకసత్వ పునలుసులను తీసుకొని, కిట్టముతో వెలిగారమును కొద్దిగాచేర్చి ఆవుపేడతో కలిపి నూరి వెనుకటివలె యుండలను చేసి కొలిమిలోనుంచి యూదవలెను. ఇట్లు రెండు మూడుసారులు చేసి పూర్తిగా సత్వమునుతీసికొని, దానిని శోధనీయగణద్రవ్యములతో చేర్చి కాంజికముకలిపి యుడికించినచో పరిశుద్ధమై రసరసాయనములందు వాడుకొనదగ్గ దగును.

## —♦ అభ్రకద్రుతి ♦—

మూ. మధుతైలవసాజ్యేషు ద్రావితం పరితాపితం।
మృదుస్స్యాద్దశవారేణ సత్వం లోహాదికం ఖరం॥

తా॥ అభ్రకము లోహము మొదలగువానికఠినసత్వములను బాగుగకరగించి తేనె నూనె, వసనెయ్యి, అనువానిలో 10 సారులు బోసినయెడల మృదువులగును.

శ్లో. "ధాన్యామ్లకే పర్యుషితం నిచుల క్షారవారిణి,
స్థితం తద్ద్రవతాం యాతి నిర్మలం రససన్నిభం" (రసార్ణవము.)

(ధాన్యాభ్రకమును కాంజికమునందు భావనచేసి దానిని నీరుప్రబ్బలి క్షారోదక, మందుంచబడినభాండములో పెట్టి పైనమూకుడుమూసి చీరజేసి యెండించి ఆభాండ



మును కొంతకాలము భూమిలో పాతిపెట్టినయెడల అభ్రకము ద్రవరూపమగును.)

అగ్నిజారం నవేకుంభే స్థాపయిత్వాధరోత్తరం।గగనం ద్రవతి క్షిప్రం ముక్తాఫల సమప్రభం॥ కాకమాచీ బీజచూర్ణే నాభ్రచూర్ణం సమంకృతం। భావితంవజ్రిదుగ్ధేన ధమనా ద్రుతిమాప్నుయాత్ ॥ (రసార్ణవము)

అభ్రకమునకు పైన, క్రింద అగ్నిజారమును పోసి ఒక నూతన ఘటమందుంచి కొలిమిలో నూదినయెడల ముత్యమువలె తెల్లగ ద్రవించును.

కామంచి గింజల చూర్ణముతో శ్వేతాభ్రక చూర్ణమును చేర్చి జెముడుపాలతో భావనచేసి కొలిమిలో నుంచి యూదినచో శ్వేతాభ్రకము ద్రవించును.

(ఎర్ర కలబను శ్వేతాభ్రకముతో చేర్చి నూరి కొలిమిలో నూదిన ద్రవించును)

## —♦ సత్వాభ్రక రసాయనము ♦—

మూ. పట్టచూర్ణం విధాయాథ గోఘృతేన పరిప్లుతం
భర్జయేత్సప్తవారాణి చుల్లీసంస్థిత ఖర్పరే
అగ్నివర్ణం భవేద్యావ ద్వారం వారం విచూర్ణయేత్
తృణం క్షిప్త్వా దహేద్యావత్ తావద్వా భర్జనం చరేత్
తతస్స గంధకం పిష్ట్వా వటమూల కషాయతః
పుటే ద్వింశతివారాణి వారాహేణ పుటేనహి॥
పునర్వింశతివారాణి త్రిఫలోత్థ కషాయతః
త్రిపులాముండికాభృంగ పత్రి పథ్యాక్షమూలకైః
భావయిత్వా ప్రయోక్తవ్యం సర్వరోగేషు మాత్రయా
ఏవంచేచ్ఛతవారాణి పుటపాకేనసాధితం
సత్వాభ్రాన్నపరం కించిన్నిర్వికారం గుణోత్తరం
గుణప జ్జాయతేత్యర్థం పరం పాచనదీపనం॥

తా॥ అభ్రక సత్వమును చూర్ణించి వస్త్రగాలితముచేసి ఆవు నేయితో జేర్చి పెంకులో యేడుమారులు వేయించవలెను. ఎర్రగా నిప్పువలె నగువరకుగాని, గడ్డిపోచను వేసినచో కాలిపోవు వరకుగాని వేయించి అందు కొంచెము గంధకముకలిపి మర్రివేళ్ళకషాయముతో మర్దించి యిరువది వరాహపుటములు వేయవలెను. పిదప త్రిఫలాకషాయముతో యిరువది పుటములు వేసి త్రిఫలాకషాయము బోడతరపురసము, గుంటగలగరరసము, కరకకాయక్వాథము, తానికాయక్వాథము, ఉసిరికాయక్వాథము, అనువానితో ప్రత్యే

కము భావనచేసి రోగబలవయఃకాలానుకూలమగు మోతాదు చొప్పున సకలరోగములందును వాడవచ్చును. పై జెప్పిన చొప్పున నూరు పుటములు వేయబడిన సత్త్వాభ్రకమునకంటె నిర్వికారమైనట్టియు, బలవత్తరమైనట్టియు ఔషధము వేరొకటి లేదు. ఇది పాచన దీపనములను సరిగాచేయును.

—♦ అభ్రక భస్మవిధి ♦—

మూ॥ గంధర్వపత్రతోయేన గుడేనసహ భావితం
అధోర్ధ్వం వటపత్రాణి నిశ్చంద్రం త్రిపుటైఃఖగం
క్షుధంకరోతి చాత్యర్థం గుంజార్ధమితి సేవయా
తత్తద్రోగహరై ర్యోగై స్సర్వరోగహరం పరం॥

తా॥ ఆముదపు ఆకుల రసము, బెల్లపు నీరు వీనితో భావనచేయుచు, మఱ్ఱియాకుల నడుమ నుంచి మూడు పుటములు వేసినచో అభ్రకము నిశ్చంద్రికమగును. దీనిని అర్ధగుంజాప్రమాణముగ సేవించిన ఆకలి కలుగును. అనుపాన విశేషయుక్తమై సర్వరోగములను హరించును.

—♦ దివ్యాభ్రక రసాయనము ♦—

మూ. సత్త్వస్య గోళకం ధ్మాతం సస్యసంయుక్తకాంజికే
నిర్వాప్య తత్క్షణేనైవ కుట్టయే ల్లోహపారయా॥
సంప్రాప్య ఘనస్థూలకణాన్ క్షిప్త్వాథ కాంజికే
తత్క్షణేన సమాహృత్య కుట్టయిత్వా రజశ్చరేత్
గోఘృతేన చ తచ్చూర్ణం భర్జయే త్పూర్వవత్త్రిధా॥
ధాత్రీఫలరసైస్తద్వద్ధాత్రీపత్ర రసేనవా॥
భర్జనే భర్జనే కార్యం శిలాపట్టేన పేషణం
తతః పునర్నవా వాసా రసైః కాంజిక మిశ్రితైః
ప్రపుటే ద్దశవారాణి దశవారాణి గంధకైః
ఏవం సంశోధితం వ్యోమ సత్వం సర్వ గుణోత్తరం॥
యథేష్టం వినియోక్తవ్యం జారణేచ రసాయనే॥
వేల్లవ్యోష సమన్వితం ఘృతయుతం వల్లోన్మితం సేవితం
దివ్యాభ్రం క్షయపాండురుగ్గ్రహణికా శూలామ కుష్ఠామయం



ఊర్ధ్వశ్వాసగదం ప్రమేహ మరుచిం కాసామయం దుర్ధరం
మందాగ్నిం జఠరవ్యథాం విజయతే యోగై రశేషామయాన్॥
ధృతయో నైవ నిర్దిష్టాః శాస్త్రైర్దృష్టా అపి దృఢం
వినా శంభోఃప్రసాదేన నసిద్ధ్యంతి కదాచన॥

తా॥ తుత్థచూర్ణము కలిపిన కాంజికములో అభ్రకసత్వమును యెర్రగా కొలిమిలో కాల్చి చల్లార్చవలెను. వెంటనే యినుప గుదియతో నలియగొట్టి చూర్ణించి అందలి పెద్ద రవ్వలను మరల కాల్చి పైవిధముగ తుత్థచూర్ణయుత కాంజికములో చల్లార్చి మరల చూర్ణించవలెను. (కాల్చి కాంజికములో చల్లార్చినచో సత్త్వము పెళుసుదనమును జెందునని యెఱుంగునది.) పిదప వెనుక జెప్పిన యట్లు ఆవునేతితో మూడుసారులు వేయించుచు ప్రతిపర్యాయమును ఉసిరిగపండ్ల రసముతోగాని ఉశిరిగ ఆకురసముతోగాని మర్దించుచుండవలెను. పిదప తెల్లగలిజేరు రసము, కాంజికము కలిపి నూరి బిళ్లలు చేసి పది పుటములును, గంధకముకలిపి పై రసములతో మర్దించి పదిపుటములును, వేసిన యెడల ఉత్కృష్టగుణములుగల అభ్రక రసాయన మగును. దీనిని జారణప్రక్రియయందును, రసాయన యోగములందును, స్వేచ్ఛగా వినియోగింపవచ్చును.

దీనిని వాయువిడంగములు, త్రికటుకములు, నేయి అనుపానముగా ఒకచిన్నము యెత్తు చొప్పున సేవించుచుండిన యెడల, క్షయ, పాండువు, గ్రహణీ, శూల, ఆమవాతము, కుష్ఠము, ఊర్ధ్వశ్వాస, ప్రమేహము, అరుచి, దుస్తరమైన కాసరోగము, అగ్నిమాంద్యము, జఠరవ్యాధి మొదలగు రోగములను బోగొట్టును.

అభ్రక సేవయందు అపథ్యములు:—రససంకేత కలిక—

"క్షారామ్ల ద్విదళం వర్జ్యం కర్కోటం కారవేల్లకం
వృంతాకంచ కరీరంచ తైలంచాభ్రక సేవనే॥"

(ఉప్పు, పులుసు, ద్విదళధాన్యము, ఆగాకర, కాకర, వంకాయ, వెణుతురు, నూనె ఇవి అభ్రక సేవయందు వర్జించదగినవి.)

ద్రుతులను చేయు విధానములు శాస్త్రమునందు చెప్పబడియున్నను పరమేశ్వర ప్రసాదములేక యవి సిద్ధింపవు.

—♦ వైక్రాంత పరీక్ష ♦—

మూ. అష్టాస్ర శ్చాష్టఫలకః షట్కోణో మసృణోగురుః
శుద్ధమిశ్రిత వర్ణైశ్చ యుక్తో వైక్రాంత ఉచ్యతే॥

శ్వేతో రక్తశ్చ పీతశ్చ నీలః పారావతచ్ఛవిః
శ్యామలః కృష్ణవర్ణశ్చ కర్బురశ్చాష్టధా హి సః॥

తా. వైక్రాంతము కెనిమిది యంచులును యెనిమిదిపలకలును, ఆరుకోణములును ఉండును. దట్టమగు రంగును బరువును గలిగి యుండును. తెలుపు మిశ్రవర్ణము కూడ కలిగి యుండును. మరియు వైక్రాంతము తెలుపు, యెరుపు, పసుపు, నీలము, పావురపు వన్నె, మేఘవర్ణము, నలుపు, కర్బురము (చిత్రవర్ణము) అనురంగులభేదముచే యెనిమిది విధములుగ గూడనుండును.

## — వైక్రాంత గుణములు —

మూ. ఆయుః ప్రదశ్చ బలవర్ణకరోఽపి వృష్యః
ప్రజ్ఞాప్రద స్సకలదోష గదాపహారీ,
దీప్తాగ్నికృత్పవిసమాన గుణస్తరస్వీ
వైక్రాంతకః ఖలు వపుర్బలలోహకారీ॥
రసాయనేషు సర్వేషు పూర్వగణ్యః ప్రతాపవాన్
వజ్రస్థానే నియోక్తవ్యో వైక్రాంత స్సర్వదోషహా॥

తా॥ వైక్రాంతము ఆయువును బలమును కాంతిని వీర్యవృద్ధిని బుద్ధిచాతుర్యమును అగ్నిదీప్తిని యిచ్చును. సకల దోషజన్య వికారములను హరించును. రసాయనములలో నిది ముఖ్యమైనది. వజ్రమునతో సమానమగు గుణముకలది గనుక వజ్రాభావమున దీనిని వాడుకొనవచ్చును.

## — వైక్రాంతోత్పత్తి - భేదము —

మూ. దైత్యేంద్రో మాహిష స్సిద్ధః సహదేవ సముద్భవః
దుర్గాభగవతీ దేవీ తం శూలేన వ్యమర్దయత్॥
తస్య రక్తంతు పతితం యత్రయత్ర స్థితం భువి
తత్రతత్రతు వైక్రాంతం వజ్రాకారం మహారసం
వింధ్యస్య దక్షిణేభాగే హ్యుత్తరే నాస్తి సర్వతః
వికృంతయతి లోహాని తేన వైక్రాంతక స్స్మృతః॥
శ్వేతః పీత స్తథా రక్తః నీలః పారావతచ్ఛవిః
మయూరకంఠ సదృశ శ్చాన్యో మరకతప్రభః॥



దేహసిద్ధికరం కృష్ణం పీతే పీతం సితే సితం॥
సర్వార్థసిద్ధిదం రక్తం తథా మరకతప్రభం
శేషే ద్వే నిష్ఫలే వర్జ్యే వైక్రాంతమితి సప్తధా॥
యత్ర క్షేత్రే స్థితం చైవ వైక్రాంతం తత్రభైరవం
వినాయకంచ సంపూజ్య గృహ్ణీయా చ్ఛుద్ధమానసః।
వైక్రాంతో వజ్రసదృశః దేహలోహకరో మతః।
విషఘ్నో రసరాజశ్చ జ్వరకుష్ఠక్షయాపహృత్॥

తా. దేవతావిరోధియగు మహిషాసురుడను వానిని దుర్గాదేవి సంహరించెను. వాని రక్తము భూమియందుపడినచోట తెల్లవజ్రాకారమగు వైక్రాంతమను మహారసము జనించెను. అది వింధ్యకు దక్షిణభాగమునను ఉత్తరభాగమునను విశేషముగనుండును. లోహమును ఖండించునది గాన వైక్రాంతము అని దీనికి పేరు. ఇది తెలుపు, పసుపు, యెరుపు, నీలము, పావురాయి వన్నె, నెమిలికంఠమువంటివర్ణము, మరకతవర్ణము(ఆకుపచ్చరంగు) కలదిగనుండును. అందు నల్లనిది దేహసిద్ధిని చేయును. పచ్చనిది హేమవిద్యయందును తెల్లనిది రజతవిద్యయందును, యెర్రనిది, ఆకుపచ్చనిది అణిమాది సిద్ధిసాధనమందును సమర్థమైయుండును. తక్కినరెండును నిష్ప్రయోజనములు. వైక్రాంతముగలచోట వినాయకుని, భైరవుని పూజించి దానిని భక్తితో గ్రహించవలెను. ఇది వజ్రమువంటి గుణముకలది. విషదోషమును, జ్వరమును, కుష్ఠును, క్షయను పోగొట్టును. ఇదిమహారసము.

## — వైక్రాంతశోధనము —

మూ. వైక్రాంతకాస్స్యు స్త్రిదినం విశుద్ధా
స్సంస్వేదితాః క్షారపటూని దత్త్వా
ఆమ్లేషు మూత్రేషు కులుత్థరంభా
నీరేథవా కోద్రవవారిపక్వాః॥
కులుత్థక్వాథ సంస్విన్నో వైక్రాంత శ్శుద్ధిమృచ్ఛతి॥

ఆమ్లరసములందు క్షారలవణములను జేర్చి దానితో మూడుదినములు స్వేదనము చేసినను ఉలవకట్టు, అరటిదుంపరసము, కొర్రగంజి అనువానిలోను శెకించినను ఉలవకట్టుతో స్వేదనముచేసినను వైక్రాంతము శుద్ధమగును.

## వైక్రాంతభస్మవిధి

మూ. త్రియతేష్ట పుష్పైర్గంధ నింబుక ద్రవసంయుతైః॥
వైక్రాంతేషుచ తప్తేషు హయమూత్రం వినిక్షిపేత్
పౌనః పున్యేనవా కుర్యాద్ద్రవం దత్త్వా పుటేత్వసు॥
భస్మీభూతంతు వైక్రాంతం వజ్రస్థానే నియోజయేత్॥

తా॥ వైక్రాంతమును కాల్చిగుర్రపుమూత్రములో పలుమారుచల్లార్చి పిదపగంధకము జేర్చి నిమ్మపండ్లరసముతో నూరి యెనిమిదిపుటములు వేసినయెడల భస్మమగును. దీనిని వజ్రభస్మమునకు మారుగ నుపయోగింపవచ్చును.

## వైక్రాంతసత్వపాతనము

మూ. మోక్షమోరట పాలాశ క్షార గోమూత్రభావితం।
వజ్రకందనిశాకల్క ఫలచూర్ణ సమన్వితం।
తత్కల్కం టంకణం లాక్షాచూర్ణం వైక్రాంతసంభవం
నవసారసమాయుక్తం మేషశృంగీద్రవాన్వితం।
పిండితం మూక మూషస్థం ధ్మాపితంచ హఠాగ్నినా।
తత్రైవ పతతే సత్త్వం వైక్రాంతస్య నసంశయః॥
సత్త్వపాతన యోగేన మర్దితశ్చ వటీకృతః॥
మూషాస్థో ఘటికాధ్మాతో వైక్రాంత స్సత్వ ముత్సృజేత్॥

తా॥ మొక్కపుచెట్టు, మొరళిచెట్టు, మోదుగుచెట్టు అనువానిక్షారములను తీసి వానిని క్షారోదకకల్పనప్రకారముగ కషాయముకాచి దానియందు శుద్ధవైక్రాంతమును భావనచేసి చూర్ణించి పిదప అడవికంద, పసుపు, త్రిఫలములు అనువానిని కల్కముచేసి ఆకల్కమును, నవాసారమును, వెలిగారమును, లక్కను చూర్ణముచేసి యాచూర్ణమును వైక్రాంతచూర్ణముతోచేర్చి దుష్టపాకురసముతోనూరి ముద్దచేసి దానిని మూసలోబెట్టి కొలిమియందు గాఢాగ్నినూదినచో వైక్రాంతసత్త్వము ఆమూసలోపడును. ఆసత్వమును పైవిధముగనూరి మాత్రలుగచేసి యెండించి సత్వపాతనయంత్రమందుంచి మరలనొకఘడియమాత్రమూదిన శుభ్రమగు సత్త్వము వెడలును.

శ్లో. "భస్త్రాద్వయేన హఠతో ధ్మాతవ్యం పంచమాహిషసుబద్ధం
దత్త్వాదశాంశస్వర్జిక పటుటంకణ గుంజకాక్షారాన్



తద్గచ్ఛతి కఠినత్వం ముంచతి సత్త్వం స్ఫులింగకాకారం
ముక్తానికరప్రాయం గ్రాహ్యం తత్కాచమధివర్జ్య॥"(రసహృదయతంత్రం)

తా॥ శుద్ధవైక్రాంతమునకుపదియవవంతు సర్జక్షార, పంచలవణ, టంకణ, గుంజాక్షారవర్గద్రవ్యములను చేర్చి పంచమాహిషముచేత మర్దించి మాత్రలుచేసి మూసలోనుంచి జంటతిత్తులుగ కొలిమిలోబెట్టి గాఢముగనూదిన అగ్నికణములబోలిన సత్వము వెడలి,కొంచెముచల్లారిన పిదప గట్టిపడి ముత్యములప్రోగువలెనుండు వైక్రాంతసత్వకణములను గ్రహించి కిట్టమును వర్జించవలెను.

రసార్ణవము:—శుద్ధిచేసిన వైక్రాంతమును చూర్ణించి అడవికందరసముతోను జెముడురసముతోను ప్రత్యేకముగనూరి అందు గేదెవెన్నను, తేనెను జేర్చి ముద్దజేసి యాముద్దను మూసలోబెట్టి దీరజేసి కొలిమిలోనుంచి యూదినచో వైక్రాంతమునుండి యెఱ్ఱనిసత్వము వెడలును.

## వైక్రాంతరసాయనము

మూ. భస్మత్వం సముపాగతో వికృతకో హేమ్నామృతేనాన్వితః
పాదాంశేన కణాజ్యవేల్ల సహితో గుంజామిత స్సేవితః
యక్ష్మాణం జరణంచ పాండుగుదజం శ్వాసంచ కాసామయం
దుష్టాంచగ్రహణీమురఃక్షతముఖాన్ రోగాన్ జయేద్దేహకృత్॥
సూతభస్మార్ధసంయుక్తం నీలవైక్రాంత భస్మకం
మృతాభ్రసత్వముభయోః తులితం పరిమర్దితం
క్షౌద్రాజ్యసంయుతం ప్రాత ర్గుంజామాత్రం నిషేవితం
నిహంతి సకలాన్ రోగాన్ దుర్జయా న్యన్యభేషజైః
త్రిసప్తదివసైః నృణాం గంగాంభ ఇవపాతకం॥

తా॥ వైక్రాంతభస్మము, స్వర్ణభస్మము యివిసమభాగములుగకలిపి యిందుగుంజాప్రమాణమగుభస్మమును, పిప్పళ్లు, మిరియాలు అనువానిచూర్ణముతోచేర్చి నేతిలో పుచ్చుకొనుచుండు నెడల క్షయ, ముదిమి, పాండువు, మూలరోగము, శ్వాసకాసలు, గ్రహణి ఉరఃక్షతము, మున్నగురోగములు నశించును. దేహజనకమై యుండును.

నీలవైక్రాంతము 1భాగము, రసభస్మము ½భా॥ అభ్రకసత్వభస్మము 1½భా॥ యీమూటినికలిపి తేనె, నేయి అనుపానముతో గుంజామాత్రము సేవించినచో యితర ఔషధములకుసాధ్యముకాని సకలరోగములను యిరువదియొక్కదినములకు నశించును. గంగోదకము పాపములనువలె నిది రోగములను నశింపజేయును.

గౌరీమతము:—“వికృతా వజ్రఖండా యే వైక్రాంతాఖ్యాం భజంతి తే। జాత యశ్శోధనం హింసా గుణాస్తేషాంతు వజ్రవత్॥ (వికృతములగు వజ్రపుముక్కలు వైక్రాంతము లనబడగును. వీనిజాతి, శుద్ధి, భస్మము, గుణము మున్నగునవి వజ్రమునకువలె నిర్ణయింపనగును.)

—♦స్వర్ణమాక్షికోత్పత్తి – లక్షణము – గుణము♦—

మూ. సువర్ణ శైలప్రభవో విష్ణునా కాంచనోరసః
తాపీకిరాత చీనేషు యవనేషుచ నిర్మితః॥
తాప్య సూర్యాంశు సంతప్తో మాధవే మాసి దృశ్యతే॥
మధురః కాంచనాభాసః సామ్లో రజత సన్నిభః॥
కించిత్కషాయమధురః శీతః పాకే కటు ర్లఘుః
తత్సేవనా జ్జరా వ్యాధి విషైర్న పరిభూయతే॥
మాక్షికో ద్వివిధో హేమమాక్షికో తారమాక్షికః
తత్రాద్యం మాక్షికం కాన్యకుబ్జోత్థం స్వర్ణసన్నిభం॥
తపతీతీరసంభూతం పంచవర్ణ సువర్ణవత్॥
పాషాణ బహుళం ప్రోక్తః తారాఖ్యోల్పగుణాత్మకః॥
మాక్షికధాతు స్సకలామయఘ్నః
ప్రోక్తో రసేంద్రస్య వరంహి వృష్యః॥
దుర్మేళలోహద్వయ మేళనశ్చ
గుణోత్తర స్సర్వరసాయనాగ్ర్యః॥

తా॥ తాపీ కిరాత చీనా యవన దేశములందు కాంచనరసమగు సువర్ణమాక్షికమును విష్ణువు సృజించెను. ఎండవేడిమికి మిగులతప్తమై వైశాఖమాసమం దది తరుచు కనబడును. అది బంగారు వర్ణము, రజితవర్ణము గలిగి రెండువిధములై వరుసగ హేమమాక్షికము తారమాక్షికము అను పేర్లబరగును. అందు మొదటిది మధురముగను ల్లగను ఉండును. రెండవది కొంచెమువగరుగను మధురముగను నుండును. ఈరెండును శీతవీర్యమును కటువిపాకమును, ముదిమిని, రోగమును, విషదోషమును తొలగించు ప్రభావము గలిగియున్నవి. మొదటిది కాన్యకుబ్జదేశమందును రెండవది తపతీనదీతీరమందును తరుచు గాదొరకును. హేమమాక్షికము అయిదు వన్నెల బంగారుచాయ గలిగియుండును. పాషాణ బహుళమై తారమాక్షికము అల్పగుణదాయకముగ నుండును. రసమున కిది ప్రాణమువంటిది. వీరవృద్ధినికలిగించుటకును, మేళనముకాని లోహముల నొకటితో మఱొకటి కలుపుటకునుయిది ఉత్తమమైనది. రసాయనములం దిది శ్రేష్ఠము.



రసరత్నాకరము:— “భంగే సువర్ణసంకాశః మనాక్కృష్ణో బహిశ్ఛవిః।
బృహద్వర్ణ ఇతిఖ్యాతో మాక్షికశ్శ్రేష్ఠఉచ్యతే॥”

(తా॥ పగులగొట్టినచో బంగారురంగుగలిగి పైన కొంచెము నల్లనివర్ణముగలదియు నగు మాక్షికము బృహద్వర్ణస్వర్ణమాక్షికమనబడును.)

—♦స్వర్ణమాక్షిక శోధన – మారణములు♦—

మూ. ఏరండతైలలుంగాంబు సిద్ధం సిధ్యతిమాక్షికం।
సిద్ధంవా కదలీకంద తోయేన ఘటికాద్వయం॥
తప్తం క్షిప్త వరాక్వాథే శుద్ధిమాయాతిమాక్షికం॥
మాతులుంగాంబు గంధాభ్యాం పిష్టం మూషోదరేస్థితం।
పంచక్రోడపుటీదగ్ధం మ్రియతే మాక్షికం ఖలు।
ఏరండస్నేహ గవ్యాజ్యైః మాతులుంగ రసేనవా॥
ఖర్పరస్థం దృఢం పక్వం జాయతే ధాతుసన్నిభం
ఏవం మృతం రసేయోజ్యం రసాయనవిధావపి॥

తా॥ఆముదము,నిమ్మపండ్లరసము అనువానిలోనుడికించినను అరటిదుంపరసములో రెండుగడియలుడికించినను కాల్చి కరక్కాయకషాయమునముంచినను మాక్షికము శుద్ధియగును. పిదప దానితో గంధకమును చేర్చి నిమ్మపండ్లరసముచేనూరి మూసలోనుంచి చీరజేసి అయిదు వరాహపుటములు పెట్టిన భస్మమగును. పిదప ఆభస్మమును లోహపాత్రలోనుంచి ఆముదము, ఆవునేయి, మాదీఫలరసము పోసి పక్వముచేసినయెడల సిందూరించును. ఇట్లు మృతముగావింపబడిన మాక్షికమును రసమందుజారణచేయుటకును, రసాయనములందు కలుపుటకును ఉపయోగించవలెను.

—:స్వర్ణమాక్షిక సత్వపాతనము:—

మూ. త్రింశాంశ నాగసంయుక్తం క్షారైరమ్లైశ్చమర్దితం
ధ్మాతం ప్రకటమూషాయాం సత్త్వంముంచతి మాక్షికం
సప్తవారం పరిద్రావ్య క్షిప్తం నిర్గుండికాజలే
మాక్షికసత్త్వసమ్మిశ్రం నాగం నశ్యతి నిశ్చితం॥
క్షౌద్రగంధర్వతైలాభ్యాం గోమూత్రేణ ఘృతేనచ
కదళీకంద సారేణ భావితం మాక్షికం ముహుః

మూషాయాం ముంచతి ధ్మాతం సత్త్వం శుల్బనిభం మృదు
గుంజాబీజసమచ్ఛాయం ద్రుతద్రావంచ శీతలం
తాప్య సత్త్వం విశుద్ధం తద్దేహ లోహకరం పరం॥

తా॥శుద్ధిచేసిన స్వర్ణమాక్షికమునుచూర్ణించి దానికి ముప్పదియవవంతు శుద్ధిచేసిన సీసమును కలిపి క్షారగణోక్త ముష్కకాదిక్షారోదకములతోను ఆమ్లవర్గద్రవ్యరసములతోను బాగుగమర్దించి పిదప దాని నెండించి మూసలోబెట్టిపైన మూతమూయక కొలిమిలోనుంచియూదినచో సత్త్వమువెడలును. దానినిగ్రహించి కరిగించుచు ఏడుసారులు వావిలికషాయమున చల్లార్చినయెడల సీససంపర్కదోషము నివర్తించును.మరియు మాక్షికమును తేనె,ఆముదము, గోమూత్రము,ఆవునేయి, అరటిదుంపరసము అను నీద్రవములందు పలుమారు భావనచేసి మూసలోనుంచి కొలిమిలోబెట్టియూదినచో అందుండి తామ్రవర్ణము, గుంజావర్ణముగల సత్త్వమువెడలును. దానినిసేవించిన దేహము లోహతుల్యమగును.

రసార్ణవము:—"గోమూత్రైశ్చ స్నుహీక్షీరైః భావ్యమేరండతైలకైః
మాక్షికం దినమేకంతు మర్దితం వటకీకృతం
అభ్రవ ద్ధమయే త్సత్త్వం........."

(తా॥ గోమూత్రము, జెముడుపాలు, ఆముదము అనువానిలో మాక్షికము నొకదినము భావనచేసి మర్దించి పటికలుగ జేసి మూసలో బెట్టి యభ్రకమునువలె కొలిమిలోనూదిన సత్త్వమువెడలును)

—— స్వర్ణమాక్షికరసాయనము ——

మూ. మాక్షికసత్త్వంచరసేన పిష్టం కృత్వావిలీనేచ బలింనిధాయ
సమ్మిశ్రసంమర్ద్యచ ఖల్వమధ్యేనిక్షిప్య సత్త్వంద్రుతిమభ్రకస్య
విధాయగోళం లవణాఖ్యయంత్రే పచేద్దినార్ధం మృదువహ్నినాచ
స్వాంగశీతంపరిచూర్ణ్యసమ్యగ్వల్లోన్మితంవ్యోషవిడంగయుక్తం॥
సంసేవితం క్షౌద్రయుతంనిహంతిజరాంసరోగా మపమృత్యుమేవం
దుస్సాధ్యరోగానపి సప్తవాసరైర్నైతేనతుల్యోస్తిసుధారసోపి॥

తా॥పాదరసమందు మాక్షికసత్త్వమునుజేర్చి రెండును కలిసినపిదప గంధకమును జేర్చి అభ్రకద్రుతితో కల్వమునందు ముద్దజేసి లవణయంత్రమందు పండ్రెండుజాములు వండి స్వాంగశీతలమునదీసి చూర్ణించి అందు చిన్నమెత్తు ఔషధమును,మిరియాలు,వాయువిడంగములు, తేనె అనుపానముతో ఏడుదినములు సేవించిన అపమృత్యువును సకల రోగములను ముదిమియు తొలగును. అమృతాధికమైన యౌషధము.



—— స్వర్ణ మాక్షికద్రుతి ——

మూ. ఏరండోత్థేన తైలేన గుంజాక్షౌద్రంచ టంకణం
మర్దితం తస్యవాపేన సత్త్వం మాక్షికజం ద్రవేత్॥

తా॥గురివెందగింజలను వెలిగారమును చూర్ణించి అందు ఆముదమును తేనెనుకలిపి దానిలో స్వర్ణమాక్షిక సత్త్వమునుచేర్చి కొలిమిలోపెట్టి యూదిన స్వర్ణమాక్షికసత్త్వము ద్రవించును.

—— విమలము ——

మూ. విమల స్త్రివిధః ప్రోక్తః హేమాద్య స్తారపూర్వకః
తృతీయః కాంస్యవిమలః తత్త త్కాంత్యా చ లక్ష్యతే
వర్తులః కోణసంయుక్తః స్నిగ్ధశ్చ ఫలకాన్వితః
మరుత్పిత్తహరో వృష్యః విమలోతి రసాయనః
పూర్వో హేమక్రియాసూక్తో ద్వితీయో రౌప్యకృన్మతః
తృతీయో భేషజే తేషు పూర్వపూర్వో గుణోత్తరః॥

తా॥హేమవిమలము, తారవిమలము, కాంస్యవిమలము అని విమలము మూడువిధములు. అవి క్రమముగ బంగారు వెండి కంచురంగులుగలవై గుండ్రనై అంచులును పలకలును మెరుపును గలిగినవై యుండును. వాతపిత్తములను హరించును.వీర్యవృద్ధినికల్గించును. రసాయనము అందు మొదటిది హేమవిద్యయందును, రెండవది తారవిద్యయందును మూడవది ఔషధములందును ఉపయోగించును. క్రమముగా నవి ఉత్తమ మధ్యమ అధమగుణములు గలవి.

—— విమలశోధన - మారణ - సత్త్వపాతనములు ——

మూ. ఆటరూషజలే స్విన్నః విమలో విమలో భవేత్
జంబీరస్వరసే స్విన్నః మేషశృంగీరసేథవా
ఆయాతి శుద్ధిం విమలః ధాతవశ్చ యథాపరే
గంధాశ్మలకుచామ్లైశ్చ మ్రియతే దశభిః పుటైః
సటంకలకుచద్రావైః మేషశృంగ్యాశ్చ భస్మనా

పిష్టో మూషోదరే లిప్త స్సంశోష్యచ నిరుధ్యచ
షట్ప్రస్థకోకిలై ర్ధ్మాతో విమల శ్శశిసన్నిభం
సత్త్వం ముంచతి తద్యుక్తో రస స్స్యా త్స రసాయనః
విమలో శిగ్రుతోయేన కాంక్షీ కాసీస టంకణం
వజ్రికందసమాయుక్తం భావితం కదలీరసైః
మోక్షకక్షారసంయుక్తం ధ్మాపితం మూకమూషగం
సత్త్వం చంద్రార్కసంకాశం పతతే నాత్రసంశయః॥

శుద్ధి:—విమలమును అడ్డసరపు కషాయమందుగాని నిమ్మపండ్లరసమందుగాని దుష్టుపాకు రసమందుగాని స్వేదనముచేసిన శుద్ధమగును. ఇతరధాతువులకు జెప్పిన శుద్ధులను గూడ దీనికి చేయవచ్చును.

ఆంధ్రరసప్రదీపిక:—"గీ. వరుసతోడుత విమలము వావిలాకురసమునను జాముఫండిన పాసగుశుద్ధి."

భస్మము:—ఇట్లు శుద్ధమైన విమలముతో గంధకమును చేర్చి నిమ్మపండ్లరసముతో నూరి పదిపుటములు వేసిన యెడల భస్మమగును.

సత్వపాతనము:—శుద్ధమైన విమలము, వెలిగారమును కలిపి చూర్ణించి అందు దుష్టుపాకు భస్మమును చేర్చి నిమ్మపండ్లరసముతో నూరి యాముద్దను మూస యొక్క లోభాగమునపూసి యెండించి మూతిమూసి చీరజేసి కొలిమి లోపెట్టి ఆరుప్రస్థముల బొగ్గులను పోసి, యూదిన చంద్రకాంతిగల సత్త్వము వెడలును. ఇది జరామృత్యువులను సంహరించును.

విమలమును పటికి, అన్నభేది, వెలిగారము, అనునీమూటితో జేర్చి మునగపూలరసమందును అరటిదుంపరసమందును ఆడవికందరసమందును భావనచేసి మొక్కపుక్షారమును కొంచెముకలిపి మూసలోపెట్టి మూతిమూసి కొలిమిలోనుంచి యూదినచో సత్వము వెడలును.

—♦ విమలరసాయనము ♦—

మూ. తత్సత్త్వం సూతసంయుక్తం పిష్టంకృత్వా సుమర్దితం
విలీనం గంధకే క్షిప్త్వా జాయతే త్రిగుణాత్మకం॥
శిలాం పంచగుణాం చాపి వాలూకాయంత్రకే ఖలు
తారభస్మదశాంశేన తావ వైక్రాంతకం మతం



సర్వమేకత్ర సంచూర్ణ్య పటేన పరిగాల్యచ
విక్షిప్య కూపికామధ్యే పరిపూర్య ప్రయత్నతః
లీఢో వ్యోషసమన్వితో విమలకో యుక్తో ఘృతై స్సేవితో
హన్యా ద్దుర్భగకృ జ్జ్వరాన్ శ్వయథుకం పాండుప్రమేహారుచీః।
మూలార్తిం గ్రహణీంచ శూల మతులం యక్ష్మామయం
[కామలాం
సర్వాన్ పిత్తమరుద్గదాన్ కిముపరై ర్యోగై రశేషామయాన్॥

తా. విమలసత్త్వము, రసము, గంధకము, ఇవి ప్రత్యేకము ఒకభాగము, మణిశిల, అయిదుభా॥ రజతభస్మము పదియవభా॥ వైక్రాంతభస్మము పదియవభా॥ వీని నేకముజేసి చూర్ణించి వస్త్రగాలితము చేసి కాచకుప్పెలోబోసి వాలుకాయంత్రమున క్రమాగ్నులతోవండి సాంగశీతలమునదీసి బలానుసారము గుంజెత్తుమొదలు నాలుగు గుంజలయెత్తువరకు మిరియాలు, కరక్కాయ, నేయి అనుపానముతో సేవించిన జ్వరము, శ్వయథు పాండువు, ప్రమేహము, అరుచి, మూలవ్యాధి, గ్రహణి, శూల, క్షయ, కామిల, వాతపిత్తరోగములు మున్నగువానిని సంహరించును. ఇతర ఔషధములు దీనిని సరిపోల జాలవు.

—♦ శిలాజతు ♦—

మూ. శిలాజతు ద్వివిధా ప్రోక్తో గోమూత్రాద్యో రసాయనః
కర్పూరపూర్వక శ్చాన్యః తత్రాద్యో ద్వివిధః పునః
స సత్త్వశ్చైవ నిస్సత్త్వః తత్ర పూర్వో గుణాధికః
గ్రీష్మే తీవ్రార్కతప్తేభ్య శ్శిలాధాతు ర్వినిస్సరేత్॥
స్వర్ణగర్భగిరే ర్జాతో జపాపుష్పనిభో గురుః
స స్వల్పతిక్త స్సుస్వాదుః పరమం తద్రసాయనం
రౌప్యగర్భగిరే ర్జాతం మధురం పాండురం గురు
శిలాజం పిత్తరోగఘ్నం విశేషా త్పాండురోగహృత్॥
తామ్రగర్భగిరేర్జాతం నీలవర్ణం ఘనం గురు।
వహ్నౌ క్షిప్తం భవే ద్యావ ల్లింగాకార మధూమకం
సలిలేధవిలీనం చ త చ్ఛుద్ధం హి శిలాజతు॥

తా॥ గోమూత్రశిలాజతు, కర్పూరశిలాజతు అని శిలాజతు రెండువిధములు. మొదటిది నిస్సత్త్వము ససత్త్వము అని మరలరెండువిధములు. ససత్త్వము శ్రేష్ఠము.

గ్రీష్మకాలమున తీక్ష్ణమైన యెండకాకవలన బంగారు, వెండి, రాగి పుట్టునట్టి హిమవత్పర్వతపు రాళ్ళనుండి నిర్యాస (జిగురు) రూపముగ వెడలునట్టి ద్రవ్యమే శిలాజతు అనబడును.

ప్రత్యేక భేద-గుణములు:— స్వర్ణగర్భశిలలనుండి పుట్టునది దాసానిపూవురంగు గలిగి బరువై కొంచెముచేదుగలిగి స్వాదుగనుండును. ఇది శ్రేష్ఠమైన రసాయనము.

రజతగర్భశిలలనుండి పుట్టినది తెల్లగను బరువుగను మధురముగను ఉండును. ఇది ప్రధానముగ పాండురోగమును పిత్తరోగములను జయించును.

తామ్రగర్భ శిలలందుపుట్టునది నల్లగ బరువుగనుండును. నిప్పుపై వేసిన పొగలేవక లింగాకారమును జెందును. నీళ్ళలో వేసిన మర్రియూడలవలె క్రిందికిజిగును. ఇట్లు పరీక్షించి యుత్తమశిలాజతును గ్రహించునది.

అయుర్వేద ప్రకాశమందు:—

"శిలాజతు ద్విధా ప్రోక్తం తత్రాద్యం గిరిసంభవం
ద్వితీయం స్యాత్ క్షారభూమ్యా మృత్తికాజలయోగతః॥"

(శిలాజతు రెండువిధములు. ఒకటి పర్వతములందు పుట్టును. రెండవది చవిటిభూములందు మన్ను, ఉదకము వీనిసంయోగమువలన బుట్టును. అని విశేషము వ్రాయబడినది.)

## శిలాజతు గుణములు

మూ. నూనం సజ్వర పాండు శోఫ శమనం మేహాగ్నిమాంద్యాపహం
మేదశ్ఛేదకరంచ యక్ష్మశమనం శూలామయోన్మూలనం
గుల్మప్లీహవినాశనం జఠరహృచ్ఛూలామయోన్మూలనం
సర్వత్వగ్గదనాశనంకిమరం దేహేచ లోహే హితం॥
రసోపరస సూతేంద్ర రత్నలోహేషు యే గుణాః
వసంతి తే శిలాధాతౌ జరామృత్యుజిగీషయా॥

తా॥ జ్వరము పాండువు, శోఫ, మేహము, అగ్నిమాంద్యము, మేదోరోగము, క్షయ, శూల, గుల్మము, ప్లీహ జఠరహృదయ శూలలు వీనిని శిలాజితు సంహరించును. రసములు, ఉపరసములు, పాదరసము, లోహములు వీనియందున్న సకలగుణములు శిలాజతునందున్నవి. కాన నిది సమస్తరోగములను బోగొట్టి దేహమును లోహతుల్యముగ జేయును.



## శిలాజతుశుద్ధి - భస్మము

మూ. క్షారామ్లగోజలై ర్ధౌతం శుధ్యత్యేవ శిలాజతు
శిలాధాతుం చ దుగ్ధేన త్రిఫలామార్కవద్రవైః
లోహపాత్రే వినిక్షిప్య శోధయే దతియత్నతః
క్షారామ్లగుగ్గులూపేతైః స్వేదనీయంత్రమధ్యగైః॥
స్వేదితం ఘటికామానా చ్ఛిలాధాతు ర్విశుద్ధ్యతి
శిలయా గంధతాళాభ్యాం మాతులుంగరసేన చ॥
పుటితం కా శిలాధాతుః మ్రియ తేష్టగిరిండకైః॥

తా. క్షారోదకములు, ఆమ్లరసములు, గోమూత్రము అనువానితో శిలాజితును కడిగినచో శుద్ధమగును. మరియు ఆవుపాలు త్రిఫలాక్వాథము గుంటగలగరరసము వీనితో జేర్చి శిలాజితును లోహపాత్రయందుంచినను శుద్ధమగును. క్షారములు, ఆమ్లరసము, గుగ్గిలము వీనితో జేర్చి ఒకఘడియ స్వేదనముచేసినను శిలాజితు శుద్ధమగును.

శుద్ధిచేసిన శిలాజితును గంధకము, మణిశిల, తాళకము జేర్చి నిమ్మపండ్లరసముతో నూరి యెనిమిదిపుటములు వేసిన భస్మమగును.

## శిలాజతురసాయనము

మూ. భస్మీభూతశిలోద్భవం సమతులం కాంతంచ వైక్రాంతకం।
యుక్తంచ త్రిఫలాకటుత్రికఘృతై ర్వల్లేన తుల్యం భజేత్
పాండౌ యక్ష్మగదే తదాగ్నిసదనే మేహేషు మూలామయే
గుల్మప్లీహమహోదరే బహువిధే శూలేచ యోన్యామయే॥
సేవేత యది షణ్మాసం రసాయనవిధానతః।
వలిపలితనిర్ముక్తో జీవే ద్వర్షశతం సుఖీ॥

తా. శిలాజితుభస్మము, వైక్రాంతభస్మము వీనిని సమభాగములంగ జేర్చి అందు చిన్నమెత్తుచొప్పున త్రిఫలాత్రికటుకచూర్ణములతోను ఆవునేతితోను కలిపి ఆరుమాసములు రసాయనసేవావిధి ననుసరించిసేవించిన పాండువు, క్షయ, అగ్నిమాంద్యము, మేహము, మూలరోగము, గుల్మము, ప్లీహ, ఉదరము, శూల, యోనిరోగములు నివర్తించి జరాఽకాలమరణరహిత శతాయువునిచ్చును.

## —* శిలాజితుసత్వపాతనము *—

మూ. పిష్ట్వా ద్రావణవర్గేణ సామ్లేన గిరిసంభవం।
క్షిప్త్వా మూషోదరే రుద్ధ్వా గాఢం ధ్మాత్వా తు కోకిలైః।
సత్త్వం ముంచే చ్ఛిలాధాతు స్తత్క్షణా ల్లోహసంభవం॥

తా. గోమూత్రశిలాజితును ద్రావణవర్గద్రవ్యములతో జేర్చి ఆమ్లవర్గములతో చక్కగ మర్దించి మూసలో బెట్టి చీలజేసి బొగ్గులనిండుగాగల కొలిమిలోనుంచి యూదినచో శిలాజితునుండి సత్వము వెడలును.

## —* కర్పూరశిలాజతు *—

మూ. పాండురం సికతాకారం కర్పూరాద్యం శిలాజతు।
మూత్రకృచ్ఛ్రాశ్మరీ మేహ కామలా పాండు నాశనం।
ఏలాతోయేన సంభిన్నం శుద్ధం శుద్ధి ముపైతి తత్
నైతస్యమారణం సత్త్వపాతనం విహితం బుధైః॥

తా. తెల్లయిసుకవలెనుండు కర్పూరశిలాజతు మూత్రకృచ్ఛ్ర, అశ్మరి, మేహము, పాండువు, వీనిని ఖండించును. దీనిని యేలకులకషాయముతో వండిన శుద్ధమగును. దీనిని మారణము చేయుటయు దీనినుండిసత్వపాతనము చేయుటయు ఆచారములేదు.

రసపద్ధతియందు:—దీనిని సోరకమను పేరుతో అగ్నిబాణవిద్యయం దుపయోగించునని వ్రాసియున్నాడు. సోరకమనగా సురాకారము. ఇదియు పైజెప్పబడిన గుణములను గల్గియుండుటంబట్టి రసపద్ధతికారు డట్లువ్రాసియుండును గాని యింకను కర్పూరశిలాజతునుగూర్చి విచారించదగియున్నది.

## —♦ మైలతుత్థము ♦—

మూ. పీత్వా హాలాహలం శాంతం పీతామృతం గరుత్మతా
విషేణామృతయుక్తేన గిరౌ మరకతాహ్వయే
తద్వాంతంహి ఘనీభూతం సంజాతం సస్యకం ఖలు।
మయూరకంఠసచ్ఛాయం భారాఢ్య మతిశస్యతే॥
ద్రవ్యం విషయుతం యత్త ద్ద్రవ్యాధికగుణం భవేత్॥
హాలాహలం సుధాయుక్తం సుధాధికగుణం భవేత్॥



నిశ్శేషదోషవిషహృ ద్గదశూలమూల
కుష్ఠామ్లపైత్తికవిబంధహరం పరంచ
రాసాయనం వమనరేకకరం గరఘ్నం
శ్విత్రాపహం గదిత మత్ర మయూరతుత్థం॥

తా. గరుత్మంతు డమృతపానము చేసినపిదప హాలాహలమను విషముకూడ ద్రావి మరకత పర్వతమందు వమనము చేసెను. అప్పుడు అమృతయుక్తమైనవిషము గడ్డకట్టి నెమలి మెడవంటి వర్ణమును బరువును గలదియై సస్యకము, మయూరతుత్థము, మైలతుత్థము అనుపేరులతో నొప్పుచుండెను. ఏద్రవ్యమున విషవస్తువు కలియుచున్నదో ఆ ద్రవ్యము మునుపటికంటె నుత్తమగుణములు కలదియగుచున్నది. మైలతుత్థము విషదోషములను, హృద్రోగమును, శూలను, మూల, కుష్ఠ, ఆమ్లపిత్త, మలబంధ, గరదోషములను హరించును. శ్విత్రమును (బొల్లిని) పోగొట్టును. వమన విరేచనములం జేయును.

## —* మైలతుత్థముశుద్ధి-భస్మము *—

మూ. తుత్థకం శుద్ధి మాప్నోతి రక్తవర్గేణ భావితం।
స్నేహవర్గేణ సంసిక్తం సప్తవార మదూషితం
డోలాయంత్రేణ సంస్విన్నం సస్యకం పరిహారత్రయం
గోమహిష్యజ మూత్రేణ శుధ్యతే తుత్థఖర్పరం
లకుచద్రావగంధాశ్మటంకణేన సమన్వితం
నిరుధ్య మూషికామధ్యే మ్రియతే కౌక్కుటైః పుటైః॥

తా. తుత్థమును రక్తవర్గముచే భావనజేసినను స్నేహవర్గమున యేడుమారులు నానబెట్టినను గోమూత్రము, బర్రెమూత్రము, మేకమూత్రము వీనిచే ప్రత్యేకము జాముసేపు డోలాయంత్రమున స్వేదనము చేసినను శుద్ధమగును. (స్వేదనము చేసినచో తుత్థము కరిగి క్రింద ద్రవమున్న ఘటమునబడును. కాన ద్రవద్రవ్యమిగురువరకును కాచి తుత్థమును స్వీకరించవలెనని యుపదేశము.)

దానితో గంధకము, వెలిగారము చేర్చి నిమ్మపండ్ల రసముతోనూరి మూకుడులో పెట్టి పైన మూకుడుమూసి చీలజేసి కుక్కుటపుటములు వేసిన భస్మమగును.

రసప్రదీపిక:—మైలతుత్థమును పెరుగుతోనూరి మూకుళ్లలోనుంచి చీలజేసి యేడుపుటములు పెట్టిన భస్మమగును.

అనుభూతయోగములు:—(1) అంతరదామరాకు ముద్దలో బెట్టి చీరజేసి పుటపాకము చేసిన భస్మమగును. (2) వెనురుఆకులలో పెట్టి కాల్చినయెడల భస్మమగును.

రెండవవిధము:—బాలురమూత్రములో మైలతుత్థమును ఒకదినము నాననిచ్చి మరునాడు దీసి నూరి యాముద్దను, చిక్కుడాకులను నూరిన ముద్దలోనుంచి శరావసంపుటమునబెట్టి చీరచేసి సాధారణముగ 25 పిడకలతో పుటము వేసినయెడల భస్మమగును.

మూడవవిధము:—కంకుడుకాయలోని గింజను తీసి పైచి యందుశుద్ధిచేసిన తుత్థమును పెట్టి గుడ్డచుట్టి మన్నుపూసి రెండుపిడకలతో పుటము బెట్టినయెడల కుంకుమ కంటెను అందమైనరంగు గలిగిన సిందూరమగును. ఇందు సాధారణముగ చర్దియుండదు. తేనెతో శ్వాసకాసలందు బియ్యముగింజెత్తు చొ॥ దినమునకు రెండుమూడు పర్యాయములు వాడవచ్చును.

నాల్గవవిధము:—పచ్చికంకుడుకాయ రసముతో శుద్ధతుత్థమునునూరి కుంకుడు వేరుపట్ట యొక్క ముద్దలోనుంచి శరావసంపుటమున బెట్టి చీరజేసి 30 పిడకలతో పుటము వేసినయెడల చక్కగా భస్మమగును.

## —*తుత్థసత్వపాతనము*—

మూ. సస్యక స్యాథ చూర్ణంతు పాదసౌభాగ్యసంయుతం
కరంజతైలమధ్యస్థం దినమేకం నిధాపయేత్॥
అంధమూషాస్యమధ్యస్థం ధ్మాపయే త్కోకిలత్రయం
ఇంద్రగోపాకృతిచైవ సత్వం భవతి శోభనం
నింబూద్రవాల్పటంకాభ్యాం మూషామధ్యే నిరుధ్యచ
తామ్రరూపం పరిధ్మాతం సత్త్వం ముంచతి సస్యకం
శుద్ధం సస్యం శిఖిక్రాంతం పూర్వభేషజసంయుతం
నానావిధానయోగేన సత్త్వం ముంచతి సస్యకః॥

తా. శుద్ధిచేసిన తుత్థమునకు నాలుగవపాలు వెలిగారమును కలిపి చూర్ణించి కానుగునూనెలో నొకదినము నానబెట్టి మరుచటి దినమునతీసి మూసలోనుంచి మూసి చీరజేసి కొలిమిలోబెట్టి మూడుబొగ్గులతో నూదినయెడల ఇంద్రగోపపురుగుయొక్క రంగుగల సత్వము వెడలును. తుత్థములో కొంచెము వెలిగారముజేర్చి నిమ్మపండ్లరసముతో నూరి



యాముద్దను మూసలోనుంచి మూసి చీరజేసి కొలిమిలోనుంచి యూదిన సత్వము వెడలును.

అనుభూతప్రక్రియ:—తుత్థమును చూర్ణించి యినుపపాత్రలోనుంచి ఉదకము పోసి కొంతసేపుంచి తేరిన నీళ్ళను పారబోయవలెను. మరల ఉదకముపోసి యట్లేకడుగుచున్న యెడల అడుగుండు తామ్రరూపసత్వము క్రింద దిగబడును. ఇది సులభమగు ప్రక్రియ. ఇది తుత్థమునుండి రాగిని తీయు విధము.

## —◆ తుత్థముద్రిక ◆—

మూ. సత్త్వమేత త్సమాదాయ ఖర భూనాగ సత్వయుక్
తన్ముద్రికాకృతస్పర్శా శూలఘ్నీ తత్క్షణాద్భవేత్॥
చరాచరవిషం భూత ఢాకినీ దృగ్గతం జయేత్
ముద్రికేయం విధాతవ్యా దృష్టప్రత్యయ కారికా॥
"రామవ త్సురసేనాని ముద్రితేపి తథాక్షరం
హిమాలయోత్తరే దేశే అశ్వకర్ణో మహాద్రుమః॥
తత శ్శూలం సముత్పన్నం తత్రైవ విలయంగతం॥"
మంత్రేణానేన ముద్రాంభో నిపీతం సప్తమంత్రితం॥
సద్యశ్శూలహరం ప్రోక్త మితి భాలుకి భాషితం
అన్యథా ముద్రయాతప్తం తైలమగ్నా సునిశ్చితం॥
లేపితం హంతివేగేన శూలం యత్ర క్వచి ద్భవేత్
సద్యస్సూతికరం నార్యాః సద్యో నేత్రరుజాపహం॥

తా. మైలతుత్థసత్వమును భూనాగసత్వమును సమభాగములుగ కలిపి ఉంగరము చేసి స్పృశించినయెడల తత్క్షణము శూల శమించును. శాకినీ ఢాకిన్యాది గ్రహబాధలను, స్థావరజంగమవిషములను, నిస్సంశయముగా నివర్తించును. ఇది ప్రత్యక్షఫలము. "రామ...గతం" అను మంత్రముచేత ఉంగరమును ఉదకమందు వేసి అభిమంత్రించి ఆ యుదకము నిచ్చినచో శూల తత్క్షణము శమించునని భాలుకిఋషి చెప్పెను. ఈ ముద్రిక వేసి కాచిన తైలమును శూలగలచోట రాచిన యెడల శూల మాయమగును. దీనిని ధరించినచో గర్భిణి స్త్రీ తత్క్షణము సుఖప్రసవ మగును. దీని వలన నేత్రరోగములు కుదురును.

### చపలశుద్ధి - భస్మము

మూ. గౌర శ్వేతోరుణః కృష్ణః చపలస్తు చతుర్విధః
హేమాభశ్చైవ తారాభో విశేషా ద్రసబంధనః
శేషౌ మధ్యౌచ లాక్షావ చ్ఛీఘ్రద్రావౌతు నిష్ఫలౌ॥
వంగవ ద్ద్రవతే వహ్నౌ చపలస్తేన కీర్తితః
చపలో లేఖన సిద్ధః దేహలోహకరో మతః
రసరాజసహాయ స్స్యాత్ తిక్తోష్ణ మధురోమతః
చపలస్ఫటికచ్ఛాయ షడస్రి స్స్నిగ్ధకో గురుః
త్రిదోషఘ్నోతివృష్యశ్చ రసబంధవిధాయకః॥
మహారసేషు కైశ్చిద్ధి చపలః పరికీర్తితః.
జంబీర కర్కోటక శృంగ బేరై ర్విభావనాభి శ్చపలస్య శుద్ధిః॥
శైలంతు చూర్ణయిత్వాథ ధాన్యామ్లోపవిషై ర్విషైః
పిండం బధ్వాతు విధివత్పాదయే చ్చపలస్తథా॥

తా. చపలము అను ఒకవిధమైన రాయి పసుపు, తెలుపు, యెరుపు, నలుపు వర్ణములు గలిగి నాలుగు విధములుగ నుండును. అందు బంగారు వలె పచ్చనిరంగును వెండివలె తెల్లనిరంగుగలవి రసబంధమునకు విశేషముగ నుపయోగించును. తక్కిన యెరుపు నలుపు వర్ణములుగలవి నిప్పుమీదనుంచినచో వెంటనే లక్కవలె కరగును. ఇవి బలహీన మైనవిగనుక ఔషధములం దుపయోగింపవు. నిప్పులో కరగించినప్పుడు తగరమువలె కరగును కనుక చపలమని దీనికి పేరు. ఇది లేఖనకారి. దేహసిద్ధిని చేయును.

తిక్తరసమును, ఉష్ణవీర్యమును మధురవిపాకమునుగలవి. స్ఫటికమువలె తెల్లనై ఆరంచులుగలిగి మెరుగును బరువును గలిగినదిగానున్నది. త్రిదోషములను గొట్టును. వీర్య వృద్ధిని చేయును. రసబంధమును జేయును. కొందరు దీనిని మహారసమనిరి. దీనిని నిమ్మ పండ్లరసము ఆగాకరదుంపరసము, అల్లపురసము వీనియందు భావనచేసిన శుద్ధమగును.

చపలమునకు క్రింద, పైన సున్నపురాళ్లుపేర్చి మూసలోబెట్టి పుటమువేసి కాలిన పిదప నీళ్లుపోసిచల్లార్చినను శుద్ధముగనుండును.

శుద్ధమగుచపలమునుచూర్ణించి ఉపవిష (జిల్లేడు, జెముడు, పొత్తిగడ్డ, గురువెంద, గన్నేరు, విషముష్టి, నేపాలను, ఉమ్మెత్త, నల్లమందు) ములను, విషము (శృంగి, కాలకూటము, ముస్తకము, నాభి, సక్తుకము)లను చేర్చి ధాన్యామ్లముతోనూరి ముద్దజేసి యథావిధిగ కొలిమిలోపెట్టి యూదినచో నందుండి సత్త్వమువెడలును.



### రసకము

మూ. రసకో ద్వివిధః ప్రోక్తో దర్దురః కారవేల్లకః।
సదళో దర్దురః ప్రోక్తో నిర్దళః కారవేల్లకః॥
సత్వపాతే శుభః పూర్వో ద్వితీయ శ్చౌషధాదిషు।
రసకస్సర్వమేహఘ్నః కఫపిత్తవినాశనః॥
నేత్రరోగక్షయఘ్నశ్చ లోహపారదరంజనః।
నాగార్జునేన సందిష్టౌ రసశ్చ రసకా వుభౌ॥
శ్రేష్ఠౌ సిద్ధరసౌ ఖ్యాతౌ దేహలోహకరౌ పరౌ।
రసశ్చ రసకశ్చోభౌ యేనాగ్నిసహనౌ కృతౌ॥
దేహలోహమయీ సిద్ధి ర్దాసీ తస్య న సంశయః॥

తా. రసకము (కఫరి) దర్దురము, కారవేల్లకము, అని రెండువిధములు. దర్దురమునకు రేకులుండును. కారవేల్లకమునకుండవు. దర్దురము సత్త్వపాతనమందును కారవేల్లకము ఔషధయోగములందును పనికివచ్చును. ఇది కఫపిత్తవికారములను, మేహములను, నేత్ర రోగములను, క్షయను పోగొట్టును. లోహాదిరంజనమునకు ఉపయోగించును. నాగార్జునుడు రసము, రసకము అని రెంటినిచెప్పెను. అవి నిప్పుపైబెట్టిన నెగిరిపోకుండజేసి సేవింపబడినచో దేహమును లోహతుల్యముగజేయును.

“ మృత్తికాగుడ పాషాణ భేదతో రసకస్త్రిధా
పీతస్తు మృత్తికాకారః మృత్తికారసకో వరః॥
గుడాభో మధ్యమో జ్ఞేయః పాషాణాభః కనిష్ఠకః॥”

అని రసార్ణవమున కఫరి మృత్తికా, గుడ, పాషాణ భేదములచే మూడుతెరంగులనియు, పూర్వపూర్వముకన్న నుత్తరోత్తరము గుణహీనమనియు భేదముచెప్పబడినది.

### కఫరి శుద్ధి

మూ. కటుకాలాబు నిర్యాస ఆలోడ్య రసకం పచేత్
శుద్ధం దోషవినిర్ముక్తం పీతవర్ణంచ జాయతే॥
ఖర్పరః పరిసంతప్తః సప్తవారం నిమజ్జితః
బీజపూరరసస్యాంతః నిర్మలత్వం సముశ్నుతే॥
నృమూత్రే వాశ్వమూత్రే వా తక్రేవా కాంజికేథవా
ప్రతాప్య మజ్జితం సమ్యక్ ఖర్పరం పరిశుద్ధ్యతి॥

నరమూత్రే స్థితో మాసం రసకో రంజయేద్ధ్రువం।
శుద్ధతామ్రం రసం తారం శుద్ధస్వర్ణసమప్రభం॥

తా. చేమ ఆనగ కాయరసమందు రసకమును చేర్చి వండినను, కాల్చి దానిమ్మపండ్ల రసమున 7 మారులుముంచినను దోషములుబాసి పచ్చని వర్ణముగలదియగును. మరియు నరమూత్రము, అశ్వమూత్రము, మజ్జిగ, కాంజిక అను వీనిలోనైన రసకమును కాల్చి చల్లార్చినయెడల శుద్ధమగును. నరమూత్రమున ఒకమాసము నానబెట్టినచో కఫరికి రంజకత్వమును, బంగారువర్ణమును కలుగును.

## —♦ కఫరి సత్వపాతనము ♦—

మూ. హారిద్రా త్రిఫలా రాళ సింధు ధూమైస్సటంకణైః
సారుష్కరైశ్చ పాదాంశైః సామ్లైస్సమర్ద్య ఖర్పరం॥
లిప్తం వృంతాకమూషాయాం శోషయిత్వా నిరుధ్య చ
మూషాముఖోపరి న్యస్య ఖర్పరం ప్రధమేత్తతః
ఖర్పరే ద్రుతే జ్వాలా భవేన్నీలా సితా యది
తదా సందంశతో మూషాం ధృత్వా కృత్వా త్వధోముఖీం
శనైరాస్ఫాలయేద్భూమౌ యథా నాళం న భిద్యతే॥
వంగాభం పతితం సత్వం సమాదాయ నియోజయేత్
ఏవం త్రిచతురైర్వారైస్సత్త్వం సర్వం వినిస్సరేత్
సాభయా జతు భూనాగ నిశా ధూమజ టంకణం
మూాకమూషాగతం ధ్మాతం శుద్ధం సత్త్వం విముంచతి॥

తా॥ పసుపు,త్రిఫలములు, హరితాళము, కరిధూపము, సైంధవలవణము, వెలిగారము, జీడిగింజలు,అను నీవస్తువులను ప్రత్యేక ప్రత్యేకము కఫరికి నాల్గవవంతున జేర్చి వానిని కాంజికము, ఆమరసములు అనువానితో మర్దించి వృంతాకమూసయొక్క లోపలి భాగమునపూసి యెండించి మూసనుమూసి చీరజేసి కొలిమిలో పెట్టి యూదవలెను. ఊదునపుడు నల్లగను తెల్లగను మంటలు వెడలు నెడల కఫరి కరిగినట్లు తెలిసికొని ఆ సమయమున మూసను పట్టుకారుతో పట్టుకొని తలక్రిందుగత్రిప్పి మూసపగులకుండ మూసపైన మెల్లగ కొట్టినయెడల అందుండి తగరమువంటి సత్త్వముపడును. మరల నాప్పటము పైవిధముగ నాలుగుసారులు చేసినయెడల కఫరియందలి సత్త్వమంతయు వచ్చును.



## —♦ కఫరి సత్త్వపాతనము-భస్మము ♦—

మూ. లాక్షా గుడా సురీ పథ్యా హారిద్రా సర్జటంకణైః
సమ్యక్సంచూర్ణ్య తత్పక్వం గోదుగ్ధేన ఘృతేన చ॥
వృంతాకమూషికామధ్యే నిరుధ్య గుటికీకృతం
ధ్మాత్వా ధ్మాత్వా సమాకృష్య ఢాలయిత్వా శిలాతలే
సత్త్వం వంగాకృతి గ్రాహ్యం రసకస్య మనోహరం
యద్వా జలయుతాం స్థాలీం నిఖనేత్కోష్ఠికోదరే
సచ్ఛిద్రం తన్ముఖే మల్లం తన్ముఖేధోముఖీం క్షిపేత్
మూషోపరి శిఖిత్రింశ్చ నిక్షిప్య ప్రధమేద్దృఢం
పతితం స్థాలికానీరే సత్త్వమాదాయ యోజయేత్
తత్సత్త్వం తాళకోపేతం ప్రక్షిప్య ఖలు ఖర్పరే
మర్దయేల్లోహదండేన భస్మీభవతి నిశ్చితం॥

తా॥ లక్కజెముడు,ఆవాలు,కరక్కాయ, మద్దిచెక్క,పసుపు,వెలిగారము వీనిన న్నిటినిచూర్ణించి రసకమునందుచేర్చి ఆసముదాయమును ఆవుపాలలోను ఆవునేతిలోను ఉడికించి వృంతాకమూసలోబెట్టి చీరజేసి యెండించి కొలిమిలోనూదవలెను. ఇట్లు పలుమారులూది మూసనుతీసి రాతిమీద మూసనుతలక్రిందుగాపెట్టి పైన మెల్లగా కొట్టినచో రసకసత్త్వము వంగమువంటి కాంతిగలిగి వెడలును. మరియు పైజెప్పినద్రవ్యములను, రసకమును చూర్ణించి ఆవుపాలలోను ఆవునేతిలోను ఉడికించి, మూసలోపెట్టియుంచుకొని కొలిమిలోనడుమ నీళ్ళతోనిండియుండు ఒకపిడతనుపాతి దానిపై నొకమట్టి మూకుడునకు నడుమ రంధ్రముచేసి మూసియుంచవలెను. పిదప ఔషధముచే నిండియున్నమూసను పైజెప్పిన మూకుడుపై తలక్రిందుగా నుంచి, మూసపై నిప్పులుపోసి నిప్పుతగిలించి యూదవలెను. అట్లూదినయెడల మూసలోని ద్రవ్యము ద్రవించి దాని సత్త్వము నీళ్ళపిడుతపైమూసిన మూకుడులోపడి దానినడుమనుండు రంధ్రముగుండ పిడతలోని నీళ్ళలోబడును. ఆసత్త్వము పరిశుద్ధముగ నుండును.

అట్టిసత్త్వమును తాళకములోచేర్చి లోహకల్వములోనుంచి యినుపగుదియతో మర్దనచేసిన భస్మమగును:

"ఖర్పరం పారదేనైవ చూర్ణయిత్వా దినం పచేత్
వాలుకాయంత్ర మధ్యస్థం శోణం భస్మ ప్రజాయతే॥"

కఫరిని రసముతోఁజేర్చి చూర్ణించి వాలుకాయంత్రమున నొకదినము నుంచినచోఁ జక్కని సిందూరమగును. అని తంత్రాంతరమందు చెప్పబడినది.

## —♦ కఫరిరసాయనము ♦—

మూ. తద్భస్మ మృతకాంతేన సమేన సహ యోజయేత్
అష్టగుంజామితం చూర్ణం త్రిఫలాక్వాథసంయుతం
కాంతపాత్రస్థితం రాత్రౌ తిలజప్రతివాపకం
నిషేవితం నిహంత్యాశు మధుమేహమపి ధ్రువం॥
పిత్తం క్షయంచ పాండుంచ శ్వయథుం గుల్మమేవచ
రక్తగుల్మంచ నారీణాం ప్రదరం సోమరోగకం
యోనిరోగా నశేషాంశ్చ విషమాఖ్యాన్ జ్వరానపి
రజశ్శూలంచ నారీణాం కాసం శ్వాసంచ హిధ్మకం॥

ఇతి శ్రీ వాగ్భటాచార్యవిరచితే రసరత్నసముచ్చయే ద్వితీయోధ్యాయః

పైజెప్పిన కఫరిభస్మమునకు సముగ కాంతభస్మమును చేర్చి రెండుచిన్నములయెత్తు భస్మమును త్రిఫలాకషాయములో వేసి కాంతపాత్రలో బోసి యొక రాత్రి నిలువయుంచి ఉదయమున కొంచెము నువ్వులనూనెకలిపి సేవించినయెడల మధుమేహమును పిత్తవికారమును క్షయను పాండువును శ్వయథువును గుల్మమును స్త్రీలకుజనించు రక్తగుల్మమును ప్రదరమును సోమరోగమును సమస్తయోనిరోగములను విషమజ్వరములను ఋతుశూలను శ్వాసకాసలను హిధ్మను నశింపచేయును.

రసార్ణవము:— రసకము-హేమవిద్యోగయోపము: "కిమత్రచిత్రం రసకం రసేన రజస్వ
లాయాః కుసుమేనభావితం। క్రమేణ కృత్వా ఉరగేన రంజితం కరోతి
శుల్బం త్రిపుటేనకాంచనం॥"

(రసకమును రసముతో స్త్రీయొక్క ఋతురక్తముతో 'సప్తాహంభావనా విధిః' అనుటచే యేడుదినములు భావనచేసి నాగముచే రంజనముగావించి రాగితోఁచేర్చి మూడుపుటములు వేసినయెడల రాగి హేమమించును.)

రసేంద్రచింతామణిః—
"పారద ష్టంక ఏక స్స్యాత్ ద్విపలం పీతఖర్పరం।
మర్దయే త్సుదృఢం యావత్ రసో యావ ద్విలీయతే
పున ర్జంబీరనీరేణ గుడేనచ సమన్వితం
శోషయే చ్చాతపే పిష్ట్వా శ్లక్ష్ణం కృత్వాచ ధార్యతే



అర్కదుగ్ధస్య దాతవ్యా భావనాస్తా యథాతథా.
అస్య కల్కస్య సిద్ధస్య భాగ ఏక శ్చ టంకణః
తామ్రం భాగత్రయం దత్త్వా ధామ్యతా మంధమూషయా
సువర్ణం దివ్యతేజస్స్యా త్కుంకుమా దతిరిచ్యతే॥"

(రసము ఒకభాగము, వెలిగారము ఒకభాగము, పీతకఫరి (మృత్తికాకారమై పచ్చనిరంగుగల కఫరి) రెండుభాగములు, వీనినేకముజేసి ఖల్వమునందుంచి రసము లీనమగువరకు దృఢముగ మర్దించినపిదప "భాగేను క్తే సమంగాహ్యం" అనుటచే సముదితద్రవ్యమునకు సముముగ బెల్లమునుకలిపి నిమ్మపండ్లరసముతోనూరి యెండించి చూర్ణించి, యా చూర్ణమును జిల్లేడుపాలతో యేడుదినములు భావనచేసి యాకల్కమును భద్రపరుచుకొనవలెను. అట్టికల్కము ఒకభాగము, వెలిగారము ఒకభాగము, శుద్ధతామ్రము మూడుభాగములు వీనిని ఒకమూసలోబెట్టి పైనమూసి చీలజేసి కొలిమిలోనుంచి యూదినచో తామ్రము సువర్ణమై కుంకుమప్రభగలిగి యుండును.)

ఇట్టి కఫరి స్వర్ణవిద్యయందు బహుయోగములలో చేర్చబడుచున్నది.
ఆయుర్వేదప్రకాశము: —"రసకం తుత్థభేదస్స్యా త్ఖర్పరంచాపి తత్స్మృతం।
యేగుణా స్తుత్థకే ప్రోక్తా స్తేగుణా రసకేస్మృతాః"

అని కఫరితుత్థభేదమనియు రెండును సమానగుణములుకలవనియు చెప్పబడినది.

శ్రీమత్కృష్ణా గోదావరీమధ్య విద్యోతమాన నూజవీడ్నగరీప్రభువర శ్రీమదుయ్యూరు
మేడూరు నిడదవోలు ప్రముఖసంస్థానాధీశ్వర ఆంధ్రకవితాధురంధర పండితకవి
పోషక శ్రీ శ్రీ రాజా వెంకటాద్ర్యప్పారాయ ప్రభుపుంగవాస్థాన
పండిత భారద్వాజసగోత్రపవిత్ర వేంకటసుబ్బావధాని సత్పుత్ర
సకలపండితకవి సద్వైద్యవిధేయ సత్యనారాయణశాస్త్రి
నామధేయాంధ్రీకృత రసరత్నసముచ్చయమునందు
ద్వితీయాధ్యాయము సమాప్తము.
శ్రీశారదాంబార్పణమస్తు.

శ్రీరస్తు

# రసరత్న సముచ్చయము

## తృతీయాధ్యాయము

### ఉపరసములు

మూ. గంధాశ్మ గైరి కాసీస కాంక్షీ తాళ శిలాంజనం।
కంకుష్ఠం చే త్యుపరసా శ్చాష్టౌ పారదకర్మణి॥

తా. గంధకము, గైరికము, కాసీసము, పటికి, హరితాళము, మణిశిల, అంజనము, కంకుష్ఠము అను నివి యెనిమిదియు నుపరసములనబడును.

### గంధకోత్పత్తి

మూ. గంధకస్యతు మాహాత్మ్యం తద్గుహ్యం వద మే ప్రభో!
శ్వేతద్వీపే పురా దేవి! సర్వరత్నవిభూషితే॥
సర్వకామమయే రమ్యే తీరే క్షీరపయోనిధేః।
విద్యాధరీభి ర్ముఖ్యాభి రంగనాభి శ్చ యోగినాం।
సిద్ధాంగనాభి శ్శ్రేష్ఠాభి స్తథై వాప్సరసాంగణైః॥
దేవాంగనాభీరమ్యాభిః క్రీడతీభి ర్మనోహరం॥
గీతై ర్నృత్తై ర్విచిత్రైశ్చ వాద్యై ర్నానావిధై స్తథా।
ఏవం సంక్రీడమానాయాః ప్రాభవ త్ప్రస్రుతం రజః॥
తద్రజోతీవ సుశ్రోణి! సుగంధి సుమనోహరం।
రజస శ్చాతి బాహుళ్యాత్ వాసస్తే రక్తతాం గతం॥
తత్త్యక్త్వాతు తద్వస్త్రం సుస్నాతా క్షీరసాగరే।
వృతా దేవాంగనాభి స్త్వం కైలాసం పునరాగతా।





ఊర్మిభి స్తద్రజోవస్త్రం నీతం మధ్యే పయోనిధేః।
ఏవం తే శోణితం భద్రే ప్రవిష్టం క్షీరసాగరే।
క్షీరాబ్ధిమథనే చైతత్ అమృతేన సహోత్థితం।
నిజగంధేన తా న్సర్వాన్ హర్షయ న్దైత్యదానవాన్
తతో దేవగణై ర్యుక్తం గంధకాఖ్యో భవత్వయం।
యే గుణాః పారదే ప్రోక్తాః తే చైవాత్ర భవంత్వితి।
రసస్య బంధనార్థాయ జారణాయ భవత్వయం।
ఇతి దేవగణైః ప్రీతైః పురా ప్రోక్తం సురేశ్వరి।
తేనాయం గంధకో నామా విఖ్యాతః క్షితిమండలే॥

తా. పార్వతీదేవియొక్క రజస్సు గంధకాకారమైనదని పైశ్లోకములకు ముఖ్య తాత్పర్యము. ప్రత్యేకశ్లోకార్థము ప్రీడాకరముగుటచేతను, ప్రకృతమునం దుపయోగము లేకుంటచేతను వివరింపబడలేదు.

### గంధకభేదములు

మూ. సచాపి త్రివిధో దేవి! శుకచంచునిభో వరః।
మధ్యమః పీతవర్ణస్స్యాత్ శుకవర్ణోధమస్స్మృతః॥
చతుర్థా గంధకో జ్ఞేయో వర్ణైశ్శ్వేతాదిభిః ఖలు।
శ్వేతోత్ర ఖటికా ప్రోక్తో లేపనే లోహమారణే।
తథాచామల సారస్స్యా ద్యో భవే త్పీతవర్ణవాన్।
శుకపుచ్ఛస్సఏవ స్స్యాత్ శ్రేష్ఠో రసరసాయనే॥
రక్తశ్చ శుకతుండాఖ్యో ధాతువాద విధౌవరః॥
దుర్లభః కృష్ణవర్ణశ్చ స జరామృత్యునాశనః॥

తా. గంధకము యెరుపు, పసుపు, తెలుపు వర్ణములుంగలిగి మూడువిధములనియు, అవి క్రమముగా ఉత్తమ మధ్యమ అధమకోటిలో చేరుననియు నొకమతము. మరియు తెలుపు, యెరుపు, నలుపు, పసుపువర్ణములుగలిగి నాల్గువిధములుగనుండునని యొకమతము. అందు తెల్లగకణికవలెనుండునది లేపనములకును లోహాదులను భస్మముచేయుటకును ఉపయోగించును. చిలుకరెక్కలవలెపచ్చగనుండు గంధకము "అమరశిల" యను పేరుగలిగి యున్నది. రక్తవర్ణగంధకము శుకతుండమని పేరుగలిగి ధాతువాదమున వాడబడును. కృష్ణగంధకము జరామరణములులేకుండజేయును; ఇది దుర్లభము.

### —♦ గంధకగుణములు ♦—

మూ. గంధాశ్మాతి రసాయన స్సుమధురః పాకే కటూష్ణో మతః।
కండూకుష్ఠ విసర్ప దర్పదళనో దీప్తానలః పాచనః।
ఆమోన్మోచన శోషణో విషహరస్సూతేంద్ర వీర్యప్రదః ।
ప్లీహాధ్మాన వినాశనః కృమిహర స్సత్వాత్మక స్సూతజిత్॥
బలినా సేవితః పూర్వం ప్రభూత బలహేతవే
వాసుకం కర్షతస్తస్య తన్ముఖజ్వాలయాయుతా॥
వసాగంధక గంధాఢ్యా సర్వతో నిస్సృతా తనోః॥
గంధకత్వంచ సంప్రాప్తా గంధో భూత్స విష స్తతః
తస్మా ద్బలివసేత్యుక్తో గంధకోతిరసాయనః॥

తా. గంధకము, రసాయనము మరియు మధురవిపాకమును, కటురసమును, ఉష్ణవీర్యమును గలది. దురద, కుష్ఠము, విసర్పము, దద్రులు, అగ్నిమాంద్యము వీనిని పోగొట్టును. పాచనకరము. ఆమమును వెడలించును. మఱియు శోషింపజేయును. విషహారము, రసవీర్యజనకము. ప్లీహ, ఆధ్మానము, కృమి వీనిని జయించును. సత్వరూపముగలది. రసమును జయించును. బలిచక్రవర్తి దీనిని పూర్వము బలము కొఱకు సేవించెను. పిదప బలి వాసుకి నాకర్షించునపుడు వాసుకియొక్క ముఖమందుండు విషజ్వాలలు బలిమీద వ్యాపింప బలి తాను సేవించిన గంధకముతో వాసుకివిషముగూడ మిశ్రమై బలియొక్క శరీరమునందుండి స్రవించిన వస విషసహితమైన గంధకముగ నేర్పడెను. కాన గంధకమునకు బలివసయనియు పేరు.

### —♦ గంధకశుద్ధి ♦—

మూ. పయస్స్విన్నో ఘటీమాత్రం వారిధౌతోహి గంధకః।
గవ్యాజ్య విద్రుతో వస్త్రా ద్గళిత శ్శుద్ధిమృచ్ఛతి।
ఏవం సంశోధిత స్సోయం పాషాణా నంబరే త్యజేత్
ఘృతే విషం తుషాకారం స్వయం పిండత్వమేతిచ
ఇతి శుద్ధోహి గంధాశ్మ పథ్యై ర్వికృతిం వ్రజేత్
అపథ్యా దన్యథా హన్యా త్ప్రీతం హాలాహలం యథా
గంధకో ద్రావితో భృంగరసే క్షిప్తో విశుద్ధ్యతి।
తద్రసై స్సప్తధా స్విన్నో గంధకః పరిశుద్ధ్యతి



స్థాల్యాం దుగ్ధం వినిక్షిప్య ముఖే వస్త్రం నిబధ్యచ
గంధకం తత్ర నిక్షిప్య చూర్ణితం సికతాకృతి
ఛాదయే త్పృథు దీర్ఘేణ ఖర్పరేణైవ గంధకం
జ్వాలయే త్ఖర్పరస్యోర్ధ్వం వనచ్ఛాణై స్తథోపలైః।
దుగ్ధే నిపాతితో గంధో గళితః పరిశుద్ధ్యతి।
శతవారం కృతశ్చైవం నిర్గంధో జాయతే బలీ॥
ఇత్థం విశుద్ధ స్త్రిఫలాజ్య భృంగమధ్వన్విత శ్శాణమితోహి లీఢః
గృధ్రాక్షితుల్యం కురుతేక్షియుగ్మం కరోతి రోగోజ్ఝిత దీర్ఘమాయుః॥

తా. పాలతో ఒకఘడియసేపు స్వేదనముచేసి నీళ్లతో కడిగి పిదప ఆవునేతియందు ఒకసారి ద్రవింపజేసినయెడల గంధకము శుద్ధమగును. ఇట్లుచేసిన గంధకమందలి పాషాణసంబంధములగు దోషములు వస్త్రమందే నిలచి శుద్ధగంధకము క్రిందనుదిగును. ఘృతమందు గంధకగతమైన తుషవంటి దోషమునశించుచున్నది. ఇట్లు శుద్ధిచేయబడిన గంధకమును సేవించునపుడు అపథ్యదోషము, ప్రమాదమును గలిగినను వికారపెట్టదు. లేనిచో హాలాహలమువలె చంపును. మరియు గంధకము గుంటగలగరరసమునందు ద్రవింపజేసినను యేడుసారులు స్వేదనము చేసినను శుద్ధమగును.

గంధకమును ద్రవింపజేయువిధి:—శుద్ధిచేయుట కుపయోగించు పాలు, గుంటగలగర రసము మొదలగు ద్రవద్రవ్యములను ఒక భాండములోపోసి దానికి గుడ్డవాసెనగట్టి దానిపై ఇసుకవలె చూర్ణింపబడిన గంధకమునుపోసి పైన వెడల్పు, యెత్తుగల యొకమూకుడును బోర్లించి (పైనబోర్లించిన మూకుడు వాసెనమీదనున్న గంధకమునకు తగులుచున్న యెడల నిప్పు గంధకమునకంటుకొని గంధకము కాలిపోవును గనుక యెత్తు, వెడల్పుగల మూకుడును బోర్లించవలెనని తాత్పర్యము) చీరజేసి యెండించి, శుద్ధిద్రవ్యముగల కుండను భూమిలో కంఠమువరకు పాతిపెట్టి మూకుడుపైన అడవి యెరుపిడకలతో పుటముబెట్టవలెను. అప్పుడు గంధకము అగ్నితాపమునకు కరిగి క్రిందికుండలోనున్న శుద్ధిద్రవ్యమునందు జొన్నలవలెపడును. ఇదియే గంధకమును ద్రవింపజేయువిధి. ఇట్లు నూరుసారులు చేసిన యెడల గంధకమునందలి వాసనపోవును.

రససారము:—గంధక గంధనివారణము:
"నవమాల్యా రసేనైవ దేవదాల్యా రసేనచ
వజ్రార్క పయసా సార్ధ మమ్లవర్గేణ సంయుతః
స్వేదితో మర్దితో గంధో గంధహీనో భవేద్ధ్రువం॥"

(నవమాలి, దేవదాళి వీనిరసములచేతను, జెముడు, జిల్లేళ్ల పాలచేతను, అమ్లవర్గము చేతను గంధకమును స్వేదన మర్దనములు చేసిన గంధకమందలి వాసన నశించును.)

ఆయుర్వేదప్రకాశము:— "విచూర్ణ్యగంధకం క్షీరే ఘనీభావావధిం పచేత్ । తతస్సూర్యావర్తరసం పునర్దత్వా పచేచ్ఛనైః॥ పశ్చాచ్చపాతయేత్ప్రాజ్ఞః జలే త్రైఫలసంభవే। జహాతి గంధకో గంధం నిజం నాస్తి హి సంశయః॥" గంధకమునుచూర్ణించి పాలలోవేసి గడ్డకట్టువరకు కాచి మరల సూర్యావర్తరసమునందుంచి మెల్లగావండి పిదప త్రిఫలాక్వాథమునందు అధఃపాతనముచేసినచో గంధకపువాసన తప్పక నశించును.

(కలబంద, మెంగలిచన్నులు, గుంటగలగర, ఆడ్డసరము, తెల్లగలిజేరు, నేలములక, నేయి, తేనె, కాంజికము, పాలు, అనువానితో ప్రత్యేకముగ పైజెప్పినవిధముగ ద్రవింపజేసినయెడల గంధకము మిగులపరిశుద్ధమై ప్రత్యేకసేవనాయోగ్యమై యుండునని మతాంతరము.)

పైవిధముగా శోధనముచేయబడిన గంధకమును త్రిఫలములు, నేయి, గుంటగలగర, తేనె వీనిలో దేనితోనైనకలిపి శాణప్రమాణముగ సేవించునెడల దివ్యమైన దృష్టిని రోగరహిత దీర్ఘాయువును యిచ్చును.

## —♦ గంధకద్రుతి ♦—

మూ. కలాంశవ్యోష సంయుక్తం గంధకం శ్లక్ష్ణచూర్ణితం
అరత్ని మాత్రే వస్త్రే తద్విప్రకీర్య వివేష్ట్య తత్
సూత్రేణ వేష్టయిత్వాథ యామం తైలే నిమజ్జయేత్
ధృత్వా సందంశతో వర్తిమధ్యం ప్రజ్వాలయేచ్చ తత్॥
దృతో నిపతితో గంధో బిందుశః కాచ భాజనే
తాం దృతిం ప్రక్షిపేత్పాత్రే నాగవల్ల్యా స్త్రిబిందుకాం
వల్లేన ప్రమితం స్వచ్ఛం సూతేంద్రంచ విమర్దయేత్
అంగుళ్యాదసపత్రాం తాం దృతిం సూతంచ భక్షయేత్॥
కరోతి దీపనం తీవ్రం క్షయం పాండుంచ నాశయేత్
కాసం శ్వాసంచ శూలార్తిం గ్రహణీ మతిదుర్ధరాం
ఆమం వినాశయత్యాశు లఘుత్వం ప్రకరోతిచ॥



తా॥ శుద్ధిచేసిన గంధకమునకు పదహారవభాగము త్రికటుకచూర్ణమును కలిపి రెంటిని మెత్తగానూరి ఒకమూరెడు నిడివియు వెడల్పుగల ఒకగుడ్డపైన ఆచూర్ణమును చల్లి ఆగుడ్డను చాపవలె చుట్టచుట్టి దారముతో బిగియగట్టి ఒకజామువరకు మంచినూనెలో నానబెట్టి పిదప ఆవత్తినితీసి పట్టుకారుతో మధ్య పట్టుకొని వత్తికొనను నిప్పువెలిగించి చేతిలోధరించి యుంచునెడల వత్తిలోనుండు గంధకము కరిగి బొట్టుబొట్టుగా క్రిందపడును. దాని పింగాణిగిన్నెలో గాని గాజుపాత్రలో గాని భద్రపఱచి యుంచుకొనవలెను. ఇదియె గంధకద్రుతి యనబడును. అట్టితైలమును మూడుబిందువులు ఒకతమలపాకులో వేసి అందు వల్లప్రమాణము శుద్ధరసభస్మమును కలిపి ఆకుతోసహా మ్రింగివేసినయెడల దీపనము కల్గించును. క్షయము, పాండువును, శ్వాసకాసలను, శూలలను, గ్రహణిని, ఆమదోషమును పోగొట్టును. శరీరమునకు లాఘవమునిచ్చును.

## —♦ గంధక ప్రయోగములు ♦—

మూ. ఘృతాక్తే లోహపాత్రేతు విద్రుతం శుద్ధగంధకం
ఘృతాక్త దర్వికాక్షిప్తం ద్వినిష్కప్రమితం భజేత్
హంతి క్షయముఖాన్ రోగాన్ కుష్ఠరోగం విశేషతః
గంధకస్తుల్య మరిచః షడ్గుణః త్రిఫలాన్వితః
ఘృష్ట శ్శమ్యాకమూలేన పీత శ్చాఖిల కుష్ఠహా
తన్మూలం సలిలే పిష్టం లేపయే త్ప్రత్యహం తనౌ
దృష్ట ప్రత్యయ వీర్యోయం సర్వత్రాప్రతివీర్యవాన్
శ్రీమతా సోమదేవేన సమ్యగత్ర ప్రకీర్తితః
క్షారామ్ల తైల సౌవీర విదాహి ద్విదళం తథా
శుద్ధగంధక సేవాయాం త్యాజ్యం యోగయుతే నహి॥

తా॥ లోహపాత్రలో నేయిపోసి అందు కరిగించిన గంధకముపోసి నేయిపూసిన తెడ్డుతో కలియబెట్టి అందునిష్కములు ప్రమాణముగు గంధకమును సేవించిన కుష్ఠము, క్షయ మొదలగురోగములు నశించును. గంధకము ఒకభాగము, మిరియాలు 1 భా॥ త్రిఫలములు ఆరుభాగములు వీనిని రేలవేరు గంధముతో కలిపి బలానుసారముగ పానముచేయుచు రేలవేరును నీళ్లతోనూరి శరీరమునకు లేపనముచేయుచు నున్నయెడల కుష్ఠము, క్షయ తప్పకనశించును. సోమదేవసిద్ధుడు దీనిప్రభావమును కనుగొని యిట్లువ్రాసెను.

గంధక సేవయందు అపథ్యము:—ఉప్పు, పులుసు, నూనె, సౌవీరము, విదాహకరవస్తువులు, ద్విదళధాన్యములు (కందులు, పెసలు మొదలగునవి) వర్జించదగినవి.

నాగార్జున తంత్రము:—గంధకము హేమవిధ్యోపయోగము:

"పారద స్సీసకో గంధః మనశ్శైల చతుష్టయం
బీజపూరాంభసా పిష్ట్వా గాఢం దినచతుష్టయం
అథ సూక్ష్మాణి పత్రాణి తాని తారస్య లేపయేత్
బీజపూర రసే నైతా న్యతిమాత్రేణ తావతా||
ఏకాధికా భవేత్పత్ర భావనా చాత్ర వింశతిః
విశోష్యావర్తయే త్తారం భవే త్తారస్య కాంచనం||

రసము, సీసము, గంధకము, మణిశిల వీనిని మాదీఫలరసముతో గాఢముగ నాల్గు దినములుమర్దించి మిక్కిలి పలుచనగ చేయబడిన వెండిరేకులకు పట్టించి, యిరువదియొక్క సారులు మాదీఫలరసముతో భావన చేసి యెండ నెండించవలెను. ఇట్లు చేసినచో వెండిరేకులు హేమించును.

## —♦ కండూహర ప్రయోగము ♦—

మూ. ద్వినిష్కపరిమితం గంధం పిష్ట్వా తైలేన సంయుతం
అథవాపామార్గతోయేన సతైల మరిచేనచ
విలిప్య సకలం దేహం తిష్ఠే ద్ఘర్మే తతః పరం
తక్రభక్తంచ భుంజీత తృతీయే ప్రహరేఖలు
భజేద్రాత్రౌ తథా స్వప్నం సముత్థాయ తథా ప్రగే
మహిషీ చ్ఛగణం లిప్త్వా స్నాయా చ్ఛీతేన వారిణా||
తతోభ్యజ్య ఘృతైర్దేహం స్నాయా దిష్టోష్ణవారిణా|
అమునా క్రమయోగేన వినశ్య త్యతివేగతః||
దుర్జయా బహుకాలీనా పామా కండూ స్సునిశ్చితం
గంధకస్య ప్రయోగాణాం శతం తన్నప్రకీర్తితం
గ్రంథవిస్తరభీతేన సోమదేవేన భూభుజా||

తా. రెండునిష్కముల గంధకమును నూనెతోగాని ఉత్తరేణురసముతోగాని మిరియపుచూర్ణమును చేర్చిన నూనెతోగాని నూరి శరీరమున కంతకును పూసికొని యెండలో గూర్చుండి మూడవజామునలేచి మజ్జిగఅన్నముతిని రాత్రియందు నిప్పుసెగను



కొంతసేపుండి (నిద్రించి) తెల్లవారుజామునలేచి గేదెపేడతో శరీరమునకు నలుగుబెట్టి చన్నీళ్ళతో స్నానముచేసినపిదప శరీరమునకంతకును నేయిపూసి అభ్యంజనము చేసికొని ఉష్ణోదకముతో స్నానముచేయవలెను. ఇట్లు చేసినయెడల చిరకాలమునుంచి యున్నట్టియు దురద, తామర నిశ్చయముగ హరించును. సోమదేవుడను రాజు గంధకప్రయోగములను నూరువరకు చెప్పెను. గ్రంథవిస్తరభీతిచే నవి యిచ్చట నుదహరింపబడవు.

## —* గంధకతైలము *—

మూ. అథవార్కస్నుహీక్షీరైః వస్త్రం లేప్యంతు సప్తధా
గంధకం నవనీతేన పిష్ట్వా వస్త్రం లిపేద్ఘనం||
తద్వర్తిం జ్వలితాం దంశే ధృతాం కుర్యా దధోముఖీం
తైలం పతే దధోభాండే గ్రాహ్యం యోగేషు యోజయేత్
శుద్ధగంధో హరే ద్రోగాన్ కుష్ఠమృత్యు జరాదికాన్
అగ్నికారీ మహానుష్ణో వీర్యవృద్ధిం కరోతిచ||

తా. జిల్లేడు, జెముడు వీనిపాలలో ఒకగుడ్డను యేడుసారులు తడిపి యెండించిన పిదప ఆగుడ్డకు వెన్నతోనూరిన గంధకమును మందముగాపూసి వర్తిచేసి దాని మధ్యను కారుతో పట్టుకొని నిప్పుముట్టించి తలక్రిందుగా పట్టుకొనినచో గంధకతైలపుచుక్కలు క్రిందపడును. దానిని గాజుపాత్రలో భద్రపరచి బలానుసారముగా సేవించినచో కుష్ఠము, మృత్యువు, ముదిమి వీనిని లేకుండజేయును. వీర్యవృద్ధిని, అగ్నిదీప్తిని గలిగించును.

వాదమంజరి:—గంధకభస్మము.

"అర్జునక్షారమధ్యస్థం గంధకం పాచయే త్పుటే
తామలక్యారసే నాథ మర్దయే త్ప్రహరత్రయం
పుటే కపోతకే దగ్ధ్వా మృతిమాయాతి గంధకం||"

(తా. మద్దిచెక్క బూడిదలో శుద్ధగంధకమును పెట్టి శరావసంపుటమందుంచి చీరజేసి పుటమువేసినయెడల గంధకము అగ్నిసహముగ నుండును. పిదప దానిని నేలయుసిరి పసరుతో మూడుజాములు మర్దించి బిళ్ళచేసి శరీరవృద్ధి సంపుటమందిడి చీరజేసి కపోతపుటము వేసినయెడల గంధకము స్వచ్ఛముగ భస్మమవును.)

## —♦ గైరికము ♦—

మూ. పాషాణగైరికం చైకం ద్వితీయం స్వర్ణగైరికం
పాషాణగైరికం ప్రోక్తం కఠినం తామ్రవర్ణకం

అత్యంతశోణితం స్నిగ్ధం మసృణం స్వర్ణగైరికం
స్వాదుస్నిగ్ధం హిమం నేత్ర్యం కషాయం రక్తపిత్తనుత్
హిధ్మా వమి విషఘ్నంచ రక్తఘ్నం స్వర్ణగైరికం
పాషాణగైరికం చాన్య త్పూర్వ స్మాదల్పకం గుణైః
గైరికం తు గవాందుగ్ధై ర్భావితం శుద్ధిమృచ్ఛతి॥

గైరికం సత్త్వరూపంహి నందినా పరికీర్తితం
క్షారవ్యుక్తం పతేత్సత్త్వ క్షారామ్ల స్విన్నగైరికాత్॥
ఉపతిష్ఠతి సూతేంద్రి మేకత్వం గుణవత్తరం॥

తా॥ పాషాణగైరికము, స్వర్ణగైరికము అని గైరికము, రెండువిధములు. అందు మొదటిది కఠినముగను తామ్రవర్ణము కలదిగను ఉండును. రెండవది మిక్కిలి యెఱ్ఱనై స్నిగ్ధమై దట్టమై మధురవిపాకమును స్నిగ్ధగుణమును శీతవీర్యమును కషాయరసమును గల్గినదై నేత్రవ్యాధులను రక్తపిత్తమును పోగొట్టునదై యున్నది. హిక్కా వమన విషదోషములనుగూడ హరించును. స్వర్ణగైరికముకన్న పాషాణగైరికము గుణహీనమైనది. గైరికమును ఆవుపాలతో భావనచేసిన శుద్ధమగును.

శుద్ధిచేసిన గైరికము స్వాభావికముగ సత్త్వరూపమై యుండునని నందికేశ్వరుడు చెప్పెను గాని క్షారములతోచేర్చి యామ్లవర్గముతో భావనచేసిన యారసములతో స్వేదనముచేసిన సత్త్వమును విడచునని కొందరందురు.

—♦ కాసీసము ♦—

మూ. కాసీసం వాలుకాద్యేకం పుష్పపూర్వ మథాపరం
క్షారామ్లా గురు ధూమాభం సోష్ణవీర్యం విషాపహం
వాలుకా పుష్పకాసీసం శ్విత్రఘ్నం కేశరంజనం॥
పుష్పాదికాసీస మతిప్రశస్తం సోష్ణం కషాయామ్ల మతీవనేత్ర్యం
విషానిలశ్లేష్మ గదవ్రణఘ్నం శ్విత్రక్షయఘ్నం కచరంజనంచ॥
సకృద్భృంగాంబునా క్లిన్నం కాసీసం నిర్మలం భవేత్
తువర సత్త్వవత్సత్త్వ మేతస్యాపి సమాహరేత్
కాసీసం శుద్ధి మాప్నోతి పిత్తైశ్చ రజసా స్త్రియః
బలినా హతకాసీసం కాంతకాసీస మీరితం



ఉభయం సమభాగంహి త్రిఫలా వేల్ల సంయుతం
విషమాంశఘృత క్షౌద్రప్లుతం శాణమితం ప్రగే
సేవితం హంతి వేగేన శ్విత్రం పాండుం క్షయామయం
గుల్మప్లీహాగదం శూలం మూలరోగం విశేషతః
రసాయన విధానేన సేవితం వత్సరావధి
ఆమసంశోషణం శ్రేష్ఠం మందాగ్ని పరిదీపనం
పలితం వలిభిస్సార్థం వినాశయతి నిశ్చితం॥

తా॥ వాలుకా, కాసీసము, పుష్పకాసీసము అని కాసీసము (అన్నభేది) రెండు విధములు. అది పులుసు, ఉప్పు, వగరు కలిసిన రుచిని ధూమ్రవర్ణమును ఉష్ణవీర్యమును గలిగియుండును. రెండువిధముల అన్నభేదియు తెల్లకుష్ఠమును పోగొట్టును. వెండ్రుకలను నలుపుచేయును. పుష్పకాసీసము మిగుల ప్రశస్తము. నేత్రరోగములందు ముఖ్యముగ పనిచేయును. విషదోషమును వాతకఫములను వ్రణములను బొల్లిని క్షయను హరించును. కేశరంజనము చేయును. గుంటగలగరాకురసముతో నొకమారు స్వేదనముచేసిన నిది శుద్ధమగును.

పటికినుండితీసినవిధమున దీనినుండియు సత్త్వమును తీయవలెను. మరియు దీనిని పిత్తము(చేదు)లచేతను స్త్రీల బుతురక్తముచేతను శుద్ధిచేయుట మతాంతరము.

కాంతకాసీసము:—శుద్ధగంధకము, అన్నభేది సమభాగములుగ కలిపి నూరి పుటము వేసినయెడల సిందూరించును, ఇదియ కాంతకాసీసము.

కాంతకాసీసము:—1 శాణము, త్రిఫలచూర్ణం, వాయువిడంగములు కలసి 1 శాణము, నేయి, తేనె కలిసి 3 శాణములు, కలిపి ప్రాతఃకాలమున సేవించుచుండిన చో శీఘ్రముగ శ్విత్రము, పాండువు, క్షయ, గుల్మము, ప్లీహ, శూల నశించును. మూలరోగమున విశేషఫలప్రదము. రసాయనసేవ సేయు పద్ధతిని దీనినొక సంవత్సరము సేవించవలెను. ఇది ఆమమును శోషింపజేసి అగ్నిదీప్తిని కల్గించును. వలీపలితములను లేకుండ చేయును.

—♦ కాంక్షి (పటికి) ♦—

మూ. సౌరాష్ట్రశ్మని సంభూతా మృత్స్నా సాతు పరీమతా
వస్త్రమారంజయే ద్యోసా మంజిష్ఠా రాగబంధినీ

పటికీ ఫుల్లకీ చేతి ద్వితీయా పరికీర్తితా
ఈషత్పీతా గురుస్నిగ్ధా పీతికా విషనాశనీ
వ్రణకుష్ఠహరా సర్వకుష్ఠఘ్నీచ విశేషతః
నిర్భారా శుభ్రవర్ణాచ స్నిగ్ధా సామ్లా పరామతా
సాఫుల్ల తువరీప్రోక్తా లేపా త్తామ్రం చరే దియం॥
కాంక్షీ కషాయా కటుకామ్లకంఠ్యా కేశ్యా వ్రణఘ్నీ విషనాశనీచ
శ్విత్రాపహా నేత్రహితా త్రిదోష శాంతిప్రదా పారదజారణీచ॥
తువరీకాంజికే క్షిప్తా త్రిదినాచ్ఛుద్ధిమృచ్ఛతి
క్షారామ్లైర్మర్దితా ధ్మాతా సత్త్వం ముంచతి నిశ్చితం
గోపిత్తేన శతం వారాన్ సౌరాష్ట్రీం భావయే త్తతః
ధమిత్వా పాతయే త్సత్త్వం క్రామణంచాతి గుహ్యకం॥

తా॥ సౌరాష్ట్రదేశమందలి గనులలో దొరకు మృత్తికాభేదమును కాంక్షి యందురు. ఇది గుడ్డలకు రంగు వేయుపనియం దుపయోగించును. మంజిష్ఠయొక్క రంగును నిలుపును. పటికి, ఫుల్లిక, అని ఇది రెండువిధములు. పటికి కొంచెము పచ్చగను బరువుగను నునుపుగను ఉండును. విషమును, వ్రణమును, కుష్ఠమును, విశేషముగ హరించును. ఫుల్లికయను నది తేలికగను తెల్లగను నునుపుగను పుల్లగను ఉండును. దానిని రాగికి లేపనముచేసి నచో రాగిని తినివేయును.

“రసార్ణవము:—“సితా కృష్ణాచ సౌరాష్ట్రీ చూర్ణఖండాత్మికాచ సా” (చూర్ణము, ఖండము అను పేళ్లతో తెలుపు నలుపు వర్ణములుగలిగి రెండు విధము లగనుండు రసార్ణవ వాక్య మిందుతో భేదించుచున్నది.)

పటికి కషాయ, కటు, ఆమ్లరసములు గలది. కంఠరోగములను వ్రణములను విష దోషమును బొల్లిని నేత్రవ్యాధులను పోగొట్టును. వెండ్రుకలకు నలుపెక్కించును. త్రిదోషశాంతి జేయును. రసజారణమున కుపయోగించును.

పటికిని కాంజికములో మూడుదినములుంచిన శుద్ధమగును. క్షారవర్గముతోను ఆమ్లవర్గముతోను నూరి కొలిమిలోబెట్టి యూదినచో సత్త్వమును విడచును. మరియు తువరిని ద్రవముగనుండు పచ్చిగోరోజనముతో నూరుసారులు భావనచేసి కొలిమిలో నుంచి యూదినచో సత్త్వము వెడలును.



## హరితాళము

మూ. హరితాళం ద్విధాప్రోక్తం పత్రాఢ్యం పిండతాళకం
స్వర్ణపత్రం గురుస్నిగ్ధం తనుపత్రంచ భాసురం
తత్పత్ర తాళకం ప్రోక్తం బహుపత్రం రసాయనం
నిష్పత్రం పిండసదృశం స్వల్పపత్రం తథాగురు
స్త్రీపుష్పహరణం తత్తు గుణాల్పం పిండతాళకం॥
శ్లేష్మరక్త విషవాత భూతను త్కేవలంచ ఖలు పుష్పహృత్ [స్త్రీణాః
స్నిగ్ధ ముష్ణకటుకంచ దీపనం కుష్ఠహారి హరితాళ ముచ్యతే॥

తా. పత్రతాళకము, పిండతాళకము అని తాళకము రెండువిధములు. పత్రతాళకము బంగారురేకులవంటి రేకులుగలిగి మెరయుచు బరువై యుండును. ఇది రసాయనము. పిండతాళకము రేకులులేనిదై అల్పగుణములుగలిగి ముద్దవలె నుండును. స్త్రీలరజస్సును నశింపజేయును. శ్లేష్మను రక్తవికారమును వాతమును భూతచేష్టలను నశింపజేయును. నునుపుగను ఉష్ణముగను కటువుగను దీపనకారిగను కుష్ఠహరముగను ఉండును.

## హరితాళశుద్ధి

మూ. స్విన్నం కూశ్మాండతోయేవా తిలక్షారజలేపివా
తోయేవా చూర్ణసంయుక్తే డోలాయంత్రేణ శుధ్యతి
అశుద్ధం తాళ మాయుర్ఘ్నం కఫ మారుతమేహకృత్
తాపస్ఫోటాంగసంకోచం కురుతే తేన శోధయేత్
తాళకం కణశః కృత్వా దశాంశేన చ టంకణం
జంబీరోత్థ ద్రవైః క్షాళ్యం కాంజికైః క్షాళయే త్తతః
వస్త్రే చతుర్గుణే బద్ధ్వా డోలాయంత్రే దినం పచేత్
సచూర్ణే నారనాళేన దినం కూశ్మాండజే రసే
స్వేద్యం వా శాల్మలీతోయై స్తాలకం శుద్ధి మాప్నుయాత్॥

తా. బూడిదగుమ్మడికాయ రసమునగాని నువ్వుకంపను కాల్చి యాబూడిదలో నీరుపోసి తేరినపిదప వడియగట్టిన క్షారోదకమునగాని సున్నపునీటిలోగాని డోలా యంత్రమున స్వేదనముచేసినచో తాళకము శుద్ధమగును.

ఈశుద్ధిచేయబడని తాళకము ఆయువును హరించును. కఫ వాత మేహములను పెంచును. తాపము, దేహముపగులుట మొదలగు వికారములను గలిగించును. కాన శోధన మవసరము. తాళకమును ముక్కలుగాజేసి అందు పదియవవంతు వెలిగారమును చేర్చి నూరి నిమ్మపండ్లరసముచేతను పిదప కాంజికముచేతను కడగవలెను. తరువాత ఆముక్కలను నాల్గుమడతలుగల గుడ్డలోపెట్టి సున్నముకలిపిన అరనాళమునగాని బూడిదగుమ్మడికాయ రసమునగాని బూరుగువేరు రసమునగాని ఒకదినము స్వేదనము చేసిన శుద్ధమగును.

## —♦ తాళకభస్మము ♦—

మూ. మధుతుల్యే ఘనీభూతే కషాయే బ్రహ్మిమూలజే
త్రివారం తాళకం భావ్యం పిష్ట్వా మూత్రేథ మాహిషే
ఉపలైర్దశభి ర్దేయం పుటం రుద్ధ్వాథ పేషయేత్
ఏవం ద్వాదశధా పాచ్యం శుద్ధం యోగేషు యోజయేత్॥

తా. మోదుగువేరు కషాయముతీసి వీనిని సమభాగములుగజేర్చి గట్టిపడువరకు కాచి అందు తాళకమును మూడుజాములు భావనచేసి గేదెమూత్రములోనూరి శరావ సంపుటమందిడి పదియేడు పిడకలతో పుటముచేసి చూర్ణించవలెను. ఇట్లు పండ్రెండు సారులు పుటముచేసిన పరిశుద్ధముగ భస్మమై యోగములందు చేర్చుటకు తగియుండును.

సిద్ధమతమందు:—తాళకభస్మప్రకరణము.

"తబక్యాఖ్యం హరితాళం మహిషీమూత్రే ఘృతకుమారీరసే చూర్ణతోయే శరపుంఖారసే కూష్మాండరసే నింబూరసేచ షట్ప్రహరం పృథక్ సంశోధ్యమితి శుద్ధిః."

అథ మర్దనం:—కూష్మాండరసేన, కాగదీనింబూరసేన ధత్తూరరసేన సహదేవీరసేన పలాశరసేన బదరీరసేన ఆర్ద్రకరసేన గోభీరసేన ఛిక్కిణీరసేన హుల్ హుల్ రసేన నాగార్జునీరసేన భృంగరాజరసేన ఏరండమూలరసేన బ్రహ్మదండరసేన శ్వేతలశునరసేన పలాండురసేన స్వర్ణవల్లీరసేన కాకమాచీరసేన బలారసేన వజ్రీదుగ్ధేన అర్కదుగ్ధేనచ ప్రత్యేకం ఏకవింశతి దినాని మర్దయేత్. ఏతత్కష్టం కర్తుమశక్తశ్చేత్ తేన దినశబ్దో భావనాపరతయా బోధ్యః. తాంచ క్రికాం కృత్వా ఘర్మశుష్కాం కారయేత్. తతోతిదృఢాం హండీం మృత్కర్పటై రేకవింశతివారం లేపయేత్. తతస్తస్యాం హండికాయాం పిప్పలస్య విభూతిం పూరయేదంగుష్ఠపరిమితం యావత్ తదుపరితాంచ క్రికాం దృఢాం సంస్థాప్య



పునస్తదుపరి తద్విభూత్యా అతి దృఢం పూరయే దాకంఠం. తతో ముద్రాం కృత్వా క్రమవివర్ధిత మగ్నిం దద్యాత్ప్రహరాణాం చతుష్షష్టిం సిద్ధం భస్మభవతి. తద్యత్నత స్సంరక్షేత్. దేవగోబ్రాహ్మణపూజాం కృత్వా తస్య మాత్రాం తండులపరిమితాం గుంజాపరిమితాం వా భక్షయేత్. యథా రోగమనుపానాని పథ్యం లవణామ్లతీక్ష్ణతైలవర్జం ప్రోక్తవత్ జ్ఞేయం॥

అస్యఫలశ్రుతిః—త్రిస్సప్తాహాన్మండలే నైకేనవా శ్వేతప్రభృత్యష్టాదశకుష్ఠాని యావంతో రక్తవికారాః త్రయోదశ సన్నిపాతాః అపస్మారాదయో యావంతః పాపరోగాః భగందర నాడీవ్రణ ప్రభృతయో మహావ్రణాః, ప్రశీర్ణం వాతరక్తం ఉపదంశ ఫిరంగాద్యా లింగరోగాః శ్లీపదగ్రంథి ప్రభృతయః సర్వాంగశోఫాః సూతికా వాతరోగ ప్రభృతయః సర్వా శీతవాతవికారాః శ్వాసకాసాద్యా వాతవికారాః దుష్టపీనస ప్రభృతయః ప్రతిశ్యాయాః అర్శాదయోష్టౌ మహారోగాః వహ్నిమాంద్యజా గ్రహణీ ప్రభృతయః మధుమేహాద్యా సర్వే ప్రమేహాః మేదోవృద్ధ్యర్బుదగండమాలాద్యాః కఠినవికారా ఆమవాత గృధ్రస్యాద్యా మహావికారాః రాజయక్ష్మాద్యా శోషాః కించాశీతిసంఖ్యాకా వాతరోగాః అనుపానభేదేన చత్వారింశత్పిత్తరోగాః వింశతిసంఖ్యాకా కఫరోగాః దశ రక్తజారోగాః శీఘ్రం ప్రణశ్యంతి. జరావ్యాధినాశశ్చ భవతి. దివ్యదేహః కాంతిధృతిమాన్ సత్త్వసంయుతః కామినీకామదర్పఘ్నః తార్క్ష్యదృష్టి ర్వాగ్మీ వదాన్యశ్చ భవతి॥

సిద్ధవైద్యైస్తు హరితాళశ్చతుర్విధః ప్రోక్తః బుగదాదీ గోదంతీ తబకీ పిండతాళశ్చేతి॥

## —♦ హరితాళసత్వము ♦—

మూ. శుద్ధత్థ క్వాథసౌభాగ్య మహిషాజ్య మధుప్లుతం
స్థాల్యాం క్షిప్త్వా విదధ్యాచ్చ మల్లేన చ్ఛిద్రయోగినా
సమ్యఙ్నిరుధ్యశిఖినా జ్వాలయే త్క్రమవర్ధితం
ఏకప్రహరమాత్రంహి రంధ్రమాచ్ఛాద్య గోమయైః

యామాంతే ఛిద్రముద్ఘాట్య దృష్టే ధూమేచ పాండురే
శీతాం స్థాలీం సముత్తార్య సత్త్వమాకృష్య చాహరేత్
సర్వపాషాణసత్త్వానాం ప్రకారా స్సంతి కోటిశః
గ్రంథవిస్తరభీత్యాతు లిఖితా న మయా ఖలు॥
పలాలకం రవేర్దుగ్ధైర్దినమేకం విమర్దయేత్
క్షిప్త్వా షోడశికాతైలే మిశ్రయిత్వా తతః పచేత్
అనావృత్తప్రదేశేచ సప్తయామావధి ధృవం
స్వాంగశీత మధస్థంచ సత్త్వం శ్వేతం సమాహరేత్
ఛాగలస్యాథవా లాభే బలినాచ సమన్వితం
తాళకం దివసద్వంద్వం మర్దయిత్వాతియత్నతః
యుక్తం ద్రావణవర్గేణ కాచకుప్యాం వినిక్షిపేత్॥
త్రిధా తాంచ మృదాలిప్త్వా పరిశోష్య ఖరాతపే
తతః ఖర్పరిక చ్ఛిద్రే తా మధ్యాంచైవ కూపికాం
ప్రవేశ్య జ్వాలయే దగ్నిం ద్వాదశ ప్రహరావధి
కూపీకంఠస్థితం శ్వేతం శుద్ధం సత్త్వం సమాహరేత్॥
పలార్ధప్రమితం తాళం బధ్వా వస్త్రే సితే దృఢే
బలినా లిప్య యత్నేన త్రివారం పరిశోష్యచ
ద్రావితే త్రిఫలే తామ్రే క్షిపే త్తాళకపోటలీ
భస్మనాచ్ఛాదయే చ్ఛీఘ్రం తామ్రేణావేష్టితం సితం
మృదులం సత్త్వమాదద్యా త్ప్రోక్తం రసరసాయనే॥

తా. శుద్ధిచేసిన తాళకమును ఉలకపకషాయము మజ్జిగ గాడిదనేయి తేనె అనుద్రవ్యములలో నాననిచ్చి ఒకమట్టిపిడతలోనుంచి ఒకమూకుడునకు రంధ్రముచేసి దానిచే మూసి గట్టిగ సంధిబంధముగావించి మూకుడునకు పైనుండు రంధ్రముమీద పేడముద్దను తీసి ఆరంధ్రమునుండి తెల్లనిపొగ వెడలుటజూచి మంటచల్లార్చి స్వాంగశీతలమున విప్పి దానినంటియుండు తెల్లని సత్త్వమును గ్రహించవలెను.

సర్వపాషాణములనుండియు సత్త్వమును తీయుపద్ధతులు కోట్లకొలది కలవు. వానిని గ్రంథవిస్తరభీతిచే నిట నుదహరింపము.

ఒకపలము శుద్ధతాళకమును జిల్లేడుపాలతో నొకదినము మర్దించి అందొకపలము



మానెకలిపి మూసలోనుంచి కొలిమిలోపెట్టి క్రమముగా నేడుజాము లూది స్వాంగశీతలమైన పిదప కొలిమిలో క్రింద తెల్లగా వ్యాపించియుండు సత్త్వమును గ్రహించవలెను.

తాళకమును గొఱ్ఱె, గుఱ్ఱము వీనియొక్క చొల్లుతో జేర్చి రెండుదినములు బాగుగా నూరి ఆచూర్ణమునందు ద్రావణవర్గద్రవ్యములను కలిపి గాజుకుప్పెలోపోసి యాకుప్పెను మూడువరుసలు చీరజేసి గాఢమైన యెండ నెండించియుంచవలెను. పిదప కొలిమిలో నడుమ ద్వారముండునట్లు చేసి దానియందు కుప్పెను సగమువరకు యిముడునట్లు పెట్టి నిప్పువేసి పండ్రెండుజాములవరకు నూది స్వాంగశీతలమైన పిదప కుప్పెనుతీసి దానికంఠప్రదేశమున తెల్లగవ్యాపించియుండు సత్త్వమును గ్రహించునది.

అర్ధపలము తాళకమును తెల్లని గట్టిబట్టతో మూటగట్టి మూటపైన నీళ్లతో మెత్తగా నూరిన గంధకమును పట్టించి యెండించవలెను. ఇట్లు మూడుపూతలు పూసి మూడుపలముల రాగిని కరిగించి అందు పైచెప్పిన తాళకపుమూటనుంచి వెంటనే బూడిదతో రాగిని మూసివేయవలెను. చల్లారినపిదప తీసి తామ్రపురేకునకంటియుండు తెల్లనితాళకసత్త్వమును గ్రహించవలెను.

(క్షయ, కాస మొదలగు క్రూరకఫవ్యాధులందు ఒకయవలో యెనిమిదవవంతు చొప్పున దీనిని వాడవలెను. సుకుమారులకు గర్భిణులకు జాగ్రతతో యివ్వదగియుండును.)

రసార్ణవము:—తాళకపత్రి:

"తిలసర్షపశిగ్రూణి లాక్షాచ లవణం గుడః
టంకణంచ యుతై రేతై స్తాళకం భూధరే ద్రవేత్"

(నువ్వులు, ఆవాలు, మునగచెక్క, లక్క, లవణము, బెల్లము, వెలిగారము అను వానితో తాళకమును చేర్చి నూరి భూధరయంత్రమున పక్వముచేసినచో తాళకము ద్రవించును.)

మాతేంద్రసిద్ధి:— తాళకము-తారవిద్యోపయోగము.

"తాళకం హింగుళం సూతం గృహీత్వా సమభాగకం।
స్వరసే నేంద్రవృక్షస్య దినమేకంతు మర్దయేత్॥
విధాయ చక్రికాం మల్లద్వయే రుద్ధ్వా పుటే దహేత్॥
భస్మభూతం సముద్ధృత్య ద్రుతే తామ్రే వినిక్షిపేత్।
భవేచ్ఛారద చన్ద్రాభం రజతం రుచిరప్రభం॥"

(తాళకము, ఇంగిలీకము, రసము వీనిని సమభాగములుగ గ్రహించి నల్లనుద్దిపట్ట స్వరసముతో నొకదినము మర్దించి బిళ్లచేసి శరావసంపుటమందుంచి చీరజేసి పుటము వేసి

నచో భస్మమగును. ఆభస్మమును, రాగిని కరిగించి యందు వేసినయెడల శరచ్చంద్రనిభ మైన చక్కని రజతమగును.)

వాదమంజరి:— తాళకభస్మము తారవిద్యోపయోగము.

సంశోధితం పత్రితాళ మజవత్సత్వగావృతం। తప్తచూర్ణాశ్మమధ్యస్థం ధారయే ద్భాజనే మృదః॥ అజాక్షీరై స్సమాప్లావ్య శరావేణాపి ధాపయేత్॥ చతుర్థేహాని విసృజ్య పునస్తద్వ త్క్రియాం చరేత్।ఏవం కృత్వా త్రివారాణి మృతమాలం సమాదదేత్। తతో వినిక్షిపే ద్వంగే ద్రుతే తద్రజతం భవేత్॥”

(శుద్ధిచేసిన పత్రితాళకమును చక్కగా కాల్చిన సున్నపురాళ్లనడుమనుంచి యొక పిడతలోనుంచి యారాళ్లు మునుగునట్లు మేకపాలుపోసినచో నది కుత కుత ఉడుకును. వెంటనే యొకమూకుడును బోర్లించి చీరచేసి మూడుదినములుంచి నాల్గవదినమున దీయునది. మరల అట్లే రెండుసారులు చేయవలెను. చక్కగా భస్మమగును. దానిని గురుసంప్రదాయముననుసరించి కరిగించిన వంగమున వేసినచో వంగమునందలి నీరు హరించి రజతమగును.)

నాగార్జునతంత్రము:— తాళకభస్మము.

“అశ్వత్థచర్మణశ్చూర్ణం మృదులంపటగాలితం। అంగుళోత్సేధ మాపూర్య శరావే తాళకం న్యసేత్। పున రాకంఠ మాపూర్య చూర్ణేనైవ శరావకం। చుల్ల్యామారోప్య యత్నేన దీపం ప్రజ్వాలయే దధః। యదా చూర్ణార్ధ దహనం తదాలస్య మృతిర్భవేత్। అవతార్య సుశీతం తదాలభస్మ సమాహరేత్॥”

(తా॥ రావిచెక్కను మెత్తగాచూర్ణించి వస్త్రగాలితముచేసి యొకమూకుడులో అంగుళమెత్తువరకు పరచి దానిపై తాళకపుముక్కను బెట్టి పైన మరల రావిచెక్క చూర్ణమును మూకుడుయొక్క కంఠపర్యంతము పూరించి యామూకుడును పొయ్యిమీద బెట్టి క్రింద దీపమును బెట్టవలెను. దీపపువేడికి చూర్ణము కాలి మధ్యనుబెట్టిన తాళకము భస్మమగును. సగముచూర్ణము కాలగానే మూకుడుదించి సాంగశీతలమున మృతమైన తాళకపుముక్కను గ్రహించవలెను.

అనుభవము:— రావిచెక్కచూర్ణమును అంగుళమెత్తు పరచి తాళకపుముక్కపెట్టి యాముక్కకు మైనమును అంటించి యామైనముమీద చీపురుపుల్లను అతికించి కంఠమువరకు చూర్ణమును పేర్చినచో దీపపువేడికి చూర్ణము కాలి పైనున్న చీపురుపుల్లయు కాలి క్రిందబడును. అపుడు చూర్ణము సగము



కాలినట్లు మనకు గుర్తించవచ్చును. మరియు నిందు వ్రాయబడకున్నను తాళకపుముక్కకు అయిదారువరసలు తములపాకులను చుట్టుటమంచిది.

భావప్రకాశిక:— తాళకభస్మము:

“పత్రాఖ్యం తాళకం శుద్ధం పౌనర్నవరసేనతు। ఖల్వే విమర్దయే దేకందినం పశ్చాద్విశోషయేత్॥ సంశోష్య గోళకం కృత్వా చక్రాకార మథాపివా। తతః పునర్నవాక్షారైః స్థాల్యామర్ధం ప్రపూరయేత్॥ తత్ర తద్గోళకం కృత్వా పునస్తేనైవ పూరయేత్। స్థాపం చుల్ల్యాం సమారోప్య క్రమాద్వహ్నిం వివర్ధయేత్॥ దినాన్యంతర శూన్యాని పంచవహ్నిం ప్రదీపయేత్। ఏవంత న్మ్రియతే తాళం మాత్రా తస్యైకరాజికా॥

(శుద్ధిచేసిన పత్రితాళకము తెల్లగలిజేరురసముతో నొకదినము మర్దించి గుళికగాగాని చక్రాకారముగగానిచేసి యెండించి తెల్లగలిజేరు బూడిదలో పెట్టి క్రమముగ వృద్ధిచేయుచు అయిదుదినములు వండినయెడల భస్మమగును. దీనిని అనుపానభేదముచే సుఖవ్యాధులకును విసర్పము, వాతరక్తము, విస్ఫోటము మొదలగు రోగములందు వాడదగును. మోతాదు ఒక గురిగింజెత్తు.)

అనుభూతప్రక్రియ:— తులం తాళకమును 5 తులముల తెల్లజిల్లేడుపాలతో భావనచేసి మర్దించి యుండజేసి ఆయుండకు 5 తులముల దారమును బంతివలె చుట్టి శరావసంపుటమందుంచి పుటము వేసినచో తెల్లగ భస్మమగును.

## — మణిశిల —

మూ. మనశ్శిలా త్రిధా ప్రోక్తా శ్యామాంగీ కణవీరకా
ఖండాఖ్యా చేతి తద్రూపం వివిచ్య పరికథ్యతే
శ్యామారక్తా సగౌరాచ భారాఢ్యా శ్యామికామతా
తేజస్వినీచ నిర్గౌరా తామ్రాభా కణవీరకా
చూర్ణీభూతాతిరక్తాంగీ సభారా ఖండపూర్వికా
ఉత్తరోత్తరతశ్శ్రేష్ఠా భూరిసత్త్వా ప్రకీర్తితా॥
మనశ్శిలా సర్వరసాయనాగ్ర్యా తిక్తా కటూష్ణా కఫవాతహంత్రీ
సత్త్వాత్మికా భూతవిషాగ్నిమాంద్య కండూతి కాసక్షయహారిణీచ॥
అశ్మరీం మూత్రకృచ్ఛ్రంచ అశుద్ధా కురుతే శిలా

మందాగ్నిం మలబద్ధంచ శుద్ధా సర్వరుజాపహా
అగస్త్యపత్రతోయేన భావితా సప్తవాసరం
శృంగబేర రసైర్వాపి విశుధ్యతి మనశ్శిలా
జయంతీ భృంగరాజోత్థ రక్తాగస్త్యరసై శ్శిలాం
డోలాయంత్రే పచేద్యామం యామం ఛాగోత్థమూత్రకైః
క్షాళయే దారనాళేన సర్వయోగేషు యోజయేత్
అష్టమాంశేన కిట్టేన గుడగుగ్గులు సర్పిషా
కోష్ఠ్యాం రుద్ధ్వా దృఢం ధ్మాతా సత్త్వం ముంచే న్మనశ్శిలా
భూనాగసత్త్వ సౌభాగ్య మదనైశ్చ విమర్దితైః
కారవల్లీ దళాంభోభిః మూషాం కృత్వాథ నిక్షిపేత్
శిలాం క్షారామ్లనిష్పిష్టాం ప్రథమే త్తదనంతరం
కోకిలాద్వయమాత్రంహి ధ్మానా త్సత్త్వం సృజత్యసౌ॥

తా. శ్యామాంగి, కణవీరక, ఖండక, అని మణిశిల మూడువిధములు. శ్యామాంగి యనునది నలుపు యెరుపు తెలుపురంగులు గలిగి బరువైయుండును. కణవీరక తామ్రవర్ణముగలిగి తెలుపురేక తళతళలాడుచు బరువులేనిదై యుండును. ఖండక మిగుల యెర్రనై బరువుగలిగి చూర్ణరూపముగ నుండును. మొదటిదానికన్న రెండవది దానికన్న మూడవది ఉత్తమము.

గుణము:—మణిశిల సర్వరసాయనములలో శ్రేష్ఠము. చేదు, కారము గలది. ఉష్ణమును చేయును. కఫవాతహరము, సత్త్వరూపమైనది. భూత, విష, అగ్నిమాంద్య, కండూతి, కాస, క్షయలను హరించును. దీనిని శుద్ధిచేయక వాడినచో అశ్మరిని మూత్రకృఛ్రమును అగ్నిమాంద్యమును మలబద్ధమును కలిగించును. శుద్ధిచేసినచో సర్వరోగములను హరించును.

శుద్ధి:—అగసియాకురసమందుగాని శొంఠిరసమునగాని ఏడుదినములు భావనచేసినచో మణిశిల శుద్ధమగును. పసుపుదుంప గుంటగలగర యెర్రఅగసియాకు వీనిరసములతో డోలాయంత్రమునం దొకజాము స్వేదనముచేసి పిదప మేకమూత్రముతో స్వేదనముచేసి ఆరనాళముతో కడిగి సర్వరోగములందును వాడుకొనవలెను.

సత్వము:—శుద్ధిచేసిన మణిశిలకు యెనిమిదవవంతు యినుపచిట్టెము, గుగ్గిలము, బెల్లము, నేయి (అన్నియుచేరి యెనిమిదవవంతు) చేర్చి మూసలోనుంచి కొలిమిలోబెట్టి గాఢాగ్ని కలుగునట్లూదినయెడల మణిశిలనుండి సత్వము వెడలును.



మరియు, భూనాగసత్వమును వెలిగారమును మ్రింగకాయను కాకరాకురసముతోనూరి అముద్దను మూసయొక్క లోభాగమునపూసి యెండించి మణిశిలను క్షారములతో జేర్చి అమ్లవర్గముతో నూరి యామూసలో బెట్టి కొలిమిలో నూదినయెడల మణిశిలనుండి సత్వము వెడలును.

ఆయుర్వేదప్రకాశము:— "తాళవచ్చ శిలాసత్త్వం గ్రాహ్యం తైరేవ చౌషధైః"
తాళకము నుండివలె మణిశిలనుండియును సత్వమును గ్రహించవలెను.

## —♦ అంజనములు ♦—

మూ. సౌవీర మంజనం ప్రోక్తం రసాంజన మతః పరం।
స్రోతోంజనం తదన్య చ్చ పుష్పాంజనక మేవచ॥
నీలాంజనం చ తేషాంహి స్వరూప మిహావర్ణ్యతే॥
సౌవీరమంజనం ధూమ్రం రక్తపిత్తహరం హిమం।
విషహిధ్మాదిరోగఘ్నం వ్రణశోధన రోపణం।
రసాంజనంచ పీతాభం విషవక్త్రగదాపహం॥
శ్వాసహిధ్మాపహం వర్ణ్యం వాతపిత్తాస్ర నాశనం॥
స్రోతోంజనం హిమం స్నిగ్ధం కషాయం స్వాదులేఖనం।
నేత్ర్యం హిధ్మావిషచ్ఛర్ది కఫపిత్తాస్రరోగనుత్
పుష్పాంజనం సితం స్నిగ్ధం హిమం సర్వాక్షిరోగనుత్॥
అతిదుస్తరహిధ్మాఘ్నం విషజ్వరగదాపహం॥
నీలాంజనం గురుస్నిగ్ధం నేత్ర్యం దోషత్రయాపహం।
రసాంజనం సువర్ణఘ్నం లోహమార్దవకారకం
అంజనాని విశుధ్యంతి భృంగరాజ దళద్రవైః
మనోహ్వా సత్త్వవత్సత్వ మంజనానాం సమాహరేత్॥
వల్మీకశిఖరాకారం భంగే నీలోత్పలద్యుతి।
ఘృష్టంతు గైరికచ్ఛాయం స్రోతోంజనం లక్షయేద్ధ్రువం।
గోశకృద్రసమూత్రేషు ఘృతక్షౌద్ర వసాసుచ॥
భావితం బహుశస్తశ్చ శీఘ్రం బధ్నాతి పారదం।
సూర్యావర్తాది యోగేన శుద్ధిమేతి రసాంజనం।
రాజావర్తకవ త్సత్త్వం గ్రాహ్యం స్రోతోంజనాదపి॥

తా. సౌవీరాంజనము, రసాంజనము, స్రోతోంజనము, పుష్పాంజనము, నీలాంజనము అని అంజనములు అయిదు విధములు.

సౌవీరాంజనము ధూమ్రవర్ణముగలది. రక్తపిత్తములను హరించును. చల్లగానుండును. విషహిధ్మాది రోగములను ఖండించును. వ్రణములను కోయును, మాన్పును.

రసాంజనము పచ్చగనుండును. విషదోషమును ముఖరోగములను శ్వాసము హిధ్మను వాతపిత్త రక్తదోషములను హరించును. దేహకాంతి నిచ్చును.

స్రోతోంజనము శీతలముగను స్నిగ్ధముగను కషాయ స్వాదురసములు కలదిగను లేఖనకారిగను నేత్ర, హిధ్మా, విష, ఛర్ది, కఫ, పిత్త, రక్తవికారములను హరించును.

పుష్పాంజనము తెల్లగను స్నిగ్ధముగను శీతలముగను ఉండును. నేత్రరోగములను క్రూరమైనహిధ్మను విషజ్వరములను పోగొట్టును.

నీలాంజనము బరువుగను స్నిగ్ధముగను ఉండును. నేత్రరోగములను దోషత్రయ వికారములను అడంచును. రసాయనము స్వర్ణభస్మము చేయుటకు పనికివచ్చును. సర్వ లోహములకు మృదుత్వమును గలిగించును.

పంచవిధాంజనములును గుంటగలగరాకురసముతో నూరిన శుద్ధమగును. ఈ యంజనములనుండి మణిశిలనుండివలె సత్వమును గ్రహించవలెను.

పుట్టకొనలవలెనుండి నరికినచో నల్లకలువయొక్క రంగునుకలిగి అరగదీసినచో గైరికమువలె యెఱ్ఱనిరంగుగల్గి యుండునెడల నిశ్చయముగా నది స్రోతోంజనమని గుర్తించవలెను. దీనిని గోమయరసము, గోమూత్రము, నేయి, తేనె, వస అనువానిలో పలుమారు భావనచేసినచో నిది శీఘ్రముగ రసమును బంధించును.

కంకుష్ఠవివరణములో ముందు చెప్పబోవు సూర్యావర్తము మొదలగు ఉపరస బోధక ద్రవ్యగణముతో చేర్చి నూరినచో రసాంజనము శుద్ధమగును. దీని సత్త్వమును రాజావర్త సత్త్వమునువలె గ్రహించునది.

ఈ యంజనపంచకము ప్రకృతము దుర్లభములుగనున్నవి. ప్రానుపసుపు నాల్గురెట్లు మేకపాలలోవేసి కాచి వడియగట్టి మరల నాకషాయ మిగురువరకు కాచిన రసక్రియనే రసాంజనమునకు మారుగ చిరకాలమునుండి వాడుచున్నారు.

ఆయుర్వేదప్రకాశమునందు:—

"స్రోతోంజనంతు ద్వివిధం శ్వేతకృష్ణ విభేదతః ।
తత్ర స్రోతోంజనం కృష్ణం సౌవీరం శ్వేతమీరితః"



అని స్రోతోంజనము ఒకటియే శ్వేతకృష్ణభేదముచే రెండుతెరంగులై నల్లనిది స్రోతోంజన మనియు తెల్లనిది సౌవీరాంజనమనియు జెప్పబడునని వ్రాయబడెను. మరియు,

"స్రోత స్సౌవీరయో స్సత్త్వం గృహ్ణీయా త్కుశలో భిషక్
మనశ్శిలాసత్త్వవచ్చ తన్నేత్ర్యం పరమం మతం॥"

స్రోతోంజన సౌవీరాంజనములనుండి మణిశిలనుండివలె సత్వమును గ్రహించవలెననియు నవి నేత్రములకు మిగుల హితకరమనియు సత్త్వపాతనము వ్రాయబడినది.

రాజనిఘంటువునందు:—పై రెండుగ్రంథములకన్న విశేషముగ కులుత్థాంజనమనునది ఆరవది వ్రాయబడెను. ("చిమడ్" అని హిందీభాషయందు ను "చాక్సూ" అని ఆంగ్లభాషయందును వ్యవహరించు అడవియులవలను పైపొట్టుదీసి చూర్ణించి వస్త్రగాలితము గావించిన నదియె కులుత్థాంజనమవును. దీనిని శిశువులకు నేత్ర రోగములందు వాడవలెను.)

## కంకుష్ఠము

మూ. హిమవత్పాదశిఖరే కంకుష్ఠ ముపజాయతే
తత్రైకం నాళికాఖ్యం హి తదన్య ద్రేణుకం మతం
పీతప్రభం గురు స్నిగ్ధం శ్రేష్ఠం కంకుష్ఠ మాదిమం
శ్యామపీతం లఘు త్యక్తసత్త్వం నేష్టం హి రేణుకం
కేచి ద్వదంతి కంకుష్ఠం సద్యోజాతస్య దంతినః॥
వర్చశ్చ శ్యామపీతాభం రేచనం పరికథ్యతే
కతిచి త్తేజివాహానాం నాళం కుంకుష్ఠ సంజ్ఞికం
వదంతి శ్వేతపీతాభం త దతీవ విరేచనం
రసే రసాయనే శ్రేష్ఠం నిస్సత్త్వం బహువైకృతం
కంకుష్ఠం తిక్తకటుకం వీర్యోష్ణం చాతిరేచనం
వ్రణోదావర్తశూలార్తి గుల్మప్లీహగుదార్తినుత్॥
సూర్యావర్తక కదలీ వంధ్యా కర్కోటకీచ సురనాళీ
శిగ్రుశ్చ వజ్రికందో నీరకణాం కాకమాచీచ
ఆసామేక రసేనతు లవణక్షారామ్ల భావితా బహుశః
శుధ్యంతి రసోపరసా ధ్మాతా ముంచంతి సత్వాని॥

కంకుష్ఠం శుద్ధి మాప్నోతి త్రిధాశుంఠ్యంబు భావితం
సత్త్వాకర్షోస్య నప్రోక్తో యస్మాత్సత్వమయం హి తత్
భజేదేనం విరేకార్థే గ్రాహిభి ర్యవమాత్రయా
నాశయే దామజార్తించ విరేచ్య క్షణమాత్రతః
భక్షితే స్నుహితాంబూలై ర్విరిచ్యాసూన్వినాశయేత్
బర్బురీ మూలికాక్వాథో జీరసౌభాగ్యకం సమం
కంకుష్ఠవిషనాశాయ భూయోభూయః పిబేన్నరః॥

**తా.** హిమవత్పర్వతశిఖరమున కంకుష్ఠము పుట్టును. అది నాళికము, రేణుకము అనిరెండువిధములు. నాళికము పచ్చగను బరువుగను స్నిగ్ధముగను ఉండును. ఇదిశ్రేష్ఠము. రేణుకము శ్యామపీతవర్ణములు గలిగి సత్త్వరహితమై యుపయోగార్హముగా నుండదు.

కొందరు అప్పుడు పుట్టిన యేనుగుపిల్ల రేణము (మలము)ను కంకుష్ఠమని వ్యవహరింతురు, ఇది శ్యామపీతవర్ణములు గలది. విరేచనకరము. మరికొందరు గుర్రపు నాళమును కంకుష్ఠమందురు. ఇది తెల్లగ పచ్చగనుండి గాఢవిరేచనము చేయును. రసరసాయనములందు శ్రేష్ఠముగ పనిచేయును. సత్త్వరూపమై యుండును.

**గుణము:**—కంకుష్ఠము చేదు, కారము గలిగి ఉష్ణవీర్యమై గాఢవిరేచనకారియై వ్రణ ఉదావర్త శూల గుల్మ ప్లీహ గుదరోగములను బోగొట్టునదై యుండును.

**సత్వము:**—దూర్వావర్తము, అరటిదుంప, పోతుకాకరగడ్డ, దేవదాళి, మునగచెక్క, అడవికంద, నీరుపిప్పలి, కామంచి వీనిలో దేనిరసముందైనను లవణవర్గమును, క్షారవర్గమును, ఆమ్లవర్గమును చేర్చి రసములను, ఉపరసములను పలుమారు భావనచేసినయెడల శుద్ధములగును. పిదప కొలిమిలోనుంచి యూదినచో సత్త్వమును విడచును.

**శుద్ధి:**—కంకుష్ఠము మూడుసారులు శొంఠికషాయముతో భావనచేసినయెడల శుద్ధమగును. ఇది కేవలము సత్త్వస్వరూపమగుటచే దీనికి సత్త్వపాతనప్రకారము చెప్పబడలేదు.

దీనిని యవప్రమాణముగ సేవించినచో క్షణమాత్రమున విరేచనముచేసి ఆమదోషమును నివర్తింపచేయును, కంకుష్ఠమును తాంబూలముతో కలిపి సేవించినయెడల తత్క్షణమే గాఢవిరేచనముచేసి చంపును. దీనివికారము శాంతించుటకై తుమ్మవేరుచెక్క కషాయమందు జీలకర్ర, పొంగించిన వెలిగారము చేర్చి తరుచుగ త్రాగుచుండవలెను.



### —♦ సాధారణరసములు ♦—

మూ. కంపిల్లశ్చాపరో గౌరీపాషాణో నవసాగరః।
కపర్దో వహ్నిజారశ్చ గిరిసిందూర హింగులౌ।
మృద్దారశృంగమిత్యష్టౌ సాధారణ రసాస్స్మృతాః॥
రససిద్ధికరాః ప్రోక్తా నాగార్జునపురస్సరైః।

తా. కంపిల్లము, గౌరీపాషాణము, నవాసాగరము, కపర్దము (గవ్వ), అగ్నిజారము, గిరిసిందూరము, ఇంగ్లీకము, మృద్దారుశృంగి అను నీయెనిమిదియు సాధారణ రసము లనబడును. నాగార్జునాదిరసతంత్రకర్తలు వీనిని రససిద్ధికరములని వచించిరి.

### —♦ కంపిల్లము ♦—

మూ. ఇష్టికాచూర్ణ సంకాశ శ్చంద్రికాఢ్యోతిరేచనః।
సౌరాష్ట్రదేశే చోత్పన్నో సహి కంపిల్లకస్స్మృతః।
పిత్తవ్రణాధ్మాన విబంధహారీ శ్లేష్మోదరార్తి క్రిమిగుల్మహారీ॥
మూలామశోఫజ్వరశూలహారీ కంపిల్లకో రేచగదాపహారీ॥

తా. ఇటుకపొడివలె నెఱ్ఱనై తళుకులు గలిగి రేచకమైన కంపిల్లకము సౌరాష్ట్రదేశమున గనులలో దొరకును. ఇది పిత్తరోగములను వ్రణ ఆధ్మాన మలబంధములను శ్లేష్మములను ఉదరరోగమును కృములను గుల్మమును మూలరోగమును ఆమదోషమును శోఫను జ్వరమును శూలను హరించును.

(కరక్కాయకషాయముతో డోలాయంత్రమున స్వేదనముచేసిన శుద్ధమగునని బసవరాజీయమునుండియు, నిమ్మపండ్లరసమున భావనచేసిన శుద్ధమగును అని రసప్రదీపికనుండియు కంపిల్లకశుద్ధులు గ్రహింపనగును.)

### —♦ గౌరీపాషాణము ♦—

మూ. గౌరీపాషాణకః పీతో వికటో హతచూర్ణకః।
స్ఫటికాభశ్చ శంఖాభో హారిద్రాభ స్త్రయస్స్మృతాః।
పూర్వపూర్వో గుణై శ్శ్రేష్ఠః కారవల్లీఫలే క్షిపేత్।
స్వేదయే ద్దండికామధ్యే శుద్ధో భవతి మూషకః॥
తాళవద్ద్రాహయే త్సత్త్వం శుద్ధం శుభ్రం ప్రయోజయేత్
రసబంధకర స్స్నిగ్ధో దోషఘ్నో రసవీర్యకృత్॥

తా. గౌరీపాషాణము పీతము, వికటము, హతచూర్ణకము అని మూడువిధములు. అందు పీతము పచ్చగను తక్కినవి తెల్లగను ఉండును. ఇందు మొదటిదానికన్న రెండవదియు దానికన్న మూడవదియు నుత్తమము.

పాషాణము కాకరకాయలోపెట్టి స్వేదనముచేసిన శుద్ధమగును. గౌరీపాషాణమునుండి తాళకమున చెప్పినప్రకారము సత్త్వము తీయవలెను. దానిని సర్వరోగములందును వాడనగును. ఇది రసబంధము చేయును. స్నిగ్ధగుణముకలది. రసదోషహరము. రసవీర్యజనకము.

ఆయుర్వేదప్రకాశము:—

"గౌరీ పాషాణకః ప్రోక్తో ద్వివిధ శ్వేతపీతకః
శ్వేత శ్శంఖ సదృక్షీతో నాడిమాభః ప్రకీర్తితః।
శ్వేతః కృత్రిమకః ప్రోక్తః పీతః పర్వతసంభవః॥"

(తా. అనిచెప్పియున్నదిగాన గౌరీపాషాణము తెలుపు పసుపు రంగులభేదముచే రెండువిధములనియు, అందు పచ్చనిది సైజమనియు, తెల్లనిది కృత్రిమమనియు మతాంతరము తెలియదగియున్నది.) మరియు శంఖపాషాణము ఉల్లిపాషాణము దొడ్డిపాషాణము సవీరము మొదలగు నామభేదముచేత కృత్రిమపాషాణములు 64 అని అగస్త్యసంప్రదాయ గ్రంథములలో నగపడుచున్నది.

శంఖపాషాణము:— హేమవిద్యోపయోగము:

శుద్ధపాదరసమును నీళ్లలోవేసి కొంచెముకొంచెముగ మైలతుత్థచూర్ణమును వేయుచు నుడకబెట్టి, పిదప గుడ్డలోవేసి పిండి ఖల్వములోనుంచి బాగుగా మర్దించినయెడల రసమందలి తుత్థమలినము బైటకువెడలును. దానిని తీసి సైచి రసమును ఉండవలెజేసి ఒకదినము కాంజికములోగాని నిమ్మకాయ రసములోగాని యుంచినచో రసము గట్టిపడును. పిదప ఆరసగుళికతో సమానపరిమాణముగల శంఖపాషాణమునుచేర్చి మర్దించినయెడల రెండును లీనమైచూర్ణమగును. పిదప తెల్లజిల్లేడుపాలతో వానినినూరి యుండజేసి గుడ్డజుట్టి మన్నుబూసి యాగోళమును వాలుకాయంత్రమందుంచి గాఢాగ్నితో నాల్గుజాములు వండినయెడల శంఖపాషాణరసములయొక్క గోళము భస్మమగును. ఆభస్మమును భద్రపరచుకొని ఒకతులము రాగికరిగించి అందు గుంజాప్రమాణభస్మమును వేసినయెడల రాగి హేమించును. (వాదమంజరి)

గౌరీపాషాణము:—రజతవిద్యోపయోగము:

గౌరీపాషాణమును చూర్ణించి యొక మూసములోనుంచి కొంచెముకొంచెముగ



అడవిపందిచమురును పోయుచు దీపాగ్నిచే పక్వముచేయునెడల కొంతసేపటికి పాషాణము మైనమువలెనుండును. దానిని గ్రహించి, ఒకతులము తగరముకరిగించి యందు గౌరీపాషాణమైనమును రెండుగుంజలెత్తు వేసినచో రజతమగును.

శంఖపాషాణముకట్టు:—

ఒకతులము శంఖపాషాణమును నాల్గుతులముల మిరియాలలోనుంచి ఒకశేరు అనగా 25 తులముల సున్నపునీరును చురకా యిచ్చినయెడల శంఖము అగ్నియందుంచినను యెగిరిపోక నిలచియుండును. ఇట్లే సవీరమును గూడ కట్టవచ్చును.

—♦ నవాసాగరము ♦—

మూ. కరీరపీలు కాష్ఠేషు పచ్యమానేషు చోద్భవః
క్షారోసౌ నవసారస్స్యా చ్చూలికా లవణాభిధ
ఇష్టికా దహనేజాతం పాండురం లవణం లఘు
తదుక్తం నవసారాఖ్యం చూలికాలవణంచ తత్॥
రసేంద్రజారణం లోహద్రావణం జఠరాగ్నికృత్
గుల్మప్లీహాస్యశోషఘ్నం భుక్తమాంసాదిజారణం
బిడాఖ్యంచ త్రిదోషఘ్నం చూలికాలవణం మతం॥

తా॥ వరగోగుచెక్కను కాల్చి బూడిదచేసి ఆబూడిదను క్షారపరిభాష ననుసరించి యేడుసారులు వండినయెడల నవసాగరము సిద్ధమగును. ఇటుకవామిని తగులబెట్టునపుడు పుట్టు తెల్లనైన లవణమును గూడ నవాసాగరమందురు. దీనికి చూలికాలవణమనియు విడలవణమనియు పేరు. లోహద్రావణమందును రసజారణమందును ఉపయోగించును. జఠరదీప్తి నిచ్చును. మాంసాద్యాహారములను సులభముగ జీర్ణింపచేయును. త్రిదోషములను గుల్మప్లీహముఖశోషరోగములను నశింపచేయును.

నవాసారభస్మము:— హేమవిద్యోపయోగము:

కాల్చిన సున్నపురాళ్లను, సముద్రలవణమును, సమభాగములుగా గ్రహించి చూర్ణించి యాచూర్ణమును ఒకపిడతలో సగమువరకుపోసి దానిపై నవాసాగరపుముక్కను పెట్టి తక్కినసగముకూడ పైచూర్ణముతో నింపి అందు తెల్లగలిజేరు స్వరసమును పోసి వెంటనే మూకుడు మూసి చీరజేసి యెండించి గజపుటమువేయవలెను. స్వాంగశీతలమున దీసినచో నవాసాగరము కట్టును (అనగా అగ్నిసహముగ నుండును). అట్టి నవాసారపుముక్కను మూకుడులోనుంచి పొయ్యిమీదబెట్టి మందాగ్నిచే మంటబెట్టు

చు వంగజయనీరును చురకా యివ్వవలెను. ఇట్లు చురకాయిచ్చినపిదప పైడిప్రత్తికాయలరసముతో నొకదినమును పైడిప్రత్తిపూలరసముతో నొకదినమును మర్దించి బిళ్లచేసి శరావసంపుటమం దిడి చీరజేసి ఏబది యేరుపిడకలతో పుటము వేసిన యెడల నవాసారము భస్మమగును. పిదప ఒకతులమురాగిని కరిగించి యవప్రమాణము పైభస్మమును ప్రతీవాపము చేసినచో రాగి హేమించును.

వంగజయనీరును చురకాయివ్వకయే భస్మముగావించినచో నయ్యది అర్ధయవప్రమాణముగ యుక్తానుపానములతో మూడు లేక అయిదు లేక తొమ్మిదిదినములు సేవించినచో ఉదరములు, గుల్మములు, శూలలు, పాండువు మొదలగురోగములు నిర్మూలములగును. మూత్రాఘాతము, మూత్రకృచ్ఛ్రము, అశ్మరి మొదలగువానియందు అమోఘమైన గుణము నిచ్చును. సెగరోగములందిది మిగుల నుపయుక్తముగ బనిచేయును. ఇది పరమరహస్యమైన సిద్ధయోగము.

వంగజయనీరు చేయుపద్ధతి:—శుద్ధవంగమును మూకుడు వేసి కరిగించి కొంచెము కొంచెముగ సురాక్షారము వేయుచు మర్దించినయెడల వంగము భస్మమగును. దానిని వస్త్రగాలితము చేసి కాచపాత్రలోనుంచి మంచులో బెట్టినయెడల నది ద్రవించును. అదియె వంగజయనీరని తెలియవలెను.

మరియు నీనవాసారము వాదప్రక్రియయందు బహువిధములుగ నుపయోగపడును. ఆవిధానములన్నియు "వాదమంజరి" యను గ్రంథమున జక్కగ వ్రాయబడియున్నవి. గ్రంథవిస్తరభీతిచే నిచట వ్రాయబడలేదు.

నవాసాగరభస్మము:—

నవాసాగరము తు 3 లు, సూరాకారం తు ౧ లు, మూడుకోడిగుడ్లలోని సొన, సొనకు సమం ఆముదం, వీనినన్నిటిని యొకపిడతలో పోసి పైన మూకుడుమూసి చీరజేసి గజపుటము వేసిన భస్మమగును. దీనిని నిమ్మపండ్లరసముతో ఒక చిన్నం మొదలు మూడుచిన్నములవరకు వాడవచ్చును. సమస్తశూలలు నివర్తించును.

(వాదమంజరి.)

—♦ కపర్దము ♦—

మూ. పీతాభాగ్రంథిలా పృష్ఠే దీర్ఘవృత్తా వరాటికా
రసవైద్యై ర్వినిర్దిష్టా సా చరాచరసంజ్ఞికా
సార్ధనిష్కభరా శ్రేష్ఠా నిష్కభారాచ మధ్యమా



పాదోన నిష్కభారాచ కనిష్ఠా పరికీర్తితా
పరిణామాది శూలఘ్నీ గ్రహణీ క్షయనాశనీ
కటూష్ణా దీపనీ వృష్యా నేత్ర్యా వాతకఫాపహా
రసేంద్రజారణే శస్తా విడద్రవ్యేషు శస్యతే
తదన్యేతు వరాటాస్స్యుః గురవ శ్లేష్మ పిత్తలాః
వరాటాః కాంజికేస్విన్నాః యామచ్ఛుద్ధి మవాప్నుయుః॥

తా. పచ్చగను గ్రంథులుగలదిగను పొడవైన తోకకలదిగను ఉండుగవ్వ ఔషధములం దుపయోగింపదగినది. దీనిని రసవైద్యులు చరాచరవస్తువుగ పరిగణించిరి. ఇది తొమ్మిదిచిన్నముల యెత్తుగలది, శ్రేష్ఠమును. ఆరుచిన్నముల యెత్తుగలది మధ్యమము. నాలుగున్నరచిన్నముల యెత్తుగలది అధమము.

గుణము:—గవ్వ పరిణామాదిశూలలను గ్రహణిని క్షయను హరించును. కారము ఉష్ణముగలది. అగ్నిదీప్తిని వీర్యవృద్ధిని గలిగించును. నేత్రరోగములను వాతకఫములను హరించును. రసజారణమం దుపయోగించును. విడద్రవ్యములలో ప్రశస్తమైనది. పైజెప్పిన లక్షణములులేని గవ్వలు గురుగుణములుగలవై పిత్తమును గల్గించును. వరాటములను ఒకజాము కాంజికముతో స్వేదనముచేసిన శుద్ధములగును

—♦ అగ్నిజారము ♦—

మూ. సముద్రేణాగ్నినక్రస్య జరాయు ర్బహిరుజ్ఝితః
సంశుష్కో భానుతాపేన సోఽగ్నిజార ఇతిస్మృతః
అగ్నిజార స్త్రిదోషఘ్నో ధనుర్వాతాది వాతనుత్॥
వర్ధనో రసవీర్యస్య దీపనో జారణ స్తథా
త దబ్ధిక్షార సంశుద్ధం తస్మాచ్ఛుద్ధిం నహాప్యతే॥

తా. సముద్రమునందు జరించు అగ్నినక్రంబను మొసలియొక్క మావి (గర్భమందుండు జంతువు నావరించియుండు పొరవంటి యొకవిధమగు జరాయువను పేరుగల చర్మము) తహ జంతువులచే విసువబడి సముద్రతరంగములచే యొడ్డునకు కొట్టబడి గట్టిపడిపోవును. దీనిని అగ్నిజారమందురు.

అగ్నిజారము త్రిదోషములను ధనుర్వాతము మొదలగు వాతరోగములను పోగొట్టును. మరియు నిది రసజారణరంజనసంస్కారములం దుపయోగించును. సముద్రమందు ఉప్పునీటిసంపర్క మధికముగావున దీనికి శుద్ధి అనవసరము. దీనినే "అంబరు" అని కొందరందురు.

## సిందూరము

మూ. మహాగిరిషు చాల్పీయః పాషాణాంతస్థితో రసః
శుష్కశోణ స్స నిర్దిష్టో గిరిసిందూరసంజ్ఞయా
త్రిదోషశమనం భేది రసబంధన మగ్రిమం
దేహలోహకరం నేత్ర్యం గిరిసిందూర మీరితం॥

తా. గొప్పపర్వతమందు రాళ్ళలో స్వల్పముగా యెఱ్ఱనిసిందూరము పుట్టి యెండిపోవును. దీనిని గిరిసిందూరమందురు. ఇది త్రిదోషములను శమింపచేయును. మల బంధమును విప్పును. రసమును బంధించును. నేత్రరోగముల బోగొట్టును. శరీరమును లోహతుల్యముగ జేయును.

## ఇంగిలీకము

మూ. హింగుళ శ్శుకతుండాఖ్యః హంసపాక స్తథాపరః
ప్రథమోల్పగుణ స్తత్ర చర్మార స్స నిగద్యతే
శ్వేతరేఖః ప్రవాళాభః హంసపాక స్స కీర్తితః
హింగుళ స్సర్వదోషఘ్నో దీపనోతిరసాయనః
సర్వరోగహరో వృష్యో జారణాయాతి శస్యతే
ఏతస్మా దాహృత స్సూతః జీర్ణగంధసమో గుణైః
సప్తకృత్వార్ద్రక ద్రావై ర్లకుచస్యాంబు నాథవా
శోషితో భావయిత్వాథ నిర్దోషో జాయతే ఖలు
క్రిమత్ర చిత్రం దరద స్సుభావితః క్షీరేణ మేష్యా బహుశోమ్లవర్గైః॥
ఏవంసువర్ణం బహుఘర్మణాపితం కరోతి సాక్షాద్వరకుంకుమప్రభం॥
దరదః పాతనా యంత్రే పాతితశ్చ జలాశ్రయే
తత్సత్వం సూతసంకాశం జాయతే నాత్రసంశయః॥

తా. శుకతుండమనియు, హంసపాకమనియు ఇంగిలీకము రెండువిధములు. అందు శుకతుండము అల్పగుణముగలది. దీనికి చర్మారమనియు నామాంతరము. తెల్లనిరేఖలు గలిగి చిగురుటాకురంగు గలిగియుండునది హంసపాకము.

గుణము:—ఇంగిలీకము సర్వదోషములను హరించును. దీపనముచేయును. వలీపలిత ములను పోగొట్టును. వీర్యవృద్ధినిచ్చును. జారణమునను మిగుల నుపయు క్తము. దీనినుండి క్రమప్రకారము గ్రహింపబడిన పారదము జీర్ణగంధక మైన రసముతో సమానమైన గుణముకలదిగ నుండును.



శుద్ధి:—అల్లపురసమునగాని నిమ్మపండ్లరసమునగాని యేడుమారులు భావనచేసి యెం డించినచో యింగిలీకము శుద్ధమగును. మేకపాలతోను ఆమ్లవర్గముతోను పలు సారులు భావనచేసి గాఢమైన యెండలో నెండించినచో నింగిలీకము కుంకు మవంటి చక్కనిరంగుగలదై యుండును.

ఇంగిలీకమును పాతనాయంత్రమున క్రమప్రకారముగ వండినయెడల అందుండి రసరూపమైన సత్వము వెడలును.

ఇంగిలీకము:—హేమవిద్యోపయోగము:

ఇంగిలీకము, రసకర్పూరము, తాళకము, సమభాగములుగ ఈమూటిని నల్లమద్దిచె క్కస్వరసముతో నెనిమిదిజాములు మర్దించి బిళ్ళచేసి యెండించి శరావసంపుటమందిడి దృఢముగ సంధిబంధముగావించి పుటము వేసినయెడల భస్మమగును. వెండికరిగించి యం దు పైభస్మమును తులమునకు గుంజచొప్పున ప్రతీవాపము చేసినచో వెండి హేమించును. ఇట్లే ఒక తులము వంగమందు ప్రతీవాపము చేసినచో రజతమగును.

ఇంగిలీకమును అగ్నిసహముగ జేయు (కట్టు)ట, భస్మము చేయుట, మైనముగ జేయుట మొదలగు విషయములును వానికి హేమవిద్యయందును తారవిద్యయందును ఉపయోగములును 'వాదమంజరి' యను గ్రంథమున వ్రాయబడియున్నవి. గ్రంథవిస్తర మగునని యిచట వ్రాయబడలేదు.

రసపద్ధతిగ్రంథమందు:—హింగుళోత్పత్తి క్రమ మీక్రిందివిధమున వర్ణింపబడెను.

అశుద్ధపారదంభాగం చతుర్భాగం చ గంధకం
ఉభౌ క్షిప్త్వా లోహపాత్రే క్షణం మృద్వగ్నినాపచేత్
తస్మిన్ మనశ్శిలాచూర్ణం పారదాద్దశమాంశకం
క్షిప్త్వాచుల్ల్యా మయోదర్వ్యా హ్యవతార్యం సుశీతలం
తతస్తు ఖండశఃకృత్వా కాచకుప్యాం నిరుధ్యచ
వస్త్రమృత్తికయా సమ్యక్కాచకూపీం ప్రలేపయేత్
సర్వతోంగుళమానేన ఛాయాశుష్కాంచ కారయేత్
వాలుకాయంత్రగర్భేతు దినం మృద్వగ్నినాపచేత్॥
క్రమవృద్ధాగ్నినా పశ్చాత్పచే ద్దివసపంచకం
సప్తాహాత్తు సముద్ధృత్య హింగుళ స్స్యాన్మనోహరః॥"

(అశుద్ధరసమొకభాగము, గంధకము నాల్గుభాగములు, రెండును కలిపి లోహ పాత్రలోబోసి యొక క్షణకాలము వండి, యందు రసమునకు పదియవవంతు మణిశిల చూర్ణమును వైచి లోహదండముతో కలిపి స్వాంగశీతలమైన వెనుక ముక్కలుగా కొట్టి, అంగుళము మందముగ కవచము చేయబడిన కాచకుప్పెలోబోసి వాలుకాయంత్ర మునందుంచి యొకదినము మృద్వగ్నిచేత పాకము జేసి పిదప క్రమముగ వృద్ధిచేయుచు మరల అయిదుదినములు వండి యేడవదినమున దించి స్వాంగశీతలమున సిద్ధమైన హింగుళమును గ్రహించవలెను.)

ఇంగిలీకప్రకట్టు :—వాదమంజరియందు :—

"తామ్రచూర్ణంచ తాళంచ సమంధత్తూరజై ర్ద్రవైః
తథా సారీరసైశ్చాపి లింపేత్సంమర్ద్య హింగుళం
కాక్కుటేతు పుటేదగ్ధః బద్ధో నిర్ధూమతాం వ్రజేత్॥"

(తామ్రపురజను, తాళకము సమముగా గ్రహించి నల్లఉమ్మెత్తాకు రసముతోను సంబరేణురసముతోను మర్దించి ఇంగిలీకపు ముక్కకు కవచము యిచ్చి, యెండించి కుక్కుటపుటము వేసినచో కట్టి నిప్పుపై వేసినను పొగ లేకయుండును.)

వాదమంజరియందు :—ఇంగిలీకప్రకట్టు.

"కర్షత్రయంతు దరదస్య నివేశ్య పత్రే వ్యోమ్నా ఘనచ్ఛదసుమైరథ కమాచ్చా
ప్రత్యేక తద్దశగుణై రితి పాకసిద్ధ స్సిద్ధిందదాతి దరదః ఖలుబంధమేతి ॥

(మూడుతులములయెత్తు ఇంగిలీకమును శ్వేతాభ్రకపురేకునందుంచి నిప్పులపైబెట్టి 30 తులముల మునగపూరసముతోడను 30 తులముల కామంచియాకు రసముతోను చురకాయిచ్చినయెడల ఇంగిలీకము కట్టును. ఇది సకలసిద్ధుల నొసంగును. (దీనిని శ్వాసకాసలందు బహుళముగ వాడుక చేయవచ్చును.)

—♦ మృద్దారు శృంగము ♦—

మూ. సదళం పీతవర్ణంచ భవే ద్ఘూర్జరమండలే
అర్బుదస్య గిరేః పార్శ్వేజాతం మృద్దారు శృంగకం
సీససత్త్వం గురుశ్లేష్మ శమనం పుంగదాపహం
రసబంధన ముత్కృష్టం కేశరంజన ముత్తమం
సాధారణరసా స్సర్వే మాతులుంగార్ద్రకాంబునా
త్రిరాత్రిం భావితా శ్శుష్కాభవేయు ర్దోషవర్జితాః
యానికానిచ సత్త్వాని తానిశుధ్యం త్యశేషతః
ధ్మాతాని శుద్ధివర్గేణ మిలంతిచ పరస్పరం॥

తా॥ ఘూర్జరదేశమందును అర్బుదపర్వతపార్శ్వములందును మృద్దారుశృంగి పుట్టును. ఇది పచ్చనిరేకుల గలిగి బరువుగనుండును. సీససత్త్వముగలది. శ్లేష్మరోగములను నపుంసకత్వమును పోగొట్టును. రసబంధనమున కత్యావశ్యకమైనది. వెంట్రుకలను నలుపెక్కించును. మృద్దారుశృంగి మొదలైన యీ సాధారణ రసములన్నియు అల్లపు రసమందు, మాదీఫలరసమందు మూడు దినములు భావన చేసిన పరిశుద్ధములగును. ఏసత్త్వములైనను శుద్ధివర్గముతో చేర్చి నిప్పులలో బెట్టి యూదినచో శుద్ధములై అన్యోన్యము కలిసికొనును. (ఈద్వంద్వమేలాపనక్రియలు లనేకములుగ నున్నవి. గ్రంథవిస్తరభీతిచే నిచట వ్రాయబడలేదు.)

మహారస ఉపరస సాధారణ రసములయొక్క వివరణము పూర్వోక్తద్వితీయ తృతీయాధ్యాయములందు వర్ణింపబడినది. దీనివిషయమైన వరుసవిభాగము మొదలైన వాట్ల వివరణము రసతంత్రములందు భేదము లగపడుచున్నవి. ఎట్లన:



రసార్ణవమున:—"మాక్షికో విమల శ్శైలః చపలో రసకస్తథా। సస్యకో దరదశ్చైవ స్రోతోంజనమథాష్టమం॥ అష్టౌమహారసాశ్చైవ మేతాః పరిధమతశ్శృణు॥ ఏవంమహారసాః ప్రోక్తాః శ్రుణుష్వోపరసా న్ప్రియే॥ గంధకస్తాళక శ్శైల స్సౌరాష్ట్రీ ఖగ గైరికం। రాజావర్తశ్చ కంకుష్ఠ మష్టా వుపరసా స్స్మృతాః। అభ్రకం కాంతపాషాణం వజ్రం వైక్రాంతకం ప్రియే॥"

అని మాక్షికము, విమలము, శిలాజతు, చపలము, రసకము, తుత్థము, దరదము, స్రోతోంజనము అను నెన్మిదిమహారసములనియు గంధకము, తాళకము, మణిశిల, కాంక్షి, అన్నభేది, గైరికము, రాజావర్తము, కంకుష్ఠము అను నెన్మిదియుపరసములనియు అభ్రకము, అయస్కాంతము, వజ్రము, వైక్రాంతము అను నీనాలుగు శక్తిరసములనియు చెప్పంబడినది.

శివతత్త్వరత్నాకరము:—"భూనాగ ఘనవైక్రాంత విమలాతాప్యతుత్థకాః। ఖర్పరీరాజావర్తశ్చ ఖ్యాతా అష్టౌమహారసాః। గంధకంకుష్ఠ కాసీస శిలాకాంక్షీ వరాటికాః। గైరికస్తాళకశ్చాష్టౌ ఉపపూర్వారసా అమీ॥ గిరిసిందూరబోదారుశృంగీగౌరీ శిలాంజనం। కంపిల్లశ్చపలః ప్రోక్తా స్సాధారణరసా ఇమే॥ హింగుళం సస్యకంచైవ శిలాజత్వగ్నిజారకః। ఏతేశక్తిరసాః ప్రోక్తాశ్చత్వారః"

అనిభూనాగము, అభ్రకము, వైక్రాంతము, విమలము, తాప్యము, తుత్థము, కఫరి, రాజావర్తము అను నెన్మిది మహారసములనియు, గంధకము, కంకుష్ఠము కాసీసము, మణిశిల, కాంక్షి, వరాటిక, గైరికము, తాళకము అను నెనిమిదియుపరసములనియు గిరిసిందూరము, మృద్దారుశృంగి, గౌరీపాషాణము, శిలాజితు, అంజనము, కంపిల్లము, చపలము అనునవి సాధారణ రసములనియు ఇంగిలీకము, సస్యకము, శిలాజితు, అగ్నిజారము అను నాలుగు శక్తిరసములనియు చెప్పబడినది.

ఆనందకందము:—"గంధతాళ శిలాతాప్య ఘనహింగుళ గైరికాః। చపలాశ్మజయానాగ హరితాళాగ్నిజారకాః॥ ఖర్పరీ తుత్థ కంకుష్ఠ గిరిసిందూరటంకణాః। కంపిల్ల విషకాసీస గౌరీపాషాణ భూఖగాః॥ బోదారుశృంగ సిందూర స్తువరీశ్చరసాంజనం। నీలాంజనంచ సౌవీరం స్రోతోంజన మఫేనకం। పుష్పాంజనం శంఖశుక్తి శంబూకాశ్చవరాటకాః॥ సాంబ్రాణిచ నవక్షారం యవక్షారకుమారికా। సర్జగుగ్గులు లాక్షాశ్చ క్షారాశ్చ లవణానిచ। గోరోచనోమ్లవేతశ్చ కాచాభ్రఖగవాలుకాః॥ ఏతే ఉపరసాః ఖ్యాతాః రసరాజస్యకర్మణి॥"

అని పాదరసమును రసముగను తక్కిన పైజెప్పబడిన మహారసోపరస సాధారణ రసాదులను క్షారములను విషములను, లవణములను, గాజు, యిసుక మొదలగునవి

మున్నియు నుపరసములనియుం జెప్పబడినది.

ఆయుర్వేదప్రకాశమునందు:—మహారస ఉపరసములనే చెప్పి సాధారణ రసముల జెప్పక విడువబడెను.

భావప్రకాశికయందు:—"గంధో హింగుళ మభ్రతాళక శిలా స్రోతోంజనం టంకణం। రాజావర్తక చుంబకౌచ స్ఫటికాః శంఖః ఖటీ గైరికం। కాసీసం రసకం కపర్దసికతా బోలాశ్చ కంకుష్ఠకం। సౌరాష్ట్రీచ మతా అమీ ఉపరసాస్సూతస్యకించిద్గుణైః॥ అని ఆనంద కందమందువలెనే పాదరసమును రసముగను గంధకాదులను ఉపరసములుగను చెప్పబడినది.

సావతారమునందు:—"హింగుళ తాప్య విమలాచల సస్యకాంత। వైక్రాంతపక్షిపతయశ్చ మహారసాస్స్యుః। సౌవీరగంధక శిలాల విరంగ ధాతు కాసీసకా శ్చ్యుపరసాః కథితా రసజ్ఞైః" అని చెప్పబడినది.

ఇట్లే రసతంత్రములయందు పరస్పరభేదము లగపడుచున్నవి. ఇట్టి భేదములు తత్తద్ద్రవ్యోపయోగములంబట్టి తత్తద్రస గ్రంధకర్తలు వ్రాసిరని తెలియవలెను.

## —◆ రాజావర్తము ◆—

మూ. రాజావర్తోల్ప రక్తోరు నీలికా మిశ్రితప్రభః
గురుశ్చ మసృణశ్శ్రేష్ఠ స్తదన్యో మధ్యమ స్స్మృతః
ప్రమేహక్షయ దుర్నామ పాండు శ్లేష్మానిలాపహః
దీపనః పాచనో వృష్యః రాజావర్తో రసాయనః
నింబూద్రవైస్సగోమూత్రైస్సక్షారైస్స్వేదితాః ఖలు
ద్వి త్రివారేణ శుద్ధ్యంతి రాజావర్తాది ధాతవః
శిరీష పుష్పార్ద్రరసై రాజావర్తం విశోధయేత్॥
లుంగాంబు గంధకోపేతో రాజావర్తస్సుచూర్ణితః॥
పుటనాత్సప్తవారేణ రాజావర్తో మృతో భవేత్।
రాజావర్తస్యచూర్ణంతు కునటీ ఘృతమిశ్రితం
విపచే దాయసే పాత్రే మాహిషీక్షీరసంయుతం
సౌభాగ్య పంచగవ్యేన పిండబద్ధంతు కారయేత్
ధ్మాపితం ఖాదిరాంగారైః సత్త్వంముంచతిశోభనం



అనేన క్రమయోగేన గైరికం విమలం భవేత్
క్రమాత్పీతంచ రక్తంచ సత్త్వం పతతి శోభనం॥

ఇతి శ్రీవాగ్భటాచార్యవిరచితే రసరత్నసముచ్చయే తృతీయోధ్యాయః

తా. రాజావర్తము కొంచెము యెరుపును అధికముగ నీలమును కలసినరంగుగలదై బరువై నున్నదై యున్నచో శ్రేష్ఠము. రాజావర్తమును సేవించినచో ప్రమేహము, క్షయ, దుర్నామరోగము, పాండువు, శ్లేష్మవ్యాధులు నశించును. దీపనపాచనములం జేయును. వీర్యవృద్ధి నిచ్చును, రసాయనము.

నిమ్మపండ్లరసమందును గోమూత్రమందును క్షారములందును రెండుమూడు సారులు స్వేదనము చేసినయెడల రాజావర్తము మొదలగు ధాతువులన్నియు శుద్ధములగును. మరియు దిరిసెనపూలరసమందును అల్లపురసమందును భావన స్వేదనముల జేసినను రాజావర్తము శుద్ధమగును.

శుద్ధిచేసినరాజావర్తముతో గంధకమును చేర్చి యేడుపుటములు వేసిన భస్మమగును.

శుద్ధరాజావర్తమును చూర్ణించి అందు మణిశిల, నేయిచేర్చి యినుపపాత్రిలో నుంచి గేదెపాలంబోసి పక్వముచేసి పిదప వెలిగారము చేర్చి పంచగవ్యముతో నూరి జారణ యంత్రమునసుంచి కొలిమిలోనుంచి యూదినయెడల రాజావర్తమునుండి సత్త్వము వెడలును.

ఈవిధముగ గైరికమునుండి పచ్చని సత్త్వమును విమలమునుండి యెర్రనిసత్త్వమును గ్రహింపవచ్చును.

శ్రీమత్కృష్ణా గోదావరీమధ్య విద్యోతమాన నూజవీడ్నగరీప్రభువర శ్రీమదుయ్యూరు
మేడూరు, నిడదవోలు ప్రముఖసంస్థానాధీశ్వర ఆంధ్రకవితాధురంధర పండితకవి
పోషక శ్రీ శ్రీ రాజా వెంకటాద్రిఅప్పారాయ ప్రభుపుంగవాస్థాన
పండిత భారద్వాజసగోత్రపవిత్ర వేంకటసుబ్బావధాని సత్పుత్ర
సకలపండితకవి సద్వైద్యవిధేయ సత్యనారాయణశాస్త్రి
నామధేయాంధ్రీకృత రసరత్నసముచ్చయమునందు
తృతీయాధ్యాయము సమాప్తము.
శ్రీశారదాంబార్పణమస్తు.

శ్రీరస్తు.

# రసరత్న సముచ్చయము

## చతుర్థాధ్యాయము

### —◆ రత్నములు ◆—

మూ॥ మణయోపిచ విజ్ఞేయా స్సూతబంధన కారకాః
వైక్రాంత స్సూర్యకాంతశ్చ హీరకం మౌక్తికం మణిః
చంద్రకాంత స్తథాచైవ రాజావర్తశ్చ సప్తమః
గరుడోద్గారకశ్చైవ జ్ఞాతవ్యా మణయ స్త్వమీ
పుష్పరాగం మహానీలం పద్మరాగం ప్రవాళకం
వైడూర్యంచ తథానీల మేతేపి మణయోమతాః
యత్నత స్సంగ్రహీతవ్యాః రసబంధస్య కారణాత్
పద్మరాగేంద్రనీలాఖ్యో తథా మారకతోత్తమః
పుష్పరాగ నవజ్రాఖ్యః పంచరత్న వరాస్మృతాః॥
మాణిక్య ముక్తాఫల విద్రుమాణి తార్క్ష్యంచపుష్పం భిదురంచ నీలం
గోమేదకం చాథ విదూరకంచ క్రమేణ రత్నాని నవగ్రహాణాం॥
గ్రహానుమైత్ర్యా కురువింద పుష్పప్రవాళ ముక్తాఫలతార్క్ష్యవజ్రం
నీలాఖ్య గోమేదవిదూరకంచక్రమేణ ముద్రాధృత మిష్టసిద్ధ్యై॥
రసే రసాయనే దానే ధారణే దేవతార్చనే
సులక్షణాని సుజాతీని రత్నాన్యుక్తాని సిద్ధయే॥

తా. మణులుకూడ సూతబంధనకారములై యున్నవి. వైక్రాంతము, సూర్యకాంతము, వజ్రము, ముత్యము, మాణిక్యము, చంద్రకాంతము, రాజావర్తము, గరుడపచ్చ ఇవియేమణు





లని యొక్కమతము. పుష్పరాగము, మహానీలము, పద్మరాగము, ప్రవాళము, వైడూర్యము, నీలము యివియేమణులని మరియొకమతము. పద్మరాగము, ఇంద్రనీలము, మరకతము, పుష్పరాగము, వజ్రము అను నీయైదుమాత్రమే మణులని వేరొకమతము. ఇవి రసబంధనకారులు గనుక ప్రయత్నపూర్వకముగ సంపాదించుకొనవలెను. (పద్మరాగము, ముత్యము, పగడము, పచ్చ, పుష్పరాగము వజ్రము, నీలము, వైడూర్యము, గోమేదకము అని రత్నములు తొమ్మిదియని ప్రసిద్ధము.)

ఇందు మాణిక్యము సూర్యునకును, ముత్యము చంద్రునకును, పగడము అంగారకునకును, పచ్చ బుధునకును, పుష్పరాగము గురునకును, వజ్రము శుక్రునకును, నీలము శనికిని గోమేదకము రాహువునకును, వైడూర్యము కేతువునకును, ప్రియములైనవి. సూర్యాది నవగ్రహములలో నన్యోన్యమైత్రి ననుసరించి నవరత్నములను వరుసగా కెంపు, పుష్పరాగము, ప్రవాళము, ముత్యము, పచ్చ, వజ్రము, నీలము, గోమేదకము, వైడూర్యము అనువానిని (బంగారులోగూర్చి) ఉంగరముచేయించి చేతధరించినయెడల యిష్టసిద్ధికలుగును. రసరసాయనములందును దానమునందును ధారణమునందును దేవతార్చనమునందును మంచిజాతిగలిగి దోషరహితములైన మణులనే జాగ్రత పరచి యుపయోగించవలెను.

### —◆ మాణిక్యము ◆—

మూ॥ మాణిక్యం పద్మరాగాఖ్యం ద్వితీయం నీలగంధిచ
కుశేశయ దళచ్ఛాయం స్వచ్ఛం స్నిగ్ధం గురుస్ఫుటం
వృత్తాయతం సమం గాత్రం మాణిక్యం శ్రేష్ఠముచ్యతే
నీలం గంగాంబుసంభూతం నీలగర్భారుణచ్ఛవి॥
పూర్వమాణిక్యవ చ్ఛ్రేష్ఠం మాణిక్యం నీలగంధి తత్
పంధ్రకారక్తశ్యా మాలిన్యా రౌక్ష్యా వైశద్యసంయుతం
చిపిటం లఘువక్త్రంచ మాణిక్యం దుష్ట మష్టధా॥
మాణిక్యం దీపనం వృష్యం కఫవాతక్షయార్తినుత్
భూత భేతాళ పాపఘ్నం కర్మజవ్యాధినాశనం॥

తా॥ పద్మరాగము, నీలగంధి యని మాణిక్యము రెండువిధములు. పద్మరాగము తామరరేకువంటి కాంతిగలిగి స్వచ్ఛమై స్నిగ్ధమై బరువై స్ఫుటముగనుండి గుండ్రముగను పెద్దదిగను హెచ్చుతగ్గులులేక సమముగను నున్నగను ఉన్నయెడల శ్రేష్ఠమైనది. నీలగంధియనునది నీలవర్ణముకలసిన యెరుపుకలదై యుండును. ఇది గంగాజలంబులలో బుట్టును. నీలగంధి పద్మరాగసమానగుణము కలది.

చిల్లులుగల్గి యుండుట, గరగరలాడుట, మాలిన్యము, పెళుసుదనము, వెలవెలపోవుట, మట్టుగలిగియుండుట, తేలికగను వంకరగను ఉండుట, అను యెనిమిదిదోషములును మాణిక్యమం దుండును. అట్టిమాణిక్యము కాదనిభావము.

మాణిక్యము అగ్నిదీప్తిని కల్గించును. కఫవాతములవలన బుట్టిన క్షయమున్నగు రోగముల నడంచును. భూషణముగ శరీరమున ధరించినచో భూతభేతాళాదిగ్రహపీడలును పాపములును తొలగును.

వైద్యచింతామణి:—మాణిక్యశోధనము – భస్మము.

"అశ్వమూత్రాంతరేభావ్యం త్రిదినం ప్రబలాతపే
తదుష్ణవారిణా క్షాళ్యం రత్నశుద్ధి ర్భవిష్యతి
తన్మాణిక్యం రవిక్షీరే దివసత్రియాభావితం
శరావే త్రిపుటం పాచ్యం భస్మీభవతి తిక్షణాత్॥"

(మాణిక్యమును గుర్రపు మూత్రమునందు ఒకరాత్రి నాననిచ్చి తీవ్రమైనయెండ నెండించవలెను. ఇట్లు మూడుదినములు చేసి వేడినీళ్ళతో కడిగినయెడల శుద్ధమగును. పిదప దానిని జిల్లేడుపాలతో మూడుదినములు భావనచేసి శరావసంపుటమం దిడి మూడుపుటములు పెట్టిన భస్మమగును.

## —♦ ముత్యము ♦—

మూ. హృదిశ్వేతం లఘుస్నిగ్ధం రశ్మివ న్నిర్మలం మహత్
ఖ్యాతం తోయంప్రభం వృత్తం మౌక్తికం నవధా శుభం
ముక్తాఫలం లఘుహిమం మధురంచ కాంతి దృష్ట్యగ్ని
పుష్టికరణం విషహారి భేది
వీర్యప్రదం జలనిధే ర్జనితాచ శుక్తి ర్దీప్తాచ పక్తిరుజ మాశు
హరే దపథ్యం॥

రూక్షాంగం నిర్జలం శ్యావం తామ్రాభం లవణోపమం
అర్ధశుభ్రంచ వికటం గ్రంథిలం మౌక్తికం త్యజేత్
కఫ పిత్తక్షయధ్వంసి కాసశ్వాసాగ్నిమాంద్యనుత్
పుష్టిదం వృష్యమాయుష్యం దాహఘ్నం మౌక్తికం మతం॥

తా. హృదయమందు తెల్లగనుండి తేలికగను నునుపును నిర్మలమైన కాంతిని గలిగి పెద్దదై గుండ్రనై నీరువంటి రంగుకలదై గంట్లు మొదలైనవిలేక స్ఫుటమైన ముత్యము శ్రేష్ఠము ఇట్లు తొమ్మిది విధములగు లక్షణములుగల ముత్యములను గ్రహింపవలెను.



ముత్యము లఘుగుణమును శీతవీర్యమును మధురవిపాకమును గలిగియుండును. కాంతిని దృష్టినైర్మల్యమును జఠరదీప్తిని కల్గించును. విషదోషమును హరించును. విరేచనముజేయును. వీర్యవృద్ధికరము. సముద్రమందుపుట్టు ముత్యముల కాశ్రయమైన శుక్తియు (ముత్యపుచిప్ప) అగ్నిదీప్తినిచ్చును. పార్శ్వశూలను హరించును. పెళుసుదనమును శ్యావవర్ణమును తామ్రవర్ణమును ఉప్పుయొక్కరంగును గలిగి నీరులేకయు అర్ధభాగమునందే స్వచ్ఛమై గొగ్గులు, ముడులుగలిగిన ముత్యము నింద్యమైనది. కనుక త్యజింపవలెను.

పరిశుద్ధమైన ముత్యమును సేవించినచో కఫ పిత్తములవలన బుట్టిన క్షయను, శ్వాసకాసలను, అగ్నిమాంద్యమును, దాహమును హరించి బలమును శుక్రమును ఆయువును పెంపొందించును.

వైద్యచింతామణి:—మౌక్తికశోధనము – భస్మము.

"మౌక్తికం శోధయే దమ్లైః కాంజికై ర్నింబుకద్రవైః
గోమూత్రై శోధయే త్పశ్చాత్ శోధయే త్పయసా తథా
కుంలీఫలజద్రావైః భావితం దివసత్రియం
అథవా తింతిడీద్రావైః శుద్ధిర్భవతి మౌక్తికం॥
శుద్ధముక్తాఫలం శ్వేతబృహతీఫలజై ర్ద్రవైః
భావితం భూపుటే పాచ్యం భస్మ శుద్ధం భవిష్యతి॥"

(తా॥ ముత్యములను అమ్లవర్గము, కాంజికము, గోమూత్రము, ఆవుపాలు అను వానిలో ప్రత్యేకముగ భావనచేసిన శుద్ధములగును. లేక తెల్ల యుప్పిపండ్లరసమందైనను చింతపండు రసమందైనను మూడుదినములు భావనచేసిన శుద్ధములగును. పిదప వానిని తెల్లములక పండ్లరసమున భావనచేసి శరావసంపుటమం దిడి భూపుటముబెట్టిన భస్మమగును.

## —♦ ప్రవాళము ♦—

మూ. పక్వబింబఫలచ్ఛాయం వృత్తాయత మవక్రకం
స్నిగ్ధ మవ్రణకం స్థూలం ప్రవాళం సప్తధా శుభం
పాండురం ధూసరం సూక్ష్మం సవ్రణం కండరాన్వితం
నిర్భారం శుభ్రవర్ణంచ ప్రవాళం నేష్యతేష్టధా
క్షయపిత్తాస్రకాసఘ్నం దీపనం పాచనం లఘు
విషభూతాది శమనం విద్రుమం నేత్రరోగనుత్॥

తా॥ దొండపండువంటిఛాయగల్గి గుండ్రనై పొడవుగనుండి వంకరలేక సన్న గను గొగ్గులు (పుచ్చులు) లేక స్థూలముగనుండు ప్రవాళము శ్రేష్ఠము. కాన నీయేడు లక్షణములుగల ప్రవాళమును గ్రహించునది.

పాండురధూసరవర్ణములు గలదిగను చిన్నదిగను పుచ్చినదిగను పొరలుగలదిగను తేలికనుగను తెల్లనిగను ఉండు ప్రవాళములు దుష్టములు. కాన నీయెనిమిది దుర్లక్షణము లు కనిపెట్టవలెను.

శుద్ధప్రవాళసేవచే క్షయపిత్తరక్తకాసలు, విషభూతాదివికారములు, నేత్రరోగములు నశించును. దీపనపాచనములు గలుగును.

వైద్యచింతామణి:— ప్రవాళశుద్ధి—భస్మము.

"జంబీరనీరాంతరేణ భావితం యామమాత్రకం
ఉష్ణోదకేక్షాళయిత్వా శుద్ధం భవతి విద్రుమం
తద్విద్రుమం రవిక్షీరైఃభావితం దివసత్రయాం
ఏవంగజపుటేపాచ్యం భస్మీభవతి తత్క్షణాత్॥"

(తా॥ పగడమును నిమ్మపండ్లరసములో నొకజాము నానబెట్టి వేడినీళ్లతో కడిగిన శుద్ధమగును. పిదప దానిని జిల్లేడుపాలతో మూడుదినములు భావనచేసి గజపుటము వేసిన భస్మమగును.)

—◆ గరుడపచ్చ ◆—

మూ. హరిద్వర్ణం గురుస్నిగ్ధం స్ఫురద్రశ్మిచయం శుభం
మసృణంభాసురం తార్క్ష్యం గాత్రం సప్తగుణం మతం
కపిలంకర్కశం నీలం పాండుకృష్ణ మలాఘవం
చిపిటం వికటం కృష్ణం రూక్షం తార్క్ష్యం న శస్యతే
జ్వరచ్ఛర్ది విషశ్వాస సన్నిపాతాగ్నిమాంద్యనుత్
దుర్నామ పాండుశోఫఘ్నం తార్క్ష్య మోజోవివర్ధనం॥

తా. ఆకుపచ్చరంగు, బరువు, స్నిగ్ధత, మంచికాంతి, నునుపు, మనోహరత్వము స్థూలము అనునీయేడు లక్షణములుగల పచ్చ శ్రేష్ఠము. కపిలవర్ణము (గోరోచనపురంగు), గరగరలాడుట, నీలవర్ణము, తెలుపు, నలుపు, తేలిక, అడుగు గట్టిగనుండుట, గొగ్గిగనుం డుట, పెళుసుదనము అను దుర్లక్షణములుగల పచ్చ నింద్యము.

గరుడపచ్చను శోధనము, మారణముచేసి సేవించిన జ్వరము, ఛర్దిజ, విషము,



శ్వాస, సన్నిపాతజ్వరము, అగ్నిమాంద్యము, మూలరోగము, పాండువు, శోఫ అను రోగములు నివర్తించును. శరీరమునకు గాంతినిచ్చును.

వైద్యచింతామణి—గరుడపచ్చశోధనము-మారణము.

"క్షిప్త్వా విదారికా కందాంతఃపుటే కౌక్కుట సంజ్ఞికే
పాచితంచాథ తన్నిత్వా భవేన్మరకతం శుచి
తతోమరకతం క్షుద్రారసేన పరిభావయేత్
పాషాణభేదీద్రావేణ మర్దితంచ శరావకే
పుటమేకం తతః పాచ్యం భస్మీ భవతి తద్ధ్రువం॥"

తా. మరకతమును నేలగుమ్మడుగడ్డనడుమనుంచి చీరమంటినిబూసి యెండ బెట్టి కుక్కుటపుటము వేసిన శుద్ధమగును. పిదప దానిని వాకుడుకాయల రసమందు భావనచేసి కొండపిండి వేళ్లరసముతో మర్దించి పుటముచేసిన భస్మమగును.

—◆ పుష్పరాగము ◆—

మూ. పుష్పరాగం గురుస్నిగ్ధం స్వచ్ఛం స్థూలం సమం మృదు
కర్ణికార ప్రసూనాభం మసృణం శుభ మష్టధా
నిష్ప్రభం కర్కశం రూక్షం పీతశ్యామం నతోన్నతం
కపిశం కపిలం పాండు పుష్పరాగం పరిత్యజేత్
పుష్పరాగం విషచ్ఛర్దికఫవాతాగ్నిమాంద్యనుత్
దాహ కుష్ఠాస్రశమనం దీపనం పాచనం లఘు॥

తా॥ బరువు, స్నిగ్ధత, స్వచ్ఛత, లావు, సమము, మృదువు, గోగుపువ్వువంటి యాకృతి, నునుపు అను యెనిమిదిలక్షణములుగల పుష్పరాగము శ్రేష్ఠము.

కాంతిలేకపోవుట, గరగరలాడుట, పెళుసుగనుండుట, పచ్చగను నల్లగను ఉండుట, హెచ్చుతగ్గులు కలిగియుండుట, గోరోచనపురంగును కపిశవర్ణమును పాండువర్ణమును కలిగి యుండుట అను లక్షణములుగల పుష్పరాగము మంచిదిగాదు.

మంచిపుష్పరాగమును శోధన మారణములచేసి సేవించినచో విషచ్ఛర్ది కఫవాత అగ్నిమాంద్యములు దాహకుష్ఠములు రక్తదోషము ఇవిహరించును. దీపన పాచనములు కలుగును.

వైద్యచింతామణి:— పుష్పరాగశోధనము-మారణము:

"పుష్పరాగం ఛాగమూత్రై ర్భావ్య శుద్ధం భవిష్యతి

తత్పుష్యరాగం పాషాణభేదీద్రావేణ భావితం
విశ్వకర్మపుటే దగ్ధ్వా భస్మీభవతి తత్క్షణాత్॥"

(తా॥ పుష్పరాగమును మేకమూత్రమునందు భావనచేసిన శుద్ధమగును. పిదప పాషాణభేది (కొండపిండివేళ్లు) రసముతో భావనచేసి కొలిమిలోపెట్టి యూదినచో భస్మమగును.)

—: వజ్రము :—

మూ. వజ్రంచ త్రివిధంప్రోక్తం నరోనారీ నపుంసకం
పూర్వం పూర్వమిహ శ్రేష్ఠం రసవీర్యవిపాకతః
అష్టాస్రం చాష్టఫలకం షట్కోణ మతిభాసురం
అంబుదేంద్ర ధనుర్వారేతరం పుంవజ్రముచ్యతే
తదేవ చిపిటాకారం స్త్రీవజ్రం వర్తులాయతం
వర్తులం కుంఠకోణాగ్రం కించిద్గురు నపుంసకం
స్త్రీపుంనపుంసకం వజ్రం యోజ్యం స్త్రీపుంనపుంసకే
వ్యత్యాసా న్నైవ ఫలదం పుంవజ్రేణ వినా క్వచిత్॥
శ్వేతాది వర్ణభేదేన తదేకైకం చతుర్విధం
బ్రహ్మక్షత్రియ విట్ఛూద్రం స్వస్వవర్ణ ఫలప్రదం
ఉత్తమోత్తమ వర్ణం హి నీలవర్ణ ఫలప్రదం
న్యాయోయం భైరవేణోక్తో పదార్థే ష్వఖిలేష్వపి
ఆయుఃప్రదం ఝటితి సద్గుణదంచ వృష్యం
దోషత్రయ ప్రశమనం సకలామయఘ్నం
సూతేంద్ర బంధవధ సద్గుణకృ త్ప్రదీప్తం
మృత్యుంజయం తదమృతోపమమేవ వజ్రం॥
గ్రాసస్త్రాసశ్చ బిందుశ్చ రేఖాచ జలగర్భతా
సర్వరత్నే ష్వమీదోషాః పంచసాధారణా మతాః
క్షేత్రతోయభవా దోషా రత్నేషు నలగంతి తే॥

తా. పురుషవజ్రము స్త్రీవజ్రము నపుంసకవజ్రము అని వజ్రముమూడువిధములు. నపుంసకవజ్రముకన్న స్త్రీవజ్రము, దీనికన్న పురుషవజ్రము రసవీర్యవిపాకములం దుత్తమములు. ఎనిమిదిఅంచులును యెనిమిదిపలకలును ఆరుకోణములునుగలిగి మేఘమునందు



మెరయు యింద్రధనుస్సువంటి కాంతులుగలిగి నీరువలె నీడదేరునది పురుషవజ్రమనియు, గుండ్రనై పొడవై అలుకులుగట్టియుండు ఆకృతిగలది స్త్రీవజ్రమనియు, మణగినకోణములు గలిగి గుండ్రనై కొంచెము బరువుగలది నపుంసకవజ్రమనియు నెరుంగవలెను. స్త్రీపురుష నపుంసకజాతుల వజ్రములను క్రమముగ స్త్రీపురుషనపుంసకుల కుపయోగింపదగును. అట్లుగాక మార్పుజెందెనేని ఫలప్రదముకాదు. పురుషవజ్రముమాత్ర మందరకు నుపయోగించవచ్చును. పైజెప్పిన మూడువిధములగు వజ్రములును ప్రత్యేకముగ శ్వేతాదివర్ణభేదముచే నాలుగు విధములుగ నున్నవి. అనగా బ్రహ్మజాతి వజ్రము తెల్లగను క్షత్రియజాతి వజ్రము యెర్రగను వైశ్యజాతి వజ్రము పచ్చగను శూద్రజాతి వజ్రము నల్లగను ఉండును. ఆయాజాతి వజ్రముల నాయాజాతిమనుజుల కుపయోగించిన ఫలప్రదమై యుండునుగాని అధమజాతులకు ఉత్తమజాతివజ్ర ముపయోగించవచ్చును. (అనగా బ్రహ్మజాతి వజ్రము నాల్గుజాతులకును క్షత్రియవజ్రము మూడుజాతులకును వైశ్యవజ్రము రెండుజాతులకును శూద్రవజ్రము ఒక్క శూద్రజాతికిని వాడదగుననుట) ఈ న్యాయము జాతిభేదముగల సమస్తవస్తువులకును చెల్లునని భైరవునిసిద్ధాంతము.

రసార్ణవము:—బ్రహ్మాదివజ్రములకు ప్రత్యేకోపయోగకథనము:
"రసాయనే భవేద్విప్రో హ్యణిమాది గుణప్రదః
క్షత్రియో మృత్యునాశార్థే వలీపలిత రోగహా
ద్రవ్యకారీ తథా వైశ్యః శరీరం దృఢతాం నయేత్
వ్యాధిప్రశమనం శూద్రః వయస్తంభం కరోతిచ॥"

(తా॥ బ్రహ్మవజ్రము జరామరణరహిత దేహసిద్ధి నిచ్చురసాయనములందును అణిమాదిసిద్ధిసాధనమందును ఉపయుక్తము. క్షత్రియవజ్రము వలీపలితములను, మృత్యువును హరించును. వైశ్యవజ్రము శరీరదార్ఢ్యకరమును ధనాకర్షకమునై యుండును. శూద్రవజ్రము రోగనాశనమును వయస్తంభమును చేయును.)

వజ్రమును శోధనమారణములజేసి సేవించిన ఆయుర్వృద్ధిని, వీర్యవృద్ధిని, దోషత్రయవికారములను, సకలరోగములను, మృత్యువును జయించును. రసమును బంధించును. రసవీర్యజనకము, అమృతసమానము.

గ్రాసము, త్రాసము, రేఖ, జలగర్భత అను ఐదుదోషములును సాధారణముగ అన్ని రత్నములయందు నుండును. ఇది ఆయారత్నములు పుట్టు భూమిసంబంధమువలనను ఉదకసంబంధమువలనను గలుగును.

## —♦ వజ్రశోధనము ♦—

మూ. కుళుత్థ క్వాథకే స్విన్నం కోద్రవ క్వథితేనవా
ఏకయామావధి స్విన్నం వజ్రం శుధ్యతి నిశ్చితం॥

తా. ఉలవకషాయమునగాని, కొఱ్ఱలకషాయమునగాని వజ్రమును డోలాయంత్రమున నొకజాము వండినయెడల శుద్ధమగును.

## —♦ వజ్రభస్మము ♦—

మూ. వజ్రం మత్కుణరక్తేన చతుర్వారం విభావితం
సుగంధ మూషికా మాంసైః వర్తితైః పరివేష్ట్య చ
పుటేత్పంచైర్వరాహాఖ్యై స్త్రింశద్వారం తతఃపరం
ధ్మాత్వా ధ్మాత్వా శతం వారాన్ కుళుత్థ క్వాథకే క్షిపేత్
అన్యైరుక్తం శతంవారాన్ కర్తవ్యోయం విధిః క్రమాత్
కుళుత్థక్వాథసంయుక్త లకుచద్రవపిష్టయా
శిలయా లిప్తమూషాయాం వజ్రం క్షిప్త్వా నిరుధ్య చ
అష్టవారం పుటేత్సమ్యగ్విశుష్కైశ్చ వనోపలైః
శతవారం తతోధ్మాత్వా నిక్షిప్తం శుద్ధపారదే
నిశ్చితం మ్రియతే వజ్రం భస్మవారితరం భవేత్
సత్యవాక్సోమసేనానీ రేతద్వజ్రస్య మారణం
దృష్టప్రత్యయ సంయుక్త ముక్తవాన్ రసకౌతుకీ॥
విలిప్తం మత్కుణస్యాస్రైః సప్తవారం విశోషితం
కాసమర్దరసాపూర్ణే లోహపాత్రే నివేశితం
సప్తవారం పరిధ్మాతం వజ్రభస్మ భవేత్ఖలు
బ్రహ్మజ్యోతిమునీంద్రేణ క్రమోయం పరికీర్తితః
నీలజ్యోతిర్లతాకందే ఘృష్టం ఘర్మే విశోషితం
వజ్రం భస్మత్వమాయాతి కర్మవత్ జ్ఞానవహ్నినా॥
మదనస్య ఫలోద్భూత రసేన శ్రోణినాగకైః
కృతకల్కేన సంలిప్య పుటే ద్వింశతివారకం
వజ్రచూర్ణం భవేద్వర్యం యోజయేచ్చ రసాదిషు॥



మూ. తద్వజ్రం చూర్ణయిత్వాథ కించి ట్టంకణసంయుతం।
ఖర భూనాగసత్త్వేన వింశేనావర్తయే ద్ధ్రువం।
తుల్యస్వర్ణేన తద్ధ్మాతం యోజనీయం రసాదిషు॥
త్రిగుణేన రసేనైవ సంమర్ద్య గుటికీకృతం।
ముఖేధృతం కరోత్యాశు చలద్దంతవిబంధనం॥

తా. వజ్రమును నల్లినెత్తురులో నాలుగుమాఱులు భావనచేసి త్రిసుగంధములు (జాజికాయ, ఏలకులు, లవంగాలు), యెలుకమాంసము నూరి యాముద్దలో వజ్రమునుంచి, మన్నుపూసి వరాహపుటము వేయునది. ఇట్లు ముప్పదిపుటములు వేసినపిదప వజ్రమును కాల్చుచు ఉలవకషాయములో నూరుసారులు చల్లార్చిన భస్మమగును. నూరుసారులు పుటమువేసి, నూరుసారులు చల్లార్చవలెనని కొందరమతము.

ఉలవకషాయమును నిమ్మపండ్లరసముతో చేర్చి మణిశిలను నూరి దానిని మూసను బాగుగ పట్టించి యామూసలో వజ్రమును పెట్టి మూతమూసి చీలజేసి యెండించి యెండిన యేరుపిడకలతో పుటమువేయవలెను. ఇట్లు యెనిమిది పుటములు వేసిన పిదప నిప్పులలో కాల్చి శుద్ధపారదమునందు నూరుసారులు ముంచినయెడల వజ్రము వారితరమగు భస్మమగును. ఈయోగమును సత్యవాక్కుగల సోమసేనానియను సిద్ధుడు తన యనుభవమున చేసిచూచి చెప్పెను.

వజ్రమును నల్లినెత్తురులో వేసి యేడుసారులు యెండించి, పిదప కొలిమిలో కాల్చి కసివింద పసరులరసమున ముంచవలెను. ఇట్లు యేడుసారులు చేసిన వజ్రము భస్మమగును. ఈయోగము బ్రహ్మజ్యోతి మునీంద్రుడు చెప్పెను.

నల్లజ్యోతిష్మతి దుంపరసముతో వజ్రమును అరగదీసి యాగంధమును యెండించినయెడల జ్ఞానముచే కర్మవలె భస్మమగును.

వానపాములను నల్లఉమ్మెత్తపండ్లరసముతో నూరి కల్కముచేసి అందు వజ్రము నుంచి మన్నుపూసి యెండించి పుటము వేయునది. ఇట్లు యిరువదిపుటములు వేసినచో వజ్రము మార్ణమై రసాదులందు చేర్చుకొనుటకర్హమైయుండును. అట్టి వజ్రచూర్ణముతో కొంచెముగ వెలిగారమును చూర్ణమున కిరువదియవవంతు భూనాగసత్త్వమును సమానముగ సువర్ణమును చేర్చి కొలిమిలో నుంచి, యూది, దానిని రసాదులందు చేర్చుకొనవచ్చును. మరియు అట్టిచూర్ణముతో మూడురెట్లు రసమును చేర్చి, మర్దించి, గుటికగావించి నోటిలోనుంచికొనినచో కదలుచున్న దంతములు గట్టిపడును.

రసరత్నాకరము:—బ్రాహ్మణాది షడ్విధవజ్రప్రత్యేకమారణయోగములు.

"అశ్వత్థ ఖదరీ ఘింటీ మాక్షికం కర్కటాస్థిచ
తుల్యం స్నుహీపయః పిష్ట్వా వజ్రం తద్గోళకే క్షిపేత్
రుద్ధ్వా గజపుటే పచ్యా ద్విప్రజాతి ర్మృతోభవేత్॥
కరవీరం మేషశృంగం బదరంచ ఉదుంబరం
అర్కదుగ్ధం సమంపిష్ట్వా విప్రవ న్మారయే న్నృపం॥
బలాం చాతిబలాం గంధం పేషయే త్కచ్ఛపాస్థిచ
ఏతైర్వా వారుణీదుగ్ధై ర్మ్రియేత్ వైశ్యోపి విప్రవత్
సూరణం లశునం శంఖం సమం పేష్యం మనశ్శిలాం
వటక్షీరేణ మాషాంతః విప్రవ చ్ఛూద్రమారణం
స్త్రీయ స్తేషాం మ్రియంతేచ తత్తదౌషధయోగతః
నపుంసకమృతి స్తేషాం చతుర్ణా మౌషధై స్సమం॥"

(తా॥ రావిచెక్క, రేగుచెక్క, ములుగోరింటచెక్క, తేనె, యెండ్రకాయఅస్థులు వీనిని సమభాగముగ గ్రహించి అన్నిటికి సమము జెముడుపాలుపోసి నూరి యాముద్దలో విప్రవజ్రమునుంచి గజపుటమువేసిన భస్మమగును. కరవీరము, మేషశృంగి, రేగు, మేడి వీనిని సమభాగమగు జిల్లేడుపాలతోనూరి విప్రవజ్రమునువలె పుటమువేసిన క్షత్రియ వజ్రము భస్మమగును. బల, అతిబల, గంధకము, తాబేలుచెంప వీనిని వారుణీ (సాపర) దుగ్ధముతో నూరి పైజెప్పినవిధమున పుటమువేసిన వైశ్యవజ్రము భస్మమగును. అడవి కంద, ఉల్లిపాయ, శంఖము, మణిశిల వీనిని సమభాగముగ గ్రహించి మర్రిపాలతో నూరి పైవిధముగ పుటమువేసిన శూద్రవజ్రము భస్మమగును. స్త్రీవజ్రము లాయా జాతుల పురుషవజ్రములకు చెప్పిన మారణయోగముచే భస్మముచేయునది. నపుంసక వజ్రమును నాల్గుజాతుల యోగములచే మృతము గావింపవలెను.)

## —♦ వజ్రరసాయనము ♦—

మూ. త్రింశద్భాగమితంహి వజ్రభసితం స్వర్ణంక ళాభాగికం
తారం చాష్టగుణం సితామృతివరం రుద్రాంశకం భాభ్రికం
పాదాంశంఖలు తాప్యకంవసుగుణాం వైక్రాంతకం షడ్గుణాం
భాగోప్యుక్తరసై రసోయ ముదితః షాడ్గుణ్య సంసిద్ధయే॥

తా. వజ్రభస్మము ముప్పదిభాగములు, స్వర్ణభస్మము పదహారుభాగములు, వెండి భస్మము యెనిమిదిభా॥ స్వచ్ఛమైన పాదరసము పదకొండుభా॥ అభ్రకము నాలుగుభా॥



స్వర్ణమాక్షికము యెనిమిదిభా॥ వైక్రాంతము ఆరుభా॥ ఇటుల వీనినెల్లచేర్చి బలానుసారముగ సేవించిన సర్వసిద్ధులు కలుగును.

## —♦ నీలమణి ♦—

మూ. జలనీ లేంద్రనీలంచ శక్రనీలం తయోర్వరం
శ్వైత్యగర్భితనీలాభం లఘు తజ్జల నీలకం
కార్ష్ణ్యగర్భిత నీలాభం సభారం శక్రనీలకం
ఏకచ్ఛాయం గురుస్నిగ్ధం స్వచ్ఛం పిండితవిగ్రహం
మృదుమధ్యోల్లసజ్జ్యోతిః సప్తధా నీల ముత్తమం
కోమలం విహితం రూక్షం నిర్భారం రక్తసంధిచ
చిపిటాభం ససూక్ష్మంచ జలనీలంహి సప్తధా॥
శ్వాసకాసహరం వృష్యం త్రిదోషఘ్నం సుదీపనం
విషమజ్వర దుర్నామా పాపఘ్నం నీల ముత్తమం॥

తా. జలనీలమనియు ఇంద్రనీలమనియు నీలము రెండువిధములు. ఇంద్రనీలము శ్రేష్ఠము. తేలికయై తెలుపు కూడియుండు నీలవర్ణముగల నీలము జలనీల మనబడును. బరువై నలుపువర్ణముగల నీలము మిశ్రితముగాక ఒకేవర్ణముగల కాంతిగల్గి బరువై నునుపైమలినములేక కలయికగల రూపముగలిగి మృదువై మధ్యభాగమున కాంతిగల్గియుండు నీలము శ్రేష్ఠమైనది. మిశ్రవర్ణముగ నుండునదియు సగము స్వచ్ఛముగను సగము మిశ్రముగను ఉండువర్ణముగలదియు రూక్షంబును బరువులేనిదియు కొంచెము యెరుపుతో గూడినదియు అడుకులుగల రూపముగలదియు నలుసులు గల్గినదియు జలనీల లక్షణములతో గూడినదియు నగు నీలము శ్రేష్ఠముకాదు.

శ్రేష్ఠమగు నీలము శ్వాసకాసలను శమింపచేయును. వీర్యవృద్ధి నిచ్చును. వాత పిత్త కఫదోషములను బోగొట్టును. అగ్నిదీప్తి గల్గించును. విషమజ్వరము, మూలరోగమును పాపజనితవ్యాధులను హరించును.

వైద్యచింతామణి:—నీలశోధనము—మారణము.

"ఖరమూత్రాంతరే క్షిప్త్వా నీలం తీవ్రాతపే క్షిపేత్
భావితం దినమేకంచ నీలం శుద్ధం భవిష్యతి॥
తన్నీలం లక్షితం జీవాద్రివే భావ్యం త్రియామకం
విశ్వకర్మపుటే దగ్ధ్వా భస్మీ భవతి తత్క్షణాత్॥"

(నీలమును గాడిదమూత్రమందు నానబెట్టి గాఢమైన యెండ నెండించిన శుద్ధమగు. పిదప దానిని పాలకూర రసముతో మూడుదినములు భావనచేసి కొలిమిలోబెట్టి యూదినచో భస్మమగును.)

## గోమేదకము

మూ. గోమేద సమరాగత్వాద్గోమేదం రత్నముచ్యతే
సుస్వచ్ఛ గోజలచ్ఛాయం స్వచ్ఛం స్నిగ్ధం సమంగురు
నిర్దళం మసృణం దీప్తం గోమేదం శుభమష్టధా
విచ్ఛాయం లఘురూక్షాంగం చిపిటం పటలాన్వితం.
నిష్ప్రభం పీతకాచాభం గోమేదం నశుభావహం॥
గోమేదం కఫపిత్తఘ్నం క్షయ పాండు క్షయంకరం
దీపనం పాచనం రుచ్యం త్వచ్యం బుద్ధిప్రబోధనం॥

తా. ఆవుయొక్క మేదస్సును పోలియుండును గనుక గోమేద మనబడును. గోమేదము స్వచ్ఛమైన గోమూత్రముయొక్క కాంతిగలిగి స్వచ్ఛమైనదై, హెచ్చుతగ్గులు లేక సమానమై బరువై పొరలులేక దట్టముగను కాంతివంతముగను నుండిన శ్రేష్ఠము. కాంతిహీనమై తేలికయై పెళుసై అడుకులుగల యాకారముగలిగి పొరలుగలిగి మెరుపులేక పచ్చని గాజుపెంకువలె నుండు గోమేదకము శ్రేష్ఠముకాదు.

గోమేదకమును సేవించినయెడల కఫపిత్తరోగములను, క్షయను, పాండువును హరించును. అగ్నిదీప్తిని కలిగించి ఆహారమును పాచనముచేయును. రుచిబుట్టించును. త్వగింద్రియమునకు హితమైనది. బుద్ధిబలము నిచ్చును.

వైద్యచింతామణి:— గోమేదకశోధనము — భస్మము.

"తతో గోమేదకం వాజిమూత్రే భావ్యం దినత్రయం
తతో విదారీ స్వరసే భావ్యం శుద్ధిర్భవిష్యతి
శుద్ధం గోమేదకం కృష్ణ ధత్తూరద్రవ భావితం
విశ్వకర్మపుటే దగ్ధ్వా త్రివారం భస్మచాప్నుయాత్॥"

(తా. గోమేదమును గోమూత్రములో మూడుదినములు భావనచేసి పిదప నేలగుమ్మడు స్వరసమున భావన చేసినయెడల శుద్ధమగును. పిదప దానిని నల్లయుమ్మెత్తాకురసమున మూడుభావనలు చేసి కొలిమిలోనుంచి యూదినచో భస్మమగును.)



## వైదూర్యము

మూ. వైదూర్యం శ్యామశుభ్రాభం సమం స్వచ్ఛం గురుస్ఫుటం
అభ్రితోయోత్తరీయేణ గర్భితం శుభమీరితం
శ్యామం తోయసమ చ్ఛాయం చిపిటం లఘుకర్కశం
రక్త గర్భోత్తరీయంచ వైదూర్యం నైవ శస్యతే
వైదూర్యం రక్తపిత్తఘ్నం ప్రజ్ఞాయుర్బలవర్ధనం
పిత్తప్రధానరోగఘ్నం దీపనం మలమోచనం॥

తా॥ నలుపు తెలుపునైనకాంతి గలిగి సమానమై స్వచ్ఛమై బరువై స్ఫుటమై లోన తిరుగుచుండు తెల్లనియుత్తరీయమువంటి పొరగలిగియుండు వైదూర్యము శ్రేష్ఠము.

నల్లగాగాని నీటిరంగుగల్గిగాని యెండినను అడుకులుగల యాకృతిగల్గినను తేలికగనున్నను గరగరలాడుచున్నను లోపల యెర్రనైన యుత్తరీయమువంటి పొరతిరుగుచుండినను వైదూర్యము శ్రేష్ఠముకాదు.

ఉత్తమవైదూర్యమును సేవించిన రక్తపిత్త వ్యాధిని పోగొట్టును. బుద్ధిబలమును ఆయుర్వృద్ధిని బలమును కలిగించును. పిత్తదోషప్రధానములగు రోగముల నన్నిటిని మాన్పును. అగ్నిదీప్తి నిచ్చును. మలమును వెడలించును.

వైద్యచింతామణి:— వైదూర్యశోధనము — భస్మము.

"వైదూర్యం వాజిమూత్రేణ కూశ్మాండ స్వరసేనచ
భావితం ద్విదినం చాథ శుద్ధిర్భవతి నిశ్చయం
తద్వైదూర్యం శిలాభేది రసేన పరిభావితం
విశ్వకర్మపుటేదగ్ధ్వా తీవ్రాగ్నౌ వజ్రమూషయా
తతో గజపుటే పాచ్యం భస్మీభవతి నిశ్చయం॥

(తా॥ వైదూర్యమును అశ్వమూత్రమందును బూడిదగుమ్మడురసమందును రెండు దినములు భావనచేసిన శుద్ధమగును. పిదప దానిని పాషాణభేదిరసముతో భావనచేసి కొలిమిలోనుంచితీవ్రాగ్నిచే నూదునది. పిదప నొకగజపుటము వేసినయెడల భస్మమగును.)

## సర్వరత్నశుద్ధి

మూ. శుధ్యత్యమ్లేన మాణిక్యం జయంత్యా మౌక్తికంతథా
విద్రుమం క్షారవర్గేణ తార్క్ష్యం గోదుగ్ధకైస్తథా
పుష్పరాగం చ సంధానైః కుళుత్థ క్వాథసంయుతైః

తండులీయ జలైర్వజ్రం నీలం నీలీరసేనచ
రోచనాభిశ్చ గోమేదం వైడూర్యం త్రిఫలాజలైః॥

తా. అమ్లవర్గమందు స్వేదనభావనలు జేసిన మాణిక్యము శుద్ధమగును. తక్కలియాకు రసమున భావనచేసినను స్వేదనముచేసినను ముత్యము శుద్ధమగు. క్షారవర్గమందు పగడము శుద్ధమగును. ఆవుపాలచేత గరుడపచ్చ శుద్ధమగు. సంధానసిద్ధములగు ఆసవారిష్టము లలో ఉలవకట్టుచేర్చి అందు పుష్యరాగమును స్వేదనముచేసిన శుద్ధమగును. వాయువిడంగకషాయమున స్వేదనభావనలచేసిన వజ్రము శుద్ధంబగు. నీలియాకురసముచే నీలము శుద్ధమగును. గోమేదకమును గోరోచనపురసముతో భావనచేసిన శుద్ధమగును. త్రిఫల కషాయమున స్వేదనముచేసిన వైడూర్యము శుద్ధమగును.

## —♦ సర్వరత్నభస్మవిధి ♦—

మూ. లకుచద్రావసంపిష్టై శ్శిలాగంధక తాళకైః
వజ్రంవినాన్యరత్నాని మ్రియంతేష్టపుటై ర్లఘు॥

తా. మణిశిల, గంధకము, తాళకము వీనిని నిమ్మపండురసముతో నూరి ముద్దచేసి దానిశుద్ధరత్నములను పొదిగి పుటముపేయవలెను. ఇట్లు యెనిమిదిపుటములు వేసిన సర్వరత్నములును భస్మములగును.

## —♦ రత్నద్రుతి ♦—

మూ. రామఠం పంచలవణం క్షారాణాం త్రితయం తథా
మాంస ద్రావోమ్లవేతశ్చ చూలికాలవణం తథా
స్థూలం కుంభీఫలంపక్వం తథా జ్వాలాముఖీ శుభా
ద్రవంతీచ రుదంతీచ పయస్యా చిత్రమూలకం
దుగ్ధంస్నుహ్యా స్తథార్కస్య సర్వం సంమర్ద్య యత్నతః॥
గోళంవిధాయ తన్మధ్యే ప్రక్షిపే త్తదనంతరం
గుణవ న్నవరత్నాని జాతిమంతి శుభానిచ
భూర్జే తంగోలకం కృత్వా సూత్రేణావేష్ట్య యత్నతః
పున ర్వస్త్రేణ సంవేష్ట్య డోలాయంత్రే నిధాయచ॥
సర్వామ్లయుక్తసంధాన పరిపూర్ణఘటోదరే
అహోరాత్రత్రయం యావత్ స్వేదయేత్తీవ్రవహ్నినా



తస్మాదాహృత్య సంక్షాళ్య రత్నజాం ద్రుతిమాహరేత్
రత్నతుల్యప్రభా లఘ్వీ దేహలోహకరీ శుభా॥
ముక్తాచూర్ణంతు సప్తాహం వేతసామ్లేనమర్దితం
జంబీరరసమధ్యేతు ధాన్యరాశౌ వినిక్షిపేత్
సప్తాహా దుద్ధృతంచైవ పుటేధృత్వా ద్రుతిర్భవేత్
వజ్రవల్ల్యంతరస్థంచ కృత్వా వజ్రం నిరోధయేత్
అమ్లభాండగతం స్వేద్యం సప్తాహా ద్ద్రవతాం వ్రజేత్॥

తా. ఇంగువ, పంచలవణములు, సజ్జక్షారము, యవక్షారము, వెలిగారము, మాంసద్రావము, అమ్లవేతసము, చూలికాలవణము (వవాసాగరము), కుంభీఫలము, జ్వాలాముఖీ, ద్రవంతి, రుదంతి, మనుబాల, చిత్రమూలము అను నీద్రవ్యముల నన్నిటిని చేర్చి అందు జల్లేడుపాలను జెముడుపాలను కలిపి నూరి యుండజేసి యుంచుకొనవలెను. పిదప మిక్కిలిప్రశస్తగుణముల మంచిజాతిరత్నము నెద్దానినైన సక్రమముగ శుద్ధిచేసి పైజెప్పిన యుండయందుంచి పైన భుజపత్రినిచుట్టి దారముచేగట్టి దానిపైని గుడ్డనుచుట్టి అమ్లవర్గముచేతను ఆసవారిష్టములచేతను డోలాయంత్రమున మూడు అహోరాత్రములు గాఢాగ్నిని స్వేదనముచేసి పిదప రత్నమును వెలికిదీసి నీళ్లతోగడిగి కొలిములోబెట్టి యూదినచో ద్రవించును. అట్టిరత్నద్రుతి ఆయారత్నములకాంతిగలిగి దేహమును లోహతుల్యముగ జేయునదై యుండును. ముత్యములను చూర్ణించి పుల్లప్రబ్బలిరసముతో యేడుదినములు మర్దించి నిమ్మపండు మధ్యనుంచి ధాన్యరాశియందు యేడుదినములుంచి తీసి పుటముబెట్టినయెడల ద్రవించును.

నల్లేరునునూరి ముద్దజేసి అందు శుద్ధవజ్రమును బెట్టి మూసలోనుంచి చీరజేసి పుటము వేసినచో ద్రవించును.

## —♦ వైక్రాంతద్రుతి ♦—

మూ. శ్వేతవర్ణంతు వైక్రాంతం అమ్లవేతసభావితం
సప్తాహా న్నాత్ర సందేహః ఖర ఘర్మే ద్రవత్యలం
కేతకీస్వరసంగ్రాహ్యం సైంధవం స్వర్ణపుష్పికా
ఇంద్రగోపక సంయుక్తం సర్వం భాండే నిధాపయేత్
సప్తాహంస్వేదయే త్తస్మిన్ వైక్రాంతం ద్రవతాంవ్రజేత్
లోహాష్టకే తథా వజ్రపాతనా త్స్వేదనా ద్ద్రుతిః
జాయతే నాత్రసందేహో యోగస్యాస్య ప్రభావతః
కురుతే యోగరాజోయం రత్నానాం ద్రావణం పరం

కుసుంభతైలమధ్యేతు సంస్థాప్య ద్రుతయః పృథక్
తిష్ఠతి చిరకాలంతు ప్రాప్తే కార్యేనియోజయేత్॥

తా. శ్వేతవర్ణముగల వైక్రాంతమును పుల్లప్రబ్బలిరసమం దేడుదినములు భావనచేసి తీవ్రమైన యెండలో నుంచినచో ద్రవించును. మొగలిచెట్టు స్వరసమునందు సైంధవలవణము, స్వర్ణపుష్పి, యింద్రగోపపురుగులు వీని నొకభాండమం దుంచి దానితో యేడుదినములు భావనచేసినయెడల వైక్రాంతము ద్రవించును. లోహాష్టకమందు వజ్రచూర్ణమును చల్లి స్వేదనముచేసినచో వైక్రాంతము మొదలగు రత్నములన్నియు ద్రవించును. నిస్సంశయము.

వేరు వేరుగా ద్రుతులను యుక్తమైన పాత్రలలో బోసి కుసుంభానూనెలో నుంచినయెడల చిరకాలమువరకు నిలచియుండును. కాన అట్లు భద్రపరచుకొని అవసరమగునపు డుపయోగించుకొనవలెను.

## —♦ రత్నసాధారణగుణములు ♦—

మూ. సూర్యాదిగ్రహ నిగ్రహాపహరణం దీర్ఘాయురారోగ్యదం
సౌభాగ్యోదయ భాగ్యవశ్యవిభవోత్సాహప్రదం ధైర్యకృత్
దుశ్ఛాయాచలధూళిసంగతిభవాఽలక్ష్మీహరం సర్వదా
రత్నానాం పరిధారణం నిగదితం భూతాది నిర్నాశనం॥

ఇతి శ్రీవాగ్భటాచార్య విరచితే రసరత్నసముచ్చయే చతుర్థోధ్యాయః

తా. నవరత్నములను ధరించువారికి సూర్యాదినవగ్రహముల అనుగ్రహమును, ఆయుర్వృద్ధియు, ఆయురారోగ్యములును, సౌభాగ్యమును, లోకవశ్యతయు, ఉత్సాహమును, ధైర్యమును కలుగును. దుష్టమైన చెట్లు, పర్వతములు మొదలగువాని నీడలలో తిరుగుటవలనను చీపురుదుమ్ము మొదలగు ధూళుల సంపర్కమువలనను గల్గిన అలక్ష్మి తొలగును. గ్రహబాధలు నశించును.

శ్రీమత్కృష్ణా గోదావరీమధ్య విద్యోతమాన నూజవీణ్ణగరీప్రభువర శ్రీమదుయ్యూరు
మేడూరు నిడదవోలు ప్రముఖసంస్థానాధీశ్వర ఆంధ్రకవితాధురంధర పండితకవి
పోషక శ్రీ శ్రీ రాజా వెంకటాద్ర్యప్పారాయ ప్రభుపుంగవాస్థాన
పండిత భారద్వాజసగోత్రపవిత్ర వేంకటసుబ్బావధాని సత్పుత్ర
సకలపండితకవి సద్వైద్యవిధేయ సత్యనారాయణశాస్త్రి
నామధేయాంధ్రీకృత రసరత్నసముచ్చయమునందు
చతుర్థాధ్యాయము సమాప్తము.
శ్రీశారదాంబార్పణమస్తు.

శ్రీరస్తు

# రసరత్నసముచ్చయము

## పంచమాధ్యాయము

### —♦ ధాతువులు ♦—

మూ. శుద్ధం లోహం కనకరజతం భానులోహాశ్మసారం
పూతీలోహం ద్వితయ ముదితం నాగవంగాభిధానం॥
మిశ్రం లోహం ద్వితయ ముదితం పిత్తలంకాంస్య వర్తం
ధాతుర్లోహే లుహ ఇతిమతః సోపి కర్షార్థవాచీ॥

తా. సువర్ణము, రజతము, తామ్రము, తీక్ష్ణము, అనునీనాలుగును శుద్ధలోహములు. నాగవంగములు పూతిలోహములు, పిత్తలకాంస్య వర్తములు మిశ్రలోహములు. (మెత్తము తొమ్మిదిలోహములును మూడువిధములై యున్నవి.) లుహధాతువువలన "లోహ" మనుశబ్ద మేర్పడినది. (లుహతి సేవ్యమాన స్సర్వాన్ రోగానితి లోహః) అనువ్యుత్పత్తిచే దీనిని సేవించినచో సర్వరోగములు శమించును. కనుక లోహమని దీనికి పేరు.

### —♦ సువర్ణము ♦—

మూ. ప్రాకృతం సహజం వహ్నిసంభవం ఖనిసంభవం
రసేంద్రవేధసంజాతం స్వర్ణం పంచవిధం స్మృతం॥
బ్రహ్మాండం సంవృతం యేన రజోగుణ భవాఖిలు
తత్ప్రాకృతమితి ప్రోక్తం దేవానామపి దుర్లభం॥
బ్రహ్మ యేనావృతో జాతః సువర్ణేన జరాయుణా
తన్మేరురూపతాం యాతం సువర్ణం సహజం హి తత్

విసృష్ట మగ్నినాశైవం తేజః పీతం సుదుస్సహం॥
అభూత్సర్వం వినిర్దిష్టం సువర్ణం వహ్నిసంభవం
ఏతత్స్వర్ణత్రయం దివ్యం వర్ణైః షోడశభిర్యుతం
ధారణాదేవ తత్కుర్యాచ్ఛరీర మజరామరం
తత్ర తత్ర గిరీణాంహి జాతం ఖనిషు యద్భవేత్
తచ్చతుర్దశవర్ణాఢ్యం భక్షితం సర్వరోగహృత్
రసేంద్రవేధసంభూతం తద్వేధజ ముదాహృతం॥
రసాయనం మహాశ్రేష్ఠం పవిత్రం వేధజంహి తత్॥

**తా.** ప్రాకృతము, సహజము, అగ్నిసంభవము, ఖనిజము, రసేంద్రవేధజము అని స్వర్ణము అయిదు విధములు. రజోగుణాత్మకుండైన బ్రహ్మ బ్రహ్మాండమంతయు సువర్ణముచే నావృతము గావించెను. అట్టిసువర్ణము ప్రాకృతమనబడును. ఇది దేవతలకుగూడ దుర్లభమైనది. గర్భస్థుడైన బ్రహ్మ నావరించియుండు సువర్ణవికారమైన యొకవిధమైన జరాయువు అనుచర్మము మేరుపర్వతముగ పరిణమించెను. ఇది సహజసువర్ణమనబడును. శివుడు స్వకీయమైన వీర్యమును అగ్నియందు విడచెను. దుస్సహమైన యారేతస్సు స్వర్ణమయ్యెను. అది వహ్నిసంభవ మనబడును. పైజెప్పిన మూడు విధముల స్వర్ణములును దివ్యము లనబరగి పదునారువన్నెలుగలిగి యుండును. వీనిని ధరించినంతమాత్రముచ శరీర మజరామరణ మగును. అచ్చటచ్చట పర్వతములందును గనులయందును పుట్టు స్వర్ణము ఖనిజ మనబడును. ఇది పదునాల్గు వన్నెలుగలిగి యుండును. దీనిని శోధన మారణములుచేసి సేవించినచో సర్వరోగములు హరించును. రసవాదప్రక్రియలందు చెప్పబడిన అష్టాదశసంస్కారములచే సంస్కరింపబడిన రసముచేత స్పర్శాదివేధలనందిన లోహాంతరములు సువర్ణముగ మారును. అది వేధజ మనబడును.

(ఈప్రక్రియ ననుసరించి నీచలోహముల నుత్తమలోహములుగ మార్చు సంప్రదాయములను బోధించు వాదఖండము ప్రస్తుతము విశేషముగ లభ్యముకాదుగాని రసార్ణవము, రససారము, కల్పసిద్ధి, యోగేశ్వరదర్శనము, సూతేంద్రసిద్ధి, రసేంద్రచూడామణి, నాగార్జునతంత్రము, రసహృదయతంత్రము మొదలగుగ్రంథము లచ్చటచ్చట లభ్యములై తత్సంప్రదాయములు కొంతవరకుమాత్రమే గ్రహింపబడుచున్నవి. అట్టి విషయములు యీగ్రంథమున నాయాభాగములందు దిఙ్మాత్రముగ నుదహరింపబడినవి. వేధజన్యమైన స్వర్ణము మిగులపవిత్రమును రసాయనమును అయియున్నది.)



రసార్ణవము:—"రసజం క్షేత్రజంచైవ లోహసంకరజం తథా
త్రివిధం జాయతే హేమ చతుర్థం నోపలభ్యతే॥"

(తా॥ రసజము, క్షేత్రజము, లోహసంకరజము అని హేమము మూడువిధములు. నాల్గవది లేదు. అని తాత్పర్యము.)

## —♦ స్వర్ణగుణము ♦—

మూ. ఆయుర్లక్ష్మీప్రభాధి స్మృతికర మఖిలం వ్యాధివిధ్వంసి పుణ్యం
భూతావేశప్రశాంతి స్మరభరసుఖదం సౌఖ్య పుష్టిప్రకాశం
గాంగేయం చాధరూప్యం గదహర మజరాకారి మేహాపహారి
క్షీణానాం పుష్టికారి స్ఫుటమతికరణం వీర్యవృద్ధిప్రకారి॥
స్నిగ్ధం మేధ్యం విషగదహరం బృంహణం వృష్యమగ్ర్యం
యక్ష్మోన్మాద ప్రశమనపరం దేహరోగప్రమాథి
మేధాబుద్ధి స్మృతి సుఖకరం సర్వదోషామయఘ్నం
రుచ్యం దీపి ప్రశమితరుజం స్వాదుపాకం సువర్ణం॥
సౌఖ్యం వీర్యం బలం హంతి రోగావర్తం కరోతిచ
అశుద్ధ మమృతం స్వర్ణం తస్మాచ్ఛుద్ధంతు మారయేత్॥

తా॥ స్వర్ణరజతములను శోధనమారణములజేసి సేవించినచో ఆయువును లక్ష్మిని కాంతిని బుద్ధిని జ్ఞాపకశక్తిని సంభోగశక్తిని సుఖమును పుష్టిని వీర్యవృద్ధిని యిచ్చును జరామరణములు లేనంతచేయును. మేహములను క్షీణత్వమును యక్ష్మోన్మాదములను దేహగత సర్వరోగములను త్రిదోషవికారములను హరించును. మధురవిపాకముగలది.

అపరిశుద్ధమును, అమృతమును (భస్మముచేయబడనిది) అగు స్వర్ణమును సేవించినయెడల సౌఖ్యమును బలమును వీర్యమును హరించి రోగములను గల్గించును, గాన తప్పక శోధనము మారణముచేసి సేవింపదగును.

## —♦ స్వర్ణశోధనము ♦—

మూ. కర్షప్రమాణంతు సువర్ణపత్రం శరావరుద్ధం పటుధాతుయుక్తం
అంగారసంస్థం ప్రహరార్థమానాధ్మాతేనతత్స్యాన్ననుపూర్ణవర్ణం

తా॥ వన్నెతగ్గిన బంగారము ఒకతులము గ్రహించి రేకులుగకొట్టి ఉపధాతువులతోడను చేర్చి మూకుడులోనుంచి చీమంటినిచ్చి అర్ధజామువరకు నిప్పులందూదిన దోషములను హరించి శుద్ధమగు పదునారు వన్నెలుగల బంగారమగును.

రససంకేతకలిక:—"సువర్ణం సప్తశోదాల్యం కాంచనారరసేశుచి॥"

(స్వర్ణమును కాల్చి యేడుమారులు దేవకాంచనపు రసమందు చల్లార్చిన యెడల శుద్ధమగును.)

## —♦ సువర్ణభస్మము ♦—

మూ. లోహానాం మారణం శ్రేష్ఠం సర్వేషాం రసభస్మనా
మూలీభిర్మధ్యమం ప్రాహుః కనిష్ఠం గంధకాదిభిః
అరిలోహేన లోహస్య మారణం దుర్గుణప్రదం
కృత్వా కంటకవేధ్యాని స్వర్ణపత్రాణి లేపయేత్
లుంగాంబు భస్మసూతేన మ్రియతే దశభిః పుటైః
ద్రుతే వినిక్షిపేత్స్వర్ణే లోహమానం మృతం రసం
విచూర్ణ్య లుంగతోయేన దరదేనసమన్వితం
జాయతే కుంకుమచ్ఛాయం స్వర్ణం ద్వాదశభిః పుటైః
హేమ్నఃపాదం మృతం సూతం పిష్ట మమ్లేన కేనచిత్
పత్రే లిప్త్వా పుటైః పచ్యా దష్టభి ర్మ్రియతే ధ్రువం॥
ఏతద్భస్మ సువర్ణజం కటుఘృతోపేతం ద్విగుంజోన్మితం
లీఢం హంతి నృణాం క్షయాగ్నిసదనం శ్వాసంచ కాసారుచిం
ఓజోధాతువివర్ధనం బలకరం పాండ్వామయధ్వంసనం
పథ్యం సర్వవిషాపహం గరహరం దుష్టగ్రహణ్యాదినుత్॥
బలంచ వీర్యం హరతే నరాణాం రోగవ్రజం కోపయతీహ కాయే
అసౌఖ్యకారంచ సదైవహేమాఽపథ్యం సదోషం మరణం
[కరోతి॥

తా. లోహములను భస్మము చేయు ప్రక్రియ లనేకములు. అందు రసభస్మమును చేర్చి చేయువిధానము ఉత్తమము. మూలికాయోగములు మధ్యమములు. గంధకాదిధాతువులచే చేయబడినవి యధమములు. శత్రులోహములతో చేయునవి దుర్గుణప్రదములు.



శుద్ధసువర్ణమును సుత్తితో పొడిచినంత మాత్రమున చిల్లిపడునట్లు పలుచని రేకులుగ కొట్టి నిమ్మపండ్లరసముతో నూరిన రసభస్మమును ఆరేకులకు పట్టించి పుటము వేయవలెను. ఇట్లు పదిపుటములు వేసిన స్వర్ణము భస్మమగును.

స్వర్ణముతో సమమగు తూనికగల రసభస్మమును ఇంగిలీకముతో చేర్చి మాదీఫలరసముతో నూరి బంగారుతో చేర్చి పండ్రెండుపుటములు వేసిన స్వర్ణము భస్మమగు ఇది కుంకుమచ్ఛాయ గల్గియుండును.

భస్మార్థమై గ్రహింపబడిన బంగారమునకు నాల్గవపాలు రసభస్మమును గ్రహించి దాని నామ్లరసముతో నూరి బంగారురేకులకు పట్టించి పుటము వేయవలెను, ఇట్లు యెనిమిది పుటములు వేసిన సువర్ణము భస్మమగును.

శుద్ధిచేసినస్వర్ణమును ఆకురాయితో పొడిగారాచి, యాచూర్ణమును చమ్మఆకు రసముతో నూరుచు 5, 6 పుటములు వేసినయెడల భస్మమగును. వృద్ధోపదేశము:

రససంకేతకలిక:

"లోహం సూతయుతం దోషాన్ త్యజేత్సూతశ్చ లోహయుక్
అతస్స్వర్ణాది లోహాని వినా సూతం నమారయేత్॥"
"పృథక్ భస్మామ్ల లిప్తాసి స్తామ్రవర్ణ స్తదామృతిః॥"

(తా॥ లోహములను సూతముజేర్చి మృతము గావించినచో లోహములందలి సకలదోషములు నశించును. అట్లే రసమును లోహముతో చేర్చి మృతము గావించినచో రసమందలి దోషములు నశించును గాన స్వర్ణాదిలోహములను సూతముతో మిశ్రితములగావింపక మృతము జేయరాదు. అనగా సూతమిశ్రితముగ మారణమైన స్వర్ణాదిలోహభస్మములు నిర్దుష్టములై యుండునని భావము.)

మృతస్వర్ణాదిపరీక్ష:—స్వర్ణరజతభస్మములను ప్రత్యేకముగ ఆమ్లరసముతోనూరి లోహనిర్మితమైన కత్తికి పూసినచో కత్తి తామ్రవర్ణమును పొందెనేని యాస్వర్ణతారములు పరిశుద్ధములుగ భస్మములైనట్లు యుండునని తెలియవలెను.

పై జెప్పినవిధముగ జక్కగ మారణముచేయబడిన స్వర్ణభస్మమును రెండుగుంజ లెత్తుచొప్పున నేతితో సేవించుచుండిన క్షయ, అగ్నిమాంద్యము, శ్వాసకాసలు, అరుచి, పాండువు, విషదోషము, గ్రహణి మొదలగు రోగములు హరించును. తేజస్సు, ధాతుబలము కలుగును.

అపరిశుద్ధసువర్ణ భస్మసేవవలన బలవీర్యసౌఖ్యములు హరించును. అసౌఖ్యమును చేసి చివరకు చంపును.

## —♦ సువర్ణద్రుతి ♦—

మూ. మండూకాస్థి వసాటంకణహంసపాలేంద్రగోపకైః
ప్రతీవాపేన కనకం సుచిరం తిష్ఠతి ద్రుతం
చూర్ణం సురేంద్రగోపానాం దేవదాలీ ఫలద్రవైః
భావితం సప్తశం హేమ కరోతి జలవద్ద్రుతం॥

తా. కప్పయొక్క యెముకలు, వెలిగారము, గుర్రపుచొల్లు, ఇంద్రగోపపురుగులు (ఆర్ద్రపురుగులు), అను నీద్రవ్యముల నొకటిగ చేర్చి యెండించి చూర్ణించి యుంచుకొని బంగారును కరిగించి అది చక్కగా కరుగునపుడు పైచూర్ణమును ప్రతీవాపము చేసిన చో యెప్పటికిని గట్టిపడక ద్రవరూపముగనే యుండును.

## —♦ రజతము ♦—

మూ. సహజం ఖనిజాతంచ కృత్రిమం త్రివిధం మతం
రజతం పూర్వ పూర్వంహి స్వగుణై రుత్తమోత్తమం
కైలాసాద్యద్రిసంభూతం సహజం రజతం భవేత్
తత్స్పృష్టంహి సకృద్వ్యాధినాశనం దేహినాం భవేత్
హిమాలయాద్రికూటేషు యదూప్యం జాయతేహి తత్
ఖనిజం కథ్యతే తజ్ఞైః పరమంహి రసాయనం
శ్రీరామపాదుకాన్యస్తం వంగః యద్రూప్యతాం గతం
తత్పాదరూప్య మిత్యుక్తం కృత్రిమం సర్వరోగనుత్
ఘనం స్వచ్ఛం గురు స్నిగ్ధం దాహే చ్ఛేదే సితం మృదు
శంఖాభం మసృణం స్ఫోటరహితం రజతం శుభం
దాహే రక్తంచ పీతంచ కృష్ణం రూక్షం స్ఫుటం లఘు
స్థూలాంగం కర్కశాంగంచ రజతం త్యాజ్య మష్టధా॥
రౌప్యం విపాకమధురంతు వరామ్లసారం శీతం సరం పరమలేఖన
[కంచ రుచ్యం
బల్యం పరం స్థిరవయస్కరణంచ మేధ్యం స్నిగ్ధంచ వాతకఫజి
[జ్జఠరాగ్నిదీపి॥
రౌప్యం శీతం కషాయామ్లం స్నిగ్ధం వాతహరం లఘు
రసాయనవిధానేన సర్వరోగాపహారకం॥



తా॥ సహజము, ఖనిసంభవము, కృత్రిమము, అని వెండి మూడువిధములు. కృత్రిమముకన్న ఖనిజము దానికన్న సహజము శ్రేష్ఠము. కైలాసాది పర్వతరూపమైన వెండి సహజము. దానిని తాకినంతమాత్రమున రోగములు నశించును. హిమాలయాది పర్వత కూటములందు గనులలోపుట్టునది ఖనిజమనబడును. ఇది రసాయనము. శ్రీరామపాదుకలయందు ఘటితమై యుండు వంగము రజతముగ పరిణమించెను. ఇదియె పాదరూప్యమనబడును. దీనికి కృత్రిమమని పేరు.

బరువుగను, స్వచ్ఛముగను, స్నిగ్ధముగను, కాల్చినను, నరికినను, తెల్లగ నుండునదియు నునుపుగలదియు గొగ్గులులేనిదియు రజతము శ్రేష్ఠము.

కాల్చినచో యెరుపు, నలుపు, పసుపు వర్ణములు గలిగి పెళుసై, తేలికయై, కఠినమై యుండురజతము మంచిదికాదు.

వెండి మధురవిపాకమును, వగరు పులుపు రుచులను, శీతవీర్యమును, సరగుణమును గలది. లేఖనకారి. రుచ్యమైనది. స్నిగ్ధము. వాతకఫహరము. అగ్నిదీప్తిని బలమును వీర్యవృద్ధిని కలిగించును. రసాయనసేవనావిధి ననుసరించి సేవించిన సకలరోగములను హరించును.

## —♦ రౌప్యశోధనము ♦—

మూ. తైలే తక్రే గవాం మూత్రే హ్యారనాళే కుళుత్థజే
క్రమాన్నిషేచయే త్తప్తం ద్రావేద్రావేతు సప్తధా
స్వర్ణాదిలోహపత్రాణాం శుద్ధిరేషా ప్రశస్యతే
ఆయుశ్శుక్రంబలం హంతి తాపవిడ్బంధరోగకృత్
అశుద్ధం నమృతం తారం శుద్ధ మార్యమతోన్యథా॥
నాగేన టంకణేనైవ వాపితం శుద్ధి మృచ్ఛతి
తారం త్రివారం నిక్షిప్తం తైలే జ్యోతిష్మతీభవేత్
ఖర్పరే భస్మచూర్ణాభ్యాం పరితః పాలికాంచరేత్
తత్రరూప్యం వినిక్షిప్య సమసీససమన్వితం
జాతసీసక్షయం యావత్ ధమేత్తావ త్పునఃపునః
ఇత్థం సంశోధితం రూప్యం యోజయేచ్చ రసాదిషు॥

తా॥ స్వర్ణాదిలోహములను కరిగించి తైలము మజ్జిగ గోమూత్రము ఆరనాళము ఉలవకషాయము అను ద్రవ్యములలో క్రమముగా చల్లార్చినయెడల శుద్ధములగును. ఇది

ఉత్తమకల్పము. శుద్ధిచేయబడనట్టియు మృతము గావింపబడనట్టియు వెండిని సేవించుట వలన ఆయుర్వు, శుక్రము, బలము హరించును. మలబంధమును తాపమును శిర్స్రోగము లను గలుగజేయును. అందువలన శోధనమారణము లత్యావశ్యకములు.

వెండినికరిగించి సీసమునుగాని వెలిగారమునుగాని ఆవాపముచేసినచో రజతము శుద్ధమగును. వెండినికరిగించి మాల్కంగునితైలమునందు మూడుసారులు ముంచి అనంతరము ఒక మూకుడునందు బూడిద, సున్నముకలిపి నూరి దానితో కట్టుగకట్టి దానియందు పైజెప్పిన వెండిని సమానపరిమాణముగల సీసముతోకలిపియుంచి కుంపటియందు సీసము హరించువరకు గాఢముగనూదినచో వెండి శుద్ధమగును.

## —♦ రౌప్యభస్మము ♦—

మూ. లకుచద్రావసూతాభ్యాం తారపత్రం ప్రలేపయేత్
ఊర్ధ్వాధోగంధకందత్త్వా మూషామధ్యే నిరుధ్యచ
స్వేదయే ద్వాలుకాయంత్రే దిసమేకం దృఢాగ్నినా
స్వాంగశీతాంచ తాం పిష్టిం సామ్లతాళేన మర్దితాం
పుటే ద్ద్వాదశవారాణి భస్మీభవతి రూప్యకం
మాక్షికచూర్ణలుంగాంబు మర్దితం పుటితం శనైః
త్రింశద్వారేణ తత్తారం భస్మసాజ్జాయతేతరాం
భావ్యం తాప్యం స్నుహీక్షీరై స్తారపత్రాణి లేపయేత్।
మారయే త్పుటయోగేన నిరుత్థం జాయతే ధ్రువం
తారపత్రం చతుర్భాగం భాగైకం శుద్ధతాళకం॥
మర్ద్యం జంబీరజద్రావై స్తారపత్రాణి లేపయేత్
శోధయే దంధయంత్రేత త్రింశదుపలకైః పచేత్
చతుర్దశపుటై రేవం నిరుత్థం జాయతే ధ్రువం॥

తా. రసభస్మమును నిమ్మపండ్లరసముతో నూరి శుద్ధిచేసిన వెండిరేకులకు పట్టించి యారేకులకుపైన, క్రింద గంధకపు పొడి పోసి మూసలోనుంచి చీలజేసి వాలుకాయంత్రమున నొకదినము దృఢాగ్నిచే పాకముచేయవలెను. స్వాంగశీతలమునందా పిష్టిని దీసి తాళకముతో చేర్చి ఆమ్లరసములతో నూరి పండ్రెండుపుటములు వేయునెడల రజతము భస్మగును.

రజతపుపొడిని మాక్షికముతో జేర్చి నిమ్మపండ్లరసముతో నూరి పుటము వేయునది. ఇట్లు ముప్పదిపుటములు వేసిన రజతము భస్మమగును.



మాక్షికమును జెముడుపాలతో భావనచేసి దానిని వెండిరేకులకు పట్టించి పుటము వేసినచో భస్మమగును.

వెండిరేకులకు నాల్గవవంతు తాళకమును నిమ్మపండ్లరసముతో నూరి రేకులకు పట్టించి మూసలోనుంచి, మూసి ముప్పదిపిడకలతో పుటము వేయునది. ఇట్లు పదునాల్గు పుటములు వేసిన వెండి భస్మమగును,

ఒకతులం వెండిని కరగించి యందు శుద్ధవంగము నొకతులము వైచి నీళ్ళలో చల్లార్చి చూర్ణించి దానిని కూతురుబుడమాకురసముతో నుడికించి యొకపుటము వేసినచో చక్కగ భస్మమగును.

శుద్ధిగావింపబడిన రజతమును పలుచనిరేకులుగా గొట్టి వానిని ముత్తవపులగపు వేరుపట్టముద్దలో పెట్టవలెను. పిదప కుక్కపొగాకు రసముతో తడిపి ఆరవేయబడిన గుడ్డను ఆముద్దకు చుట్టి జనపనారతో గట్టిగాకట్టి పుటము వేయవలెను. చక్కని భస్మమగును. అనుభూతయోగము.

## —♦ రౌప్యరసాయనము ♦—

మూ. భస్మీభూతం రజతమమలం తత్సమా వ్యోమభానూ
సర్వైస్తుల్యం త్రికటుకవరం సారఘాజ్యేన యుక్తం
లీఢం ప్రాతః క్షపయతి తరాం యక్ష్మపాండూదరార్శః
శ్వాసం కాసం నయనజరుజః పిత్తరోగా నశేషాన్॥

తా. పైజెప్పినట్లు శోధనమారణములజేసిన రజతభస్మముతో శతపుటకృష్ణాభ్రకమును తామ్రభస్మమును సమభాగములుగ జేర్చి అన్నిటికి సమముగ త్రికటుకచూర్ణమును కలిపి బలానుసారముగ నేయి, తేనె కలిపి ప్రాతఃకాలమున సేవించినచో క్షయ, పాండు, ఉదర, అర్శః, శ్వాస, కాస, నేత్ర పిత్తరోగములు హరించును.

## —♦ రౌప్యద్రుతి ♦—

మూ. సప్తధా నరమూత్రేణ భావయే ద్దేవదాళికాం
తచ్చూర్ణావాపమాత్రేణ ద్రుతిస్స్యాత్స్వర్ణతారయోః॥

తా. దేవదాలిని యేడుమారులు నరమూత్రముతో భావనచేసి యెండించి చూర్ణించి వెండి కరగునపుడు ఆచూర్ణమును ప్రతీవాపముచేసినచో వెండి ద్రవరూపమున నిలచియుండును. స్వర్ణద్రుతికూడ యిట్లే చేయవచ్చును.

## — ♦తామ్రము♦ —

మూ. మ్లేచ్ఛం నేపాలకం చేతి తయో ర్నేపాలకం వరం
నేపాలా దన్యఖన్యుత్థం మ్లేచ్ఛమి త్యభిధీయతే॥
సితకృష్ణారుణచ్ఛాయము మతివామి కఠోరకం॥
క్షాళితంచ పునః కృష్ణ మేతన్మ్లేచ్ఛక తామ్రకం
సుస్నిగ్ధం మృదులం శోణం ఘనఘాతక్షమం గురు
నిర్వికారం గుణశ్రేష్ఠం తామ్రం నేపాలముచ్యతే॥
పాండురం కృష్ణశోణంచ లఘుస్ఫుట నసంయుతం
రూక్షాంగం సదళం తామ్రం నేష్యతే రసకర్మణి॥

తా॥ మ్లేచ్ఛము, నేపాలము అని రాగి రెండు విధములు. అందు నేపాలముత్తమము. నేపాలదేశపుగనులందు పుట్టు తామ్రము నేపాలతామ్ర మనబడును. తదన్యమైనది మ్లేచ్ఛ తామ్రము. మ్లేచ్ఛతామ్రము తెలుపు, నలుపు, యెరుపు కలసినరంగుగలదై మిగులవాంతి కరమై సాగగొట్టునపుడు కఠినముగ నుండును. మాలిన్యము పోగొట్టు అమ్లరసముతో తోమినను మగల నల్లబడును. నేపాలతామ్రము నునుపుగను మెత్తగను సమ్మెటతో గొట్టిన పొడిపొడిగ నలిగిపోకయుండునదిగను యెఱ్ఱని కాంతిగలదిగను వమనాది వికార రహితముగను ఉత్తమగుణములు కలదిగను ఉండును. తెల్లగనైనను నలుపు యెరుపుకలసిన రంగుకలదిగనైనను తేలికగనైనను పగుళ్లుగలదైనను పెళుసైనను పొరలుగలదైనను తామ్రము రసకర్మయం దుపయోగింపజనదు.

## —♦ తామ్రగుణము ♦—

మూ. తామ్రం తిక్తకషాయకంచ మధురం పాకేథ వీర్యోష్ణకం
సామ్లం పిత్తకఫాపహం జఠరరుక్కుష్ఠామజం త్వంతకృత్
ఊర్ధ్వాధః పరిశోధనం విషయకృత్ స్థౌల్యాపహం క్షుత్కరం
దుర్నామక్షయ పాండురోగ శమనం నేత్రం పరం లేఖనం.

తా॥ తామ్రము తిక్తకషాయరసములను మధురవిపాకమును ఉష్ణవీర్యమును గలది. ఆమ్లపిత్తము, కఫము, జఠరవ్యాధి, కుష్ఠము, ఆమవాతము, కృమి, స్థౌల్యము, మూల వ్యాధి, క్షయ, పాండు, నేత్రరోగములు వీనిని హరించును. వమనవిరేచనములం జేయును. ఆకలి బుట్టించును. లేఖనకారిగ నుండును.



## —♦ అశుద్ధ తామ్రగుణము ♦—

మూ. అశుద్ధతామ్ర మాయుర్ఘ్నం కాంతివీర్య బలాపహం
వాంతిమూర్ఛాభ్రమోత్క్లేదం కుష్ఠం శూలం కరోతి తత్
ఉత్క్లేద భేద భ్రమదాహ మోహా స్తామ్రస్య దోషాఃఖలు దుర్ధరా స్తే
విశోధనా త్తద్విగతస్వదోషం సుధాసమం స్యా ద్రసవీర్యపాకే.

తా॥ అశుద్ధతామ్రము ఆయువును బలమును కాంతిని వీర్యమును హరించును. వాంతి మూర్ఛ, భ్రమ, ఉత్క్లేదము, కుష్ఠము, మూలరోగము, శూల వీనిని బుట్టించును. ఆ యాసము, భ్రాంతి, త్రిప్పట, తాపము, మూర్ఛ అనుదోషములు తామ్రమందు గలవు, కాన చక్కగా శోధనచేసినచో దోషరహితమై రసవీర్యవిపాకములయందు అమృత సమమై యుండును.

## —♦ తామ్రశుద్ధి ♦—

మూ. తామ్రం క్షారామ్లసంయుక్తం ద్రాపితం దత్తగైరికం
నిక్షిప్తం మహిషీ తక్రే భగణే సప్తవారకం
పంచదోష వినిర్ముక్తం భస్మయోగ్యంహి జాయతే
తామ్ర నిర్మలపత్రాణి లిప్త్వా నింబ్వంబు సింధునా
ధ్మాత్వా సౌవీరక క్షేపా ద్విశుధ్య త్యష్టవారతః
నింబ్వంబు పటులిప్తాని తాపితా న్యష్టవారకం
విశుధ్యం త్యర్కపత్రాణి నిర్గుండ్యా రసమజ్జనాత్.
గోమూత్రేణ పచేద్యామం తామ్రపత్రం దృఢాగ్నినా
శుధ్యతే నాత్రసందేహో మారణంచాప్యధోచ్యతే॥

తా. తామ్రపురేకులకు అమ్లవర్గముతోనూరినక్షారములను పట్టించి యేరుపిడ కలలో కాల్చి గేదెమజ్జిగలో యేడుసారులుముంచినయెడల పంచదోషరహితమై భస్మముచేయుట కర్హమగును.

పొరలులేని రాగిరేకులకు నిమ్మపండ్లరసముతో ఉప్పును నూరి పట్టించి నిప్పులలో కాల్చి కాంజికమునందు ముంచవలెను. ఇట్లెనిమిది పర్యాయములు చేసిన రాగి శుద్ధమగును.

పైవిధముగ కాల్చి వావిలియాకు రసమున నెనిమిది పొర్లు చల్లార్చినను రాగి శు ద్ధమగు. రాగిరేకులను గోమూత్రములోనుంచి యొకజాము వండిన నిస్సంశయముగ శుద్ధ మగును.

### —♦ తామ్రమారణము ♦—

మూ. జంబీర రససంపిష్ట రసగంధక లేపితం
శుల్బపత్రం శరావస్థం త్రిపుటైర్యాతి పంచతాం
అథవా మారితం తామ్రం ఆమ్లేనైకేన మర్దితం
తద్గోళం సూరణస్యాంతా రుద్ధ్వా సర్వత్ర లేపయేత్
శుష్కం గజపుటే పచ్యాత్ సర్వదోషహరం భవేత్
వాంతిం భ్రాంతిం విరేకంచ నకరోతి కదాచన
తామ్రపత్రాణి సూక్ష్మాణి గోమూత్రే పంచయామకం
క్షిప్త్వా రసేనభాండే తద్ద్విగుణాం దేహి గంధకం
అమ్లపర్ణీం ప్రపిష్యాథ హ్యాభితో దేహి తామ్రకే
సముజ్ఝి రుధ్యభాండే తమగ్నింజ్వాలయా యామకం
భస్మీ భవతి తామ్రం తద్యథేష్టం వినియోజయేత్
సూతా ద్విగుణితం తామ్రపత్రం కన్యారసైః ప్లుతం
పిష్ట్వా తుల్యేన బలినా భాండమధ్యే వినిక్షిపేత్
ఛన్నం శరావకేనైతత్ తదూర్ధ్వం లవణం త్యజేత్
ముఖే శరావకం దత్త్వా వహ్నిం యామ చతుష్టయం
అపచూర్ణ్యైవ తచ్ఛుల్బం వల్లమాత్రం ప్రయోజయేత్
పిప్పలీ మధునాసార్ధం సర్వరోగేషు యోజయేత్
శ్వాసం కాసం క్షయం పాండుం అగ్నిమాంద్య మరోచకం
గుల్మప్లీహయకృన్మూర్ఛా శూలం పక్తి సంజ్ఞికం
దోషత్రయసముద్భూతా నామయాన్ జయతి ధ్రువం
రోగానుపానసహితం జయేద్ధాతుగతం జ్వరం
రసే రసాయనే తామ్రం యోజయేద్యుక్తమాత్రయా॥

తా॥ రసగంధకములను నిమ్మపండ్లరసముతో నూరి రాగిరేకులకుపట్టి శరావసంపుట మందిడి మూడుపుటములు వేసిన భస్మమగును. ఇట్లుచేసిన భస్మమును ఆమ్లరసముతో నూరి అడవికందదుంపలో బెట్టి చీరజేసి గజపుటము వేసిన సర్వదోషరహితమై వాంతులను విరేచనములను కల్గించక చక్కగ పనిచేయును.

తామ్రపురేకులను అయిదుజాములు గోమూత్రములోనుంచి రెట్టింపురసగంధకములతో చేర్చి పులిచింతాకుముద్దలో పెట్టి మన్నుపూడి యెండించి భాండమందుంచి ఒక జాము వండిన భస్మమగును. దానిని స్వేచ్ఛగ వాడుకొనవచ్చును.



రసభస్మము ఒకభాగము, రాగిరేకులు రెండుభాగములు గ్రహించి కలంబందరసముతో నూరి అందు సమముగ గంధకమును చేర్చి యొకభాండమందుంచి పైన మూకుడు మూసి దానిని వేరొకకుండలో బెట్టి పైన, క్రింద ఉప్పుపోసి యాకుండకుమూతిమూసి చీరజేసి నాల్గుజాములువండి స్వాంగశీతలమున రాగిరేకులందీసి చూర్ణించి అందువల్ల ప్రమాణముగ పిప్పలిచూర్ణము, తేనె కలిపి సేవించిన సర్వరోగములు హరించును. దీని వలన శ్వాసకాసలు, క్షయ, పాండువు, అగ్నిమాంద్యము, ఆరోచకము, గుల్మము, ప్లీహ, యకృత్, పక్తిశూల, త్రిదోషవికారములు మొదలగునవి కుదురును. యుక్తానుపానముతో వాడిన ధాతుగతజ్వరము హరించును. రస రసాయనములందు యుక్తమగు మాత్రను వాడవలెను.

### —♦ సోమనాథీయ తామ్రభస్మవిధి ♦—

మూ. శుల్బతుల్యేన సూతేన బలినా తత్సమేనచ
తదర్ధాంశేన తాళేన శిలయాచ తదర్ధయా
విధాయ కజ్జలీం శ్లక్ష్ణాం భిన్నకజ్జలసన్నిభాం
యంత్రాధ్యాయ వినిర్దిష్ట గర్భయంత్రోదరాంతరే
కజ్జలీం తామ్రపత్రాణి పర్యాయేణ వినిక్షిపేత్
ప్రపచేద్యామపర్యంతం స్వాంగశీతం ప్రచూర్ణయేత్
తత్తద్రోగహరానుపానసహితం తామ్రం ద్వివల్లోన్మితం
సంలీఢం పరిణామశూల ముదరం శూలంచ పాండుజ్వరం
గుల్మ ప్లీహయకృత్ క్షయాగ్నిసదనం మేహంచ మూలామయం
దుష్టాంచ గ్రహణీం హరేద్ధ్రువ మిదం శ్రీసోమనాథాభిధం॥

తా॥ రాగిరేకులు రసభస్మము గంధకము యివి ప్రత్యేకము ఒకభాగము, తాళకము అర్ధభా॥ మణిశిల పాతికభా॥ వీనిని మృదువుగ కజ్జలిచేసి యంత్రాధ్యాయమందు చెప్పబడిన గర్భయంత్రమందు రాగిరేకులను కజ్జలిలోనుంచి (కొంచెము కజ్జలిపరచి యొక రేకుంచి పైన కజ్జలిపోసి మరల రేకును పెట్టి యిట్లు కజ్జలిలో రేకులను పూడ్చవలెననుట) ఒకయామమువండి స్వాంగశీతలమున రాగిరేకులను తీసి చూర్ణించి ఆయారోగములకనుకూలములగు అనుపానములతో రెండు వల్లవముల పరిమాణముగ నిచ్చినయెడల పరిణామశూల మొదలగు శూలలు, ఉదరరోగము, పాండువు, జ్వరము, గుల్మము,

ప్లీహ, యకృత్, క్షయ, అగ్నిమాంద్యము, మేహము, మూలరోగము, అసాధ్యగ్రహణీ రోగము నిశ్చయముగ హరించును. సోమనాథసిద్ధునిచే నీయోగము చెప్పబడెను గావున దీనికి సోమనాథీయ తామ్రభస్మమని పేరు.

వృద్ధోపదేశము:—నాలుగుఅంగుళముల లావుగల ఊడుగువేరు అడుగు పొడుగు గలుగునట్లు కోసి మధ్యభాగమున తొరటగావించి అందు శుద్ధిచేసిన రాగిరేకును పెట్టి ఊడుగువేరుచెక్కతో మూతవేసి రెండు, మూడు చీరలుజేసి గజపుటము వేసినయెడల తామ్రము తెల్లని భస్మమగును. దీనిని ఒకగుంజలో నాల్గవవంతుచొ॥ అయిదుమోతాదులకన్న నెక్కువ వాడరాదు. ఉబ్బసము, క్షయ, కుష్టము కుదురును. ఇంకను మరికొన్నియోగములు మా వైద్యకల్పద్రుమముయొక్క భస్మసిందూరప్రకరణమునం జూడనగును.

ఇరువదితులముల శుద్ధతామ్రపురేకులను పదహారుతులముల మోడిచూర్ణము మధ్యనుంచి గోనెపట్టాలోచుట్టి పదునైదుపిడకలతో పుటము వేయవలెను. ఆరేకులు మిగుల పెళుసుగల్గినవగును. వానిని చూర్ణించి వెన్నతో నూరి యొకపుటమును, నిమ్మపండ్లరసముతో నూరి యొకపుటమును వేసినయెడల తెల్లగా భస్మమగును.

ప్రమాణము, వాదమంజరి:—

"చతుష్పలమితంచూర్ణే కణా మూలస్య మధ్యగం
పలపంచమితం తామ్రం దహేత్కుక్కుటకే పుటే
తత స్సుచూర్ణితం ఖల్వే నవనీతేన మిశ్రితం
పూర్వవత్పుటసందగ్ధం జంబీరరసమర్దితం
సుశ్వేతంచ నిరుత్థంచ భస్మ సంజాయతే ధ్రువం॥"

## —♦ లోహము ♦—

మూ. ముండం తీక్ష్ణంచ కాంతంచ త్రిప్రకారమయస్స్మృతం॥
ముండము, తీక్ష్ణము, కాంతము అని లోహము మూడుతెరగులు.

## —♦ ముండలోహము ♦—

మూ. మృదుకుంఠం కడారంచ త్రివిధం ముండముచ్యతే
ద్రుతద్రావ మవిస్ఫోటం చిక్కణం మృదు తచ్ఛుభం
హతం యత్ప్రసరే ద్దుఃఖాత్ తత్కుంఠం మధ్యమం స్మృతం
యద్ధతం భజ్యతే భంగే కృష్ణం స్యాత్కడారకం



ముండం పరం మృదులకం కఫవాతశూల మూలామ మేహ
[గద కామల పాండుహారి
గుల్మామవాతజఠరార్తిహరం ప్రదీపి శోఫాపహం రుధిరకృత్ఖలు
[కోష్ఠశోధి॥
అశుద్ధలోహం సహితం నిషేవణా దాయుర్బలం కాంతి వినాశి
[నిశ్చితం
హృది ప్రపీడాం తనుతేహ్యపాటవం రుజం కరోత్యేవ విశోధ్య
[మారయేత్॥

తా. మృదువు, కుంఠము, కడారము అని ముండలోహము మూడుతెరంగులు. కరిగించినచో వెంటనే కరుగుస్వభావము గలదియు స్ఫోటము (బొబ్బలు) లు లేనిదియు చిక్కనైనదియు నగులోహము మృదుముండ మనబడును. ముండలోహభేదములం దిది యుత్తమము. సాగకొట్టినచో కష్టముమీద సాగునది కుంఠమనబడు. ఇది మధ్యమము సాగకొట్టినప్పుడు ముక్కలు విరుగునదియు విరిగినచోట నల్లనిరంగుగలదియు కడారమనబడును. ఇది అధమము.

గుణము:—మృదుముండము కఫవాతములను, శూలను, మూలరోగమును, మేహమును, కామిలాపాండువులను, గుల్మమును, ఆమవాతమును, జఠరరోగమును, శోఫను హరించును. శుద్ధరక్తమును పుట్టించును. కోష్ఠమును శోధించును.

అపరిశోధితలోహసేవచే ఆయువు, బలము, కాంతి హరించును. హృదయమందు పీడ, నిస్సత్త్వము గలుగును. కాన చక్కగ శోధనమారణముల జేసి సేవించవలెను.

## —♦ తీక్ష్ణలోహము ♦—

మూ. ఖరం సారంచ హృన్నాళం తారావట్టంచ వాజిరం
కాలలోహాభిధానంచ షడ్విధం తీక్ష్ణముచ్యతే
పరుషం పోగరోన్ముక్తం భంగే పారదవచ్ఛవి
నమనే భంగురం యత్తు త్ఖరలోహ ముదాహృతం
వేగభంగురధారం యత్సార లోహం తదీరితం
పోగరాభాసకం పాండు భూమిజం సారముచ్యతే
కృష్ణపాండు వపుశ్చంచు బీజతుల్యో రుపోగరం

ఛేదనేచాతి పరుషం హృన్నాళ మితి కథ్యతే
అంగచ్ఛాయాచ వంగంచ పోగరస్యాభిధాత్రియం
చికురం భంగురం లోహాత్ పోగరం తత్పరం మతం
పోగరై ర్వజ్రిసంకాశై స్సూక్ష్మరేఖైశ్చ సాంద్రికైః
నిచితం శ్యామలాంగంచ వాజిరం తత్ప్రకీర్త్యతే
నీలకృష్ణప్రభం సాంద్రం మసృణం గురుభాసురం
లోహాఘాతే ప్యభం గాత్మధారం కాలాయ సంమతం
రూక్షం స్యాత్తీక్ష్ణలోహాకం సమధురం పాకేథవీర్యే హిమం
తిక్తోష్ణం కఫపిత్త కుష్ఠజఠర ప్లీహామ పాండ్వార్తిజిత్
సద్యశ్శూల యకృద్గదక్షయ జరామేహామ వాతాపహం
దీప్తం చాతిరసాయనం బలకరం దుర్నామదాహాపహం
ఖరలోహాత్పరం సర్వ మేకైకస్మా చ్ఛతోత్తరం॥

తా. ఖరము, సారము, హృన్నాళము, తారావట్టము, వాజిరము, కాలలోహము అని ఉక్కు ఆరువిధములు.

రససారము:—"ఖరసారంచ హోత్రాగ్రం తారావర్తం బిడం తథా
కాలలోహం గజాఖ్యంచ షడ్విధం తీక్ష్ణముచ్యతే॥"

అని తీక్ష్ణలోహనామములు కొంచెము భిన్నముగ నగపడుచున్నవి.

కఠినమై చారలులేక వంచినచో విరుగునట్టి స్వభావముగలిగి పరిగినపుడు పాదరసమువంటి తెల్లనికాంతి గలిగియుండు ఉక్కు ఖరలోహ మనబడును. వేగముగ విరుగు స్వభావముగల పదనును, చారలవలె తెల్లని రచనలను గలిగి పాండుభూమియందు పుట్టునది సారలోహమనబడు. నలుపు తెలుపు కలసిన వర్ణముగలిగి ఆముదపు విత్తులయందువలె తెల్లనిచారలు గలిగి సరుకుటుకు కఠినమైయుండునది హృన్నాళిమనబడు.

అంగచ్ఛాయ, వంగము, పోగరము అని రేఖలకు మూడుపేర్లు. వీనికే చికురము భంగురము పోగరమునని మతాంతరమున నామములై యున్నవి. వజ్రమువంటి కాంతికల పెద్దరేఖలును వానినడుమ దట్టముగ వ్యాపించియుండు సూక్ష్మరేఖలును గలిగి నీలవర్ణముగనుండునది వాజిరలోహ మనబడును. నీలవర్ణముగను, కృష్ణవర్ణముగను ఉండు మెరుపుగలదియు చిక్కగను నునుపుగను బరువుగను కాంతివంతముగను యినుముపై బెట్టి కొట్టిన మొక్కపోనిదిగను ఉండునది కాలాయసలోహ మనబడును.



గుణము:—తీక్ష్ణలోహము రూక్షముగను, మధురవిపాకముకలదిగను శీతవీర్యమును తిక్తోష్ణగుణములను కలదిగను, కఫ, పిత్త, కుష్ఠ, జఠర, ప్లీహ, ఆమ, పాండు శూల, యకృత్, క్షయ, జరా, మేహ, ఆమవాత, అర్శోదాహములను,రోగములను, పోగొట్టునదిగను అగ్నిదీప్తిని బలమును యిచ్చునదిగను ఉండును. ఖరలోహముకన్న సారము,సారముకంటె హృన్నాళము, దీనికంటె తారావట్టము, దీనికన్న వాజిరము, దీనికన్న కాలాయసము నూరురెట్లు యెక్కువగుణవంతములై యుండును.

## —♦ కాంతలోహము—భేదములు ♦—

మూ. భ్రామకం చుంబకంచైవ కర్షకం ద్రావకంతథా
ఏవం చతుర్విధం కాంతం రోమకాంతంచ పంచమం
ఏక ద్విత్రి చతుష్పంచ సర్వతోముఖ మేవతత్
పీతం కృష్ణం తథారక్తం త్రివర్ణం స్యాత్పృథక్ పృథక్
క్రమేణ దేవతా స్తత్ర బ్రహ్మవిష్ణు మహేశ్వరాః
స్పర్శవేధి భవేత్పీతం కృష్ణం శ్రేష్ఠం రసాయనే
రక్తవర్ణం తథాచాపి రసబంధే ప్రశస్యతే
భ్రామకంతు కనిష్ఠంస్యా చ్చుంబకం మధ్యమం తథా
ఉత్తమం కర్షకంచైవ ద్రావకం చోత్తమోత్తమం
భ్రామయే ల్లోహజాతం యత్త త్కాంతం భ్రామకం మతం
చుంబయే చ్చుంబకం కాంతం కర్షయే త్కర్షకం తథా
సాక్షాద్యద్రావయే ల్లోహం తత్కాంతం ద్రావకం మతం
తద్రోమకాంతం స్ఫుటితాద్యతో రోమోద్గమో భవేత్
కనిష్ఠం స్యా దేకముఖం మధ్యం ద్వి త్రిముఖం భవేత్
చతుష్పంచముఖం శ్రేష్ఠం ఉత్తమం సర్వతోముఖం
భ్రామకం చుంబకంచైవ వ్యాధినాశే ప్రశస్యతే
రసే రసాయనేచైవ ద్రావకం కర్షకం హితం
షట్త్రోన్మత్త గజస్స్యాతః కాంతమంకుశ ముచ్యతే
క్షేత్రం జ్ఞాత్వా గృహీతవ్యం తత్ప్రయత్నేన ధీమతా
మారుతాతప విక్షిప్తం వర్జయే న్నాత్ర సంశయః॥

తా. భ్రామకము, చుంబకము, కర్షకము, ద్రావకము, రోమకము అని కాంత

మైదువిధములు. లోహము నాకర్షించు పార్శ్వములనుబట్టి యిది ఏకముఖము ద్విముఖము త్రిముఖము చతుర్ముఖము పంచముఖము సర్వతోముఖమునని ఆఱువిధములు. భ్రామకాదికాంతములు ప్రత్యేకము పసుపు నలుపు యెఱుపురంగులతో భేదించియుండును. పచ్చనికాంతమునకు బ్రహ్మయు నల్లనికాంతమునకు విష్ణువును, యెఱ్ఱనికాంతమునకు రుద్రుడును అధిదేవతలై యుందురు. పీతకాంతము రసవాదప్రక్రియలందు స్పర్శవేధకును కృష్ణకాంతము రసాయనమందును రక్తకాంతము రసబంధనమందును పనికి వచ్చును. భ్రామకము కనిష్ఠము. చుంబకము మధ్యమము. కర్షకముత్తమము. ద్రావకమన్నిటికన్న మంచిది.

కాంతమునకు సమీపమునందినుమునుంచినయెడల నాయినుమును గిరగిర తిరుగునట్లు చేయునది భ్రామకము. ఇనుమునకు తగిలించినచో అంటిపట్టుకొని యుండునది చుంబకము. ఇనుమును నాకర్షించునది కర్షకము. ఇనుము నొకచోటనుంచి కాంతమును దానికి చూపినచో నాఇనుము పరువెత్తి వచ్చునేని అది ద్రావక మనబడును. కాంతమును పగులగొట్టిన నందు వెండ్రుకలవంటి తీగలుండిన నది రోమకము.

భ్రామకచుంబక కాంతములు వ్యాధినాశనార్థమై చేయు ఔషధయోగములందు చేర్పదగియుండును. కర్షకము రసబంధాది ప్రక్రియలందు ఉపయుక్తము. ద్రావకము రసాయనముల కర్హమైనది.

పాదరసము మదించిన యేనుగువంటిది. కాంతము అంకుశమువంటిది. (అనగా కాంతము రసబంధము చేయునను) గాలి, యెండ తగిలిన కాంత మప్రశస్తము కావున క్షేత్రమును పరిశీలించి వైద్యుడు కాంతమును గ్రహించవలెను.

—◆ కాంతలోహలక్షణము ◆—

మూ. పతేద్యస్య ప్రసరతి జలే తైలబిందుర్నలిప్తం
గంధం హింగు త్యజతిచ తథా తిక్తతాం నింబకల్కః
పాకే దుగ్ధం భవతి శిఖరాకారతాం నైతిభూమౌ।
కాంతం లోహం తదిద ముదితం లక్షణోక్తంచ నాన్యత్
కాంతా యోతి రసాయనోత్తరతరంస్వస్థే చిరాయుః ప్రదం
స్నిగ్ధం మేహాహరం త్రిదోషశమనం శూలామ మూలాపహం
గుల్మ ప్లీహ యకృత్ క్షయామయహరంపాండూదరవ్యాధినుత్
తిక్తోష్ణం హిమవీర్యకం కిమురం యోగేన సర్వార్తినుత్



సమ్యగౌషధకల్పానాం లోహకల్పః ప్రశస్యతే
తస్మాత్సర్వ ప్రయత్నేన శుద్ధం లోహంతు మారయేత్
నాయుః పంచేత్పంచపలాదర్వా గూర్ధ్వం త్రయోదశాత్
ఆదౌ మంత్రిస్తతః కర్మ కర్తవ్యం మంత్రఉచ్యతే।
"ఓం అమృతోద్భవాయస్వాహా" ఇత్యనేన లోహమారణం।
లక్షోత్తరగుణం సర్వం లోహంస్యాదుత్తరోత్తరం
కాంతకోటి గుణం తత్ర తదప్యేవం గుణోత్తరం॥

తా. కాంతలోహపాత్రలో ఉదకమును పోసి అందు తైలబిందువును విడచినచో నది వ్యాపించదు. కాంతపాత్రయందు యింగువను వేసిన దానివాసన నశించును. వేపాకు ముద్దను వేసిన దాని చేదుగుణము పోవును. యింకను ఆపాత్రలో పాలుపోసి కాచినచో పాలు పైకి పొడవుగా పొంగునేగాని క్రిందబడవు. ఇట్టిలక్షణములుగలది కాంతలోహమని యెఱుంగునది.

గుణము:—కాంతము మంచిరసాయనము స్వస్థులు (ఆరోగ్యవంతులు) దీనిని సేవించిన ఆయువు వృద్ధియగును. స్నిగ్ధముగా నుండు మేహము త్రిదోష వికారములు శూల ఆమము మూలరోగము గుల్మ ప్లీహ యకృతులు క్షయ పాండువు ఉదరరోగములు వీనిని నశింపచేయును. తిక్తోష్ణమైనది. శీతవీర్యము. యోగములలో చేర్చి వాడిన సర్వరోగహరము.

మంచియౌషధకల్పములలో లోహకల్ప ముత్తమము. గాన ప్రయత్నపూర్వకముగ వైద్యుడు లోహమునకు శోధనమారణముల జేసికొనవలెను. శోధనమారణార్థమై గ్రహింపబడిన లోహము అయిదుపలములకు తక్కువగను పదమూడుపలముల కెక్కువగను నుండగూడదు. "ఓం అమృతోద్భవాయస్వాహా" అనుమంత్రమును ఉచ్చరించి లోహశోధనాది కర్మల నుపక్రమించమించవలెను.

లోహములలో ఖర, సార, హృన్నాళాదులు ఉత్తరోత్తరముగ కోటిగుణాధికములు. లోహముకన్న కాంతము కోటిరెట్లు గుణవత్తరము. కాంతభేదములగు భ్రామక చుంబకాదులును ఉత్తరోత్తర కోటి గుణాధికములు.

—◆ సర్వలోహశుద్ధి ◆—

మూ. [illegible]క్షుతజ సంలిప్తం త్రివారం పరితాపితం
ముండాది సకలం లోహం సర్వదోషా న్విముంచతి

క్వాథ్య మష్టగుణే తోయే త్రిఫలా షోడశం పలం
తత్క్వాథే పాదశేషేతు లోహస్య పలపంచకం
కృత్వా పత్రాణి తప్తాని సప్తవారం నిషేచయేత్
ఏవం ప్రలీయతే ధాతు ర్గిరిజో లోహసంభవః॥
సముద్రలవణోపేతం తప్తం నిర్వాపితం ఖలు॥
త్రిఫలాక్వథితే నూనం గిరిదోషమయ స్త్యజేత్
చించాపత్ర జలక్వాథాదయో దోషముదస్యతి॥
యద్వా ఫలత్రయో త్రియోపేతం గోమూత్రే క్వథితంఖలు॥

తా॥ కుందేటినెత్తురును లోహపురేకులకు పూసి కాల్చవలెను. ఇట్లు మూడుసార్లు చేసిన శుద్ధమగును. ఇటుల సర్వలోహములు శుద్ధినందును. పదహారుపలముల త్రిఫలములను యెనిమిదిరెట్లు నీటిలోవేసి నాల్గవవంతు మిగులునటుల కషాయము కాచి, అయిదుపలముల పరిమాణముగల లోహపురేకులను కాల్చి యాకషాయమందు ఏడుసారులు ముంచవలెను. ఇట్లుచేసినచో పర్వతసంబంధములగు లోహదోషములు నివర్తించును. సముద్రలవణమును నూరి లోహపురేకులకు పట్టించి యెర్రగ కాల్చి త్రిఫలకషాయమున ముంచిన పర్వతజనితదోషములు నివర్తించును. చింతాకురసము లేక కషాయమునందుగాని త్రిఫలాకషాయమందుగాని గోమూత్రమందుగాని లోహపురేకులను వండినచో నవి పరిశుద్ధములగును.

## ——♦ సర్వలోహభస్మవిధి ♦——

మూ. రేచితం ఘృతసంయుక్తం క్షిప్త్వాయః ఖర్పరే పచేత్
చాలయేల్లోహదండేన యావత్ క్షిప్రం తృణం దహేత్
పిష్ట్వా పిష్ట్వా పచేదేవం పంచవార మతఃపరం
ధాత్రీఫలరసైర్యద్వా త్రిఫలా క్వథితోదకైః॥
పుటేల్లోహం చతుర్వారం భవేద్వారితరం ఖలు
స్నేహోక్తం లోహరజో మూత్రే స్వరసేపి రాత్రి ధాత్రీణాం
పృథగేవం సప్తకృత్వో భర్జితమఖిలామయే యోజ్యం
తీక్ష్ణలోహస్య పత్రాణి నిర్దలాని దృఢేనలే
ధ్మాత్వా క్షిపే జ్జలేసద్యః పాషాణోలూఖలోదరే
ఖండయేద్గాఢనిర్ఘాతైః స్థూలయా లోహపారయా



తన్మధ్యే స్థూలఖండాని రుధ్వా మల్లద్వయాంతరే
ధ్మాత్వా క్షిప్త్వా జలే సమ్యక్ పూర్వవత్ఖండయేత్ఖలు
తచ్చూర్ణం సూత గంధాభ్యాం పుటేద్వింశతివారకం
పుటేపుటే విధాతవ్యం పేషణం దృఢవత్తరం
ఏవం భస్మీకృతం లోహం తత్తద్రోగేషు యోజయేత్
హింగుళస్య పలాన్ పంచనారీ స్తన్యేన పేషయేత్
తేన లోహస్య పత్రాణి లేపయేత్పలపంచకం
రుధ్వాగజపుటైః పచ్యాత్కషాయై స్త్రైఫలైః పునః
జంబీరై రారనాళైశ్చ వింశత్యంశేన హింగుళం,
పిష్ట్వా రుధ్వా పచేల్లోహం తద్రవైః పాచయేత్పునః॥
చత్వారింశ త్పుటైరేవం కాంతం తీక్ష్ణంచ ముండకం॥
మ్రియతే నాత్రసందేహో దత్త్వా దత్త్వైవ హింగుళం
అథ పూర్వోదితం తీక్ష్ణం వసుభల్లకవాసయోః॥
పుటితం పత్రతోయేన త్రింశ ద్వారాణి యత్నతః॥
శోణితం జాయతే భస్మకృతసిందూర విభ్రమం॥
యద్వా తీక్ష్ణదళోద్భూతం రజశ్చ త్రిఫలాజలైః।
పిష్ట్వా దత్త్వోదనం కించి చ్చక్రికాం ప్రవిధాయచ॥
శోషయిత్వాతియత్నేన ప్రపచేత్పంచభిః పుటైః।
రక్తవర్ణంహి తద్భస్మ యోజనీయం యథాయథం॥
మత్స్యాక్షీగంధవాహ్లీకైః లకుచద్రావపేషితైః।
విలిప్య సకలం లోహం మత్స్యాక్షీ కల్కలేపితం॥
భస్త్రాభ్యాం సుదృఢం ధ్మాత్వా త్రిశూలీ నిర్గమావధి॥
అథోద్ధృత్య క్షిపేత్క్వాథే త్రిఫలాగోజలాత్మకే॥
తస్మాదాహృత్య సంతాప్య మృతమాదాయ లోహకం॥
పునశ్చ పూర్వవద్ధ్మాత్వా వారయే దఖిలాయసం॥
ఖండయిత్వా తతో గంధ గుడ త్రిఫలయాసహ
పుటేత్త్రింశతి వారాణి నిరుత్థం భస్మజాయతే
సమగంధ మయశ్చూర్ణం కుమారీ వారిభావితం

పుటీకృతం కియత్కాలం అవశ్యం మ్రియతే హ్యయః
జంబీరరససంయుక్తే దరదే తప్తమాయసం
బహువారం వినిక్షిప్తం మ్రియతే నాత్రసంశయః
గోమూత్రైస్త్రిఫలాక్వాథ్యా తత్కషాయేణ భావయేత్
త్రిస్సప్తాహం ప్రయత్నేన దినైకం మర్దయేత్పునః॥
రుద్ధ్వా గజపుటే పచ్యా ద్దినం క్వాథేన మర్దయేత్
దివామర్ద్యం పుటే ద్రాత్రౌ ఏకవింశ ద్దినావధి
ఏకవింశత్పుటై రేవం మ్రియతే త్రివిధం హ్యయః
యత్పాత్రా ధ్యుషితే తోయే తైలబిందు ర్నసర్పతి
తారేణావర్తతే యత్ర త్కాంతలోహం తనూకృతం
అయసా ముత్తమం సించే త్తప్తం తప్తం వరారసే
ఏవం శుద్ధాని లోహాని పిష్టాన్యమ్లేన కేన చిత్
మృతసూతస్య పాదేన ప్రలిప్తాని పుటానలే
పచేత్తుల్యస్య వాతాప్య గంధాశ్మహర తేజసః
తప్తం క్షారామ్లసంలిప్తం శశరక్తేన వాపితం
కాంతలోహం భవే ద్భస్మ సర్వదోష వివర్జితం
శుద్ధం సూతం ద్విధా గంధం ఖల్వేన కృతకజ్జలం
ద్వయోస్సమం లోహచూర్ణం మర్దయే త్కన్యకాద్రవైః
యామద్వయాత్సముద్ధృత్య తద్గోళం కాంస్యపాత్రకే
ఆచ్ఛాద్యైరండపత్రైశ్చ యామార్ధే త్యుష్ణతాం వ్రజేత్
ధాన్యరాశౌ న్యసేత్పశ్చాత్ త్రిదినాంతే సముద్ధరేత్॥
సంపేష్య గాలయే ద్వస్త్రే సత్యం వారితరం భవేత్
కాంతం తీక్ష్ణంచ ముండంచ నిరుత్థం జాయతేమృతం
స్వర్ణాదీన్ మారయేదేవం చూర్ణం కృత్వాచ లోహవత్
సిద్ధయోగోహ్యయం ఖ్యాతః సిద్ధానాం సుముఖాగతః
అనుభూతం మయాసత్యం సర్వరోగజరాపహం
త్రిఫలామధుసంయుక్తం సర్వరోగేషు యోజయేత్॥

తా. లోహచూర్ణమును యినుపమూకుడులో పోసి నేయి వేసి వేయించుచు



లోహదండముతో రుద్దుచుండవలెను. గడ్డిపరక వేసినయెడల తక్షణమే కాలిపోవునంతవరకు వేయించి ఖల్వములోనుంచి నూరునది. ఇట్లు అయిదుసారులు వేయించి ఉసిరిగపండ్లరసము లేక త్రిఫలాకషాయముతో మర్దించి నాల్గుపుటములు వేసిన భస్మమగును.

లోహపురజనును నేతిలో కలిపి పచ్చపసుపురసముతోను ఉశిరిగపండ్లరసముతోను నూరి ద్వైవిధముగ ప్రత్యేకము యేడుసారులు వేయించి సర్వరోగములందు వాడుకొనవచ్చును.

లోహపురేకులను పొరలులేకుండ సాగగొట్టి గాఢాగ్నిలో యెర్రగ కాల్చి నీళ్ళలోముంచిన మిగుల పెళుసుగ నుండును. వానిని రాతిరోటవేసి లోహదండముతో దంచిన చూర్ణమగును. ఆచూర్ణముచు మెత్తగ జల్లించి పెద్దముక్కలు మరల కాల్చి నీళ్ళలో ముంచుచు అంతయు మెత్తనిచూర్ణము చేయవలెను. ఈచూర్ణముతో రసగంధకములను చేర్చుచు యిరువదిపుటములు వేసినయెడల లోహము చక్కగ వారితరమైన సిందూరమగును.

అయిదుపలముల లోహపురేకులకు అయిదుపలముల యింగిలీకమును చనుబాలతో నూరి పట్టించి యెండించి శరావసంపుటమందుంచి పుటమువేయవలెను. పిదప త్రిఫలాకషాయము నిమ్మపండ్లరసముపోసి లోహమున కిరువదియవ భాగ మింగిలీకము చేర్చి నూరుచు నలువదిపుటములు వేయవలెను. ప్రతిపుటమునకును యేరసముచే మర్దింపఖడునో ఆరసమందు పుటానంతరము మందును వండుచుండవలెను, ఇట్లుచేసినయెడల కాంతము లోహము ముండము అనుమూడులోహములు మృతములగును.

పూర్వోక్తప్రకారము మృతమైన లోహమును *వసుభల్లకపత్ర (జీడిమామిడి) రసము అడ్డసరపుఆకురసము అనువానితో ముప్పదిపుటములు వేసిన కుంకుమవలె సిందూరించును.

లోహచూర్ణముతో కొంచెము అన్నమును చేర్చి త్రిఫలాకషాయముతో మర్దించి చిన్నచక్రములుగా జేసి యెండించి పుటము చేయునది. ఇట్లు అయిదుపుటములు వేసిన యెర్రగ సిందూరించును. దీనిని స్వేచ్ఛగ వాడవచ్చును.

పొన్నగంటియాకు గంధకము ఇంగువ వీనిని నిమ్మపండ్లరసముతో మర్దించి లోహపురేకులకు పట్టించి ఆరనిచ్చి వానిని పొన్నగంటియాకుముద్దలో పెట్టి మూకుళ్ళయందుంచి కొలిమిలో జోడుతిత్తులతో నూదవలెను. పిదప భద్రముగ దీసి త్రిఫలాకషాయమందును గోమూత్రమందును చల్లార్చి తిరుగ కాల్చి మరల పైజెప్పిన పొన్నగంటి

* వసుభల్లక శబ్దమున కర్థము నిఘంట్వంతరములందు మృగ్యము.

మొదలగు వస్తువులకల్కమును చేర్చి మర్దించి పొన్నగంటిముద్దలో పెట్టి కొలిమిలో నూదవలెను. పిదపనాలోహమును చూర్ణించవలెను. అట్లు చూర్ణించిన లోహముతో గంధకము బెల్లము త్రిఫలములు చేర్చి నూరుచు ముప్పదిపుటములు బెట్టిన చక్కగ భస్మమై తిరిగి లోహముగ మారకయుండును.

లోహమునకు సమముగ గంధకచూర్ణమును చేర్చి కలబందరసముతో తడపి మూకుడులోనుంచినయెడల కొన్నిదినములకు లోహము భస్మమగును.

నిమ్మపండ్లరసములో యింగిలీకచూర్ణము చేర్చి యారిపమందు యెఱ్ఱగగాల్చిన లోహపురేకులను పలుమారు చల్లార్చినెడల లోహము నిస్సంశయముగ భస్మమగును.

గోమూత్రముతో త్రిఫలములను చేర్చి కాచి యాక్వాథమందు లోహపురజమును ఇరువదియొక్క దినములు భావనచేసి పిదప ఒకదినము ఆకషాయముతో మర్దించి గజపుటము వేయవలెను. ఇట్లు యిరువదియొక్క పుటములు వేసిన యెడల త్రివిధలోహములు భస్మములగును.

వైద్యచింతామణి:—లోహామృతీకరణవిధి.

"ద్విగుణే త్రిఫలాక్వాథే తుల్యం పిష్ట్వా ప్యయోరజః
పచే న్మధ్యమపాకేన సర్వవ్యాధి జరాపహం"

(లోహభస్మమునందు రెట్టింపు త్రిఫలాకషాయమును చేర్చి మధ్యమపాకముగ వండినచో లోహము అమృతతుల్యమై సర్వవ్యాధులను ముదిమిని హరించును.)

రససంకేతకలిక:—"వరా క్వాథేష్ట శేషేతు తత్తుల్యం ఘృతపాయసం
సితాలోహ మితాతామ్రే పక్త్వా చామృతవ ద్భవేత్॥"

(అష్టభాగావశేషముగ కాచబడిన కరక్కాయకషాయము, నెయ్యి, పాయసము, పంచదార, లోహభస్మము వీనిని సమభాగములుగ కలిపి తామ్రపాత్రయందు వండినచో లోహ మమృతతుల్యముగ పనిచేయును.)

రససంకేతకలిక:—త్రివిధ లోహపాకములు,

"లోహపాక స్త్రిధా ప్రోక్తో మృదు ర్మధ్యః ఖర స్తథా
పంకశుష్కరసౌ పూర్వౌ వాలుకాసదృశః ఖరః॥"

మృదుపాకము, మధ్యమపాకము, ఖరపాకము అని లోహపాకము మూడువిధములు. బురదవలెనుండునది మృదుపాకము. శుష్కరసముగలది (రసమిగురునంతవరకు పాకముచేయదగినది, మధ్యమపాకము, ఇసుకవలెనుండునది ఖరపాకము)

కాంతపాత్రలో నీరుబోసి అందొక తైలబిందువును విడచిన నది వికసింపక



యున్నను, వెండితో చేర్చి కొలిమిలోనూదిన ఖండినంటకయున్నను ఉత్తమకాంతమని గ్రహించి చూర్ణించి కాల్చి త్రిఫలాకషాయమందు ముంచవలెను. ఇట్లు పలుమారు చేయబడిన కాంతచూర్ణమును ఆమ్లరసముచే మర్దించి దానికి నాల్గవవంతు రసభస్మమును గాని, గంధకము, మాక్షికము, రసము అనునీ మూడునుకలిసి లోహమునకు సమముగాగాని చేర్చి పుటమువేయవలెను. మరియు క్షారవర్గమును ఆమ్లవర్గముతో నూరి కాంతమునపట్టించి కాల్చి, కుండేటినెత్తురులో ముంచినచో కాంతము మృతమగును.

రసము ఒకభాగము, గంధకము రెండుభాగములు, వీనిని కజ్జలిచేసి దానికి సమముగ లోహచూర్ణమునుకలిపి కలబందరసముతో రెండుజాములు మర్దించి యాముద్దను కంచుపాత్రలోబెట్టి పైన ఆముదపుఆకులను కప్పినచో అర్ధజామునకు మిగుల ఉష్ణముగా నుండును. పిదప దానిని మూడువిధములు ధాన్యరాశియందుంచి తీసి ఖల్వములోనుంచి నూరి వస్త్రగాలితముచేసినచో నిశ్చయముగ లోహము వారితరమగును. పైవిధముగ కాంతము, ముండము, తీక్ష్ణముగూడ భస్మములగును.

స్వర్ణాదిధాతువులన్నిటినిగూడ పైప్రక్రియననుసరించి మారణముచేయవచ్చును. ఇది సిద్ధులముఖమునుండి యనుగ్రహింపబడిన దివ్యయోగము. దీనిని నాయనుభవపూర్వకముగ జేసియున్నాను. ఈప్రక్రియననుసరించి చేసిన లోహభస్మమును త్రిఫలాచూర్ణము, తేనె యనుపానముగ సర్వరోగములందును వాడవచ్చును.

## —♦ లోహభస్మముల గుణములు ♦—

మూ. కాంతాయః కమనీయకాంతిజననం పాండ్వామయోన్మూలనం
శుక్లవ్యాధినిబర్హణం గరహరం దోషత్రయోన్మూలనం
నానాకుష్ఠవినాశనం బలకరం వృష్యం వయస్తంభనం
సర్వవ్యాధిహరం రసాయనవరం భౌమామృతం నాపరం॥
ఏతత్సార్వ దపునర్భవం హి భసితం లోహస్య దివ్యామృతం
సమ్య క్సిద్ధరసాయనం త్రికటుకీ వేల్లాజ్యమధ్వన్వితం
హన్యా న్నిష్కమితం జరామరణజ వ్యాధీంశ్చ సత్ప్రత్యదం
దిష్టం శ్రీగిరిశేన కాలయవనోద్భూత్యై పురా తత్ప్రితుః॥
లోహం జంతువికారపాండుపవన క్షీణత్వ పిత్తామయ
స్థౌల్యార్శోగ్రహణీ జ్వరార్తి కఫజచ్ఛోపప్రమేహాప్రణుత్
గుల్మప్లీహవిషాపహం బలకరం కుష్ఠాగ్నిమాంద్యప్రణుత్
సౌఖ్యాలం విరసాయనం మృతిహరం కిట్టంచ కాంతాదివత్॥

మృతాని లోహాని రసీభవంతి నిఘ్నంతి యుక్తాని మహామయాంశ్చ
అభ్యాసయోగా ద్దృఢదేహసిద్ధిం కుర్వంతి రుగ్జన్మజరావినాశం॥
పక్వజంబూఫలచ్ఛాయం కాంతలోహం త దుత్తమం॥

తా. కాంతలోహభస్మము త్రికటుకములు, వాయువిడంగములు, నేయి, తేనె వీనియనుపానముతో నిష్కప్రమాణముగ సేవించుచున్నయెడల శరీరకాంతిగల్గును. పాండువు, రాజయక్ష్మ, గరదోషము, త్రిదోషవికారములు, అష్టాదశకుష్ఠములు నశించును. బలము, వీర్యవృద్ధి, వయస్తంభనము కలుగును. కాంతము భూమియందు దొరకు అమృతమని చెప్పదగును. వంధ్యలు దీనిని సేవించిన పుత్రసంతతి కల్గును.

శ్రీమత్పరమశివుడు పూర్వము కాలయవనునితండ్రికి కాలయవనుడను కుమారుడు జనించుటకై యీ కాంతరసాయనమును చేసియిచ్చెను. మరియు కాంతసేవచే కృమి, క్షీణత్వము, పిత్తరోగములు, స్థౌల్యము, మూలరోగము, గ్రహణి, జ్వరము, కఫము, శోఫ, ప్రమేహము, గుల్మము, ప్లీహ, విషదోషము, అగ్నిమాంద్యము మున్నగు రోగములు తొలగును. మృతలోహములన్నియును మహారస సదృశములై సేవించినకొలది క్రమముగ సకలరోగములను దునిమి జరామరణములు లేకుండ జేయును. పండిన నేరేడుపండుయొక్క చాయగలిగిన కాంతభస్మము శ్రేష్ఠము.

"పారదేన వినా లోహః యః కరోతి ఖమా నిహ। ఉదరే తస్య కిట్టాని జాయంతే నాత్ర సంశయః" రసయోగము లేకుండ లోహమును సేవించినచో నది ఉదరమున కిట్టమువలెనుండును గాన రసయోగము లోహమునకావశ్యకమని తంత్రాంతరమందు వ్రాయబడినది.

రససారము:—కాంతము—స్వర్ణసమానగుణముకలది.

"సువర్ణ మథవా రూప్యం యోగే యత్ర నవిద్యతే
తత్ర కాంతోద్భవం లోహం క్షేప్యం తత్సమం గుణైః॥",

(స్వర్ణమును లేక రజతమును జేర్చవలసిన యోగములందు స్వర్ణరజతములు సంభవించకున్న దానియెత్తు సమముగ కాంతలోహమును చేర్చుకొనవచ్చును. కాంతలోహము బంగారు, వెండి, లోహములకు గల ఉత్తమగుణములను గల్గియున్నది.)

—♦ లోహద్రుతి ♦—

మూ. త్రిస్సప్తకృత్వో గోమూత్రై ర్జ్వాలినీభస్మభావితం
శోషయే త్తస్య వాహేన తీక్ష్ణం మూషాగతం ద్రవేత్



సురదాలీభవం భస్మ నరమూత్రేణ గాలితం
త్రిస్సప్తవారం తత్క్షారా వాపా త్కాంతద్రుతి ర్భవేత్॥
గంధకం కాంతపాషాణం చూర్ణయిత్వా సమం సమం।
ద్రుతే లోహే ప్రతీవాపో దేయో లోహాష్టకం ద్రవేత్॥
దేవదాళ్యాద్రవై ర్భావ్యం గంధకం దినసప్తకం।
తేన ప్రవాపమాత్రేణ లోహం తిష్ఠతి సూతవత్॥

తా. దేవదాలిని భస్మముచేసి దానిని గోమూత్రముచే నిరువదియొక్కసారులు భావనచేసి యెండించి యాక్షారమును భద్రపరచుకొనవలెను. పిదప తీక్ష్ణలోహమును కొలిమిలోబెట్టియూది కరుగునపుడు పైక్షారమును ప్రతీవాపముచేసినచో నీళ్లవలె కరిగి ద్రవరూపముగనే యుండును.

దేవదాలిని భస్మముచేసి యాభస్మమును నరమూత్రముచే భావనచేసి యెండించి యాక్షారమును కరుగుచున్న కాంతలోహమునందు ప్రతీవాపముచేసిన కాంతము ద్రవించును.

గంధకమును, కాంతలోహమును సమభాగములుగ జేర్చి చూర్ణించి యాచూర్ణమును లోహములు కరుగునపుడు ప్రతీవాపముచేసినచో లోహములెనిమిదియు ద్రవించును. (అభ్రకమువలె కాంతమును ద్రవింపచేయవచ్చునని రసార్ణవమున వ్రాయబడెను.)

రససంకేతకలిక:—లోహసేవయందపథ్యములు:

"కూష్మాండం తిలతైలంచ మాషాన్నం రాజికాం తథా
మద్య మమ్లరసం చైవ త్యజే ల్లోహస్య సేవకః."

(గుమ్మడుకాయ, నువ్వులనూనె, మాషాన్నం, ఆవాలు, మద్యము, పులుసు — ఇవి లోహసేవయందపథ్యములు.)

—♦ అపరిశుద్ధలోహదోషములు ♦—

మూ. అశుద్ధలోహం నహితం నిషేవణా దాయుర్బలం కాంతివినాశినిశ్చతం। హృదిప్రపీడాం తనుతే హ్యపాటవం రుజం కరోత్యేవ విశోధ్య మారయేత్॥

తా. అపరిశుద్ధలోహసేవవలన ఆయువు, బలము, కాంతి నశించును. హృదయమందు నొప్పికలుగును. రోగములను గల్గించును గాన లోహమును చక్కగ శోధనముచేసి మారణముచేయవలెను.

### లోహతారతమ్యములు

మూ॥ కిట్టా ద్దశగుణం ముండం ముండా త్తీక్ష్ణం శతోన్మితం
తీక్ష్ణా ల్లక్షగుణం కాంతం భక్షణా త్కురుతే గుణాన్॥
తస్మా త్కాంతం సదా సేవ్యం జరామృత్యుహరం నృణాం॥
ఆయుఃప్రదాతా బలవీర్యకర్తా రోగప్రహర్తా మదనస్యకర్తా
అయస్సమానం నహి కించి దన్య ద్రసాయనం శ్రేష్ఠతమం హి జంతోః॥

తా. కిట్టముకన్న ముండము పదిరెట్లును, ముండముకన్న తీక్ష్ణలోహము నూరురెట్లును, దానికన్న కాంతము లక్షరెట్లును గుణాధికముగనుండును. కావున జరామృత్యుహరమైనకాంతమును సేవించవలెను. కాంతసేవచే ఆయువు, బలము, వీర్యము, సంభోగశక్తి వృద్ధియగును. రోగములు నశించును. లోహముకన్న సత్తమరసాయనము లేదు.

### మండూరము

మూ॥ అక్షాంగారై ర్ధమే త్కిట్టం లోహజం త ద్గవాంజలైః॥
సేచయే దక్షపాత్రాంత స్సప్తవారం పునఃపునః
మండూరోఽయం సమాఖ్యాత శ్చూర్ణం శ్లక్ష్ణం నియోజయేత్
గోమూత్రై స్త్రిఫలాక్వాథా తత్క్వాథే సేచయే చ్ఛనైః
లోహకిట్టం సుసంతప్తం యావ జ్జీర్యతి తత్స్వయం
త చ్చూర్ణం జాయతే పేష్యం మండూరోఽయం ప్రయోజయేత్
యే గుణా మారితే ముండే తే గుణా ముండకిట్టకే
తస్మా త్సర్వత్ర మండూరం రోగశాంత్యై ప్రయోజయేత్॥

తా. లోహకిట్టమును తాండ్రబొగ్గులలో యెఱ్ఱగ కాల్చి తాండ్రకొయ్యచే చేయబడిన పాత్రయందుంచి గోమూత్రమును పోసి చల్లార్చవలెను. ఇట్లు యేడుపర్యాయములు చేసిన కిట్టము శుద్ధమగును. దానిని మెత్తగ చూర్ణించి యుపయోగించవలెను.

త్రిఫలములను గోమూత్రముతో చేర్చి కషాయముకాచి కిట్టమును యెఱ్ఱగకాల్చి యాకషాయమునందు చల్లార్చవలెను. కిట్టము స్వయముగ విడిపోవువరకు యిట్లు కాల్చి చల్లార్చి, పిదప మెత్తగనూరి యుపయోగించునది.

మారణముచేయబడిన ముండమునందుండు గుణములన్నియు శుద్ధిచేయబడిన కిట్టమూణ్డమందుండును, కనుక రోగశాంతికై మండూరము నుపయోగించవచ్చును.



### వంగము—శుద్ధి

మూ॥ ఖురకం మిశ్రకం చేతి ద్వివిధం వంగ ముచ్యతే
ఖురం తత్ర గుణై శ్శ్రేష్ఠం మిశ్రకం నహితం మతం
ధవళం మృదుళం స్నిగ్ధం ద్రుత ద్రావం సగౌరవం
నిశ్శబ్దం ఖురవంగం స్యా న్మిశ్రకం శ్యామ శుభ్రకం
వంగం తిక్తోష్ణకం రూక్ష మీష ద్వాతప్రకోపనం
మేహశ్లేష్మామయఘ్నం చ మేదోఘ్నం కృమినాశనం
ద్రావయిత్వా నిశాయుక్తే క్షిప్తం నిర్గుండికారసే
విశుధ్యతి త్రివారేణ ఖురవంగం నసంశయః
ఆమ్లతక్రే వినిక్షిప్తం వర్షాభూవిషతిందుభిః
కల్పలాంబుగతం వంగం ద్వితీయం పరిశుధ్యతి
శుధ్యతి నాగో వంగో రవి రాతపేపి మునిసంఖ్యైః
నిర్గుండీరససేకైః త న్మూలరజః ప్రవాపైశ్చ॥

తా. ఖురకము, మిశ్రకము అని వంగము (తగరము) రెండువిధములు. అందు ఖురకము గుణాధికము. తెల్లగను మెత్తగను నునుపుగను సులభముగ కరుగునదిగను బరువుగను మ్రోతలేనిదిగను ఉండునది ఖురవంగమనియు నలుపుకలిసిన తెలుపురంగుకలది మిశ్రకవంగమనియు నెరుంగవలెను.

గుణము:—వంగము తిక్తరసమును ఉష్ణవీర్యమును రూక్షగుణమును గలది. కొలదిగ వాతప్రకోపము గల్గించును. మేహము, శ్లేష్మము, మేధస్సు కృమిరోగములను పోగొట్టును.

ఖురశుద్ధి:—వావిలియాకురసమునందు పసపు కలిపి దానిలో కరిగించిన ఖురవంగమును మూడుసారులు పోసిన శుద్ధమగును.

మిశ్రకవంగశుద్ధి:—మిశ్రకతగరమును కరిగించి పులిమజ్జిగ, గలిజేరు, విషముష్టి, చేదుసార వీనిరసములయందు బోసినయెడల శుద్ధిబొందును.

వావిలాకురసమునందు యేడుసారులుపోసి కరుగునపుడు యేడుసారులు వావిలివేరు చూర్ణమును ప్రతీవాపము చేసినచో సీసను, తగరము, రాగి అనులోహములు శుద్ధిబొందును. మరియు వావిలియాకురసమును పోసి యెండలోనుంచినను శుద్ధమగును.

వైద్యచింతామణి:—అశుద్ధవంగదోషము.

"పాకేనహీనః ఖలువంగకోసౌ కుష్ఠాని గుల్మాన్ని మహాతితీవ్రాన్
పాండుప్రమేహాఽపచి వాతశోణితం బలాపహారం కురుతే నరాణాం॥"

(కుష్ఠము, గుల్మము, పాండువు, ప్రమేహము, అపచి, వాతరక్తము కలిగించున అపరిశుద్ధవంగదోషములు నుడువబడినవి.)

## వంగభస్మము

మూ. సతాళేనార్కదుగ్ధేన లిప్త్వా వంగదళానిచ
బోధిచించాత్వచః క్షారైః దద్యాల్లఘుపుటానిచ
మర్దయిత్వా చరేద్భస్మ తద్రసాదిషు శస్యతే
ప్రద్రావ్యఖర్పరే వంగం షోడశాంశం రసంక్షిపేత్
స్వల్ప స్వల్పాలకం దత్వా భారద్వాజస్య కాష్ఠతః
మర్దయిత్వా చరేద్భస్మ తద్రసాదిషు శస్యతే
పలాశద్రవయుక్తేన వంగపత్రం ప్రలేపయేత్
తాళేన పుటితం పశ్చాత్ మ్రియతే నాత్రసంశయః
భల్లాతతైలసంలిప్తం వంగం వస్త్రేణ వేష్టితం
చించా పిప్పల పాలాశ కాష్ఠాగ్నౌ యాతి పంచతాం॥

తా. జిల్లేడుపాలతో తాళకమును నూరి శుద్ధిచేసిన తగరపురేకులకు పట్టించి చింతబెరడు, రాగిబెరడు కాల్చి చేసిన భస్మములో పెట్టి లఘుపుటములను వేయవలెను. పుటము చల్లారినపిదప అందు పేలాలవలె పొంగిన వంగభస్మమును నూరి వస్త్రగాలితము చేసి రసాదులందు జేర్చి వాడుకొనునది.

వంగమును మూకుడులో కరగించి పదహారవభాగము రసమును వేసి కొంచెము కొంచెముగ తాళకమును గూడ వేయుచు పెద్దముత్తవపులగపు కాడతో కలియబెట్టుచున్నయెడల వంగము భస్మమగును. దానిని రసాదులందు వాడుకొనవచ్చును.

వంగమును రేకులుగా కొట్టి మోదుగు చెక్క రసముతో నూరిన తాళకము ఆరేకులకు పట్టించి పుటము వేసినచో వంగము భస్మమగును.

నల్లజీడిగింజల రసమును తగరపు రేకులకు పట్టించి గుడ్డచుట్టి చింత, రావి బెరళ్ళలో పుటము వేసినయెడల వంగము భస్మమగును.



## వంగరసాయనము

మూ. వంగభస్మసమం కాంతం వ్యోమభస్మచ తత్సమం
మర్దయేత్కనకాంభోభి ర్నింబపత్రరసైరపి
దాడిమస్య మయూరస్య రసేనచ పృథక్ పృథక్
భూపాలావర్త భస్మాథ వినిక్షిప్య సమాంశకం॥
గోమూత్రశిలాధాతుజలైః స్సహ్య గ్వామర్దయేత్
తతో గుగ్గులుతోయేన మర్దయిత్వా దినాష్టకం
విశోష్య పరిచూర్ణ్యాథ సమభాగేన యోజయేత్
ఘృష్టం బంధుకనిర్యాసైః నాకులీబీజచూర్ణకైః
తతః క్షిపేత్కరండాంతః విధాయ పటగాలితం
గోతక్రపిష్టరజనీసారేణ సహపాయయేత్
చతుర్భిర్వల్లకైస్తుల్యం రమ్యం వంగరసాయనం
నిశ్చితం తేన నశ్యంతి మేహా వింశతిభేదకాః
శాలయో ముద్గసూపంచ నవనీతం తిలోద్భవం
పటోలం తిక్తతుండీరం తక్రం పథ్యాయ శస్యతే॥

తా. వంగభస్మము, కాంతభస్మము, కృష్ణాభ్రకభస్మము వీనిని సమభాగముగ గ్రహించి ఉమ్మెత్తాకు రసము, వేపాకు కషాయము, దానిమ్మరసము, బ్రహ్మమేడిరసము అనువానిలో ప్రత్యేకముగ మర్దించి పై యౌషధమునకు సమము రాజావర్తభస్మమును చేర్చి గోమూత్రశిలాజిత్తుయొక్క రసముచేత మర్దించవలెను. పిదప మహిషాక్షిని నీళ్ళలో వేసి కాచి యా నీటితో యెనిమిదిదినములు మర్దించి యెండించి చూర్ణించి యా చూర్ణమునకు సమముగ వేగిసబంకను, విషముంగరివిత్తుల చూర్ణమును చేర్చి వస్త్రగాలితముచేసి బలానుసారమగు మాత్రను ఆవుమజ్జిగతో నూరి పసుపురసములో కలిపి త్రాగవలెను. దీనిని నాలుగువల్లములయెత్తువరకు సేవించ వచ్చును. వంగరసాయనమును సేవించుటచే నిశ్చయముగ వింశతిమేహములును హరించును.

పథ్యము:—శాలిధాన్యము, పెసరపప్పు, వెన్న, నూనె, పొట్లకాయ, చేదుదొండ, మజ్జిగ యివి వంగరసాయనమును సేవించువారలకు పథ్యకరమైన ఆహారములు.

## నాగము—దానిగుణము.

మూ. ద్రుతద్రావం మహాభారం ఛేదే కృష్ణసముజ్వలం
పూతిగంధం బహిః కృష్ణం శుద్ధసీస మతోన్యథా

అత్యుష్ణం సీసకం స్నిగ్ధం తిక్తం వాతకఫాపహం
ప్రమేహాతోయదోషఘ్నం దీపనం చామవాతనుత్॥

తా. సులభముగ కరుగునదియు, మిగుల బరువైనదియు, నరికినచో నలుపు మెరుపుగలదియు, దుర్గంధము గల్గినదియు, పైకి నల్లగనుండునదియు, శుద్ధమైన సీసమునుగ తెలియవలెను. ఇట్టిలక్షణములు లేనిది మంచిదికాదు.

గుణము:—సీసమత్యుష్ణమై నునుపును తిక్తరసమును గలదియై వాతకఫములను ప్రమేహములను జలదోషమును ఆమవాతమును హరించునదై దీపనకారియై యుండును.

## —◆ నాగశుద్ధి ◆—

మూ. సిందువార జటాకాంతీ హరిద్రాచూర్ణకం క్షిపేత్
ద్రుతేనాగేథ విర్గుండ్యా త్రివారం నిక్షిపేద్రసే
నాగశ్శుద్ధో భవేదేవం మూర్ఛాస్ఫోటాదినాచరేత్॥

తా. సీసమును కరిగించి వావిలివేరు రేణుకలు పసుపు వీనిచూర్ణములను వేసి లోహదండముతో మర్దించి పిదప వావిలిరసమందు చల్లార్చవలెను. ఇట్లు మూడుసారులు చల్లార్చినయెడల నాగము శుద్ధమై మూర్ఛాస్ఫోటాది దుర్గుణములు కలిగించక యుండును.

## —◆ నాగభస్మము ◆—

మూ. తిర్యగాకారచుల్ల్యాంతు తిర్యగ్వక్త్రఘటం క్షిపేత్
తంచ వక్త్రంవినా సమ్యగ్గోపయేద్యత్నతో మృదా
భ్రష్టయంత్రాభిధే తస్మిన్ యంత్రే సీసం వినిక్షిపేత్
పంచవింశతికం నాగ మధస్తీవ్రానలం క్షిపేత్
ద్రుతేనాగే క్షిపేత్సూతం శుద్ధం కర్షమితం శుభం
ఘర్షయిత్వా క్షిపేత్ క్షార మేకైకంహి పలం పలం
అర్జునస్యాక్షవృక్షస్య మహారాజగిరేరపి
దాడిమస్య మయూరస్య క్షిప్త్వా క్షారం పృథక్పృథక్
ఏకవింశతి రాత్రాణి పచేత్తీవ్రేణ వహ్నినా
విఘట్టయన్ దృఢం దోర్భ్యాం లోహదర్వ్యా ప్రయత్నతః



రక్తం తజ్జాయతే భస్మ కపోతచ్ఛాయ మేవవా॥
నాగం దోషవినిర్ముక్తం జాయతేతి రసాయనం
హత ముత్థాపితం సీసం దశవారాణి సిధ్యతి
తన్మృతం సీసకం సర్వదోషముక్తం రసాయనం
అశ్వత్థ చింతాత్వగ్భస్మ నాగస్య చతురంశతః
క్షిపేన్నాగం పచేత్పాత్రే డాలయేల్లోహచాటునా
యావద్భస్మ తదుద్ధృత్య భస్మతుల్యా మనశ్శిలా
జంబీరైరారనాళైర్వా పిష్ట్వా రుధ్వా పుటే పచేత్
స్వాంగశీతం పునః పిష్ట్వా వింశత్యంశశిలాయుతం
అమ్లే నైవతు యామైకం పూర్వవత్పాచయేత్పుటే
ఏవం షష్టిపుటైః పక్వో నాగస్స్యాత్సునిరుత్థకః
శిలయా రవిదుగ్ధేన నాగపత్రాణి లేపయేత్
పూరయేత్పుటయోగేన నిరుత్థం జాయతే తథా॥

తా॥ అడ్డముగానుండు పొయ్యిమీద అడ్డముగానుంచబడిన ముఖముగల ఘటము నుంచి దాని మూతిగాక తక్కిన ప్రదేశమంతయు మన్నుపూసి మూయవలెను. దీనినే భ్రష్టయంత్ర మందురు. అట్లు పొయ్యిమీద నుంచబడిన తిర్యగ్వక్త్రముగల కుండలో యిరువదిపల్లముల శుద్ధసీసము నుంచి తీవ్రమైన యగ్నిచే సీసమును కరిగించి అందు శుద్ధ పాదరసమును ఒక కర్షప్రమాణముగ జేర్చి మర్దించి, మద్ది, తాని, మహారాజగిరి, దానిమ్మ, బ్రహ్మమేడి అను వాని క్షారములను ప్రత్యేకము ఒకపలముచొప్పున గ్రహించి క్రమముగ కొంచెముకొంచెము ఆసీసమందువేయుచు లోహదండముతో ప్రయత్నపూర్వకముగ రుద్దుచుండవలెను. ఇట్లు యిరువదియొక్క రాత్రులవరకు తీవ్రాగ్నిచే వేయించుచున్నయెడల ఆసీసము యెర్రగాగాని పావురపురంగుగాగాని భస్మమగును. అది సర్వదోషహరమై చక్కని రసాయనముగ నుండును. మృతముగావింపబడిన సీసమును పంచమిత్రముల (బెల్లము, గుగ్గిలము, గురివెందగింజ, నెయ్యి, తేనె)తో జేర్చి యూదవలెను. ఇట్లు పదిసారు లూదినచో సీసభస్మము సిద్ధమగును.

ఒకపాత్రలో సీసమును కరిగించి దానికి నాల్గవవంతు రావి, చింత బెరడుల క్షారములను కొంచెముకొంచెముగ వేయుచు దృఢముగ లోహదండముతో మర్దించవలెను. ఇట్లు భస్మమగువరకు రుద్ది యాచూర్ణముతో సమముగ మణిశిలను చేర్చి నిమ్మపండ్లరసముతోగాని ఆగనాళముతోగాని నూరి పుటముజేసి స్వాంగశీతలమున తీసి

నాగమునకు యిరువదియవవంతు మణిశిలను చేర్చి ఆమ్లరసముతో ఒకజాము నూరి పుటము వేయునది. ఇట్లు అరువదిపుటములు వేసినయెడల నాగము స్వచ్ఛముగ భస్మమగును.

మణిశిలను జిల్లేడుపాలతో నూరి సీసపురేకులకు పట్టించి పుటము వేయవలెను. (ఇట్లు కొన్నిపుటములు వేసిన) సీసము భస్మమగును.

అనుభూతప్రక్రియ:—శుద్ధిచేసినసీసమును చతురస్రముగ బిళ్ళచేసి యుంచుకొనవలెను. పిదప సీసమునకు సమానపరిమాణముగల మద్దిచెక్కబూడిదను వెలుపుడం ధాన్యపుగంజితో కలిపి పైబిళ్ళకు కవచముయిచ్చి ఒకక్రొత్తగుడ్డను చుట్టి వజ్రకవచము చేయవలెను. ఇట్లు మూడు కవచములనిచ్చి గజపుటము వేసి స్వాంగశీతలమున నందు స్వచ్ఛముగ భస్మమై యుండుసీసమును గ్రహించి తాటిబెల్లములో పొదిగి ఒకగుంజా ప్రమాణముగ సకలమేహములందును వాడుకొనవలెను. ఇది పసుపులో వేయబడెనేని పసుపు యెఱ్ఱనగును. కాన దీనిని సీసనున్నమందురు. ప్రత్యేకముగ (మాటులేకుండ) వాడినయెడల నోరు పుండగును. పుట్టమన్ను, మసిబొగ్గు, ఇసుక, గోనెగుడ్డ, యినుపచిట్టెము అను నీవస్తువులను రాతిరోటిలోనుంచి మెత్తగ నలియగొట్టవలెను. దీనిని వజ్రమృత్తిక యందురు.

—◆ నాగరసాయనము ◆—

మూ. ఏవం నాగోద్భవం భస్మ తాప్య భస్మార్ధభాగికం
పాదం పాదం క్షిపే ద్భస్మ శుల్బస్య విమలస్యచ
కాంతాభ్రిసత్త్వయోశ్చాపి స్ఫటికస్య పృథక్పృథక్
సర్వమేకత్రి సంచూర్ణ్య పుటే త్త్రిఫలవారిణా
త్రింశ ద్వనగిరీండైశ్చ త్రింశద్వారం విచూర్ణ్యచ
వ్యోష వేల్లక చూర్ణైశ్చ సమాంశై స్సహ మేళయేత్
మధ్వాజ్యసహితం హంతి ప్రివీఢం వల్లమాత్రియా
అశీతి వాతజా౯ రోగా౯ ధనుర్వాతం విశేషతః
కఫరోగా నశేషాంశ్చ మూత్రిరోగాంశ్చ సర్వశః
శ్వాసం కాసం క్షయం పాండుం శ్వయథుం శీతకజ్వరం
గ్రిహణీ మామదోషంచ వహ్నిమాంద్యం సుదుర్జయం
సర్వా నుదకదోషాంశ్చ తత్తద్రోగానుపానతః॥



తా. నాగభస్మము ఒకభాగము, స్వర్ణమాక్షికభస్మము అర్ధభాగము, తామ్రభస్మము విమలభస్మము కాంతసత్త్వము అభ్రకసత్వము వైక్రాంతభస్మము ఇవి ప్రత్యేకము నాల్గవభాగము, వీనినన్నిటిని కలిపి త్రిఫలాకషాయముతో మర్దించి ముప్పది యేరుపిడకలతో పుటము వేయవలెను. ఇట్లు ముప్పదిపుటములు వేసి చూర్ణించి యా చూర్ణమునకు సమముగ మిరియాలు, వాయువిడంగాలు చూర్ణించి చేర్చి వల్లప్రిమాణముగా తేనె, నేయి అనుపానముతో భుజించిన యెనుబదివాతములు హరించును. విశేషముగ ధనుర్వాతమందు పనిచేయును. మరియు శ్లేష్మములు, మూత్రరోగములు, శ్వాసకాసలు, క్షయ, పాండువు, వాపు, శీతజ్వరము, గ్రహణి, ఆమదోషము, అగ్నిమాంద్యము, ఉదకదోషము మొదలగు రోగములు అనుపానవిశేషములతో వాడిన తప్పక నివర్తించును.

—◆ రీతి – పిత్తల – శోధనము – గుణము ◆—

మూ. రీతికా కాకతుండీచ ద్వివిధం పిత్తలం భవేత్
సంతప్త్వా కాంజికే క్షిప్తా తామ్రాభా రీతికా మతా॥
ఏవం యా జాయతే కృష్ణా కాకతుండీతి కథ్యతే
రీతి స్తిక్తరసా రూక్షా జంతుఘ్నీ సాస్రిపిత్తనుత్
కృమి కుష్ఠ హరా యోగా త్తోష్ణవీర్యాచ శీతలా
కాకతుండీ గతస్నేహా తిక్తోష్ణా కఫపిత్తనుత్
యకృత్ ప్లీహ హరా శీతవీర్యాచ పరికీర్తితా
గుర్వీ మృద్వీచ పీతాభా సారంగీ తాడనక్షమా
సుస్నిగ్ధా మసృణాంగీచ రీతి రేతాదృశీ శుభా॥
పాండుపీతా ఖరారూక్షా బర్బరా౽తాడనక్షమా॥
పూతిగంధాచ లక్ష్మీచ రీతి శ్నేష్టా రసాదిషు
తప్త్వా క్షిప్త్వాచ నిర్గుండీ రసేశ్యామా రజోన్వితే॥
పంచవారేణ సంశుద్ధిం రీతిరాయాతి నిశ్చితం॥

తా॥ రీతిక, కాకతుండి యని యిత్తడి రెండువిధములు. కాల్చి కాంజికములో ముంచినయెడల యెఱ్ఱనివర్ణముగలిగియుండునది రీతికయనియు, నల్లనిరంగు గలిగి యుండునెడల కాకతుండియనియు నెరుంగవలెను. రీతిక తిక్తరసమును రూక్షగుణమును, శీతవీర్యమును జంతువాత రక్త పిత్త కుష్ఠరోగములను హరించు ప్రభావమును కలిగియుండును. దీనిని యితరౌషధములలో జేర్చినపుడు ఉష్ణవీర్యము గలదియగును. కాకతుండీ స్నేహ

రహితమై తిక్తరసమును ఉష్ణగుణమును గలదియైయుండును. కఫ పిత్తములను ప్లీహ యకృత్తులను హరించును. శీత వీర్యము గలది. బరువై మృదువై పచ్చని కాంతిగలిగి బలమైన యవయవముల కలయిక కలిగి సుత్తెతో గొట్టిన యెడల దెబ్బకు తాళి సాగునదియై స్నిగ్ధమై నునుపై యుండు యిత్తడి మంచిది. తెలుపు, పసుపు కలిసినవన్నెయు కాఠిన్యమును పెళుసుదనమును గలిగి బరబరలాడునదై సుత్తెతో గొట్టినపుడు సాగక ముక్కలుముక్కలగునదియై తేలికగలదై దుర్గంధము గలదైయుండు యిత్తడి మంచిదికాదు.

శుద్ధి:—ఇత్తడిని యెఱ్ఱగ కాల్చి పసుపు చూర్ణమును కలిపిన వావిలి కషాయమున అయిదుసారులు చల్లార్చిన యెడల శుద్ధినందును. నిశ్చయము.

## —♦ పిత్తళభస్మము ♦—

మూ. నింబూరస శిలాగంధ వేష్టితా పుటితాష్టధా
రీతి రాయాతి భస్మత్వం తతో యోజ్యా యధాయధం
తామ్రవ న్మారణం తస్యాః కృత్వా సర్వత్రయోజయేత్॥

తా॥ మణిశిలను నిమ్మపండ్లరసతో నూరి యిత్తడిరేకులకుపట్టించి పుటము వేయవలెను. ఇట్లు యెనిమిది పుటములు వేసిన ఇత్తడి భస్మమగును. మరియు యిత్తడిని తామ్రమును వలె మారణము చేయవచ్చును.

## —♦ పిత్తళరసాయనము ♦—

మూ. మృతాారకూటకం కాంతం వ్యోమసత్త్వంచ మారితం।
త్రయం సమాంశకం తుల్యవ్యోష జంతుఘ్నసంయుతం।
బ్రహ్మబీజాజమోదాగ్ని భల్లాత తిలసంయుతం
సేవితం నిష్కమాత్రంహి జంతుఘ్నం కుష్ఠనాశనం
విశేషా చ్ఛ్వేతకుష్ఠఘ్నం దీపనం పాచనం హితం॥

తా. ఇత్తడిభస్మము, కాంతభస్మము, అభ్రకభస్మము మూడును సమభాగములు మిరియాలు, వాయువిడంగాలు వీనిచూర్ణము పైమూటికిసమము చేర్చి మోదుగుమాడలు, అజామోదము, చిత్రమూలము, నల్లజీడిగింజలు, నువ్వులు వీనియనుపానముతో నిష్కప్రమాణముగ సేవించునెడల జంతువాతము, కుష్ఠము, నశించును. విశేషముగ శ్వేతకుష్ఠమందు పనిచేయుచు దీపనపాచనముల గల్గించును.



## —♦ పిత్తలద్రుతి ♦—

మూ. సువర్ణరీతికాచూర్ణం భక్షితం వేష్టితం పునః
ఛాగేన కృష్ణవర్ణేన మత్తేన తరుణేనచ।
తల్లిప్తం ఖర్పరే దగ్ధం ద్రుతిం ముంచతి శోభనాం
చతుర్దశ లసద్వర్ణ సువర్ణ సదృశచ్ఛవిః।
దేహలోహకరీ ప్రోక్తా యుక్తా రసరసాయనే॥

తా. మదించినట్టియు, యౌవనమందున్నట్టియు, నల్లనిమేకను తెచ్చి బంగారుచాయగలయిత్తడిని మెత్తని చూర్ణమునుగావించి తినిపించవలెను. పిదప ఆమేకపోతు వేయు మలమును జాగ్రతపరచి ఒకకుండ పెంకులోబోసి యెండించి కొలిమిలో నూదినచో మలగతమై బంగారు రంగుగల యిత్తడి కరిగి ద్రవరూపముగనుండును. తిరుగ గట్టిపడదు. ఇది రస రసాయనములందు మిగుల నుపయుక్తము.

## —♦ ఘోషము ♦—

మూ. అష్టభాగేన తామ్రేణ ద్విభాగ ఖురకేణచ
విద్రుతేన భవేత్కాంస్యం తత్సౌరాష్ట్రభవం శుభం
తీక్ష్ణశబ్దం మృదుస్నిగ్ధ మీషచ్ఛ్యామల శుభ్రకం.
నిర్మలం దాహరక్తంచ షోఢా కాంస్యం ప్రశస్యతే
తత్ప్రీతం దహనే తామ్రం ఖరంరూక్షం ఘనాసహం
మర్దనాదాగతజ్యోతి స్సప్తధా కాంస్య ముత్సృజేత్
కాంస్యం లఘుచ తిక్తోష్ణం లేఖనం దృక్ప్రసాదనం
కృమి కుష్ఠహరం వాతపిత్తఘ్నం దీపనం హితం॥
ఘృతమేకం వినాచాన్య త్సర్వం కాంస్యగతం స్పృశాం।
భుక్తమారోగ్యసుఖదం హితంసాత్మ్యకరం తథా॥
తప్తం కాంస్యం గవాంమూత్రే వాపితం పరిశుధ్యతి
మ్రియతే గంధతాళాభ్యాం నిరుత్థం పంచభిః పుటైః
త్రిక్షారం పంచలవణం సప్తధామ్లేన భావయేత్।
కాంస్యారకూటపత్రాణి తేన కల్కేన లేపయేత్।
రుధ్వా గజపుటే పక్వం శుద్ధభస్మత్వ మాప్నుయాత్॥

తా॥ తామ్రము యెనిమిదిభాగములు, తగరము రెండుభాగములు కలిపి కరిగించిన యెడల కంచు అగును. తీక్ష్ణమైన ధ్వనియు, మార్దవమును, నునుపును కొంచెము నలుపు కలిసిన తెలుపురంగును, కాల్చినయెడల యెర్రనిరంగునుకలిగి నిర్మలమైయున్న కంచు శ్రేష్ఠము. చూపులకు పచ్చగనున్నను, కాల్చినచో రాగివన్నె కలిగినను, కరుకుదనము వెళుసుదనము కలిగియున్నను బరువుపెట్టినచో నిలుపలేక విరిగిపోవునదిగనున్నను కంచు మంచిదికాదని గుర్తించి యౌషధాదుల వాడంజనదు.

గుణము:—కంచు లఘువుగను తీక్ష్ణోష్ణముగను, లేఖనకారిగను నేత్రములకు మేలు చేయునదిగను కృమికుష్ఠవాతపిత్తములను హరించునదిగను దీపనకారిగను ఉండును. నేయి ఒకటితప్ప తక్కినవస్తువులన్నియు కాంస్యపాత్రలో నుంచబడి భుజింపబడినచో ఆరోగ్యసుఖములు కలుగును.

శుద్ధి:—కంచును కాల్చి గోమూత్రములో ముంచినచో శుద్ధియగును.

భస్మము:—కంచుతో గంధకతాళకములను చేర్చి అయిదుపుటములు వేసిన భస్మమగును. మరియు త్రిక్షారములు (సర్జక్షారము, యవక్షారము, టంకణక్షారము), పంచలవణములు (సైంధవము, సాముద్రము, సౌవర్చలము, బిడము, కాచము) వీనిని నిమ్మపండ్లరసముతో యేడుసారులు భావనచేసి యాక్షారమును కంచురేకులకు పట్టించి గజపుటము వేసినచో భస్మమగును.

వైద్యచింతామణి:—అశుద్ధకాంస్యదోషము:

"అశుద్ధ మమృతం కాంస్య మాయుర్హారి రుజాకరం
హృత్పీడాం దేహతాపంచ తస్మాచ్ఛుద్ధం సమాచరేత్॥

(శుద్ధిమారణముల జేయబడని కాంస్యము హృదయపీడ, తాపము మొదలగు రోగములను పుట్టించి ఆయువును హరించును. కాన సేవింపదగదు.)

## —♦ వర్తలోహము ♦—

మూ. కాంస్యార్కరీతి లోహాహి జాతంత ద్వర్తలోహకం
తదేవ పంచలోహాఖ్యం లోహవిద్భి రుదాహృతం
హిమామ్లం కటుకం రూక్షం కఫపిత్తవినాశనం
రుచ్యంత్వచ్యం క్రిమిఘ్నంచ నేత్ర్యం మలవిశోధనం
తద్భాండే సాధితం సర్వ మన్నవ్యంజన సూపకం
అమ్లేన వర్జితం చాతిదీపనం పాచనం హితం



మ్రిత మశ్వజలే క్షిప్తం వర్తలోహం విశుద్ధ్యతి
మ్రియతే గంధతాళాభ్యాం పుటితం వర్తలోహకం
తేషు తే ష్విహ యోగేషు యోజనీయం యథావిధి॥

తా॥ కంచు, రాగి, యిత్తడి, యినుము, సీసము అనులోహముల కూడికవలన బుట్టినది వర్తలోహమనబడును. దీనికి పంచలోహమని పేరు. (దీనినే జర్మనీవెండియందురు.)

గుణము:—వర్తలోహము శీతవీర్యము, అమ్లవిపాకము, కటురసము, రూక్షగుణము కలది. కఫపిత్తదోషములను హరించును. రుచికరము. స్పర్శేంద్రియమునకును, నేత్రేంద్రియమునకును హితముచేయును. జంతుదోషమును నశింపచేయును. మలమును వెడలించును. ఈలోహముతో చేయబడిన పాత్రతో వండిన అన్నము, పప్పు, కూరలు మొదలగునవి భుజించినచో ఆరోగ్యకరములుగ నుండును. పులుసుగల పదార్థముల నీపాత్రలలో వండగూడదు.

శుద్ధి:—వర్తలోహమును కరిగించి గుర్రపుమూత్రములో చల్లార్చిన శుద్ధమగును.

భస్మము:—గంధకతాళకములను శుద్ధవర్తలోహముతో చేర్చి నిమ్మపండ్లరసముతో నూరి పుటము వేసినయెడల భస్మమగును.

రససంకేతకలిక:—లోహవికార చికిత్స:

"సితా గవ్యయుతా దేయా ధాతుభక్షణవైకృతే॥"

(ఆవునేతితో చక్కెరగలిపి సేవించినచో దుర్లోహభక్షణమువలన గలిగిన వికారములు శాంతించును.)

## —♦ లోహములు రససిద్ధికరములనుట ♦—

మూ. జాతిమద్భి ర్విశుద్ధైశ్చ విధినా పరిసాధితైః।
రసోపరసలోహాద్యై స్సూతస్సిధ్యతి నాన్యథా
రత్నాని లోహాని వరాటశుక్తి పాషాణజాతం ఖురశృంగశల్యం
మహారసాద్యేషు కఠోరదేహం భస్మీకృతం స్యాత్ఖలు సూతయోగ్యం॥

తా. మంచిజాతికి చేరినవియు, శుద్ధిచేయబడినవియు, యథావిధిగ మారణము జేయబడినట్టియు, రసఉపరసలోహాదులచే రససిద్ధికలుగును. కాదేని యదిదుర్లభము. రత్నములు, లోహములు, గవ్వ, శుక్తి, పాషాణము, డెక్కలు, కొమ్ములు, శల్యములు, మహారసములు మొదలగు కఠోరవస్తువులన్నియు భస్మములుగ జేయబడినచో, రససిద్ధికి సాధనములుకాగలవు.

## —♦ భూనాగసత్త్వపరమావశ్యకత ♦—

మూ. వజ్రాణాం ద్రావణార్థాయ సత్త్వం భూనాగజం బ్రువే
తదేవ పరమం తేజః సూతరాజేంద్ర వజ్రయోః॥

తా. వజ్రాది రత్నద్రావణమునకు ముఖ్యావశ్యకమగు భూనాగసత్త్వమును గ్రహించు విధమును చెప్పుచున్నాను.

## —♦భూనాగసత్త్వము♦—

మూ. ధౌతభూనాగ సంభూతం మర్దయే ద్భృంగజద్రవైః
నింబూద్రవైశ్చ నిర్గుండ్యా స్స్వరసై స్త్రిదినం పృథక్
తద్ద్రావణ గణోపేతం సంమర్ద్య వటకీకృతం
నిబధ్య దృఢమూషాయాం ద్వాదండం ప్రధమేద్దృఢం
స్వతశ్శీతం సమాహృత్య పట్టకే పిని వేశ్య తత్
రవకాన్ రాజికాతుల్యాన్ రేణూ నతి భరాన్వితాన్
ద్వాదశాంశార్క సంయుక్తాన్ ధమిత్వా రవకాన్ హరేత్
ప్రక్షాళ్య రవకా నాశు సమాదాయ ప్రయత్నతః
వజ్రాది ద్రావణం తేన ప్రకుర్వీత యథేప్సితం
ఖరసత్త్వ మిదంప్రోక్తం రసాయన మనుత్తమం
ద్విత్రిమూషాసు చైకస్యాం సత్త్వంభవతి నిశ్చితం॥
భుజంగమా నుపాదాయ చతుష్ప్రస్థ సమన్వితాన్
సువర్ణరూప్యతామ్రాయస్కాంత సంభూత భూమిజాన్
ప్రక్షాళ్య రజనీతోయైః శీతలైశ్చజలైరపి
ఉపోషితం మయూరంవా శూరంవా చరణాయుధం
క్రమేణ చారయిత్వాథ తద్విష స్సముపాహరేత్॥
క్షారామ్లై సహాస్సంపేష్య విశోష్యచ ఖరాతపే॥
తతః ఖర్పరకే క్షిప్త్వా భర్జయిత్వా మషీంచరేత్
మషీం ద్రావణవర్గేణ సంయుక్తాం సంప్రమర్దితాం
నిరుధ్య కోష్ఠికామధ్యే ప్రధమే ద్ఘటికాద్వయం
శీతలీభూతమూషాయాః ఖోటమాహృత్య పేషయేత్



ప్రక్షాళ్య రవకా నాశు సమాదాయ ప్రయత్నతః
సువర్ణమానవద్ధ్మాత్వా రవం కృత్వా నియోజయేత్॥

తా. వానపాములను దెచ్చి కడిగి కాల్చి బూడిదగజేసి దానిని గుంటగలగరరసముతో నొకదినమును, వావిలిరసముతో నొకదినమును మర్దించి ద్రావణవర్గముగ జెప్పబడిన ద్రవ్యములతో దానినిచేర్చినూరి ఉండలుగజేసి మూసలోబెట్టిమూతమూసి చీలజేసి యెండించి కొలిమిలోనుంచి రెండుఘడియలు గాఢముగనూది స్వాంగశీతలమైనపిదప వెలికి దీసి గుడ్డలోబోర్లించి అందు ఆవగింజలనుబోలిన మిగులభారవంతములగు రవ్వలను గ్రహించవలెను. పిదప వానికి పండ్రెండవవంతు తెల్లజిల్లేడు పట్టచూర్ణమును కలిపి మూసలోనుంచి మరల మునుపటివలె నూది స్వాంగశీతలమున అందుండు రవలను గ్రహించునది. ఇదియభూనాగసత్త్వ మనబడును.

ఈసత్త్వమునునీళ్లతోశుభ్రముగాకడిగియుంచుకొని వజ్రాదిమణులను ద్రావణము జేయునప్పుడుపయోగించుకొనవలెను. దీనికి ఖరసత్త్వమని పేరు. ఇది రసాయనములలో నుత్తమము. పైజెప్పినరీతిగ జేసినచో సత్త్వమేర్పడకున్న మరల రెండుమూడు తడవలట్లే చేసిన తప్పక సత్త్వము వెడలును.

వెండి, బంగారము, అయస్కాంతము అనులోహములు పుట్టుభూములలోని వానపాములను నాల్గుప్రస్థములు (276 తులములు) పరిమితముగ దెచ్చి చన్నీళ్లతో చక్కగా కడిగియుంచుకొనవలెను. ఒకదినమంతయు యాహారము పెట్టక యుపవాసముంచబడిన నెమలిచేతనైనను శౌర్యముగలకోడిచేనైనను నా వానపాములను దినిపించి యాజంతువు విసర్జించినమలమునుగ్రహించి అందుక్షారములను ఆమ్లవర్గరసములను కలిపి నూరి తీక్ష్ణమైనయెండ నెండించి ఒకమూకుడులోనుంచి పొయిమీదబెట్టి వేయించి మసిచేసి ఆమసిని ద్రావణవర్గ ద్రవ్యములతో చేర్చి నూరి మూసలోనుంచిచీలజేసి యెండించి కొలిమిలోబెట్టి రెండుగడియలు కాలమూది స్వాంగశీతలమునదీసి మూసలోనుండలవలెనుండు సత్త్వమునుగ్రహించినూరి యేర్పడిన రవలను నీళ్లతోకడిగి మరల బంగారమునూదునట్లు కొలిమిలోబెట్టి యూది రవ్వను గ్రహించవలెను. ఇదియ భూనాగసత్త్వ మనబడును.

అథ భూతప్రక్రియ:— వానపాములను తెచ్చి పేడతోచేర్చి పిడకలుగజేసి యెండించి కాల్చి యాబూడిదను ఒకబాణలిలోవేసి నీరుతోకడిగి పైబూడిదను వంచివేయవలెను. ఇట్లుకొన్నిసారులు కడిగినచో అడుగున రాగివంటిభూనాగ సత్త్వ మేర్పడును.

## భూనాగ ముద్రిక

మూ. భూనాగోద్భవ సత్త్వ ముత్తమమిదం శ్రీసోమదేవోదితం
దత్తం పాదమితం ద్విశాణకనకే నైకం గతేనోర్మికాం॥
తద్ధౌతాంబువిలేపితం స్థిరచరోద్భూతం విషం నేత్రరుక్
శూలం మూలగదంచ కర్ణజరుజో హన్యాత్ప్రసూతిగ్రహాన్॥

తా॥ రెండునిష్కములయెత్తు బంగారములో నిష్కములో నాల్గవవంతు భూనాగ సత్త్వమును చేర్చి కొలిమిలోనూది ఆలోహముతో నుంగరము చేయించి ఉంగరమును నీళ్లతో కడిగి ఆనీళ్లను రాచినంతమాత్రమున స్థావరజంగమ విషములు, నేత్రరోగములు శూల, మూలరోగము, కర్ణరోగములు, సూతికాగ్రహబాధలు శమించును.

## తైలపాతనవిధి

మూ. మూలాన్యుత్తరవారుణ్యా జర్ఝరీకృత్య కాంజికే
క్షిపే దంకోలబీజానాం పేషికాం జర్ఝరీ కృతాం॥
తత్తైలం ఘృతవత్ స్యానం గ్రాహ్యం తత్తు యథావిధి
సంపేష్యోత్తరవారుణ్యా పేటకార్యా దళాన్యథ॥
కాంజికేన తతస్తేన కల్కేన పరిమర్దయేత్
రజ శ్చాంకోలబీజానాం తద్బధ్వా విరళాంబరే॥
తద్విలంబ్యాతపే తీవ్రే తస్యాధశ్చషకం క్షిపేత్
తస్మిన్నిపతితం తైలం ఆదేయం శ్విత్రనాశనం॥
అంకోలబీజసంభూతం చూర్ణం సమ్మర్ద్య కాంజికైః
ఏకరాత్రోషితం తత్తు పిండీకృత్య తతఃపరం॥
స్వేదయే త్కందుకే యంత్రే ఘటికా ద్వితయం తతః
తాంచ పిండీం దృఢేవస్త్రే బద్ధ్వా నిష్పీడ్య కాష్ఠతః॥
అధః పాత్రస్థితం తైలం సమాహృత్య నియోజయేత్
ఏవం కందుకయంత్రేణ సర్వతైలా న్యుపాహరేత్



అంకోలస్యాపి తైలం స్యా త్కాకతుండ్యా సమూలయా
వాగుజీదేవదార్వోశ్చ కర్కోటీ మూలతో భవేత్
అపామార్గ కషాయేణ తైలం స్యా ద్విషముష్టిజం
మూలకస్యాథ కుమార్యాశ్చ తైలం జైపాలకం హరేత్
కృష్ణాయాః కాకతుండ్యాశ్చ బీజచూర్ణాని కారయేత్
కాంతపాషాణచూర్ణంచ ఏకీకృత్య నిరోధయేత్
ధాన్యరాశిగతం పశ్చాత్ ఉద్ధృత్య తైలమాహరేత్॥

ఇతి శ్రీవాగ్భటాచార్యవిరచితే రసరత్నసముచ్చయే పంచమోధ్యాయః.

తా. నెల్లివేళ్లను నలియగొట్టి కాంజికములో వేసి అందులో ఊడుగుగింజలను మెత్తగా నలియగొట్టి వేసినయెడల కాంజికమందు నేయివలె తైలము తేలును. దానిని భద్రముగ గ్రహించునది.

నెల్లియాకులను, పేటకారియను మూలికయొక్క ఆకులను కాంజికముతో నూరి కల్కముచేసి యాకల్కముతో ఊడుగువిత్తులచూర్ణమును చేర్చి నూరి యా సముదితకల్కమును పలుచనిగుడ్డలో మూటగట్టి తీవ్రమైనయెండలో వ్రేలాడగట్టవలెను. ఎండవేడిమికి కల్కమందలి తైలము చుక్కలుచుక్కలుగ క్రిందపడును. దానిని పాత్రలో గ్రహించి శ్విత్రము (బొల్లి)నందు వాడవలెను.

ఊడుగువిత్తులచూర్ణమును కాంజికముతో మర్దించి ఒకరాత్రి నిలువయుంచి ఉదయమున బాగుగా రుబ్బి కందుకయంత్రమునందు రెండుగడియలు స్వేదనముచేసి యాపిండిని గట్టిబట్టలోనుంచి యొకపాత్రలో పిండినయెడల తైలము దిగును. ఇట్లు సర్వతైలములను గ్రహించవచ్చును.

అంకోలతైలమును మొదటచెప్పినట్లు నెల్లివేరుతోనేగాక కాకిదొండయొక్క సమూలతోగూడ తీయవచ్చును. మరియు బావంచివిత్తులనుండియు దేవదారి (దూపరదంగి) విత్తులనుండియు తైలమును గురివెంద వేరుతో తీయవలెను. ఉత్తరేణుకషాయముతో విషముష్టితైలమును తీయునది. కలబంద వేళ్లకషాయముతో నేపాలపువిత్తులనుండి తైలమునుదీయవలెను. పిప్పలిగింజలను చూర్ణించి దీనితో కాంతపాషాణచూర్ణమును చేర్చి

ఒక పాత్రలోనుంచి మూసి ధాన్యరాశియందు కొంతకాలముంచి తీసి దానినుండి తైలము గ్రహించవలెను.

రసరత్నాకరము:—ధత్తూరబీజతైలము:

"ధత్తూరబీజచూర్ణాని వస్త్రపూతాని కారయేత్
ఆలిప్య కాంస్యపాత్రేతు ధారయే దాతపే ఖరే॥
సుతప్తం వస్త్రపూతంచ పాతయేత్తైల మాహరేత్॥"

(నల్లయుమ్మెత్తగింజలచూర్ణమును వస్త్రగాలితము చేసి నీళ్లలో మెదిపి కంచుపాత్రకు పూసి తీక్ష్ణమైనయెండలో బెట్టి మరల వస్త్రముతో వడియగట్టినయెడల తైలము దిగును)

శ్రీమత్కృష్ణా గోదావరీమధ్య విద్యోతమాన నూజవీణ్ణప్రభువరశ్రీమదుయ్యూరు
మేడూరు నిడదవోలు ప్రముఖసంస్థానాధీశ్వర ఆంధ్రకవితాధురంధర పండితకవి
పోషక శ్రీ శ్రీ రాజా వెంకటాద్రయప్పారాయప్రభుపుంగవాస్థాన
పండిత భారద్వాజసగోత్రపవిత్ర వేంకటసుబ్బావధాని సత్పుత్ర
సకలపండితకవి సద్వైద్యవిధేయ సత్యనారాయణశాస్త్రి
నామధేయాంధ్రీకృత రసరత్నసముచ్చయమునందు
పంచమాధ్యాయము సమాప్తము.

శ్రీశారదాంబార్పణమస్తు.

---

శ్రీరస్తు

# రసరత్నసముచ్చయము

## షష్ఠాధ్యాయము

### —♦ శిష్యోపనయనం ♦—

మూ. రసశాస్త్రాణి సర్వాణి సమాలోచ్య యథాక్రమం
సాధకానాం హితార్థాయ ప్రకటీక్రియతేఽధునా
న క్రమేణవినా శాస్త్రం న శాస్త్రేణవినా క్రమః
శాస్త్రక్రమయుతం జ్ఞాత్వా యః కరోతి స సిద్ధిభాక్॥

తా॥ రసశాస్త్రగ్రంథముల నన్నిటిని పరిశీలించి రససాధకుల హితార్థమై రససాధనక్రమమును స్పష్టముగ జెప్పుచున్నాము. క్రమముదప్పిన శాస్త్రమును శాస్త్రవిహీనమైన క్రమమును కూడనివి. కనుక శాస్త్రోక్తమైన క్రమమునెరిగి రససాధనమున నుపక్రమింపవలెను.

### —♦ రసవిద్యా గురులక్షణము ♦—

మూ. ఆచార్యో జ్ఞానవాన్ దక్షః రసశాస్త్ర విశారదః
మంత్రసిద్ధో మహావీరః నిశ్చయ శ్శివవత్సలః
దేవీభక్త స్సదాధీరః దేవతాయాగతత్పరః
సర్వామ్నాయ విశేషజ్ఞః కుశలో రసకర్మణి
ఏవం లక్షణసంయుక్తో రసవిద్యా గురుర్భవేత్

తా. సదుపదేశకుడును, జ్ఞానియును, సమర్థుడును, రసశాస్త్రమును క్రమముగ నభ్యసనము జేసినవాడును, మంత్రసిద్ధిగలవాడును, పరాక్రమవంతుడును, ఇంద్రియనిగ్రహ

ముగలవాడును, శివపూజాతత్పరుడును, శ్రీ దేవతాభక్తుడును, ధైర్యముగలవాడును, దేవతాయాగములను జేసినవాడును, వివిధశాస్త్రసంప్రదాయముల నెరింగినవాడును, రసకర్మయందు నేర్పరియును నగువాడు రసవిద్యాగురువుగ నుండుట కర్హుడైయుండును.

—♦ శిష్యలక్షణము. ♦—

మూ. గురుభక్తా స్సదాచారా స్సత్యవంతో దృఢవ్రతాః
నిరాలస్యా స్స్వధర్మజ్ఞా స్సదాజ్ఞా పరిపాలకాః
దంభమాత్సర్యనిర్ముక్తా కులాచారేషు దీక్షితాః
అత్యంతసాధకా శ్శాంతాః మంత్రారాధనతత్పరాః
ఇత్యేవంలక్షణైర్యుక్తా శ్శిష్యా స్స్యు స్సూతసిద్ధయే॥

తా॥ గురుభక్తి, సదాచారము, సత్యము, పట్టుదల, చురుకుదనము, స్వధర్మపరత అను గుణములు కలిగి యెల్లప్పుడును గురునాజ్ఞను శిరసావహించుచు దంభము మాత్సర్యము మున్నగు దుర్గుణములులేక తమ కులాచారముల వీడక శాంతులై రససాధనమునందు ఆసక్తిగలిగి మంత్రసిద్ధిం బడసియుండువారు రసశాస్త్రాధ్యయనమునకు అర్హులైన శిష్యులుగ నుందురు.

—♦ అనుచరలక్షణము. ♦—

మూ. సహాయా స్సొంద్యమాస్తత్ర యథాశిష్యా స్తతోధికాః
కులీనా స్స్వామిభక్తాశ్చ కర్తవ్యా రసకర్మణి॥

తా॥ సత్కులమునందు బుట్టి యజమానియందు భక్తివిశ్వాసములుగలిగి కార్యములందు పూనికగలిగి శిష్యులకంటె నెక్కుడు చురుకుగ పనిచేయు అనుచరులను రసకర్మయందు సహాయులను జేసికొనవలెను.

—♦ అయోగ్య శిష్యలక్షణము. ♦—

నాస్తికా యే దురాచారా శ్చుంబకా గురుతోపరాత్
విద్యాం గ్రహీతు మిచ్ఛంతి చౌర్యఛద్మ ఖలోత్సవాత్
న తేషాం సిధ్యతే కించి న్మణిమంత్రౌషధాదికం
కుర్వంతియది మోహేన నాశయంతి స్వకం ధనం
ఇహలోకే సుఖం నాస్తి పరలోకే తథైవచ
తస్మా ద్భక్తిబలాదేవ సంతుష్యతి యథాగురుః



తథా శిష్యేణ సా గ్రాహ్యా రసవిద్యాత్మసిద్ధయే
హస్తమస్తకయోగేన వరం లబ్ధ్వా ససాధయేత్॥

తా॥ నాస్తికులునుగాక గురువునుండి, మరియొకరివలన సంప్రదాయాదులనుసేర్చుకొన నిచ్ఛగలవారును, దొంగతనముగను, కపటముగను, క్రూరిత్వముగను, విలాసార్థముగను, రసవిద్యను గ్రహింపదలచిన యధమునకు రససిద్ధి కానేరదు. అజ్ఞానమువలనను అహమికవలనను రససాధనము చేయబూనిన తమధనము వ్యర్థముచేసికొని యిహపర సుఖదూరులై దుఃఖపడుటయేగాని లాభములేదు. కనుక భక్తిప్రపత్తులచే గురువు సంతసించి యెప్పుడు తనకు రసవిద్యాసంప్రదాయములననుగ్రహించునో యంతవరకును శుశ్రూషజేసి హస్త మస్తకసంయోగపూర్వకముగ గురువుయొక్క వరమును పొంది రససాధనమున కుపక్రమింపవలెను. (హస్తమస్తకసంయోగమనగా శిష్యునిశిరస్సునందు గురువు తన దక్షిణహస్తమునుంచి 'ఓవత్సా! నీవు రససిద్ధి బడయుదువుగాక' యని "రసాంకుశ" విద్య నుపదేశించుట.)

—♦ రససాధన-రసశాలా-రసమండపములు. ♦—

మూ. ఆతంకరహితే దేశే ధర్మరాజ్యే మనోరమే
ఉమామహేశ్వరోపేతే సమృద్ధనగరే శుభే
కర్తవ్యం సాధనం తత్ర రసరాజస్య ధీమతా
అత్యంతోపవనే రమ్యే చతుర్ద్వారోపశోభితే
తత్ర శాలాప్రకర్తవ్యా సువిస్తీర్ణ మనోరమా
సమ్యగ్వాతాయనోపేత దివ్య చిత్రై ర్విచిత్రితా
తత్సమీపే సమే దీప్తే కర్తవ్యం రసమంటపం
అతిగుప్తం సువిస్తీర్ణం కపాటార్గళశోభితం
ధ్వజచ్ఛత్ర వితానాఢ్యం పుష్పమాలా విలంబితం
భేరీకాహళ ఘంటాది శృంగినాద వినాదితం
భూస్సమా తత్రకర్తవ్యా సుదృఢా దర్పణోపమా
తన్మధ్యే వేదికారమ్యా కర్తవ్యా లక్షణాన్వితా॥

తా. నిర్బాధకమై మనోహరమైన ధర్మరాజ్యమందు పార్వతీపరమేశ్వర ప్రతిష్ఠగల భాగ్యవంతమగు పట్టణమందు రససాధనము చేయుట కనుకూలముగ నుండును. అట్టి దేశమునందు ఉద్యానవనమున విశాలమై మనోహరమై నాల్గువైపులను

ద్వారములుగల రసశాలను నిర్మించవలెను. అందు వెలుతురు గాలి ప్రసరించునట్లు గవాక్షముల నుంచవలెను. అందు అందమైన చిత్తరువులను వ్రాయించవలెను. దానికి చేరువలో రహస్యస్థలమున ద్వారబంధములను తలుపులనుగల విశాలమైన రసమంటపమును కట్టించి దానికి జండాలు ఛత్రము వితానము(చాందినీ) పుష్పమాలికలు మొదలగు వానిచే నలంకారము చేయవలెను. అచ్చట భేరీ కాహళ ఘంటా శృంగ్యాదినాదములచే ప్రతిధ్వనులు గలుగునట్లుచేయవలెను. ఆరసమంటపముయొక్క ప్రదేశమంతయు అద్దమువలె నునుపుగను దృఢముగను సమముగను ఉండునట్లు చేయవలెను. మరియు నారసమండపమధ్యమున శుభలక్షణలక్షితమై మనోహరమైన వేదికను (అరుగు) కట్టించవలెను.

## — రసలింగ స్థాపనాదికము —

మూ. నిష్కత్రియం హేమపత్రం రసేంద్రం నవనిష్కకం
అమ్లేన మర్దయేద్యామం తేన లింగంతు కారయేత్
డోలాయంత్రే సారనాళే జంబీరస్థం దినం పచేత్
తల్లింగం పూజయే త్తత్ర సుశుభైరుపచారకైః
లింగకోటిసహస్రస్య యత్ఫలం సమ్యగర్చనాత్
తత్ఫలం కోటిగుణితం రసలింగార్చనా ద్భవేత్
బ్రహ్మహత్యాసహస్రాణి గోహత్యా శ్చాయుతానిచ
తత్క్షణాద్విలయం యాంతి రసలింగస్యదర్శనాత్
స్పర్శనాత్ప్రాప్యతే ముక్తి రితి సత్యం శివోదితం
ఆగ్నేయ్యాం శ్రీ అఘోరేణ మంత్రరాజేన చార్చయేత్
అష్టాదశభుజం శుభ్రం పంచవక్త్రం త్రిలోచనం
ప్రేతారూఢం నీలకంఠం రసలింగం విచింతయేత్
తస్యోత్సంగే మహాదేవీ మేకవక్త్రాం చతుర్భుజాం
అక్షమాలాం కుశం దక్షే వామే పాశాభయం శుభం
దధతీం తప్త హేమాభాం పీతవస్త్రాం విభావయేత్
"వాఙ్మయీశ్రీః కామరాజ శక్తిబీజం రసాంకుశా
మై స్సమాద్వాదశార్ణాంశైవ జ్ఞేయా విద్యారసాంకుశా
అనయా పూజయేద్దేవం గంధపుష్పాక్షతాదిభిః



నందీ భృంగీ మహాకాళీ కుళీరాన్ పూర్వదిక్క్రమాత్
పూజయేన్నామమంత్రైశ్చ ప్రణవాది నమోంతకైః
ఏవం నిత్యార్చనం తత్ర కర్తవ్యం రససిద్ధయే॥

తా. మూడునిష్కములయెత్తు కుందనపురేకులను తొమ్మిదినిష్కముల పాదరసము తోకలిపి నిమ్మపండ్లరసముతో నొకజాము మర్దించి యాముద్దను శివలింగాకారముగ జేసి దానిని నిమ్మపండులోపెట్టి ఆరనాళమున డోలాయంత్రములో నొకదినము స్వేదనము చేసిన గట్టిపడును. ఆలింగమును రసమంటపస్థవేదికయందుంచి ధ్యానావాహనాది షోడశోపచారములచేత పూజించవలెను. ఇట్టి రసలింగమును పూజించిన కోట్లకొలది శివలింగములను పూజించినఫల మబ్బును. వేయి బ్రహ్మహత్యాపాపములును, కోటి గోహత్యాపాపములును రసలింగదర్శన మాత్రమున నశించును. రసలింగమును స్పృశించినచో ముక్తికలుగును. ఇది సత్యమైన శివవాక్యము.

రసమంటప వేదికయొక్క ఆగ్నేయమూలయందు పైరసలింగమును అఘోరమంత్రముచే పూజించవలెను. పదునెనిమిదిభుజములను, అయిదుముఖములను, మూడు నేత్రములను, స్వచ్ఛమైన శరీరకాంతిని ప్రేతవాహనమును నీలకంఠమునుగలిగిన పరమశివుని ఆరసలింగమందు భావనచేయవలెను. మరియు నాశివుని వామాంకమునందు ఏకముఖమును నాల్గు భుజములను,ఆభుజములలో కుడిభుజములందు అక్షమాలికను, అంకుశమును,ఎడమ భుజములందు పాశమును అభయహస్తమునుగలిగినట్టియు,పదునారువన్నెబంగారుతో సమానమగు దేహకాంతికలిగినట్టియు పచ్చని వస్త్రమును ధరించినట్టియు పరదేవతను ధ్యానించవలెను."ఓం ఐం శ్రీం క్లీం హ్రీం రసాంకుశాయ నమః" అనుద్వాదశాక్షర రసాంకుశ విద్య నుచ్చరించుచు గంధపుష్పాక్షతలచే బూజించవలెను.* రసశాలయొక్కతూర్పుద్వా

* "ఓం ఐం హ్రీం శ్రీం పీం హ్రాం భగవతీ ఘోరే హ్రాం రసాంకుశేశ్వరీ హంసా హంసీ హ్రాం హ్రీం హ్రూం హ్రాం హ్రీం హ్రూం హ్రాం హ్రీం హ్రూం నమః॥ అఘోరముఖీం ఛాం ఛుం కిణి కిణి విచ్చైచ్ఛ క్షైం ఖ్యైం శ్రీం హ్రీం ఐం రసం స్తంభయ స్తంభయ స్వాహా॥"

"ఓం ఘోరే క్రీం అఘోరే, హ్రీం, అఘోరతరే హ్లీం సర్వతస్సంరక్ష హ్రాం హ్రీం హ్రూం క్షుం రుద్రరూప హుంఫట్ స్వాహా॥"

అను నీ రసాంకుశా, అఘోరమంత్రములు గోవిందభగవత్పాదులచే రససారమందు చెప్పబడినవి.

"అఘోరేభ్యోథఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యః। సర్వేభ్యస్సర్వ శర్వేభ్యో నమస్తే అస్తు విశ్వరూపేభ్యః॥" ఇది వేదోక్త అఘోరమంత్రము.

రమున నందీశ్వరుని, దక్షిణద్వారమున భృంగీశ్వరుని, పశ్చిమద్వారమున మహాకాళేశ్వరుని ఉత్తరద్వారమున కుళీశేశ్వరుని వరుసగ 'ఓం నందీశ్వరాయనమః, ఓంభృంగీశ్వరాయనమః, ఓం మహాకాళేశ్వరాయనమః, ఓం కుళీశేశ్వరాయనమః' అనుమంత్రములచే పూజింపవలెను. రససిద్ధికై పైజెప్పినచొప్పున రసశాలయందు నిత్యార్చన మాచరించుచుండవలెను.

## —♦ కుంభస్థాపనాది శిష్యదీక్షావిధానము ♦—

శ్లో. రసవిద్యా శివేనోక్తా దాతవ్యా సాధకాయవై।
యథోక్తేన విధానేన గురుణా ముదితాత్మనా॥
సుముహూర్తే సునక్షత్రే చంద్రతారాబలాన్వితే॥
కలశం తోయసంపూర్ణం హేమరత్నఫలైర్యుతం।
స్థాపయేద్రసలింగాగ్రే దివ్యవస్త్రేణ వేష్టితం॥
గంధ పుష్పాక్షతై ర్ధూపై ర్నైవేద్యైశ్చ సుపూజయేత్
పూజాంతే హవనం కుర్యా ద్యోనికుండే సులక్షణే।
తిలాజ్యైః పాయసైః పుష్పై శ్శతపుష్పాదికైః పృథక్.
అఘోరేణ రసాంకుశ్యా హోమాంతే శిష్యమాహ్వయేత్
కాళినీ శక్తిసంయుక్తా రససిద్ధిపరాయణా॥
యస్యాస్తు కుంచితాః కేశాః శ్యామాయా పద్మలోచనా।
సురూపా తరుణీ భిన్నా విస్తీర్ణజఘనా శుభా॥
సంకీర్ణహృదయా పీనస్తనభారేణ నమ్రితా
చుంబనాలింగనస్పర్శకోమలా మృదుభాషిణీ॥
అశ్వత్థపత్రసదృశయోనిదేశసుశోభితా
కృష్ణపక్షే పుష్పవతీ సా నారీ కాళినీస్మృతా॥
రసబంధే ప్రయోగేచ ఉత్తమా సా రసాయనే
తదభావే సురూపాతు యా కాచి త్తరుణాంగనా
తస్యా దేయం త్రిసప్తాహం గంధకం ఘృతసంయుతం
కర్షైకైకం ప్రభాతేతు సా భవే త్కాళినీసమా



ఏవం శక్తియుతో యోసౌ దీక్షయేత్తం గురూత్తమః
సుస్నాత మభిషించేత మంత్రేణ కలశోదకైః
అఘోర మంకుశీం విద్యాం దద్యా చ్ఛిష్యాయ వై గురుః
యథాశక్త్యాతు శిష్యేణ దాతవ్యా గురుదక్షిణా
అథాజ్ఞయా గురోర్మంత్రం లక్షంలక్షం పృథగ్జపేత్
అనయా పూజయేద్దేవి మిమాం విద్యాం రసాంకుశాం
దశాంశేన హువేత్కుండే త్రికోణే హస్తమాత్రకే
జాతిపుష్పం త్రిమధ్వక్తం పూర్ణాంతే కన్యకార్చనం॥

తా॥ శివోక్తమైన రసవిద్యను శిష్యునకు ఉపాధ్యాయుడు ముందు చెప్పబోవురీతిగ శుభముహూర్తమున శుభనక్షత్రమున చంద్రతారాబలయుతలగ్నమం దుపదేశింపవలెను. రసలింగాగ్రభాగమున మంచివస్త్రముచే గట్టబడి యుదకముచేత పూరింపబడిన కలశమునుంచి గంధపుష్పాక్షతాదులచే పూజించి నివేదనముచేసి పిదప తిలలు, నేయి, పాయసము, సదాప మొదలగు పుష్పములు అఘోర-రసాంకుశమంత్రపూర్వకముగ యోని కుండమందు హోమముచేసి పిదప శిష్యుని బిలిచి దగ్గరనుంచుకొని కాళినీపూజ గావించి అఘోర-రసాంకుశమంత్రముల నుపదేశించవలెను.

కాళినీలక్షణము:—కాళినీపూజచేయుటవలన రససిద్ధి కలుగును. వంకరలైన కేశములను గలిగి యౌవనమధ్యస్థయై తామరపూవులవంటి నేత్రములుగలిగి యుండ కత్తెయై బలసిన పిరుదులు కుచములు గలిగి, చుంబనాలింగనస్పర్శనములం దాసక్తిగలిగి మృదుభాషణములను రావియాకువంటి గుహ్యమునుగలిగి కృష్ణపక్షమందు రజస్వలయగు స్త్రీ కాళిని యనబడును. రసబంధమందును, రసప్రయోగమునందును, రసాయనమునందును కాళినీపూజచేయుట ఉత్తమసిద్ధిదాయకము. పైలక్షణములుగల యువతి దొరకనియెడల యౌవనవతియగు నేయువతినైనను తీసికొనివచ్చి యామెకు ఒకకర్షకము గంధకమును నేతితో ప్రతిదినము ఉదయమున యిరువదియొక్కదినములవరకు నిచ్చి సేవింపజేసినచో కాళినీసమాన యగును. అనగా, పైజెప్పిన కాళినీలక్షణములు లేకున్నను కాళినికి బదులుగ రససాధకుడు పూజించుట కర్హయగునని తాత్పర్యము. సుస్నాతుడై కాళినీపూజచేసిన శిష్యునిశిరస్సునందు "పవమానస్సువర్జనః" అను మార్జనమంత్రములచే గురువు మార్జనముచేసి అఘోర-రసాంకుశమంత్రముల నుపదేశించును. పిదప శిష్యుడు గురునకు యథాశక్తిగ దక్షిణ నొసంగవలెను. అనంతరమున గుర్వాజ్ఞానుసారముగ పైరెండుమంత్రములను ప్రత్యేకము లక్షచొప్పున పురశ్చరణము

గావించి మూరెడులోతును వెడల్పును గల ముక్కోణాకారముగల (యోని) కుండము నందు పెరుగు, నేయి, తేనె అను త్రిమధువులలో తడిపిన జాజిపూవులతో పదివేల సారులు హోమముచేసి పూర్ణాహుతిగావించి పిదప కన్యకార్చనము చేయవలెను,

—♦ రససిద్ధ్యర్థపదార్థ - తత్పూజాది కథనము ♦—

మూ. కృత్వాథ ప్రవిశేచ్ఛాలాం శుద్ధాం లిప్తాం సువేదికాం
షట్కోణమండలం తత్ర సిందూరేణ ద్విహస్తకం
వేదికాయాం లిఖేత్సమ్యక్తద్బహిశ్చాష్టపద్మకం
కమలంచతురస్రంచ చతుర్ద్వారైస్సుశోభితం
కర్ణికాయాం న్యసేత్ఖల్వం లోహజం స్వర్ణలేఖితం
తన్మధ్యే రసరాజంతు పలానాం శతమాత్రకం
పంచాశత్పంచవింశద్వా పూజయేద్రసలింగవత్
వజ్రవైక్రాంత వజ్రాభ్రకాంతపాషాణటంకణం
భూనాగో శక్తయశ్చైతాః షట్సుతేత్ర పూజయేత్క్రమాత్
గంధతాళకకాసీస శిలాకంకుష్ఠ భూషణం
రాజావర్తో గైరికంచ ఖ్యాతా ఉపరసా అమీ
పూజ్యా అష్టదళే చైతే పూర్వాదీశానగం క్రమాత్
రసకం విమలం తాప్యం చపలాతుత్థమంజనం
హింగుళంసస్యకంచైవ ఖ్యాతా ఏతే మహారసాః
పూర్వాదీశానపర్యంతం పత్రాగ్రేషు ప్రపూజయేత్
పూర్వద్వారే స్వర్ణరౌప్యే దక్షిణే తామ్రసీసకే
పశ్చిమే వంగ కాంతౌచ ఉత్తరే ముండతీక్ష్ణకే
సర్వమేత దఘోరేణ పూజయేదంకుశాన్వితం
విడం కాంజికయంత్రాణి క్షారమృల్లవణానిచ
కోష్ఠీ మూషా వంకనాళీ తుషాంగారవనోపలాః
భస్త్రికాదండికానేకా శిలాఖల్వాన్యలూఖలం
స్వర్ణకారోపకరణం సమస్త తులనానిచ
మృత్కాష్ఠతామ్రలోహోత్థపత్రాణి వివిధానిచ
దివ్యౌషధీనాం వర్గాశ్చ గంజకస్నేహనానిచ



ఏతాని ద్వారబాహ్యేతు మూలమంత్రేణ పూజయేత్
వాఙ్మాయాం హ్రీం తతః క్షాంచ క్ష్మశ్చ పంచాక్షరో మనుః
అనేన మూలమంత్రేణ భైరవం తత్ర పూజయేత్॥

తా. ఇట్లు గురూపదిష్టమంత్రసిద్ధిగలిగిన సాధకుడు పరిశుద్ధముగ నలుకబడిన రసమంటపమున ప్రవేశించి రెండుమూరల విస్తీర్ణముగ వేదికయందు సిందూరముతో షట్కోణ చక్రమును వేసి దానివెలుపల అష్టదళపద్మమును దానివెలుపల నాల్గువైపుల ద్వారములు గల చతురస్రరేఖలను వ్రాసి మధ్యభాగమునందు బంగారముచే గీతలుగీయబడిన లోహ ఖల్వ ముంచి అందు నూరు లేక ఏబది. లేక యిరువదియైదు పలముల పాదరసమును పోసి రసలింగమునువలె పూజించునది. వజ్రము, వైక్రాంతము, వజ్రాభ్రకము, కాంతము, వెలిగారము, భూనాగము అను శక్తిరసములను షడ్దళచక్రమందు క్రమముగ ఆరురేకు లందును పూజించునది. గంధకము, తాళకము, అన్నభేది, మణిశిల, కంకుష్ఠము, పటికి, రాజావర్తము, గైరికము, అను ఉపరసములను తూర్పు, ఆగ్నేయము, దక్షిణము, నైఋతి, పశ్చిమము, వాయవ్యము, ఉత్తరము, ఈశాన్యము అను దిక్కులందు క్రమముగ అష్టదళ పద్మమున పూజించవలెను. రసకము, విమలము, మాక్షికము, చపలము, తుత్థము, అంజనము, ఇంగిలీకము, సస్యకము అను మహారసములను వెనుకటివలె తూర్పు మొదలగు యెనిమిదిదిక్కులందు అష్టదళముయొక్క చివరలను పూజించునది. పూర్వద్వారమున సువర్ణరజతములను, దక్షిణద్వారమున తామ్రసీసములను, పశ్చిమద్వారమున వంగకాంతములను, ఉత్తరద్వారమున ముండతీక్ష్ణలోహములను పూజించునది. ఈపూజలన్నియు అఘోర-రసాంకుశమంత్రములనుచ్చరించుచు చేయవలెను. బిడము, కాంజికము, యంత్రములు, క్షారములు, మృత్తు, లవణములు, కోష్ఠి, మూష, వంకనాళము, ఉముక, బొగ్గులు, యేరుపిడకలు, తిత్తి, కర్రలు, శిలాఖల్వములు, రోలు, కారు, తిరాజులు, యొత్తురాళ్ళు, మట్టితోను, కర్రతోను, లోహముతోను, తామ్రముతోను చేసిన యనేక రకముల పాత్రలు, దివ్యౌషధములు, రసాదిరంజనమున కుపయుక్తమైన స్నేహములు వీనిని ద్వారమునకు వెలుపల మూలమంత్రముచే పూజించవలెను. "ఐం హ్రీం శ్రీం క్షాం క్ష్మః" అను మూలమంత్రముచే ద్వారబాహ్యప్రదేశమున రసకర్మ రక్షార్థమై భైరవు నుచ్చరించవలెను.

—* రససిద్ధేశ్వరబ్రాహ్మణాది పూజాక్రమము *—

మూ. సర్వేషాం రససిద్ధానాం నామ సంకీర్తయేత్తదా
వ్యాళాచార్యశ్చంద్రసేనః సుబుద్ధిర్నరవాహనః
నాగార్జునో రత్నఘోషః సురానందో యశోధనః

ఇంద్రధూమశ్చ మాండవ్యః చర్పటీ శూరసేనకః
ఆగమో నాగబుద్ధిశ్చ ఖండః కాపాలికో మతః
కామారి స్తాంత్రిక శ్శంభుః లంకోలంపక శారదా
బాణాసురో మునిశ్రేష్ఠః గోవిందః కపిలో బలిః
ఏతే సర్వేతు రాజేంద్రాః రససిద్ధా మహాబలాః
చరంతి సర్వలోకేషు నిత్యా భోగపరాయణాః
సప్తవింశతి సంఖ్యాకా రససిద్ధి ప్రదాయకాః
వంద్యాః పూజ్యాః ప్రయత్నేన తతః కుర్యా ద్రసార్చనం
హర్షయన్ ద్విజదేవానాం తర్పయే దిష్టదేవతాః
కుమారీ యోగినీ యోగీశ్వరాన్ మేళక సాధకాః
తర్పయే త్పూజయే ద్భక్త్యా యథాశక్త్యనుసారతః
ఏత్యేత త్సర్వ సంభారయుక్తం కుర్యాద్రసోత్సవం
సర్వవిఘ్న ప్రశాంత్యర్థం సర్వేప్సిత ఫలప్రదం
అన్యథా యో విమూఢాత్మా మంత్రదీక్షా క్రియాద్వినా
కర్తు మిచ్ఛతి సూతస్య సాధనం గురువర్జితః
నాసౌ సిద్ధి మవాప్నోతి యత్నకోటిశతై రపి
తస్మా త్సర్వప్రయత్నేన శాస్త్రోక్తాం కారయే త్క్రియాం॥

తా. పిదప వ్యాళుడు, చంద్రసేనుడు, సుబుద్ధి, నరవాహనుడు, నాగార్జునుడు, రత్నఘోషుడు, సురానందుడు, యశోధనుడు, ఇంద్రధూముడు, మాండవ్యుడు, చర్పటి, శూరసేనకుడు, ఆగముడు, నాగబుద్ధి, ఖండుడు, కాపాలికుడు, కామారి, తాంత్రికుడు, శంభుడు, లంకుడు, లంపకుడు, శారదుడు, బాణాసురుడు, మునిశ్రేష్ఠుడు, గోవిందుడు, కపిలుడు, బలి అనురససిద్ధులైన రాజేంద్రులు యిరువదియేడుగురును భోగపరాయణులై నిత్యులై సర్వలోకములందును చరించుచుందురు. కాన వీరలను పూజించి నమస్కరించి బ్రాహ్మణులను దేవతలను యిష్టదైవములను పూజనసంతర్పణాములచే సంతోషపరచి కుమారి, యోగిని, యోగీశ్వరుడు, రససమ్మేళన సాధకాది దేవతలనుగూర్చి శక్త్యనుసారముగ పూజించి తర్పణముచేసి సమస్తసంభారములను సమకూర్చుకొని రసోత్సవక్రియ నారంభించవలెను. ఇట్లు సర్వవిఘ్ననాశనపూర్వకముగ రససిద్ధినొసంగగల దేవతాద్యర్చనము చేయక గురుముఖమున నుపదేశమునందక రససాధనము జేయబూను మూర్ఖుని పరిశ్రమ వ్యర్థమగును. కాన యథోక్తవిధిగ రససాధన జేయంజనును.



## —♦ పారదసిద్ధికర్తృయోగ్యత – రససిద్ధి ♦—

మూ. సమ్యక్సాధనసోద్యమా గురుయుతా రాజాజ్ఞయాలంకృతా
నానాకర్మపరాఙ్ముఖా రసపరా శ్శ్రద్ధా జనై శ్చార్థితాః
మంత్రయంత్రసుపాకకర్మకుశలా స్సర్వౌషధే కోవిదాః
తేషాం సిద్ధ్యతి నాన్యథా విధిబలా చ్ఛ్రీపారదః పారదః॥
రసశాస్త్రం ప్రదాతవ్యం విప్రాణాం ధర్మహేతవే
రాజ్ఞే వైశ్యాయ వృద్ధ్యర్థం దాస్యార్థ మితరస్యచ
గురౌ తుష్టే శివ స్తుష్యే చ్ఛివే తుష్టే రస స్తథా
రసే తుష్టే క్రియాస్సర్వా స్సిద్ధ్యంత్యేవ నసంశయః
రసవిద్యా దృఢం గోప్యా మాతుర్గుహ్యమివ దృఢం
భవే ద్వీర్యవతీ గుప్తా నిర్వీర్యాచ ప్రకాశనాత్
రోగిణాం బహుభి ర్జ్ఞాతం భవే న్నిర్వీర్య మౌషధం॥
న రోగివిదితం కార్యం బహుభి ర్విదితం తథా॥

ఇతి శ్రీ వాగ్భటాచార్య విరచితే రసరత్నసముచ్చయే షష్ఠోధ్యాయః

తా. సమస్తోపకరణములను, ఉత్సాహమును గలిగి గురువును దగ్గరనుంచుకొని రాజాజ్ఞ వడసి వివిధవిషయములయందు బుద్ధిని ప్రసరింపనీయక నిరంతరము రససాధనమున దీక్షవహించి ధనికుడై ప్రజాసహాయముగలిగి మంత్రయంత్రపరిశీలనపూర్వక పాకజ్ఞానముగలిగి కుశలుడై సకల దివ్యౌషధులను గుర్తెరిగి యథావిధిగ సాధించువానికి రససిద్ధికలుగును. రససిద్ధివలన సకలైశ్వర్యములు కలుగును.

ఈరసవిద్యను ధర్మవృద్ధికై బ్రాహ్మణునకును, సంపద్వృద్ధికై క్షత్రియ వైశ్యులకును, దాస్యార్థమై చతుర్థాదిజాతివారలకును ఉపదేశింపదగును. శిష్యుడు భక్తిప్రపత్తులతో గురు నారాధించి సంతోషింపజేసినచో శివుడు సంతసించును. శివుడు సంతసించిన రసము సంతోషించును. రసము సంతోషించిన సమస్తక్రియలును సిద్ధించును. రసవిద్యను మిగుల రహస్యముగ నుంచినయెడల వీర్యవంతమైయుండును. లేనిచో నిర్వీర్యమగును.

అనేకులకు తెలిసిన యౌషధము రోగుల కిచ్చినచో పనిచేయదు. మరియు రోగికి తెలిసినట్టియు, బహుజనులకు తెలిసినట్టియు ఔషధము నిర్వీర్యమగును గాన వైద్యుడు రోగమును గుర్తించి తదనుకూలమైన యౌషధమును రోగికిని యితరులకును గూడ తెలియకుండ యియ్యవలెను.

శ్రీమత్కృష్ణా గోదావరీమధ్య విద్యోతమాన నూజవీడ్నగరీప్రభువర శ్రీమదయ్యారు
మేడూరు నిడదవోలు ప్రముఖసంస్థానాధీశ్వర ఆంధ్రకవితాధురంధర పండితకవి
పోషక శ్రీ శ్రీ రాజా వెంకటాద్ర్యప్పారాయప్రభుపుంగవాస్థాన
పండిత భారద్వాజసగోత్రపవిత్ర వేంకటసుబ్బావధాని సత్పుత్ర
సకలపండితకవి సద్వైద్యవిధేయ సత్యనారాయణశాస్త్రి
నామధేయాంధ్రీకృత రసరత్నసముచ్చయమునందు
షష్ఠాధ్యాయము సమాప్తము.

శ్రీశారదాంబార్పణమసు.

---

శ్రీరస్తు

# రసరత్నసముచ్చయము

## సప్తమాధ్యాయము

### —♦ రసశాల ♦—

మూ. రసశాలాం ప్రకుర్వీత సర్వబాధా వివర్జితాం
సర్వౌషధమయే దేశే రమ్యే కూపసమన్వితే
యక్షత్ర్యక్షాం సహస్రాక్షాం దిగ్విభాగే సుశోభనే
నానోపకరణోపేతాం ప్రాకారేణ సుశోభితాం
శాలాయాః పూర్వదిగ్భాగే స్థాపయే ద్రసభైరవం
వహ్నికర్మాణి చాగ్నేయే యామ్యే పాషాణకర్మచ
నైఋత్యే శస్త్రకర్మాణి వారుణే క్షాళనాదికం
శోషణం వాయుకోణేచ వేధకర్మోత్తరే తథా
స్థాపనం సిద్ధవస్తూనాం ప్రకుర్యా దీశకోణకే
పదార్థసంగ్రహాః కార్యో రససాధనహేతవే॥

తా. సమస్తసౌషధులు గలిగి రమ్యమై కూపసహితమైన యుద్యానవనమందు ఈశాన్యదిక్కునగాని, ఉత్తరదిక్కునగాని, తూర్పుదిక్కునగాని, పరస్పరబాధారహిత ముగనుండునట్లు రసశాలను నిర్మించవలెను. అందు సమస్తోపకరణములు నుండవలెను. చుట్టును ప్రాకారముగట్టబడి యుండవలెను. శాలయొక్క తూర్పుభాగమున రసమును స్థాపించుటయు ఆగ్నేయమున పుటములు, వంటలు, మొదలగు నగ్నికర్మల జరిగించుటయు, దక్షిణమున పాషాణాదిక్రియలును, నిఋతిమూల శస్త్రకర్మలును, పశ్చిమమున క్షాళనాదిక్రియలును, వాయవ్యమున మూలికలు మొదలగువాని నెండబెట్టుటయు, ఉత్తరమున వేధకర్మలును, ఈశాన్యమున సిద్ధమైన యౌషధముల దాచుటయు జరుపబడ

వలెను. రససాధనమున కావశ్యకమైన పదార్థములన్నిటిని సిద్ధపరచి యుంచుకొన వలెను.

## —♦ రససాధనీయ పదార్థములు ♦—

మూ. సత్త్వపాతనకోష్ఠీంచ సురాకోష్ఠీం సుశోభనాం
భూమికోష్ఠీం చలత్కోష్ఠీం జలద్రోణ్యోప్యనేకశః
భస్త్రికాయుగళం తద్వన్నాళికే వంకలోహయోః
స్వర్ణాయో ఘోషశుల్బాశ్మ కుండ్యశ్చర్మకృతాం తథా
కరణాని విచిత్రాణి ద్రవ్యాణ్యపి సమాహరేత్
కండణీ పేషణీ ఖల్వా ద్రోణీరూపాశ్చ వర్తులాః
ఆయసా స్తప్తఖల్వాశ్చ మర్దకాశ్చ తథావిధాః
సూక్ష్మచ్ఛిద్రసహస్రాఢ్యా ద్రవ్యగాలనహేతవే
చాలనీచకటత్రాణి శలాకాహిశ్చ కుండలీ
చాలనీ త్రివిధా ప్రోక్తా తత్స్వరూపంచ కథ్యతే
వైణవీభి శ్శలాకాభి ర్నిర్మితా గ్రథితా గుణైః
కీర్తితా సా సదా స్థూలద్రవ్యాణాం గాలనే హితా
చూర్ణచాలనహేతోశ్చ చాలన్యన్యాపి వంశజా
కర్ణికారస్య శాల్మల్యా హరిజాతస్య కంబయా
చతురంగుళ విస్తారయుక్తయా నిర్మితా శుభా
కుండల్యరత్నివిస్తారా ఛాగచర్మాభివేష్టితా
వాజివాలాంబరానద్ధ తలా చాలనికా పరా
తథా పరిచాలనంకుర్యా ద్వర్తులసూక్ష్మతరం రజః
మూషామృత్తుషకార్పాస వనోపలక పిష్టకం
త్రివిధం భేషజం ధాతు జీవమూల మయం తథా
శిఖిత్రి గావరంచైవ శర్కరాంచ సితోపలా
శిఖిత్రాః పావకోచ్ఛిష్టాః అంగారాః కోకిలా మతాః
కోకిలా శ్చేతి తాంగారాః నిర్వాణాః పయసావినా
పిష్టకం ఛగణం ఛాణ ముపలం చోత్పలం తథా
గిరిం డోఘలసాఖీచ సంశుష్క ఛగణాభిధాః



కాచాయో మృద్వరాటానాం కూపికా ఛషకానిచ
కూపికా కుపికా సిద్ధా గోలాచైవ గిరిండికా
ఛషకంచ కరోటీచ వాటికా ఖారికా తథా
కంచేలీ గ్రాహికాచేతి నామాన్యేకార్థకాని హి
శూర్పాది వేణుపత్రాణి క్షుద్రా క్షిప్రాశ్చ శంఖకాః
క్షురప్రాశ్చ తథా ప్రోక్తా యచ్చాన్య త్తత్ర యుజ్యతే
పాలికా కర్ణికాచైవ శాకచ్ఛేదనశస్త్రకాః
శాలా సంమార్జనాద్యం హి రసపాకాంతకర్మ యత్
తత్రోపయోగి యచ్చాన్య త్తత్సర్వం పరవిద్యయా
శ్రీరసాంకుశయా సర్వం మంత్రయిత్వా సమర్చయేత్
అన్యథా తద్గతం తేజః పరిగృహ్ణంతి భైరవాః॥

తా. సత్త్వపాతనకోష్ఠి, సురాకోష్ఠి, భూమికోష్ఠి, చలత్కోష్ఠి మొదలగు కోష్ఠులును, నీరుపోసుకొనుటకు అనేకవిధములగు తొట్లును, రెండుతిత్తులును వాటికి గావలసిన మట్టిగొట్టములును, బంగారు, లోహము, కంచు, రాగి, శిల, చర్మము వీనితో చేయబడిన కుండలు (దొప్పలు) ను యితరములగు విచిత్రమైన యుపకరణములును లోహమయములగు రోలు, దంపలు, కాయలు, వేళ్ళు మొదలగు వానిని చితుకగొట్టుటకును నూరుకొనుటకును గావలసిన పాత్రములు, సన్నికెళ్ళు, దొన్నెవలె కోలగను గుండ్రముగను ఉండు లోహఖల్వములు. తప్తఖల్వములు వానికి దగిన పాత్రములు, ద్రవ్యములను జల్లించుటకు సన్నని రంధ్రములుగల జల్లెడ, చేట, శలాక, కుండలి, యను జల్లెడలును రసశాలయందు సిద్ధముగనుండవలెను. చాలని శలాక, కుండలి యని జల్లెడ మూడు విధములుగ నుండును. వెదురుపేళ్ళతో కట్టబడి మొరుముగనుండు ద్రవ్యములను జల్లించుటకు తగినట్లు త్రాళ్ళచే రంధ్రములు కలుగులాగున కట్టబడినది చాలని యనబడును. అదియే చూర్ణములను జల్లించుటకు తగునట్లు సూక్ష్మరంధ్రములు కలుగులాగున కట్టబడినది శలాకయనంబడును. కొండగోగు, బూరుగు అనువాని నారచే చేయబడిన రంధ్రములు గలిగి వెదురుచేత నాలుగంగుళములు విస్తీర్ణము కలుగునట్లు కట్టబడిన శలాక శ్రేష్ఠము. చుట్టును మేకచర్మముతో మూయబడి మిక్కిలి సూక్ష్మరంధ్రములు కలుగులాగున గుర్రపువెండ్రుకలతో నేయబడిన గుడ్డను కట్టి మూరెడు నిడివి, వెడల్పు గలుగునట్లు చేయబడిన జల్లెడకు కుండలియని పేరు. దీనితో మిక్కిలి సూక్ష్మతరమైన చూర్ణములను జల్లించవచ్చును. మరియు మూసలు, పుట్టమన్ను, ఊముక,

దూది, ఏరుపిడకలు, యెండుపిడకలు, ధాతువులు, జీవజములు, మూలజములు అను త్రివిధములగు నౌషధములు, బొగ్గులు, పశువులదొడ్డిలో పశువులచే త్రొక్కబడి యెండిదుమ్మువలెనుండు పేడ, కంకరరాళ్లు, పలుగురాళ్లు, నీళ్ళుపోయకుండ తనంతట తాము చల్లారిన బొగ్గులు (ఈబొగ్గులకు కోకిలము, శిఖిత్రము, అంగారము అని నామములుకలవు) పిష్టకము, ఛగణము, ఛాణము, ఉపలము, ఉత్పలము, గిరిండము, ఉపలసారి అనునివి యెండిన పిడకలపేళ్ళు. గాజు, యినుము, మన్ను, గవ్వ, అను వీనిచే చేయబడిన కుప్పెలకు చషకము, కూపిక, కుపిక, సిద్ధ, గోళ, గిరిండక, కరోటి, వీటిక, ఖారిక, కంచేలి, గ్రాహిక నామాంతరములు కలవు. చేటలు, వెదురుతట్టలు, కత్తులు, పాత్రము, యీవస్తువులును యింకను యితరమైన వస్తువులను మరియు కవ్వము, విసనకర్ర, కత్తిపీటలు, చీపురుకట్టలు మొదలగు శాలాసమ్మార్జనము మొదలు రసపాకాంతము వరకు గావలసిన సకలవస్తువులను జాగ్రతపెట్టుకొని వానిని రసాంకుశవిద్యచే నభిమంత్రించి యుపయోగించుకొనవలెను. లేనిచో నాయావస్తువులందలి తేజస్సును భైరవులు హరింతురు.

## —♦ రసకర్మయందు అర్హులైన వైద్యులు - పరిజనము ♦—

మూ. రససంచింతకా వైద్యా నిఘంటుజ్ఞాశ్చ వార్తికాః
సర్వదేశజభాషాజ్ఞాః సంగ్రాహ్యా స్తేపి సాధకైః
రసపాకావసానం హి సదాఽఘోరంచ జాపయేత్
సోద్యమా శ్శుచయ శ్శూరాః బలిష్ఠాః పరిచారకాః
ధర్మిష్ఠ స్సత్యవా గ్విద్వాన్ శివకేశవపూజకః
సదయః పద్మహస్తశ్చ సంయోజ్యో రసవైద్యకే॥
పతాకా కుంభపాథోజా మత్స్యచాపాంకపాణికః
అనామాధస్థరేఖాంక స్సస్స్యా దమృతహస్తవాన్
అదేశికః కృపాముక్తో లుబ్ధో గురువివర్జితః
కృష్ణరేఖాకరో వైద్యో దగ్ధహస్త స్స ఉచ్యతే॥
భూతనిగ్రహమంత్రిజ్ఞా స్తే యోజ్యా నిధిసాధనే
బలిష్ఠా స్సత్యవంతశ్చ రక్తాక్షాః కృష్ణవిగ్రహాః
భూతత్రాసనవిద్యాశ్చ తే యోజ్యా బలిసాధనే
నిర్లోభా సత్యవక్తారో దేవబ్రాహ్మణపూజకాః
యమినః పథ్యభోక్తారో యోజనీయా రసాయనే



ధనవంతో వదాన్యాశ్చ సర్వోపస్కారసంయుతాః
గురువాక్యరతా నిత్యం ధాతువాదేషు తే శుభాః
తత్తదౌషధనామజ్ఞాః శుచయో వంచనోజ్ఝితాః
నానావిషయభాషాజ్ఞాః తే మతాభేషజాహృతౌ
శుచీనాం సత్యవాక్యానా మాస్తికానాం మనస్వినాం
సందేహోజ్ఝితచిత్తానాం రస స్సిద్ధ్యతి సర్వదా
దశాష్టక్రియయాసిద్ధే రసేసా సాధకోత్తమః
మహారసోయ మిత్యుక్త్వా సేవే తాస్యత్రి తం రసం
రససిద్ధో భవేన్మర్త్యో దాతా భోక్తా న యాచకః
జరాముక్తో జగత్పూజ్యో దివ్యకాంతి స్సదా సుఖీ॥

ఇతి శ్రీవాగ్భటాచార్య విరచితే రసరత్నసముచ్చయే సప్తమోధ్యాయః.

తా॥ రసధ్యానపరాయణులును నిఘంటుజ్ఞానముగలవారును చెప్పబడినట్టియు చెప్పబడనట్టియు దురుక్తములైనట్టియు అర్థములను స్పష్టీకరించు గ్రంథములను చదివినవారును సమస్తదేశభాషల నెరింగినవారును అగువైద్యులను రసకర్మయందు సాధకుడు సహాయులనుగా స్వీకరించవలెను. రసపాకము పూర్తియగువరకును అఘోరమంత్రమును జపించుచుండవలెను. ఉత్సాహపూర్వకముగ పనిచేయువారును శుచిగలవారును, శూరులును బలవంతులును అగుపరిచారకులను గ్రహించవలెను. ధర్మశీలుడును, సత్యముగలవాడును, విద్వాంసుడును, శివకేశవపూజకుడును, దయావంతుడును, పద్మమువలె మృదువైన హస్తముగలవాడును, జండా, కుంభము, పద్మము, మత్స్యము, ధనుస్సు వీనియాకారములుగల రేఖలుకల అరచేయిగలవాడును, అనామికయొక్క క్రింద ఊర్ధ్వరేఖలు కలవాడును అగువాడు అమృతహస్తుడనబడును.

గురుముఖమున గాక స్వయముగ వైద్యవిద్య నభ్యసించినవాడును చూపుడువ్రేలులేనివాడును దయాహీనుడును లుబ్ధుడును నల్లని హస్తరేఖలుగలవాడును అగు వైద్యుడు మృతహస్తు డనబడును.

నిధిసాధనమందు భూతనిగ్రహమంత్రసిద్ధికలవారల నియోగించునది. బలవంతులును సత్యవంతులును యెర్రనినేత్రములు కలవారును నల్లని శరీరకాంతికలవారును. భూతభయంకరమైనవిద్యలను సంపాదించినవారును అగువారిని బలిసాధనమందు నియోగించవలెను. లోభరహితులును సత్యశీలురును దేవబ్రాహ్మణపూజాపరులును చిత్తనిగ్రహముకలవారును పథ్యభోజనమును చేయువారును రసాయనములందు నియోగింప

బడవలెను. ధనికులును దాతలును సర్వోపస్కారసహితులును గురువాక్యమం దాదరణము గలవారును ధాతువాదమందు నియోగింపబడవలెను. ఆయామూలికలనామముల నెరింగినవారును శుచియైనవారును వంచకబుద్ధిలేనివారును అనేకదేశభాషాజ్ఞానముగలవారును ఔషధీసంపాదనమందు నియోగింపబడవలెను. శుచికలవారై సత్యవ్రతులై ఆస్తికులై బుద్ధిమంతులై సందేహరహితులై యుండువారలకు రససిద్ధికలుగును.

రసమునకు అష్టాదశసంస్కారములచేసిన సాధకోత్తముడు ఆమహారసమును రససేవావిధులననుసరించి సేవించినచో దాతయు సంపదోద్భక్తయు, జరారోగరహితుడును, జగత్పూజ్యుడును, దివ్యకాంతిగలవాడును సుఖియునై ముక్తుడగును.

ఇతి శ్రీ వాగ్భటాచార్య విరచితే రసరత్నసముచ్చయే సప్తమోధ్యాయః

శ్రీమత్కృష్ణా గోదావరీమధ్య విద్యోతమాన నూజవీణ్ణగరీప్రభువర శ్రీమదుయ్యూరు
మేడూరు నిడదవోలు ప్రముఖసంస్థానాధీశ్వర ఆంధ్రకవితాధురంధర పండితకవి
పోషక శ్రీ శ్రీ రాజా వెంకటాద్ర్యప్పారాయప్రభుపుంగవాస్థాన
పండిత భారద్వాజసగోత్రపవిత్ర వేంకటసుబ్బావధాని సత్పుత్రి
సకలపండితకవి సద్వైద్యవిధేయ సత్యనారాయణశాస్త్రి
నామధేయాంధ్రీకృత రసరత్న సముచ్చయమునందు
సప్తమాధ్యాయము సమాప్తము.

శ్రీశారదాంబార్పణమస్తు.

---

శ్రీరస్తు

# రసరత్నసముచ్చయము

## అష్టమాధ్యాయము

### సోమనాథ సిద్ధపరిభాష

మూ. కథ్యతే సోమదేవేన ముగ్ధవైద్య ప్రబుద్ధయే
పరిభాషా రసేంద్రస్య శాస్త్రై స్సిద్ధైశ్చ భాషితా॥

తా॥ శాస్త్రోక్తమైనట్టియు రససిద్ధులు చెప్పినట్టియు, రసవిషయిక పరిభాషల నన్నిటిని సంగ్రహించి సోమనాథసిద్ధుడు చెప్పిన పరిభాష యిచ్చట చెప్పబడుచున్నది.

### ధన్వంతరిభాగము

మూ. అర్థం సిద్ధరసస్య తైలఘృతయో శ్లేహస్య భాగోష్టమః
సంసిద్ధాఖిల లోహచూర్ణ వటకాదీనాం తథా సప్తమః
యో దీయేత భిషగ్వరాయ గదిభి ర్నిర్దిశ్య ధన్వంతరిం
సర్వారోగ్యసుఖాప్తయే నిగదితో భాగ స్స ధన్వంతరేః॥

తా॥ సిద్ధమైన రసౌషధమునందు సగముభాగము తైలఘృతములందును, లేహ్యమునందును, యెనిమిదవభాగము లోహములు, వటకములు, చూర్ణములు వీనియందును, యేడవభాగము ధన్వంతరి నుద్దేశించియు రోగులు వైద్యునకు సమర్పించుకొనినయెడల ఆరోగ్యము, సౌఖ్యము గలుగును.

### రుద్రభాగము

మూ. భైషజ్యక్రీణిత ద్రవ్య భాగో హ్యేకాదశో హి యః
వణిగ్భ్యో గృహ్యతే వైద్యై రుద్రభాగ స్స ఉచ్యతే

ప్రగృహ్యాధికరుద్రాంశం యో సమీచీన మౌషధం
దాపయే ల్లుబ్ధధీ ర్వైద్యః స స్యా ద్విశ్వాసఘాతుకః॥

తా॥ ఔషధములు విక్రయింపగా వచ్చినలాభమందు పదకొండవభాగము వైద్యునకు వర్తకుడీయవలెను. ఇది రుద్రభాగమనబడును. పదకొండవభాగముకంటె యెక్కువ ద్రవ్యమును సంపాదించవలెనని వర్తకునితో నేకీభవించి సరిగ తయారుచేయబడని దుష్టౌషధమును రోగులకిప్పించినయెడల నావైద్యుడు విశ్వాసఘాతుకుడగును.

## కజ్జలీలక్షణము

మూ. ధాతుభి ర్గంధకాద్యైశ్చ నిర్ద్రవై ర్మర్దితో రసః
సుశ్లక్ష్ణః కజ్జలాభాసః కజ్జలీ త్యభిధీయతే॥

తా॥ ధాతువులు, గంధకము మొదలగువానిం జేర్చి పాదరసమును ద్రవద్రవ్యము లేకుండ కాటుకవలె నూరిన చూర్ణమునకు కజ్జలి యని పేరు.

## రసపంకము-రసపిష్టి-పాతనపిష్టి

మూ. సద్రవా మర్దితా సైవ రసపంక ఇతి స్మృతః॥ [తోభి ఖల్వే
అక్షాంశతుల్యా ద్రసతోథ గంధా న్నిష్కార్ధతుల్యా త్కుటి
అర్కాతపే తీవ్రతరే విమర్ద్య పిష్టీభవే త్సా నవనీతరూపా॥
ఖల్వే విమర్ద్య గంధేన దుగ్ధేన సహ పారదం
పేషణా త్పిష్టతాం యాంతి సా పిష్టీతి మతాపరైః
చతుర్థాంశ సువర్ణేన రసేన కృతపిష్టికా
భవే త్పాతనపిష్టీ సా రసస్యోత్తమసిద్ధిదా॥

తా. ధాతుగంధకాదులతో పాదరసమును చేర్చి ద్రవద్రవ్యములతో నూరినది రసపంక మనబడును.

రసము ఒక అక్షము, గంధకము ఒక నిష్కము వీనిని ఖల్వమందుంచి తీవ్రమైన యెండలో మర్దించినయెడల నవనీతముతో సమానమగు పిష్టమగును. దీనికే రసపిష్టియని పేరు. రసగంధకముల నాయాయోగోక్తభాగప్రకారముగ చేర్చి పాలతో మర్దించిన యెడల పిష్టమగును. ఇది మతాంతరమున రసపిష్టియనంబడును.

రసమునకు నాల్గవవంతు సువర్ణముజేర్చి మర్దించినయెడల నది పాతనపిష్టియన బడును. ఇది రసమునకు ఉత్తమమైన సిద్ధిని కలిగించును.



## హేమకృష్టి - తారకృష్టి

మూ. రూప్యం వా జాతరూపం వా రసగంధాదిభి ర్హతం
సముత్థితంచ బహుశః సా కృష్టి ర్హేమతారయోః
కృష్టిం క్షిపే త్సువర్ణాంతః నవర్ణో హీయతే తయా
స్వర్ణకృష్ట్యా కృతం బీజం రసస్య పరిరంజనం॥

తా॥ వెండినిగాని బంగారమునుగాని రసగంధాదులచే మారణముగావించి పంచమిత్రములు గలిసి పలుమారులూదినయెడల క్రమముగా నారజతసువర్ణములు తారకృష్టి, హేమకృష్టి యని పిలువబడును. కృష్టిని సువర్ణమందుచేర్చి యూదినచో కాంతి తగ్గదు. స్వర్ణకృష్టిచే చేయబడిన బీజము రసరంజనమున కుపయోగించును.

## హేమరక్తి - తారరక్తి

మూ. తామ్రం తీక్ష్ణసమాయుక్తం ద్రుతం నిక్షిప్య భూరిశః
సగంధలకుచద్రావే నిర్గతం వరలోహకం
తేన రక్తీకృతం స్వర్ణం హేమరక్తి త్యుదాహృతం
నిక్షిప్తా సా ద్రుతా స్వర్ణే వర్ణోత్కర్షవిధాయినీ
తారస్య రంజనీచాపి బీజరాగ విధాయినీ
ఏవమేవ ప్రకర్తవ్యా తారరక్తి మనోహరా
రంజనీ ఖలు రూప్యస్య బీజానామపి రంజనీ॥

తా॥ తామ్రముతో లోహమును చేర్చి కరగించి గంధకచూర్ణసహితమైన నిమ్మపండ్ల రసములో పలుమారుపోసినయెడల స్వచ్ఛమైన లోహమగును. అట్టిలోహమును బంగారుతోచేర్చి యూదినచో బంగారము యెరుపుగనుండును. దానికి హేమరక్తి యని పేరు. హేమరక్తిని వన్నెతక్కువబంగారమునం జేర్చి యూదినచో ఉత్తమమైన బంగారమగును. మరియు నీహేమరక్తి రజతరంజనమునకును బీజరంజనమునకును ఉపయోగించును. హేమరక్తినిచేసినట్లె రజతరక్తినిగూడ చేయవలెను. రజతరక్తి రజతరంజనమునకును బీజరంజనమునకును పనికివచ్చును.

## దళలక్షణము

మూ. మృతేన వా బద్ధరసేన వాన్యలోహేన వా సాధిత మన్యలోహం
సితంచ పీతత్వ ముపాగతం తద్దళంహి చంద్రానలయోః ప్రసిద్ధం॥

ఆవాసకృత బద్ధేన రసేన సహ యోజితం
సాధితం వాన్యలోహేన సితం పీతం చ తద్దళం॥

తా. రసభస్మముచేతగాని బద్ధరసముచేతగాని ఇతరలోహముచేతగాని తెల్లని వర్ణమును కలిగింపబడిన లోహమునకు చంద్రదళమనియు పచ్చనివర్ణమును కలిగింపబడిన లోహమునకు అనలదళమనియు పేరు.

ఆయాద్రవ్యములందు ఆవాసముచేయబడి బద్ధమైన రసముతో చేర్చిగాని మరియొకలోహముతో చేర్చిగాని తెలుపు పసుపువర్ణములు గలిగింపబడిన లోహమునకు చంద్రదళమనియు, అగ్నిదళమనియు పేళ్లు.

## ——♦ శుల్బనాగము ♦——

మూ. మాక్షికేణహతం తామ్రం నవవాగం సముత్థితం
తద్వ ద్విశుద్ధనాగం హి ద్వితయం త చ్చతుష్పలం
నీలాంజనహతం భూయః సప్తవారం సముత్థితం
ఇతి సంశుద్ధ మేతద్ధి శుల్బనాగం ప్రకీర్త్యతే
సాధిత స్తేనసూతేంద్రః వదనే విధృతో నృణాం
నిహంతి మాసమాత్రేణ మేహవ్యూహం న సంశయః
పథ్యాశనస్య వర్షేణ పలితం వలిభిస్సహ
గృధ్రదృష్టి ర్లసత్పుష్టిః సర్వారోగ్యసమన్వితః॥

తా. తామ్రమును మాక్షికముతో చేర్చి మారణముచేసి పదిసారులు పంచమిత్రములతో చేర్చి యూదినచో తామ్రము పరిశుద్ధమగును. ఇట్లే నల్లసీసమునుకూడ మారణముచేసి పదిసారులు పంచమిత్రములతో నూదిన పరిశుద్ధమగును. ఇట్లు పరిశుద్ధములైన రాగిని సీసమును ప్రత్యేకముగ రెండుపలములు గ్రహించియేకముజేసి నీలాంజనముతో చేర్చిమారణముచేసి యేడుసారులు పంచమిత్రములతో చేర్చియూదినచో అది శుల్బనాగమని చెప్పబడును. శుల్బనాగముతో సాధింపబడిన పాదరసగుళికను నోటిలోనుంచుకొనునెడల ఒకమాసమునకు సమస్తమేహములు శమించును. పథ్యమగు భోజనముచేయుచు సంవత్సరమువరకు సేవించినయెడల దృష్టిప్రసాదమునుపుష్టియును ఆరోగ్యమునుకలుగును వలీపలితములు నశించును.

## ——♦ పింజరీలక్షణము ♦——

మూ. లోహం లోహాంతరే క్షిప్తం ధ్మాతం నిర్వాపితం ద్రవే
పాండుపీతప్రభం జాతం పింజరీ త్యభిధీయతే॥



తా. ఒకలోహముతో మరియొకలోహమును జేర్చి కొలిమిలోనుంచి యూది ద్రవద్రవ్యమునందు చల్లార్చినచో కొంచెము తెలుపుకలిసినపచ్చనివర్ణముకలది యగును. దీనికి పింజరియనిపేరు. (దీనికే టంకమని పేరు)

## ——♦ చంద్రార్కలక్షణము ♦——

మూ. భాగా షోడశ తారస్య తథా ద్వాదశ భాస్వతః
ఏకత్రావర్తితా స్తేన చంద్రార్కమపి కథ్యతే॥

తా. వెండి పదహారుభాగములు, రాగి పండ్రెండుభా॥ చేర్చికరిగించి చల్లార్చినచో నది చంద్రార్కమనబడును. (ఇదియే వెండిటంకము.)

## ——♦ నిర్వాపణలక్షణము ♦——

మూ. సాధ్యలోహాన్యలోహంచే త్ప్రక్షిప్తం వంకనాళతః
నిర్వాపణంతు తత్ప్రోక్తం వైద్యై ర్నిర్వాహణం తథా॥
క్షిపే న్నిర్వాపణా ద్రవ్యం నిర్వాహ్యా సమభాగికం
ఆవాహ్యాం వాపనీయేచ భాగే దృష్టేచ దృష్టవత్॥

తా. సాధింపబడు లోహమందు మరియొక లోహమును చేర్చి వంకనాళము (ఊదుటకు పనికివచ్చు ఒకవిధమైన వంకరగొట్టము) తో నూదిన నది నిర్వాపణమని రసవాదులందురు. దీనినే వైద్యులు నిర్వాహణమందురు. వైద్యప్రక్రియలందు నిర్వాపణ ద్రవ్యమును (సాధ్యలోహమున జేర్చు అన్యలోహమును) సమభాగముగ కలుపవలెను. ఇట్లే వాపనీయ ద్రవ్యమున (నిర్వాపణ ద్రవ్యమున) సాధ్యలోహమును చేర్చవలసినపుడుగూడ సమభాగికముగ చేర్చదగును. మరియు వృద్ధవైద్యుల యాచగణమునందున్న ప్రక్రియలలో ఉపదిష్టమార్గము ననుసరించి భాగముల నేర్పరుచుకొనవలెను.

## ——♦ వారితర లక్షణము —— రేఖాపూర్ణలక్షణము ♦——

మూ. మృతం తరతి యు త్తోయే లోహం వారితరం హి తత్
అంగుష్ఠ తర్జనీ మృష్టం యత్త ద్రేఖాంతరే విశేత్
మృతలోహం తదుద్దిష్టం రేఖాపూర్ణాభిధానతః॥

తా. మృతమైన లోహచూర్ణమును నీటిమీద వేసినచో మునుగక తేలియున్నయెడల ఆలోహము చక్కగా మృతమైనట్లు తెలిసికొనవలెను. ఈపరీక్షకు వారితరమని పేరు.

తా. మృతమైన లోహచూర్ణమును అంగుష్ఠతర్జనులచే నొక్కిపట్టియెత్తి ఆభస్మ పుచిటికయందు చేతి వేళ్లయొక్క రేఖలు కనబడినయెడల లోహము చక్కగ మృతమైనదని యెఱుంగవలెను. ఈపరీక్షకు రేఖాపూర్ణమని పేరు.

—♦ అపునర్భవ లక్షణము ♦—

మూ. గుడగుంజా సుఖస్పర్శ మధ్వాజ్యైః సహ యోజితం
నాయాతి ప్రకృతిం ధ్మానా దపునర్భవ ముచ్యతే॥

తా. లోహభస్మమును బెల్లము, గురివెందపప్పు, వెలిగారము, తేనె, నేయి అను పంచమిత్రములతో జేర్చి నూరి బొగ్గులోబెట్టి యూదినచో లోహము స్వప్రకృతిని బొందకుండిన (తిరిగి లోహముగ మారకయుండిన) నది అపునర్భవపరీక్ష యనబడును

—* ఉత్తమపరీక్ష *—

మూ. తస్యోపరి గురుద్రవ్యం ధాన్యం చోపనయేద్ధ్రువం।
హంసవత్తీర్యతే వారి ణ్యుత్తమం పరికీర్తితం॥

తా. లోహభస్మమును నీటిలోవేసి దానిపైన ఒకధాన్యపుగింజను విడువవలెను. అపుడు భస్మము మునుగక హంసవలె తేలియున్నచో నది నిర్జీవముగ మృతమైనదని యెఱుంగవలెను. ఇది ఉత్తమపరీక్ష.

—♦ నిరుత్థలక్షణము ♦—

మూ. రౌప్యేణసహ సంయుక్తం ధ్మాతం రౌప్యేణచేల్లగేత్
తదా నిరుత్థ మిత్యుక్తం లోహం త దపునర్భవం॥

తా. అపునర్భవ పరీక్షచేయబడిన భస్మమును వెండితో చేర్చి కొలిమిలో నూదినయెడల ఆభస్మము వెండితో కలసికొనిన నది నిరుత్థపరీక్షయనబడును.

—♦ బీజలక్షణము ♦—

మూ. నిర్వాపణవిశేషేణ తత్తద్వర్ణం భవేద్యదా
మృదులం చిత్రసంస్కారం తద్బీజ మితి కథ్యతే
ఇదమేవ వినిర్దిష్టం వైద్యై రుత్తరణం ఖలు॥

తా. లోహాదులను కాల్చి వానిని ద్రవద్రవ్యమున చల్లార్చినచో ద్రవభేదముచే నానావర్ణములు గలిగి మృదులమై చిత్రమైన సంస్కారముల నందిన నది బీజమని వాదజ్ఞులును ఉత్తరణమని వైద్యులును చెప్పుదురు.



రసార్ణవము:—“హేమతారవశా ద్బీజం ద్వివిధం తాప దీశ్వరి
పీతారుణౌ హేమబీజం తారబీజం సితైర్భవేత్
కల్పితం రంజితం పక్వమితి భూయ స్త్రిధా భవేత్
కల్పితం ద్వివిధం తచ్చ శుద్ధమిశ్రవిభేదతః
రసోపరసలోహానాం బీజనాం కల్పనం పృథక్
శుద్ధమిశ్రంతు సంయోగా ద్యథాలాభం సురేశ్వరి॥”

(హేమబీజము, తారబీజము అని బీజము రెండువిధములు. పీత (పచ్చని) అరుణ (యెఱ్ఱని) ద్రవ్యములచే సిద్ధముచేయబడినది హేమబీజమనియు, శ్వేతద్రవ్యములచే చేయబడినది తారబీజమనియు నెఱుంగవలెను. అవి ప్రత్యేకముగ కల్పితము, రంజితము, పక్వము అని మరల మూడుతెరంగులు. అందు కల్పితబీజము శుద్ధకల్పితము, మిశ్రకల్పితము అనిరెండువిధములు. రసోపరసలోహ బీజములచే ప్రత్యేకముగ కల్పించబడినది శుద్ధకల్పితబీజమనియు రసోపరసలోహాదుల సంయోగవశముచే కల్పించబడినది మిశ్రకల్పితబీజమనియు తెలిసికొనదగును.)

—♦ తాడన లక్షణము ♦—

మూ. సంసృష్టలోహయో రేక లోహస్య పరిసాధనం
ప్రధ్మాతం వంకనాళేన తత్తాడన ముదాహృతం॥

తా. రెండులోహములు కలిసియున్నచో అందు ఒక లోహమును మాత్రము గ్రహించవలసి యుండునెడల వంకనాళముతో కొలిమిలో బెట్టి యూదవలెను. దీనికి తాడనమని పేరు.

—♦ ధాన్యాభ్రక లక్షణము ♦—

మూ. చూర్ణాభ్రం శాలిసంయుక్తం వస్త్రబద్ధంహి కాంజికే
నిర్యాతం మర్దనా ద్వస్త్రా ద్ధాన్యాభ్ర మితి కథ్యతే॥

తా. అభ్రకచూర్ణముతో ధాన్యమును చేర్చి యొకముతుకగుడ్డలో కట్టి అందు కాంజికముపోసి చేతులతో నలుపుచున్నయెడల కాంజికముతో కలిసి యభ్రకరేణువులు క్రిందపడిగును. ఇదియె ధాన్యాభ్రకము.

—♦ సత్త్వలక్షణము ♦—

మూ. క్షారామ్లద్రావకై ర్యుక్తం ధ్మాత మాకరకోష్ఠకే
య స్తతో నిర్గత స్సారః సత్త్వ మి త్యభిధీయతే॥

తా. క్షార అమ్ల ద్రావకవర్గద్రవ్యములను అభ్రకాదివస్తువులతో చేర్చి కోష్ఠమున బెట్టి యూదినచో ఆయభ్రకాదులనుండి వెలువడిన వస్తువు సత్త్వమనంబడు.

—♦ ఏకకోలీసకలక్షణము ♦—

మూ. కోష్ఠికాశిఖరాపూర్ణైః కోకిలైః ధ్మానయోగతః
మూషాకంఠ మనుప్రాప్తై రేకకోలీసకో మతః॥

తా. కొలిమికి పైవరకు బొగ్గులను మూసయొక్క కంఠపర్యంతము నిండుగాపోయు ప్రక్రియకు ఏకకోలీసకమని పేరు.

—♦ స్వేదనాద్యర్హకాష్ఠములు ♦—

మూ. ద్రావణే సత్త్వపాతేచ మాధుకాః ఖాదిరాశ్శుభాః
నిర్ద్రవే వంశజాస్తేతు స్వేదనే బాదరాశ్శుభాః॥

తా॥ ద్రావణమునందు ఇప్పకట్టెలను సత్త్వపాతనమునందు చండ్రకట్టెలను ద్రవరహితముగ చేయబడు ప్రక్రియలందు వెదురుకట్టెలను, స్వేదనమునందు రేగుకట్టెలను ఉపయోగించవలెను.

—♦ హింగుళాకృష్టరసము ♦—

మూ. విద్యాధరాఖ్య యంత్రస్థా దార్ద్రక ద్రావమర్దితాత్
సమాకృష్టో రసో యోసౌ హింగుళాకృష్ట ఉచ్యతే॥

తా॥ ఇంగిలీకమును అల్లపురసముతో మర్దించి విద్యాధరయంత్రమూలమున ఆకర్షించిన రసము హింగుళాకృష్టరస మనబడును.

—♦ ఘోషాకృష్టతామ్రము ♦—

మూ. స్వల్పతాళయుతం కాంస్యం వంకనాళేన తాడితం
ముక్తరంగంహి తత్తామ్రం ఘోషాకృష్ట ముదాహృతం॥

తా॥ కంచుతో స్వల్పముగ తాళకమును చేర్చి వంకనాళముతో తాడనము చేసినచో అందలి వంగము నశించి తామ్రము నిలుచును. ఆతామ్రము ఘోషాకృష్ట మనబడు.

—♦ వరనాగలక్షణము ♦—

మూ. తీక్ష్ణం నీలాంజనోపేతం ధ్మాతంహి బహుశో దృఢం
మృదుకృష్ణం ద్రుతద్రావం వరనాగం తదుచ్యతే॥



తా॥ తీక్ష్ణలోహమును, నీలాంజనమును జేర్చి పలుమారులు కొలిమిలోపెట్టి గాఢముగ నూదినచో మృదువైనట్టియు, నల్లనైనరంగు నగునట్టియు సులభముగ ద్రవించునట్టియు స్వచ్ఛమైనసీస మేర్పడును. అదియే వరనాగ మనబడును.

రససారము:—"అంజనం తీక్ష్ణసంయుక్తం తత్సమం టంకణం కురు
అంధమూషాగతం ధ్మాతం వరనాగ ఇతి స్మృతః॥

తా॥ నీలాంజనము, తీక్ష్ణలోహము ఇవి సమభాగములుగను రెంటికి సమము వెలిగారమును గ్రహించి అంధమూషలోనుంచి కొలిమిలో నూదినచో "వరనాగము" (శ్రేష్ఠమగు సీసము) యేర్పడును.

—♦ ఉత్థాపనము ♦—

మూ. మృతస్య పునరుద్భూతి స్సంప్రోక్తోత్థాపనాఖ్యయా॥

తా॥ మృతముగావింపబడిన లోహమును పంచమిత్రములతో చేర్చి యూదినచో మరల ప్రకృతిని బొందెనేని అది యుత్థాపన మనంబడును.

—♦ ఢాలనలక్షణము ♦—

మూ. ద్రుతద్రావస్య నిక్షేపో ద్రవే తద్ఢాలనం మతం॥

తా॥ లోహములను కరిగించి ద్రవద్రవ్యమునందు పోయుట ఢాలన మనబడును.

—♦ నాగచపలము ♦—

మూ. త్రింశత్పలమితం నాగం భానుదుగ్ధేన మర్దితం
విమర్ద్య పుటయేత్తావ ద్యావత్కర్షావశేషితం॥
న తత్పుటసహస్రేణ క్షయమాయాతి సర్వదా
చపలోయం సమాదిష్టో వార్తికై ర్నాగసంభవః॥

తా. ముప్పదిపలముల సీసమును జిల్లేడుపాలతో మర్దించుచు పుటము వేయవలెను. ఇట్లు ఒకకర్షము మిగులువరకును పుటములు వేయునది. పిదప అది యెన్ని పుటములు వేసినను తరుగదు. దీనినే నాగసంభవమైన చపలమని వార్తికులు వచింతురు

—♦ వంగచపలము ♦—

మూ. ఇత్థంహి చపలః కార్యో వంగస్యాపి నసంశయః
తత్సంసృష్ట హస్తసంస్పృష్టః కేవలో బధ్యతే రసః॥

తా. పైజెప్పినవిధమున వంగచపలమునుకూడ చేయవలెను. ఇట్టి వంగచపలమును స్పృశించినచేతితో పాదరసమును స్పృశించిన రసము బద్ధమగును.

—♦ వంగచపల బద్ధరసోపయోగము ♦—

మూ. సరసో ధాతువాదేషు శస్యతే న రసాయనే
అయం హి ఖర్వణాఖ్యేన లోకనాథేన కీర్తితః॥

తా. ఇట్లు బద్ధమైనరసము ధాతువాదమం దుపయుక్తము. కాని రసాయనమం దుపయోగింపదు. ఇది ఖర్వణుడను రాజుచే జెప్పంబడెను.

—♦ ధౌతలక్షణము ♦—

మూ. భూభుజంగ శకృత్తోయైః ప్రక్షాళ్యాపహృతం రజః
కృష్ణవర్ణం హి తత్ప్రోక్తం ధౌతాఖ్యం రసవాదిభిః॥

తా. వానపాములమలమును నీళ్ళతో కడిగి అందలిబూడిదను పోగొట్టినచో ఆమలము నల్లనివర్ణము కలిగియుండును. దీనిని రసవాదులు ధౌతమందురు.

లోహరానందసంహితయందుగూడ ధౌతమునుగూర్చి:

"విష్ఠాం భూనాగసంభూతాం ప్రక్షాళ్య బహుభిర్జలైః
సమాహృత్య రజః కృత్స్నం ధౌతమిత్యభిధీయతే॥"

అని పైవిధముగనే చెప్పబడినది.

—♦ ద్వంద్వానలక్షణము ♦—

మూ. ద్రవ్యయో ర్మర్దనా ద్ధ్మానా ద్వంద్వానం పరికీర్తితం॥

తా. రెండుద్రవ్యములను చేర్చి మర్దనచేసి కొలిమిలో నూదుప్రక్రియకు ద్వంద్వానమని పేరు.

—♦ భంజనీలక్షణము ♦—

మూ. భాగాద్ద్రవ్యాధికే క్షేప మనువర్ణ సువర్ణకే
ద్రవైర్వా వహ్నికా హ్రాసః భంజనీవాదిభి ర్మతా॥

తా. ఉత్తమవర్ణము గలిగించుటకై సంగ్రహించబడిన వన్నెతక్కువ బంగారమందు హేమకృష్టిని చేర్చి. యూది, ద్రవములలో చల్లార్చినపు డాయాద్రవద్రవ్యసంయోగమువలన తేజస్సు నశించెనేని భంజనియను పేరున పిలువబడును.



—♦ ఘుల్లికాలక్షణము ♦—

మూ. పతంగీ కల్కతో జాతా లోహే తారే చ హేమతా
దినాని కతిచిత్ స్థిత్వా యాత్యసా ఘుల్లికా మతా॥

తా. లోహమందుగాని వెండియందుగాని పతంగీకల్కముచేత బంగారురంగును కల్గించవచ్చును. ఇది ఘుల్లికయనబడును. ఈబంగారురంగు కొన్నిదినములు మాత్రము ఉండి పిదప చెడిపోవును. (దీనిని బంగారుపూత యనదగును.)

—♦ పతంగీరాగము ♦—

మూ. రంజితాద్ధి చిరాల్లోహా ద్ధ్మానాద్వా చిరకాలతః
వినిర్యాస స్సనిర్దిష్టః పతంగీ రాగసంజ్ఞితః॥

తా. రంజనసంస్కారమునందింపబడిన లోహమును చాలసేపు కొలిమిలోనుంచి యూదినచో అందుండి వెలువడిన సత్వరూపమైన వినిర్యాసము పతంగీరాగ మనబడును.

—♦ ఆవాపలక్షణము ♦—

మూ. ద్రుతే ద్రవ్యాంతరక్షేపో లోహాద్యే క్రియతే హి యః
స ఆవాపః ప్రతీవాప స్తదేవాచ్ఛాదనం మతం॥

తా. కరిగించబడిన లోహమునందు మరియొకలోహమును వేయుట ఆవాప మనబడు. దీనికి ప్రతీవాపము, ఆచ్ఛాదనము అని నామాంతరములు.

—♦ అభిషేకలక్షణము. ♦—

మూ. ద్రుతేవహ్నిస్థితే లోహే వినష్ట్యాష్టనిమేషకం
సలిలస్య పరిక్షేప స్సాభిషేక ఇతిస్మృతః॥

తా. లోహమును కరగించి నిప్పులయందుండగనే యెనిమిదినిమిషములు తాళి ఉదకమును పోసి చల్లార్చుట అభిషేకమనబడును.

—♦ స్నపనలక్షణము ♦—

మూ. తప్తస్యాప్సువినిక్షేపః నిర్వాప స్నపనం చ తత్॥

తా. కాల్చినలోహము ఉదకములో ముంచుట నిర్వాపమనియు, స్నపనమనియు చెప్పబడును.

—♦ ప్రతీవాపార్హకాలము ♦—

మూ. ప్రతీవాపాదికం కార్యం ద్రుతే లోహే సునిర్మలే॥

తా. చక్కగా కరిగి లోహము నిర్మలముగా నుండునపుడు ప్రతీవాపము చేయవలెను.

## —♦ సత్త్వనిర్గమకాలము ♦—

మూ. యదా హుతాశో దీప్తార్చి శ్శుక్లోత్థాన సమన్వితః
శుద్ధావర్త స్తదాజ్ఞేయ స్సకాల స్సత్త్వనిర్గమే॥

తా. సత్త్వమును దీయుటకై వస్తువులను కొలిమిలో నూదునపుడు అగ్నిజ్వాలలు తీవ్రముగ తెల్లని కాంతిగలిగి ప్రజ్వరిల్లుచుండినచో సత్త్వము వెడలుచున్నట్లు తెలిసికొనవలెను. ఈసమయమునకు శుద్ధావర్తమని పేరు.

## —♦ బీజావర్తలక్షణము ♦—

మూ. ద్రావ్యద్రవ్యనిభా జ్వాలా దృశ్యతే ధమనే యదా
ద్రావస్యోన్ముఖతా సేయం బీజావర్త స్సఉచ్యతే॥

తా. ద్రవింపచేయబడునట్టి ద్రవ్యమునకు సమానముగు కాంతిగలిగిన అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లుచుండునపుడు ఆద్రవ్యము కరుగుచున్నదని గ్రహించవలెను. ఈసమయము బీజావర్త మనబడును.

## —♦ స్వాంగశీతల లక్షణము ♦—

మూ. వహ్నిస్థమేవ శీతం యత్తదుక్తం స్వాంగశీతలం॥

తా. అగ్నియందుండగనే క్రమముగ నిప్పు చల్లార్చినతరువాత అగ్నియందుంచిన ద్రవ్యము తనంతదాను చల్లారిన నది స్వాంగశీతల మనబడును.

## —♦ బహిశ్శీతము ♦—

మూ. అగ్నేరాకృష్య శీతం యత్త ద్బహిశ్శీతముచ్యతే॥

తా. ఏదైన నొకద్రవ్యమును కాల్చదగినంతకాలము కాల్చి బయటకుతీసి దానియంతట నది చల్లారునట్లు చేసిన నది బహిశ్శీత మనబడును.

## —♦ స్వేదన సంస్కారలక్షణము ♦—

మూ. క్షారామ్లై రౌషధైర్వాపి డోలాయంత్రే స్థితస్యహి
పాచనం స్వేదనాఖ్యం స్యాత్ మలశైథిల్యకారకం॥



తా. రసాదివస్తువులను దోలాయంత్రమందుంచి క్షారములు, అమ్లరసములు, ఔషధములు, మొదలగువానితో పాచనము జేయుట స్వేదనమనబడును. స్వేదనమువలన రసాదిగతదోషములు విడిపోవును.

## —♦ మర్దన సంస్కారలక్షణము ♦—

మూ. ఉద్దిష్టై రౌషధైస్సార్ధం సర్వామ్లైః కాంజికైరపి
పేషణం మర్దనాఖ్యం స్యా ద్బహిర్మలవినాశనం॥

తా. బహిర్మల వినాశనముకొరకు రసాదులతో కొన్ని యౌషధములను, సమస్తామ్ల రసములను, కాంజికమును చేర్చి నూరుట మర్దనమనబడును.

## —♦ మూర్ఛన సంస్కారలక్షణము ♦—

మూ. మర్దనాదిష్టభైషజ్యై ర్నష్టపిష్టిత్వకారకం
తన్మూర్ఛనంహి వంగాది భుజకంచుకనాశనం॥

తా. తత్తదనుకూలమైన యౌషధులను చేర్చి రసమును నష్టపిష్టిత్వమును బొందించుట మూర్ఛనసంస్కార మనబడును. దీనివలన రసమందలి నాగవంగాది కంచుకదోషములు నశించును.

## —♦ ఉత్థాపన సంస్కారలక్షణము ♦—

మూ. స్వేదాతపాదియోగేన స్వరూపాపాదనంహి యత్
తదుత్థాపన మిత్యుక్తం మూర్ఛావ్యాపత్తి నాశనం॥

తా. మూర్ఛనసంస్కారమునందు నష్టపిష్టిత్వమందిన రసమును స్వేదనము చేయుట, ఎండించుట మొదలగుపనులచే మరల స్వరూపవంతముగ జేయుట ఉత్థాపనసంస్కార మనబడును.

## —♦ నష్టపిష్టిత్వనిర్వచనము ♦—

మూ. స్వరూపస్య వినాశేన పిష్టత్వా ద్బంధసంహి యత్
విద్వద్భి ర్నిజితా సూతో నష్టపిష్టి స్స ఉచ్యతే॥

తా. రసముయొక్క స్వరూపనాశనమగునటుల ఆయా యౌషధులను చేర్చి నూరుటచేత చలనరహితముగ చేసినచో రసము జయింపబడి బద్ధమగును. దీనికే నష్టపిష్టియని పేరు.

### —♦ పాతనసంస్కారలక్షణము ♦—

మూ. ఉక్తౌషధై ర్మర్దిత పారదస్య యంత్రస్థితస్యోర్ధ్వ మధస్య తిర్యక్
నిర్యాతనం పాతనసంజ్ఞ ముక్తంవంగాది సంపర్కజకంచుకఘ్నం॥

తా. ఏకాదశాధ్యాయమున చెప్పబడినప్రకారము ఓషధులను చేర్చి మర్దింపబడిన రసమును ఆయాయంత్రములం దుంచి పైకి, క్రిందకు, అడ్డముగను రసమును ఆకర్షించుట పాతనసంస్కార మనబడును. దీనివలన రసమునందలి వంగాది సప్తకంచుకదోషములు నశించును.

### —♦ రోధనసంస్కారలక్షణము ♦—

మూ. జలసైంధవ యుక్తస్య రసస్య దివసత్రయం
స్థితి రాస్థాపనీ కుంభే యోసౌ రోధనముచ్యతే॥

తా. ఒకకుండయందు సైంధవలవణము, ఉదకము పోసి అందు రసమును మూడు దినములుంచినచో నది రోధనసంస్కార మనబడును.

### —♦ నియమనసంస్కారలక్షణము ♦—

మూ. రోధనాల్లబ్ధవీర్యస్య చపలత్వ నివృత్తయే
క్రియతే పారదే స్వేదః ప్రోక్తం నియమనంహి తత్॥

తా. రోధనసంస్కారమువలన వీర్యవత్తరమైయున్న రసముయొక్క చపలత్వము నివర్తించుటకై చేయబడు స్వేదనమునకు నియమనసంస్కారమని పేరు.

### —♦ దీపనసంస్కారలక్షణము ♦—

మూ. ధాతుపాషాణ మూలాద్యై స్సంయుక్తో ఘటమధ్యగః
గ్రాసార్థం త్రిదినం స్వేదః దీపనం తన్మతం బుధైః॥

తా. పారదమును ధాతుపాషాణమూలికాదులతో చేర్చి స్వేదనయంత్రమందుంచి గ్రాసార్థమై మూడుదినములు స్వేదనముచేయుట దీపనసంస్కార మనబడును.

### —♦ గ్రాసమానము ♦—

మూ. ఇయన్మానస్య సూతస్య భోజ్యద్రవ్యాత్మికామితిః
ఇయతీ త్యుచ్యతే యోసౌ గ్రాసమానం సమీరితం॥



తా. ఇంతపరిమితిగల రసమును, ఇంత పరిమితిగల వస్తువును భక్షించునని చెప్పుట గ్రాస మనబడును.

### —♦ చారణాది వివరణము ♦—

మూ. గ్రాసస్య చారణం గర్భే ద్రావణం జారణం తథా
ఇతి త్రిరూపా నిర్దిష్టా జారణా వరవార్త్తికైః
గ్రాసః పిండః పరీణామః త్రిస్రశ్చాఖ్యాః పరాః పునః॥

తా. చారణము (గ్రాసమును రసముచే తినుపించుట), గర్భద్రుతి, జారణము అని రసమందు గ్రాసమును లీనముచేయు ప్రక్రియలు మూడుగా జారణావార్తికవేత్తలు చెప్పుచున్నారు. చారణ ద్రావణ జారణములకు క్రమముగ గ్రాసము,పిండము, పరిణామము అని నామాంతరములు కలవు.

### —♦ జారణాద్వైవిధ్యము ♦—

మూ. సముఖా నిర్ముఖాచేతి జారణా ద్వివిధా పునః
నిర్ముఖా జారణాప్రోక్తా బీజాదానేన భాగతః
శుద్ధం స్వర్ణంచ రూప్యంచ బీజ మిత్యభిధీయతే
చతుష్షష్ట్యంశతో బీజప్రక్షేపో ముఖముచ్యతే
ఏవం కృతే రసో గ్రాసలోలుపో ముఖవాన్ భవేత్॥
కఠినాన్యపి లోహాని క్షమో భవతి భక్షితుం
ఇయంహి సముఖాప్రోక్తా చారణా మృగచారిణా॥

తా. సముఖము, నిర్ముఖము అని జారణము రెండువిధములు. రసమునందు భాగప్రకారము బీజమును చేర్చి జారణము చేయుట నిర్ముఖజారణ యనబడును. పరిశుద్ధమైన స్వర్ణము, రజతము బీజము లనబడును. రసమునకు అరువదినాల్గవభాగము బీజమును చేర్చుట ముఖముగ నెన్నబడును. ఇట్లు చేసినయెడల రసము ముఖవంతమై మిగుల శక్తివంతమై కఠినమైన లోహములనుగూడ భక్షించును. ఇదియే సముఖజారణ ప్రక్రియ యని శివుడు చెప్పెను.

### —♦ రాక్షసముఖరసము ♦—

మూ. దివ్యౌషధి సమాయోగాత్ స్థితః ప్రకటకోష్ఠిషు
భుంజీతాఖిల లోహాద్యం యోసౌ రాక్షసవక్త్రవాన్॥

తా. రసమును దివ్యౌషధులతో జేర్చి ప్రకటకోష్ఠియందుంచి యూదుచు లోహములను చేర్చుచున్నచో నాలోహముల నన్నిటిని రసము తినివేయును. ఇది రాక్షసముఖరస మనబడును.

—♦ చారణాలక్షణము ♦—

మూ. రసస్య జఠరే గ్రాసక్షేపణం చారణా మతా.

తా. రసముయొక్క జఠరమునందు గ్రాసముముంచుట చారణమనబడును. (అనగా తినుపించుటయని యర్థము.)

—♦ గర్భద్రుతి లక్షణము ♦—

మూ. గ్రస్తస్య ద్రావణం గర్భే గర్భద్రుతి రుదాహృతా॥

తా. గ్రస్తరసముయొక్క గర్భమందు లోహాదులను ద్రవింపజేయుట గర్భద్రుతి యనబడును.

—♦ బాహ్యద్రుతిలక్షణము ♦—

మూ. బహిరేవం ద్రుతిం కృత్వా ఘనసత్త్వాదికం ఖలు
జారణాయ రసేంద్రస్య సా బాహ్యద్రుతి రుచ్యతే॥

తా. రసేంద్రజారణమునకై కఠినమైన సత్త్వములను పైజెప్పినట్లు బాహ్యమున ద్రవింపజేయుట బాహ్యద్రుతి యనబడును.

—♦ ద్రుతిలక్షణము ♦—

మూ. నిర్లేపత్వం ద్రుతత్వంచ తేజస్త్వం లఘుతా తథా
అసంయోగశ్చ సూతేన పంచధా ద్రుతి లక్షణమ్॥

తా. తెట్టి గట్టకయుండుట, ద్రవరూపముగ నిలిచియుండుట, కాంతిగలిగియుండుట, తేలికగనుండుట, రసముతో చేర్చిన మిశ్రితము కాకుండుట, ఇవి సక్రమముగ తయారుకాబడిన ద్రుతికి లక్షణములు.

—♦ ద్రుతికి లక్షణాంతరము ♦—

మూ. ఔషధాధ్మానయోగేన లోహధాత్వాదికం తథా
సంతిష్ఠతే ద్రవాకారం సా ద్రుతిః పరికీర్తితా॥



తా. లోహములు, ధాతువులు మొదలగువానితో యౌషధులను చేర్చి కొలిమిలో నూదినయెడల లోహాదులు ద్రవాకారము నందును. అదియె ద్రుతియనంబడును.

—♦ జారణాలక్షణము ♦—

మూ. ద్రుతగ్రాసపరిణామః విడయంత్రాదియోగతః
జారణేత్యుచ్యతే తస్యాః ప్రకారా స్సంతి కోటిశః॥

తా. ద్రవీభూతమైన గ్రాసమును బిడయంత్రాదిసాహాయ్యముచేత రసమునందు జీర్ణంపచేయుట జారణమనబడును. ఈజారణాప్రక్రియలు అనేకవిధములుగ నున్నవి.

రసార్ణవమునందుగూడ "రసాలింగిత ఆహారః పిష్టికేత్యభిధీయతే। తద్ద్రుతం రసగర్భేతు జారణం పరికీర్తితం॥" అని రసముచే నాలింగనముచేసికొనబడిన (రసములో లీనమైన) అభ్రకాదిగ్రాసము పిష్టికయనబడుననియు ఆపిష్టికను రసగర్భమందు ద్రవింపచేయుట జారణయనియు సమాభిప్రాయ మొసంగబడినది.

—♦ బిడలక్షణము ♦—

మూ. క్షారై రమ్లైశ్చగంధాద్యై ర్మూత్రైశ్చ పటుభిస్తథా
రసగ్రాసస్య జీర్ణార్థం తద్బిడం పరికీర్తితం॥

తా. క్షారములు, ఆమ్లరసములు, గంధకాదులు, మూత్రములు, లవణములు మొదలగువానితో రసగ్రాసార్థమై చేయబడిన కల్కము బిడమని చెప్పబడును.

ఇయ్యది అనేకవిధములుగ నాయాప్రకరణముల కుపయుక్తముగ నాయారస తంత్రకారులు వచించియున్నారు. కొన్నిటిని క్రిందవ్రాయుదుము. రససాధకుల కివి చాలవరకు కార్యకారులుగ నుండగలవు.

రససారము:—

(1) "సైంధవంచ యవక్షారం మాలతీరససంప్లుతం
స్థిరీకృత్వా ద్రవః కార్యః సర్వకర్మసు యుజ్యతే॥

(2) శుక్తికాశంఖచూర్ణంచ కుక్కుటాండభవాత్వచః
పచేద్గజపుటే చూర్ణం సుదృఢే మల్లయంత్రకే
నవసారయుతం గంధం పచేత్కూపే సుచూర్ణకం
సప్తవారం సుపక్వంచ లోహద్రావే నియోజయేత్
జారణేచ బిడః ప్రోక్తః పరమో రసకర్మణి॥

(3) స్వర్జికాసైంధవకాసీస కాంక్షీః పిష్ట్వామ్లమూత్రకైః
సప్తవారం పచేత్కూపే బిడోయం వ్యోమజారణః॥”

రసరత్నాకరము:—

(4) “శంఖమార్ణం దవిక్షీరైశ్చాతపే భావయే ద్దినం
తద్వజ్జంబీరజై ర్ద్రావై ర్దినైకం ధూమసారకం
సువర్చల మజామూత్రైః క్వాథ్యం యామచతుష్టయం
కంటకారీంచ సంక్వాథ్య దినైకం నరమూత్రకైః
సాజీక్షారాతింతిడీకం కాసీసంచ శిలాజతుం
జంబీరోత్థై ర్ద్రవై ర్భావ్యం పృథ గ్యామచతుష్టయం
శైపాలబీజం త్వగ్గీసం మూలకానాం ద్రవైర్దినం
సైంధవం టంకణం గుంజా శిగ్రుమూల ద్రవై ర్దినం
ఏతత్సర్వం సమాంశంతు మర్ద్యం జంబీరజై ర్ద్రవైః
తద్గోళం రక్షయేద్యత్నాత్ బిడోయం బాడబానలః
అనేన మర్దయే త్సూతం గ్రాసార్థే తప్తఖల్వకే॥

(1) సైంధవలవణము, యవక్షారము, వీనిని మాలతీరసమందు చూర్ణించి వేసి ఒకకుండలో నిల్వయుంచుకొని సకల రసకర్మలందు వాడుకొనవలెను.

(2) ముత్యపుచిప్పలు, శంఖము, కోడిగ్రుడ్డు పెంకులు, వీనిని మెత్తగా చూర్ణించి శరావసంపుటమందిడి గజపుటము వేయవలెను. పిదప ఆ చూర్ణముతో నవాసాగరమును, గంధకమును చేర్చుచు యేడుసారులు పాకముచేసి భద్రపరచుకొని లోహద్రావణమందును, జారణకర్మయందును వాడునది.

(3) సజ్జక్షారము, సైంధవలవణము, అన్నభేది, పటికి వీనిని అమ్లవర్గముతోడను, మూత్రవర్గముతోడను నూరుచు మూసయందుంచి యేడుసారులు పాకముచేసి యుంచుకొని అభ్రకజారణమునం దుపయోగించుకొనవలెను.

(4) జిల్లేడుపాలతో నొకదినము నానబెట్టి యెండించబడిన శంఖమార్ణము, నిమ్మపండ్లరసముతో నొకదినము భావనచేయబడిన కరిధూపము, మేకమూత్రముతో నాలుగుజాములు వండబడిన సౌవర్చలక్షారము, నరమూత్రముతో నొకదినము కాచబడిన వాకుడు, నిమ్మపండ్లరసముతో ప్రత్యేకప్రత్యేకముగ నాలుగుజాములచొప్పున భావనచేయబడిన సజ్జక్షారము, చింతపండు, అన్నభేది, శిలాజతు, ముల్లంగిదుంపల కషాయముచే నొకదినము పక్వముచేయబడిన నేపాళపువిత్తులపప్పు, మునగవేరురసముతో



ప్రత్యేకప్రత్యేకముగ నొక్కొక్కదినము భావనముచేయబడిన సైంధవలవణము, టంకణక్షారము, గురివెందగింజలపప్పు అను నీవస్తువుల నన్నిటిని సమభాగికములుగ గ్రహించి మరల నిమ్మపండ్లరసముతో మర్దించి యాముద్దను భద్రపరచుకొనవలెను. దీనికి బడబానల బిడమనిపేరు. గ్రాసార్థమై, ఈబిడముతో రసముజేర్చి తప్తఖల్వమునందు మర్దించవలెను.

### —♦ రంజనలక్షణము ♦—

మూ. సుసిద్ధబీజధాత్వాది జారణేన రసస్యహి
పీతాదిరాగ జననం రంజనం పరికీర్తితం॥

తా. యథావిధిగ పరిశుద్ధములు చేయబడిన బీజములు, ధాతువులు మున్నగు వానిని జారణము చేయుటచే రసమునకు పీతాదివర్ణములను గలిగించుట రంజన మనబడును.

### —♦ సారణాలక్షణము ♦—

మూ. సూతే సతైలయంత్రస్థే స్వర్ణాదిక్షేపణం హి యత్
వేధాధిక్యకరం లోహే సారణా సా ప్రకీర్తితా॥

తా. సతైలయంత్రస్థమైన రసమునందు బంగారు మొదలగువాని నుంచుట సారణ యనబడును. సారణవలన లోహమునందు మెత్తదన మేర్పడును.

### —♦ వేధలక్షణము ♦—

మూ. వ్యవాయి భేషజోపేతో ద్రవ్యే క్షిప్తో రసః ఖలు
వేధ ఇత్యుచ్యతే తజ్జ్ఞైః సచానేకవిధ స్స్మృతః

తా. ద్రవ్యాంతరములందు రసమారకౌషధసమన్వితముగ రసమునుంచుట వేధ యని యనబడును. ఇది అనేకవిధములు.

### —♦ లేపాది వేధలక్షణములు ♦—

మూ. లేపః క్షేపశ్చ కుంతశ్చ ధూమాఖ్య శ్శబ్దసంజ్ఞకః
లేపనం కురుతే లోహం స్వర్ణంవా రజతం తథా
లేపవేధ స్స విజ్ఞేయః పుట మత్రచ సాకరం
ప్రక్షేపణం ద్రుతే లోహే వేధ స్స్యాత్ క్షేపసంజ్ఞికః
సందంశ ధృతసూతేన ద్రుతద్రవ్యాహృతిశ్చయా
సువర్ణత్వాదికరణం కుంతవేధ స్సఉచ్యతే

వహ్నౌ ధూమాయమానేంతః ప్రక్షిప్త రసధూమతః
స్వర్ణాద్యాపాదనం లోహే ధూమవేధ స్సఉచ్యతే
ముఖస్థిత రసేనాల్ప లోహస్య ధమనాత్ఖలు
స్వర్ణరూపత్వజననం శబ్దవేధ స్స కీర్తితః॥

తా. లేపవేధ, క్షేపవేధ, కుంతవేధ, ధూమవేధ, శబ్దవేధ, అని వేధలు సంగ్రహముగ అయిదు విధములు. లోహములకుగాని, స్వర్ణమునకుగాని రజతమునకుగాని రసమును లేపనముజేసి వరాహపుటమును బెట్టినది లేపవేధ యనబడును. లోహమును కరిగించి అందు రసమును వేయుట క్షేపవేధయనబడును. ద్రవింపచేయబడిన ద్రవ్యమును పట్టుకారుతో పట్టుకొనబడిన రసముచేత ఆకర్షించుట కుంతవేధ యనబడును. ఇదియు వర్ణవిద్యయం దుపయోగించును. రగులుకొని పొగలేచుచున్న అగ్నియందు రసము నుంచి రసము కాలి పొగరూపముగ బయలువెడలునపు డాపొగవలన లోహమునకు బంగారురంగును కలిగించునది ధూమవేధ యనబడును. యథావిధిగ సంస్కారములనందించిన రసమును నోటిలో ధరించి రాగిమొదలగు నీచలోహములను కుంపటిలో నుంచి యూదుచున్నయెడల అవి బంగారుమొదలగు నుత్తమలోహములుగ మారును. ఇట్టిప్రక్రియకు శబ్దవేధయని పేరు.

## ఉద్ఘాటనలక్షణము

మూ. సిద్ధద్రవ్యస్య సూతేన కాలుష్యాది నివారణం
ప్రకాశనంచ వర్ణస్య తదుద్ఘాటన మీరితం॥

తా. రసయోగముచే సిద్ధమైన ద్రవ్యముయొక్క మాలిన్యమును పోగొట్టి తేజస్సును కలిగించుట ఉద్ఘాటనమని చెప్పబడును.

## స్వేదనలక్షణము

మూ. క్షారామ్లై రౌషధై స్సార్ధం భాండం రుద్ధ్వాతి యత్నతః॥
భూమౌ నిఖన్యతే యస్మాత్ స్వేదనం సంప్రకీర్తితం॥

తా. క్షారములు, ఆమ్లములు, ఓషధులు అనువానితో రసాదులను ఒకభాండమందుంచి పైన మూకుడుమూసి చీరజేసి భూమియందు నియమితకాలమువరకు పాతియుంచుట స్వేదనమని చెప్పబడును. (మతాంతరమున నిదియొక స్వేదనవిధి)

## సన్న్యాసలక్షణము

మూ. రసస్యౌషధయుక్తస్య భాండరుద్ధస్య యత్నతః
మందాగ్నియుత చుల్ల్యాం తం క్షేప స్సన్న్యాస ఉచ్యతే॥



తా. రసమును ఓషధులతోచేర్చి భాండమందుంచి చీరజేసి మందాగ్నిచే పాకముజేయుట సన్న్యాసమనబడును.

## స్వేద - సన్న్యాసాధిక్యత

మూ. ద్వావేతౌ స్వేద సన్న్యాసౌ రసరాజస్య నిశ్చితం।
గుణప్రభావ జనకౌ శీఘ్రవ్యాప్తికరౌ తథా॥

తా. పైజెప్పిన స్వేద సన్న్యాస సంస్కారములబడసిన రసము మంచిగుణమును ప్రభావమును శీఘ్రకార్యప్రసక్త్వమును కలిగియుండును.

## పరిభాషావశ్యకత

మూ. రసనిగమమహాబ్ధే స్సోమదేవ స్సముంతాత్
స్ఫుటతర పరిభాషా నామరత్నాని హృత్వా
వ్యరచయ దతియత్నా త్తైరిమాం కంఠమాలాం
కలయతి భిషగ్యో మండనార్థం సభాయాం॥
భవేత్పఠిత వారోయం అధ్యాయో రసవాదినాం
రసకర్మణి కుర్వాణో న సముహ్యతి కుత్రచిత్॥

ఇతిశ్రీవాగ్భటాచార్య విరచితే రసరత్నసముచ్చయే అష్టమోధ్యాయః॥

తా॥ సోమదేవసిద్ధుడు రసశాస్త్రమను సముద్రమునుండి పరిభాష అనురత్నములను సంగ్రహించి యాపరిభాషారత్నములతో యీకంఠమాలను రచించెను. దీనిని కంఠమందు ధరించిన వైద్యుడు సభయందు జయముగాంచును. ఈయధ్యాయమును పలుసారులు శ్రద్ధతో చదివి తెలిసికొనిన రసవాదులకు తమ తమ క్రియాకలాపములయం దెన్నడును పొరబాటు జరుగదు.

శ్రీమత్కృష్ణా గోదావరీమధ్య విద్యోతమాన నూజవీణ్ణగరీప్రభువర శ్రీమదుయ్యూరు
మేడూరు నిడదవోలు ప్రముఖసంస్థానాధీశ్వర ఆంధ్రకవితాధురంధర పండితకవి
పోషక శ్రీ శ్రీ రాజా వెంకటాద్ర్యప్పారాయప్రభువుంగారాస్థాన
పండిత భారద్వాజసగోత్రపవిత్ర వేంకటసుబ్బావధాని సత్పుత్ర
సకలపండితకవి సద్వైద్యవిధేయ సత్యనారాయణశాస్త్రి
నామధేయాంధ్రీకృత రసరత్న సముచ్చయమునందు
అష్టమాధ్యాయము సమాప్తము.

శ్రీశారదాంబార్పణమస్తు.

శ్రీరస్తు

# రసరత్నసముచ్చయము

## నవమాధ్యాయము

### —* యంత్రములు *—

మూ. అథ యంత్రాణి వక్ష్యంతే రసతంత్రాణ్యశేషతః
సమాలోచ్య సమాసేన సోమదేవేన సాంప్రతం
స్వేదాదికర్మ నిర్మాతుం వార్తికేంద్రైః ప్రయత్నతః
యంత్ర్యతే పారదో యస్మాత్ తస్మాద్యంత్రమితిస్మృతం॥

తా. స్వేదాదికర్మలను చేయుటకై రసతంత్రములయందు వార్తికకారులు చెప్పిన వాక్యముల నన్నిటిని చక్కగ పరిశీలించి సోమదేవుడను సిద్ధుడు యంత్రముల నన్నిటిని వివరించుచున్నాడు. పాదరసము యంత్రమందు బద్ధమై యుంచబడును గాన యంత్రమని యనబడువార్థము.



### —♦ దోలాయంత్రము ♦—

మూ. ద్రవద్రవ్యేణ భాండస్య పూరితార్ధోదరస్య చ
ముఖస్యోభయతో ద్వారద్వయం కృత్వా ప్రయత్నతః





తయోస్తు నిక్షిపేద్దండం తన్మధ్యే రసపోటలీం
బధ్వాతు స్వేదయే దేత ద్దోలాయంత్రమితి స్మృతం॥

తా. ఒకభాండమునకు మెడవద్ద యెదురెదురుగ రెండు రంధ్రములనుచేసి ఆరంధ్రములలో పన్నికర్రను దూర్చియాభాండమున సగమువరకు తత్తదుచితద్రవద్రవ్యములను పోసి స్వేదనముచేయదగిన ద్రవ్యమును మూటగట్టి భాండముఖమందు దూర్చబడిన కర్రకు వ్రేలాడగట్టి కుండను పొయ్యిమీదనుంచి క్రింద మంటచేయుచు ఆవిరిపుట్టునట్లు చేసి వ్రేలాడగట్టబడిన పదార్థము శుభ్రమగునట్లు నియమితకాలమువరకు నుంచవలెను. ఇదియే దోలాయంత్రమనబడును.



### —♦ స్వేదనయంత్రము ♦—

మూ. సాంబుస్థాలీముఖే బద్ధే వస్త్రే పాక్యం వినిక్షిపేత్
పిధాయ పచ్యతే యంత్రే స్వేదనీయంత్రముచ్యతే॥

తా. కుండయందు అర్ధభాగమువరకు ద్రవద్రవ్యమును పోసి కుండయొక్కమూతికి ఒకగుడ్డ వాసెనగట్టి స్వేదనార్హమైనద్రవ్యమును వాసెనమీద బెట్టి పైన మూకుడుమూసి కుండను పొయ్యిమీదనుంచి నియమితకాలమువరకు మంటబెట్టవలెను. ఇది స్వేదనయంత్రము.



## పాతనయంత్రము

మూ. అష్టాంగుళ పరీణాహ మానాహేన దశాంగుళం
చతురంగుళకోత్సేధం తోయాధారం గళాదధః
అధోభాండే ముఖం తస్య భాండస్యోపరివర్తినః॥
షోడశాంగుళవిస్తీర్ణ పృష్ఠస్యాస్యే ప్రవేశయేత్
పార్శ్వయో ర్మహిషీక్షీర చూర్ణమండూరఘాణితైః
లిప్త్వా విశోషయే త్సంధిం జలాధారే జలం క్షిపేత్
చుల్ల్యా మారోపయే దేత త్పాతనాయంత్ర ముచ్యతే॥

తా. ఎనిమిది అంగుళములు వైశాల్యమును పదియంగుళముల పొడవును నాలుగంగుళముల యెత్తును గలుగునట్లును దానియొక్క కంఠప్రదేశమున (లోతట్టున) యుదకమును పోసియుంచుట కనువుగా గాడికలిగియుండునట్లును పదునారుఅంగుళముల విస్తీర్ణమును గలిగిన మట్టు గలుగునట్లును ఒకకుండను జేయించి దాని ముఖమునందు అనుకూలముగ సరిపడు మరియొక కుండయొక్క ముఖమును దూర్చి బర్రెపాలతో నూరిన కిట్టముతో సంధిబంధము గావింపవలెను. జలాధారమగు గాడియందు జలమునింపవలెను ఇట్లు నిర్మింపబడిన యంత్రమును పొయ్యిమీదనుంచి సంప్రదాయముల నెరింగి పాతన సంస్కారముం జేసికొనవలెను. ఇది యొకవిధమగు పాతనయంత్రము.

---





## అధఃపాతన యంత్రము

మూ. అధోర్ధ్వ భాజనే లిప్త స్థాపితస్య జలే సుధీః
దీప్తైర్వనోపలైః కుర్యా దధఃపాతం ప్రయత్నతః॥

తా. ముందు చెప్పబోవుప్రకారము త్రిఫలాదులతో చేర్చినూరిన రసపిష్టిని ఒక కుండయొక్క లోపలపూసి, ఆకుండయొక్క ముఖమును మరియొకకుండయొక్క ముఖమందు ప్రవేశపెట్టి దృఢముగ సంధిబంధముజేసి క్రిందికుండను (రసములేనికుండను) నీళ్లుగల గోతిలో పాతిపెట్టి నష్టపిష్టిని పూసినకుండను పైకుంచి దానిమీద యేరుపిడకలతో పుటము బెట్టినయెడల పైకుండలోనుండు రసము బురదలో పాతిపెట్టిన క్రిందికుండలోనికి దిగును. దీనికి అధఃపాతనయంత్రమని పేరు.

---



—◆ కచ్ఛపయంత్రము ◆—

మూ. జలపూర్ణ పాత్రిమధ్యే దత్త్వా ఘటఖర్పరం సువిస్తీర్ణం
తదుపరి బిడమధ్యగతః స్థాప్య స్సూతః కృతః కోష్ఠ్యాం॥
లఘులోహకరోటికయా కృత షణ్మృత్సంధి లేపయాచ్ఛాద్య
పూర్వోక్తఘటఖర్పర మధ్యేంగారైః ఖదిరకోలభవైః॥
స్వేదనతో మర్దనతః కచ్ఛపయంత్రస్థితో రసోజరతి
అగ్నిబలేనైవ తతః గర్భే ద్రవంతి సర్వసత్త్వాని॥

తా. వెడదయైన పాత్రయం దుదకమును బోసి దానిమధ్యమున విశాలమగు నొకమూకుడునుంచి ఆమూకుడులో రసమునుంచి రసమునకుపైన క్రింద బిడద్రవ్యము లను కప్పి ఆమూకుడుమీద ఒకలోహపురేకును కప్పి బంకమన్నుతో ఆరుసారులు చీరజేసి చక్కగాయెండించి రేకుపైన చండ్రబొగ్గులనుగాని రేగుబొగ్గులనుగాని పేర్చి యూదినయెడల బిడమందున్న రసము స్విన్నమగును (ఉడుకును). పిదప ఆరసమును పూర్వో క్తప్రకారము మర్దన చేసినయెడల రసమునందు బిడద్రవ్యములు అగ్నిబలముచే ద్రవించి జీర్ణించును.

---





—◆ దీపికాయంత్రము ◆—

మూ. కచ్ఛపయంత్రాంతర్గత మృణ్మయపీఠస్య దీపికా సంస్థః
యస్మిన్నిపతతి సూతః ప్రోక్తం తద్దీపికాయంత్రం॥

తా. పూర్వోక్తకచ్ఛపయంత్రమందుండు మృణ్మయపీఠము (మూకుడుయొక్క క్రిందిభాగము)న దీపముపెట్టి పాకముజేసిన మూకుడునందు రసముపడును. ఇదియే దీపికాయంత్రము.

---



—◆ ఢేకీయంత్రము ◆—

మూ. భాండకంఠా దధశ్ఛిద్రే వేణునాళం వినిక్షిపేత్।
కాంస్యపాత్రద్వయం కృత్వా సంపుటం జలగర్భితం

నాళికాస్యం తత్రియోజ్యం దృఢం తచ్చాపి కారయేత్
యుక్తద్రవ్యై ర్వినిక్షిప్తః పూర్వం తత్రఘటే రసః
అగ్నినా తాపితో నాళాత్తోయే తస్మిన్ పతత్యధః
యావదుష్ణం భవేత్సర్వం భాజనం తావదేవ హి।
జాయతే రససంధానం డేకీయంత్రమితీరితం॥

తా. ఒకకుండలో ఆయాప్రకరణోక్తమైన ద్రవ్యములతో చేర్చబడిన రసము నుంచి కుండకంఠముక్రింద చిల్లిపొడిచి అందు వెదురుగొట్టమును దూర్చవలెను. పిదప ఒకకంచుపాత్రలో నీళ్లుపోసి దానిపై నొకకంచుపాత్రను బోర్లించి దృఢముగ సంధిబంధము గావించి కుండ కమర్చబడిన వెదురుగొట్టముయొక్క చివరను జలపూర్ణమైన కంచుపాత్రసంపుటములో నుండునట్లుకుర్చి యెక్కడను సందులేకుండ చీరజేసి కుండను పొయ్యిమీదనుంచి మంటబెట్టవలెను. అగ్నితాపమువలన కుండలోని రసము వెదురుగొట్టముగుండ కంచుపాత్రసంపుటములో బడును. ఈకాంస్యపాత్రసంపుటము వెచ్చబడిన తర్వాత మంటను తగ్గించవలెను. ఇది డేకీయంత్రమనబడును.



— జారణయంత్రము —

మూ. లోహమూషాద్వయం కృత్వా ద్వాదశాంగుళమానతః
ఈషచ్ఛిద్రాన్వితా మేకాం తత్ర గంధకసంయుతాం॥



మూషాయాం రసయుక్తాయా మన్యస్యాం తాం ప్రవేశయేత్
తోయం స్యా త్సూతకస్యాథ ఊర్ధ్వాధో వహ్నిదీపనం॥
రసోనకరసం భద్రే యత్నతో వస్త్రగాలితం।
దాపయే త్ప్రచురం యత్నా దాప్లావ్య రసగంధకౌ॥
స్థాలికాయాం పిధాయోర్ధ్వం స్థాలీ మన్యాం దృఢాంకురు।
సంధిం విలేపయే ద్యత్నాత్ మృదావస్త్రేణ చైవ హి
స్థాల్యంతరే కపోతాఖ్యం పుటం కర్షాగ్నినా సదా
యంత్రస్యాధఃకరీషాగ్నిం దద్యా త్తీవ్రాగ్ని మేవ వా
ఏవంతు త్రిదినం కుర్యా త్తతో యంత్రం విమోచయేత్॥
తప్తోదకే తప్తచుల్ల్యాం నకుర్యా చ్ఛీతలాం క్రియాం
న తత్ర క్షీయతే సూతః న గచ్ఛతిచ కుత్రచిత్॥
అనేన చ క్రమేణైవ కుర్యా ద్గంధకజారణం॥

తా॥ పండ్రెండు అంగుళములు వైశాల్యముగలుగునట్లు లోహముతో రెండుమూసల్లను చేయించి అందొకమూసయందు రసమును, రెండవదానియందు గంధకమును పోసి రసముగలమూసలో గంధకము గలమూసయొక్క మూతిని జొప్పించవలెను. పైగంధకముగల మూసయొక్క మధ్య ఒకచిన్న రంధ్రము వేసి ఆరంధ్రముగుండా వస్త్రగాలితము చేయబడిన వెల్లుల్లిరసమును పూరించి ఆమూసళ్ల సంపుటమును ఒక పెద్దశరావమున నుంచి, ఆశరావములో చన్నీళ్ళుపోసి దానికిసరిపడునట్లు మరియొకమూసను బోర్లించి సంధిబంధము చేయవలెను. పైమూసమీద అడవిపిడకలతో కపోతపుటమును వేసి క్రింద అడవిపిడకలతో గాని కట్టెలతో గాని గాఢముగ మంటబెట్టవలెను. ఇట్లుమూడు దినములు జారణముచేసి యంత్రమును విప్పి జారితమైయుండు రసమును గ్రహించునది. యంత్రమందలి నీరు వేడియెక్కినను పొయ్యి మిక్కిలి వేడిగానున్నను రసము క్షీణించునని యు ఎగిరిపోవుననియు భయపడి శీతలక్రియ చేయరాదు. ఎంతఉష్ణముగ నుండినను రసము క్షీణించదు, ఎగిరిపోదు.

### —♦ విద్యాధరయంత్రము ♦—

మూ. యంత్రం విద్యాధరం జ్ఞేయం స్థాలీద్వితయసంపుటాత్
చుల్లీం చతుర్ముఖీం కృత్వా యంత్రభాండం నివేశయేత్॥
తత్రౌషధం వినిక్షిప్య నిరుంధ్యా ద్భాండకాననం
యంత్రం విద్యాధరం నామ తంత్రజ్ఞైః పరికీర్తితం॥

తా॥ ఒకస్థాలియం దౌషధముంచి మరియొక స్థాలినిబోర్లించి సంధిబంధముగావించి నాల్గుముఖములు కలుగునట్లు కట్టబడిన ప్రొయ్యియందుంచి నియమితకాలమువరకు వండవలెను. ఇది విద్యాధర యంత్రము.

---

### —♦ సోమానల యంత్రము ♦—

మూ. ఊర్ధ్వం వహ్ని రధ శ్చాపో మధ్యేతు రససంగ్రహః
సోమానల మిదం యంత్రం జారయే ద్గంధకాదికం॥

తా॥ పైనగ్నియు, క్రింద ఉదకమును, మధ్య రసాదికమును ఉండునట్లుచేసి రసమునందు గంధకాదులను జీర్ణింపజేయుట సోమానలయంత్ర మనబడును.

---

### —♦ గర్భయంత్రము ♦—

మూ. గర్భయంత్రం ప్రవక్ష్యామి పిష్టికాభస్మకారకం
చతురంగుళదీర్ఘాంచ త్ర్యంగుళోన్మిత విస్తరాం
మృణ్మయీం సుదృఢాం మూషాం వర్తులం కారయే న్ముఖం
లోహస్య వింశతి ర్భాగా భాగ ఏకస్తు గుగ్గులోః
సుశ్లక్ష్ణం పేషయిత్వాతు వారం వారం ప్రయత్నతః
మూషాలేపం దృఢం కృత్వా లవణార్ధమృదంబుభిః
కరీషే త్తుషాగ్నినా భూమౌ స్వేదయే న్మృదుమానవిత్
అహోరాత్రం త్రిరాత్రంవా రసేంద్రో భస్మతాం వ్రజేత్॥

తా. నాలుగంగుళములపొడవును మూడంగుళముల వెడల్పును గలుగునట్లు దృఢముగ మన్నుతో ఒకమూసను చేసి అందు రసపిష్టిని పెట్టి మూతిని గుండ్రముగ నుండునట్లు మూసి ఇరువదిభాగములు లోహపురజము, ఒకభాగము గుగ్గిలము, అర్ధభాగము



లవణము, వీనిని బురదనీళ్ళతో మర్దించి ఆమూసను దృఢముగ పలుమారు లేపము గావించి యెండించి భూమిలో యెరుపిడకలతో పుటముచేసి, మృదువుగ స్వేదనము చేసినయెడల ఒకఅహోరాత్రమునకుగాని మూడుఅహోరాత్రములకుగాని రసము భస్మమగును.

---

### —♦ హంసపాకయంత్రము ♦—

మూ. ఖర్పరం సికతా పూర్ణం కృత్వా తస్యోపరి న్యసేత్
అపరం ఖర్పరం తత్ర శనై ర్మృద్వగ్నినా పచేత్
పంచక్షారై స్తథా మూత్రై ర్లవణం చ బిడం తతః
హంసపాకం సమాఖ్యాతం యంత్రం తద్వార్తికోత్తమైః॥

తా. ఒకమూకుడునందు నిండుగ యిసుకను పూరించి ఆయిసుకమీద క్షారపంచకము, మూత్రవర్గము, లవణములు, బిడను వీనిని నూరినముద్దను పెట్టి పైనొక మూకుడు బోర్లించి క్రింద మందాగ్నినుంచి పాకముచేయవలెను. ఇది హంసపాకయంత్రము.

---



### —♦ వాలుకాయంత్రము ♦—

మూ. సరసాం గూఢవక్త్రాం మృద్వస్త్రాంగుళఘనావృతాం
శోషితాం కాచకలశీం పూరయే త్త్రిషుభాగయోః

భాండే వితస్తి గంభీరే వాలుకాసుప్రతిష్ఠితం
తద్భాండం పూరయే త్త్రిభి రన్యాభి రవగుంఠయేత్
భాండవక్త్రం మూనికయా సంధిం లింపే న్మృదా పచేత్
ఛుల్ల్యాం తృణస్య చాదాహా న్మానికా పృష్ఠవర్తినః
ఏతద్ధి వాలుకాయంత్రం తద్యంత్రం లవణాశ్రయం
పంచాఢవాలుకా పూర్ణ భాండే నిక్షిప్య యత్నతః
పచ్యతే రసగోలాద్యం వాలుకాయంత్ర మీరితం॥

తా॥ ఒకఅంగుళము మందముగ చక్కగ చీరలుజేసి యొండించబడిన గాజుకుప్పె యందు పాకార్థమై గ్రహింపబడిన రసద్రవ్యమును పోసి జానెడులోతుగల కుండయొక్క రెండుభాగములలో మూడువంతులు యిసుకపోసి దానిపై రసపూర్ణమైన గాజుకుప్పెను పెట్టి కుండయొక్క తక్కినరెండుభాగములలో మూడువంతులు (గాజుకుప్పెయొక్క మూతివరకును) పూడ్చవలెను. పిదప భాండముయొక్క మూతిపై మూకుడును బోర్లించి దృఢముగ సంధిబంధము గావించి పొయ్యిమీదనుంచి పైమూకుడుమీద యెండుగడ్డిపోచ నుంచినమాత్రమున కాలిపోవు నంతటివరకు మంటబెట్టి స్వాంగశీతలమైన వెనుక గాజుకుప్పెను విప్పి అందుండు రసమును గ్రహించునది. ఇదియును గంధకజారణమున కుపయోగించుయంత్రము.

పైజెప్పినప్రకారముగా తయారుచేయబడిన యంత్రమందు యిసుకకుబదులుగ అయిదు ఆఢకముల లవణమును పూరించి లవణమధ్యమున రసపుటుండను పెట్టి పాకము చేయవచ్చును.

---

## —♦ లవణయంత్రము ♦—

మూ. ఏవం లవణనిక్షేపా త్ప్రోక్తం లవణయంత్రకం॥
అంతఃకృత రసాలేప తామ్రపాత్రముఖస్యచ
లిప్త్వా మృల్లవణేనైవ సంధిం భాండతలస్యచ
తద్భాండం పటునాపూర్య క్షారైర్వా పూర్వవత్పచేత్
ఏవం లవణయంత్రం స్యా ద్రసకర్మణి శస్యతే॥

తా॥ ఒకతామ్రపాత్రయొక్క అడుగు భాగమునందు రసమును పూసి పైన మూకుడు బోర్లించి ఆరెంటికిని ఉప్పును బురదతోనూరి సంధిబంధము గావించి ఆసంపుటమును ఒకభాండములోనుంచి సంపుటముయొక్క క్రిందను, మీదను ఉప్పునుగాని క్షారములనుగాని పోసి పూరించి పైన మూకుడు మూసి సంధిబంధము చేసి వాలుకాయంత్ర పాకమువలెనే రసమును పాకముచేయవలెను. ఇదియే లవణయంత్ర మనబడును.



---

## —♦ నాళికాయంత్రము ♦—

మూ. లోహనాళగతంసూతం భాండే లవణపూరితే
నిరుద్ధం విపచే త్ప్రాగ్వత్ నాళికాయంత్రమీరితం॥

తా॥ ఒకలోహపుగొట్టములో రసమును పోసి మూసి దానిని ఉప్పులోనుంచి వెనుకటివలెనే పక్వముచేయునది. దీనికి నాళికాయంత్రమని పేరు.

---



## —♦ భూధరయంత్రము ♦—

మూ. వాలుకా గూఢసర్వాంగాం గర్తే మూషాం రసాన్వితాం
దీప్తోపలై స్సంవృణుయా ద్యంత్రం త ద్భూధరాహ్వయం॥

తా. ఒకమూసలో రసమునుపోసి మూసను మూసి యొకగోతిలో ఇసుకపోసి ఆయిసుకయందు మూసను పాతిపెట్టి పైన యేరుపిడకలతో గాఢముగ మంటబెట్టిన యెడల మూసయందలి రసము పక్వమగును. ఇది భూధరయంత్రము.

---

## పుటయంత్రము

మూ. శరావసంపుటాంతస్థం కరీషేష్వగ్ని మానవిత్
పచేచ్ఛుల్యాం ద్వియామం వా రసం తత్పుటయంత్రకం॥

తా. ఒకమూకుడులో రసాదివస్తువులను పెట్టి పైన మూకుడు మూసి సంధిబంధము గావించి యేరుపిడకలమధ్య బెట్టి నిప్పు తగిలించవలెను. లేక పొయ్యిమీద నుంచి రెండుజాములవరకు మంటబెట్టవలెను. దీనికి పుటయంత్రమనిపేరు.



## కోష్ఠీయంత్రము

మూ. షోడశాంగుళవిస్తీర్ణం హస్తమాత్రాయతం శుభం
ధాతుసత్త్వనిపాతార్థం కోష్ఠీయంత్రమితిస్మృతం॥

తా. పదునారుఅంగుళముల వెడల్పును ఒకమూరెడు పొడవును గలిగిన తిత్తియొక్క కొనను ఒకచిన్నగుంటలోనుంచి ధాతువులు మున్నగువానినుండి సత్త్వముల దీయుట కుపకరించునట్టి కొలిమికి కోష్ఠీయంత్రమని పేరు.





## వలభీయంత్రము

మూ. యత్రలోహమయే పాత్రే పార్శ్వయో ర్వలయద్వయం
తాదృ క్స్వల్పతరం పాత్రం వలయాపోత్త కోష్ఠకం
పూర్వపాత్రే పరిన్యస్య స్వల్పపాత్రే పరిక్షిపేత్
రసం సమ్మూర్ఛితం స్థూలపాత్ర మాపూర్య కాంజికైః
ద్వియామం స్వేదయేదేవం రసోత్థాపనహేతవే
ఏతత్స్యా ద్వలభీయంత్రం రసషాడ్గుణ్యకారకం
సూక్ష్మకాంతమయే పాత్రే రసస్స్యా ద్గుణవత్తరః॥

తా. ఒకలోహపాత్రమును చుట్టు రెండువలయములు గలుగునట్లు తయారుచేయించి అందు కాంజికము పోసి యాపాత్రముయొక్క వలయములకు (మరచెంబులకుండు త్రిప్పుడు మరవంటి మరకు) సరిపోవునట్లు మరియొక చిన్నలోహపాత్రను చేయించి దానిమట్టునకుగూడ రెండువలయములను గలుగునట్లుచేసి క్రిందకాంజికముతో నింపబడిన లోహపాత్రయొక్క వలయములో చిన్నపాత్రయొక్క మట్టునుపెట్టి త్రిప్పవలెను. పిదప చిన్నపాత్రలో మూర్ఛనసంస్కారమును బొందిన పాదరసమును పోసి రెండుజాములు క్రింద మంటబెట్టవలెను. ఇట్లు స్వేదనము చేసినరసము ఉత్థాపనము జెందును. మరియు రసమునకు షాడ్గుణ్యసంపత్తి కల్గును. షాడ్గుణ్యమనగా జ్ఞాన, శక్తి,

బలైశ్వర్య వీర్య తేజస్సులను గల్గియుండుటయని యర్థము. ఇట్లు రసోత్థాపనకై చేయబడు వలభీయంత్రము కాంతలోహముతో నిర్మింపబడెనేని రసము అత్యంత వీర్యవత్తరమై యుండును.

---



—♦ తిర్యక్పాతన యంత్రము ♦—

మూ॥ క్షిపేద్రసం ఘటే దీర్ఘే నతాధో నాళసంయుతే
తన్నాళం నిక్షిపేదన్యఘటకుక్ష్యంతరే ఖలు
తత్ర రుద్ధ్వా మృదా సమ్యక్ వదనే ఘటయో ధః
అధస్తా ద్రసకుంభస్య జ్వాలయే త్తీవ్రపావకం
ఇతరస్మిన్ ఘటేతోయం ప్రక్షిపే త్స్వాదు శీతలం
తిర్యక్పాతన మేతద్ధి వార్త్తికై రభిధీయతే॥

తా. పొడవైన యొకకుండకు మధ్యభాగమునందుండి క్రిందికి వంగియుండునట్లు గాగొట్టమునమర్చి ఆనాళముయొక్క రెండవచివరను మరియొక కుండలోనికి ప్రవేశపెట్టవలెను. ఇట్టియంత్రమున మొదటి పొడవుగల కుండయందు పాదరసమును పోసి రెండవకుండలో స్వచ్ఛమైన చన్నీళ్లుపోసి రెండుకుండలయొక్క మూతులనుమూసి యొక్కడను సందులేకుండ చీరజేసి యెండించవలెను. పిదప రసముగల భాండమును ప్రొయ్యిమీదనుంచి క్రింద గాఢాగ్ని బెట్టినచో రసమెగిరి నాళముగుండా ప్రక్కను నీళ్లతో నిండియుండుకుండలో బడును. ఇది తిర్యక్పాతనయంత్రము.

---



—♦ పాలికాయంత్రము ♦—

మూ. ఛషకం వర్తులం లౌహం వినతాగ్రోర్ధ్వ దండకం
ఏతద్ధి పాలికాయంత్రం బలిజారణ హేతవే॥

తా. లోహముతో గుండ్రముగానుండున ట్లొకకుండను తయారుచేయించి పైన యేనుగుతుండమువలె చివర భాగమున క్రిందికి వంగియుండు దండమును కలుగ జేసిన నది పాలికాయంత్ర మనబడును. ఇది గంధకజారణమున కుపయోగించును.

---

—♦ ఘటయంత్రము ♦—

మూ. చతుష్ప్రస్థ జలాధార శ్చతురంగుళ కాననః
ఘటయంత్ర మిదం ప్రోక్తం తదాప్యాయనకం హితం॥

తా. నాలుగంగుళముల వెడల్పుగల మూతిగలిగి నాలుగు ప్రస్థముల (256 తులముల) నీరుపట్టునట్టి భాండమునకు ఘటయంత్రమనియు ఆప్యాయనకమనియు పేరు.



—♦ ఇష్టికాయంత్రము ♦—

మూ. విధాయ వర్తులం గర్తం మల్లమత్ర నిధాయ చ
వినిధాయేష్టికాం తత్ర మధ్యగర్తవతీం శుభాం॥
గర్తస్య పరితః కుర్యా త్పాలికా మంగుళోచ్ఛ్రయాం
గర్తే సూతం వినిక్షిప్య గర్తాస్యే వసనం క్షిపేత్

నిక్షిపే ద్గంధకం తత్ర మల్లేనాస్యం నిరుధ్యచ
మల్లపాలికయోర్మధ్యే మృదా సమ్యఙ్నిరుధ్యచ
వనోత్పలైః పుటం దేయం కపోతాఖ్యం నచాధికం
ఇష్టికాయంత్ర మేతత్స్యా ద్గంధకం తేన జారయేత్॥

తా॥ భూమిలో గుండ్రముగా నొక గోయిత్రవ్వి దానికి సరిపడునట్లు నొకమూకుడు నాగోతిలో బెట్టి దానిపై నొకయిటుక నమర్చవలెను. ఆయిటుకకు మధ్య నొక గుంట త్రవ్వి ఆగుంటకు చుట్టు ఒకఅంగుళము యెత్తుగల పాలికను (కట్ట, లేకగోడ) నిర్మించి గర్తమందు (గుంట లేక గోయి) సూతమునుంచి గర్తముపై నొకగుడ్డను పరచి దానిపై గంధమును పరచి పైననొకమూకుడు మూసి, పాలికకును మూకుడునకును గల సంధికి చక్కగ మన్నుపూసి యెండించి పైన కపోతపుటమును వేయునది. అంతకన్న నెక్కువపుటము కూడదు. ఇట్లుచేసిన గంధకము రసమందు జారితమగును. ఇది యిష్టికా యంత్ర మనబడును.



## హింగుళాకృష్టి విద్యాధరయంత్రము

స్థాలికోపరి విన్యస్య స్థాలీం సమ్యఙ్నిరుధ్యచ
ఊర్ధ్వ స్థాల్యాం జలం క్షిప్త్వా వహ్నిం ప్రజ్వాలయే దధః॥
ఏతద్విద్యాధరం యంత్రం హింగుళాకృష్టి హేతవే॥



తా॥ మూకుడులో యింగిలీకమును పెట్టి పైన నొకమూకుడు పెట్టి దానిలో చన్నీళ్ళుపోసి రెండిటికి సంధిబంధము గావించి యీయంత్రమును పొయ్యిమీద పెట్టి అగ్నిని ప్రజ్వలింపజేసినయెడల ఇంగిలీకమందలి రసమెగిరి పైకుండయొక్క అడుగున పట్టును. జాగ్రతగ యంత్రమును విప్పి రసమును గ్రహించునది. ఇదియొక విధమగు విద్యాధరయంత్రము.

## డమరుయంత్రము

యంత్రస్థాల్యుపరి స్థాలీంన్యుబ్జాం దత్వా నిరుంధయేత్
యంత్రం డమరుకాఖ్యం తద్రసభస్మ కృతేహితం॥

తా॥ ఒకకుండమూతిలో మరియొకకుండమూతిని చొప్పించి చీరచేసి యడ్డముగా త్రిప్పిన నది డమరుకయంత్రమనబడును. ఇది రసభస్మముచేయుట కుపయుక్తమగును.



## నాభీయంత్రము

మల్లమధ్యే చరేద్గర్తం తత్రసూతం సగంధకం
గర్తస్య పరితఃకుడ్యం ప్రకుర్యా దంగుళోచ్ఛ్రితం॥
తతశ్చాచ్ఛాదయే త్సమ్య గ్గోస్తనాకారమూషయా
సమ్యక్తో యమృదాముద్ధ్వా సమ్యగత్రోచ్యమానయా॥
జీర్ణకిట్టరజస్సూక్ష్మ గుడచూర్ణ సమన్వితం

లేహవత్కృత బబ్బూలక్వాథేన పరిమర్దితం॥
ఇయంహి జలమృత్ప్రోక్తా దుర్భేద్యా సలిలైఃఖలు॥
ఖటికా పటుకిట్టైశ్చ మహిషీ దుగ్ధమర్దితైః
వహ్నిమృత్స్నా భవేద్వహ్ని ఘోరతాపసహాఖలు
ఏతయా మృత్స్నయారుద్ధో నగతుం క్షమతేరసః
విదగ్ధవనితా ప్రౌఢప్రేమ్ణా రుద్ధః పుమానివ
నందీనాగార్జునశ్చైవ బ్రహ్మజ్యోతిమునీశ్వరః
వేత్తి శ్రీసోమదేవశ్చ నాపరః పృథ్వీతలే
తతోజలం వినిక్షిప్య వహ్నిం ప్రజ్వాలయేదధః
నాభియంత్రమిదం ప్రోక్తం నందినా సర్వవేదినా
ంనేన జీర్యతే సూతః నిర్ధూమశ్శుద్ధగంధకః

తా. ఒకమూకుడుయొక్క మధ్యగుంటనుచేసి అందు రసగంధకములనుంచి ఆ గుంటకు చుట్టు ఒక అంగుళము యెత్తుగోడను పెట్టి దానిపై గోస్తనాకారముగల మూసను బోర్లించి ముందుచెప్పబోవు జలమృత్తికచేత సంధిబంధముచేసి అడుగుమూకుడులో నుదకమును పోసి యీయంత్రమును పొయ్యిమీదనుంచి అగ్నిని జ్వలింపచేయవలెను. ఇట్లుచేసినచో గంధకము రసమందు జీర్ణించును.

జలమృత్తిక:—ప్రాతయినుపచిట్టెమును మెత్తగాదంచి అందు బెల్లమును సున్నమును జేర్చి తుమ్మచెక్కకషాయముతో లేహ్యపాకము వచ్చువరకు మర్దించిన నది జలమృత్తిక యనబడును. దీనిని జలమందుంచినను కరుగదు.

అగ్నిమృత్తిక:—ప్రసంగవశముచే నగ్నిమృత్తికను గూడ చెప్పుచున్నాడు. సుద్ద, ఉప్పు, ప్రాతయినుపచిట్టెము వీనిని బర్రెపాలతో మర్దించినయెడల నది యెంతతీక్ష్ణమైనవేడినైన యోర్చును. పగులదు. మన్నుతో బంధింపబడిన రసము చతురయువతి ప్రౌఢప్రేమచే బద్ధుడైన పురుషునిభంగి యిటునటుకదలుటకు వీలుండదు. ఈ రహస్యమును నందీశ్వరుడు నాగార్జునుడు సోమదేవుడు బ్రహ్మజ్యోతిముని అను సిద్ధులుమాత్ర మెరుంగుదురు. ఈనాభియంత్రమందు రసము గంధకమును జీర్ణంపజేసికొని యగ్నిపై నుంచబడినను నిర్ధూమముగ నుండును.

---



## —♦ గ్రస్తయంత్రము ♦—

మూ. మూషాం మూషోదరావిష్టా మాద్యంతసమవర్తులాం
చిపిటాంచ తలేప్రోక్తం గ్రస్తయంత్రం మనీషిభిః
సూతేంద్ర రంధ్రణార్థంహి రసవిద్భి రుదాహృతం॥

తా. ఆద్యంతములయందు సమానమైన యాకారము గలుగునట్లును గుండ్రముగాను అడుగున సమముగను ఉండునట్లును రెండుమూసలనుచేసి అందొకమూసయొక్కమూతిని రెండవమూసయొక్క మూతియం దిముడునట్లు చేసి చీరజేయవలెను. ఈగ్రస్తయంత్రమును రసరంధ్రణార్థమై రసవేత్తలు చెప్పిరి.

---

## —♦ స్థాలీయంత్రము ♦—

మూ. స్థాల్యాం తామ్రాది నిక్షిప్య మల్లే నాస్యం నిరుధ్యచ
పచ్యతే స్థాలికాధస్థాత్ స్థాలీయంత్ర మిదం స్మృతం॥

తా. ఒకస్థాలియందు తామ్రాదివస్తువుల నుంచి మూకుడుమూసి పొయ్యిమీద నుంచి పాకము చేయవలెను. ఇది స్థాలీయంత్రము.

---



## —♦ ధూపయంత్రము ♦—

మూ. విధాయాష్టాంగుళం పాత్రం లోహ మష్టాంగుళోచ్ఛ్రయం
కంఠాధో ద్వ్యంగుళే దేశే జలాధారం హి తత్రచ॥

తిర్యగ్లోహ శలాకాశ్చ తన్వీస్తిర్యగ్వినిక్షిపేత్
తనూని స్వర్ణపత్రాణి తాసాముపరి విన్యసేత్
పాత్రాధో నిక్షిపేద్ధూమం వక్ష్యమాణ మిహైవహి
తత్పాత్రం న్యుబ్జపాత్రేణ చ్ఛాదయే దపరేణహి
మృదావిలిప్య సంధించ వహ్నిం ప్రజ్వాలయే దధః
తేన కృష్టాని పత్రాణి హృత్వా న్యుక్తవిధానతః॥
రస శ్చరతివేగేన ద్రుతం గర్భే ద్రవంతిచ
గంధాలక శిలానాంహి కజ్జల్యావా మృతాహినా
ధూపనం స్వర్ణపత్రాణాం ప్రథమం పరికీర్తితం॥
తారార్థం తారపత్రాణి మృతసంగేన ధూపయేత్
ధూపయేచ్చ యథాయోగ్యై రన్యై రుపరసైరపి
ధూపయంత్రమిదం ప్రోక్తం జారణాద్రవసాధనే॥

తా. ఎనిమిదిఅంగుళముల వెడల్పు అంతయె యెత్తును గలుగునట్లును కంఠము నకు రెండుఅంగుళములక్రింద లోపలిభాగమున నీళ్లుపోయుటకును అవి నిలవయుండు టకును వీలగులాగు ఒక గాడికలుగునట్లును లోహపాత్రను తయారుచేయించి అగాడి యొక్క అంచులమీద అడ్డముగ ఇనుపయూచలను పఱచి ఆయూచలపై బంగారు రేకు లను పరచవలెను. ఆలోహపాత్రలో గంధకము, తాళకము, మణిశిల అనువాని చూర్ణము నుగాని నాగభస్మమునుగాని పోసి పైన నొకపళ్లెమువంటి రేకునుకప్పి సంధిబంధము చేసి యెండించి ఆయంత్రమును ప్రొయ్యిమీదనుంచి మంటబెట్టినయెడల లోహపాత్రయం దలి వస్తువులు కాలి పొగబయలుదేరి స్వర్ణపత్రములకు పట్టును అట్టిస్వర్ణపత్రములను రసము శీఘ్రముగతినును. గర్భమందు చక్కగాద్రవించును. హేమవిద్యకై హేమమును తారవిద్యకై తారమును క్రమముగ నుపయోగింపదగునని తెలియునది.

పైవిధముగ వెండిరేకులను గూడ తగరపు భస్మము చేతగాని యితరములగు ఉపర సములచేతగాని ధూపము వేసి రసముచే సులభముగ దినిపించవచ్చును.

---

### కందుకయంత్రము

మూ. స్థూలస్థాల్యాం జలం క్షిప్త్వా వాసో బద్ధ్వా ముఖే దృఢం
తత్ర స్వేద్యం వినిక్షిప్య తన్ముఖం ప్రపిధాయ చ॥



అధస్తా జ్జ్వాలయేదగ్నిం యంత్రం తత్కందుకాభిధం
స్వేదనీయంత్ర మిత్యేతత్ ప్రాహు రన్యే మనీషిణః
యద్వా స్థాల్యాం జలం క్షిప్త్వా తృణం క్షిప్త్వా ముఖోపరి
స్వేద్య ద్రవ్యం పరిక్షిప్య పిధానం ప్రపిధాయచ
అధస్తా జ్జ్వాలయే దగ్నిం యంత్రం తత్కందుకాభిధం॥

తా॥ పెద్దదిగనుండు ఒకభాండమునకు గుడ్డవాసెనగట్టి దానిపై స్వేదనముచేయ దగిన ద్రవ్యమును పెట్టి కుండలో నీరు, కాంజికము మొదలగు స్వేదకద్రవ్యములను పోసి పైన మూకుడు మూసి క్రింద మంట బెట్టవలెను. కుండలోనుండు ద్రవద్రవ్యము కాగి వాసెనమీదనున్న ద్రవ్యమును ఆవిరిచేత నుడుకబెట్టును. ఇదియె కందుకయంత్రము. దీనిని స్వేదనయంత్రమనియును కొందరు చెప్పుదురు.

మరియు పైవాసెనమీద గడ్డిని పరచి అందుస్వేద్యద్రవ్యమునుంచి స్వేదనము చేయుటయు కలదు. కాన నిది ప్రక్రియాంతరమున స్వేదనసాధనమని తెలియదగియున్నది.



### ఖల్వయంత్రము

మూ. ఖల్వయోగ్యా శిలానీలా శ్యామా స్నిగ్ధా దృఢా గురుః
షోడశాంగుళకోత్సేధా నవాంగుళకవిస్తరా॥
చతుర్వింశాంగుళాదీర్ఘా ఘర్షణీ ద్వాదశాంగుళా
ఖల్వప్రమాణం తత్ జ్ఞేయం శ్రేష్ఠం స్యా ద్రసకర్మణి॥
ఖల్వయంత్రం త్రిధాప్రోక్తం రసాది సుఖమర్దనే
నిరుద్గారౌ సుమసృణౌ కార్యౌ పుత్రికయాయుతౌ॥
ఉత్సేధే సదశాంగుళః ఖలు కలాతుల్యాంగుళాయామవాన్
విస్తారేణ దశాంగుళో మునిమితై ర్నిమ్నస్తథై వాంగులైః॥
పాల్యాం ద్వ్యంగుళవిస్తరశ్చ మసృణోఽతీవార్ధచంద్రోపమో
ఘర్షో ద్వాదశకాంగుళశ్చ తదయం ఖల్వో మతస్సిద్ధయే॥

అస్మిన్ పంచపలస్సూతో మర్దనీయో విశుద్ధయే
తత్తదౌచిత్యయోగేన ఖల్వే ష్వన్యేషు యోజయేత్॥
ద్వాదశాంగుళవిస్తారః ఖల్వోతి మసృణోపలః
చతురంగుళనిమ్నశ్చ మర్ద్యోతి మసృణీకృతః॥
మర్దక శ్చిపిటోధస్తాత్సుగ్రాహశ్చ శిఖోపరి
అయంతు వర్తులః ఖల్వః మర్దనేతి సుఖావహః
లౌహో నవాంగుళశ్చైవ నిమ్నత్వేచ షడంగుళః
మర్దకోష్టాంగుళశ్చైవ తప్తఖల్వాభిధో హ్యయం॥
కృత్వా ఖల్వాకృతిం చుల్లీ మంగారైః పరిపూరితాం
తస్యాం నివేశ్య తం ఖల్వం పార్శ్వే భస్త్రికయా ధమేత్॥
తదంతర్మర్దితా పిష్టిః క్షారై రమ్లైశ్చ సంయుతా
ప్రద్రవ త్యతివేగేన స్వేదితా నాత్రసంశయః॥
కృతః కాంతాయసా సోయం భవేత్కోటిగుణో రసః॥

ఇతి శ్రీవాగ్భటాచార్య విరచితే రసరత్నసముచ్చయే నవమోధ్యాయః.

తా. నీలవర్ణము, శ్యామవర్ణము గలిగి నునుపుగను దృఢముగను బరువుగను నుండు శిల ఖల్వమునకు యోగ్యమైయుండును.

పదునారు అంగుళముల యెత్తును తొమ్మిదంగుళముల వెడల్పును ఇరువదినాలుగంగుళముల పొడవును గలుగునట్లు పైలక్షణములుగల శిలతో చేయబడిన ఖల్వము రసకర్మయందు శ్రేష్ఠముగనుండును. పైప్రమాణము ననుసరించి చేయబడిన ఖల్వమందు నూరుడురాయి (పొత్రము) పండ్రెండంగుళముల పొడవు కలిగియుండవలెను.

రసాదులను సుఖముగ మర్దించుటకు యోగ్యముగ నుండునట్లు మూడురకముల ఖల్వములు శాస్త్రమందు చెప్పబడినవి.

మర్దనచేయునెడల అరిగిపోవు స్వభావము గలిగినట్టియు యెత్తుపల్లములు గలిగినట్టియు యేజాతిరాతితో ఖల్వము నిర్మింపబడెనో ఆజాతిగాక మరియొక జాతిరాతితో చేయబడిన పొత్రము గలిగినట్టియు ఖల్వములు అయోగ్యములైనవి.

త్రివిధఖల్వములు:—పదిఅంగుళముల యెత్తును పదునారుఅంగుళముల పొడవును పదిఅంగుళముల వెడల్పును యేడంగుళములలోతును ఖల్వపార్శ్వములందు రెండంగుళమందమును గలిగి మిక్కిలి నునుపుగలదై అర్ధచంద్రసమానమగునట్టియు పండ్రెండంగుళ



ముల పొడవుగల పొత్రముగలిగినట్టియు ఖల్వము ఉత్తమముగ నుండును. దీనియందు ఐదుపలముల రసమును మర్దించవచ్చును, మరియు రసముయొక్క పరిమాణము ననుసరించి ఖల్వముయొక్క హెచ్చుతగ్గులను నిర్ణయించుకొని యుపయోగించుకొనవలెను. ఇది యొకరకము ఖల్వము.

పండ్రెండంగుళముల విస్తారమును నాలుగంగుళములలోతును గలిగి మిక్కిలి నునుపైనదై చివర పట్టుకొనుటకు సుకరముగనుండి అడుగు గుండ్రముగను నున్నగను ఉండుపొత్రముగలదై గుండ్రముగనుండు ఖల్వము రెండవవిధము. ఇది మర్దనమునకు మిక్కిలి అనుకూలముగ నుండును. ఇది రాతితో చేయబడవలెను.

తొమ్మిదంగుళముల విస్తారమును ఆరంగుళముల లోతునుగలిగి, ఎనిమిదియంగుళముల పొడవుగల పాత్రముతో గూడి లోహముచే నిర్మింపబడిన ఖల్వము మూడవ రకము. దీనికి తప్తఖల్వ మనిపేరు.

ఖల్వముయొక్క ఆకృతిగల పొయ్యిని నిర్మించి అందు నిప్పులను పోసి యా నిప్పులపై లోహఖల్వమునుంచి ప్రక్కను తిత్తితో నూదుచు క్షారామ్లవర్గములతో చేర్చిన రసమును లోహఖల్వమందుంచి మర్దించినయెడల శీఘ్రముగ రసము స్వేదితమై ద్రవించును. ఈతప్తఖల్వమును కాంత లోహముతో నిర్మించినయెడల అందు మర్దింపబడు రసాదులు కోటిగుణాధికముగ పనిచేయును.

## —♦ సాధారణ మాన పరిభాష ♦—

మూ. షట్త్రుట్యశ్చైకలిక్షా స్యాత్ షడ్లిక్షాయూక ముచ్యతే
షడ్యూకా స్స్యూరజ స్సంజ్ఞః నిబోధత్వం చ సువ్రతే
షడ్రజ స్సర్షప స్స స్యా త్సిద్ధార్థ స్స చ కీర్తితః
షట్సిద్ధార్థేన దేవేశి యవ స్త్వేకః ప్రకీర్తితః
షడ్యవై రేకగుంజా స్యా త్త్రిగుంజో వల్ల ఉచ్యతే
షడ్భి రేవతు గుంజాభి ర్మాష ఏకః ప్రకీర్తితః
మాషా షోడశతోలస్స్యా చ్చతుస్తోలైః పలం భవేత్॥

తా. ఆరుత్రుటులు ఒకలిక్షు. ఆరులిక్షు లొకయూకము, ఆరుయూకము లొక రజస్సు. ఆరురజస్సు లొకసర్షపము. దీనికే సిద్ధార్థమని నామాంతరము. ఆరుసిద్ధార్థ లొకయవ. ఆరుయవ లొకగుంజ. ఆరుగుంజ లొకమాషము. పదహారుమాషము లొక తోల. నాలుగుతోల లొకపలము. ఇట్లు సాధారణముగ మానపరిభాష చెప్పబడినది.

ఇతి శ్రీవాగ్భటాచార్య విరచితే రసరత్నసముచ్చయే దశమోధ్యాయః.

శ్రీరస్తు

# రసరత్నసముచ్చయము

## దశమాధ్యాయము

మూషా, కోష్ఠీ, పుట, ఔషధిగ్రహణ పరిభాషలు

### మూష

మూ. మూషా హి క్రౌంచికా ప్రోక్తా కుముదీ కరహాటికా
పాచనీ వహ్నిమిత్రా చ రసవాదిభి రీర్యతే
ముష్ణాతి దోషాన్ మూషే యా సా మూషేతి నిగద్యతే
ఉపాదానం భవేత్తస్యాః మృత్తికాలోహమేవచ
మూషాముఖవినిష్క్రాంతా వర మేకాపి కాకిణీ
దుర్జనప్రణిపాతేన ధి గ్లక్షమపి మానినాం
మూషాపిధానయోర్బంధే బంధనం సంధిలేపనం
అంధ్రిణం రంధ్రిణం చైవ సంశ్లిష్టం సంధిలేపనం
మృత్తికాపాండుర స్థూలా శర్కరాశోణపాండురా
చిరాధ్మానసహా సాహి మూషార్థ మతిశస్యతే॥
తదభావేచ వాల్మీకీ కౌలాలీవా సమీర్యతే
యా మృత్తికాదగ్ధ తుషై శ్శణేన శిఖిత్రికై ర్వా హయలద్దినాచ
లోహేన దండేనచ కుట్టితా సా సాధారణా స్యాత్ఖలు మూషికార్థే
శ్వేతాశ్మాన స్తుషాదగ్ధాః శిఖిత్రి శ్శణఖర్పరా
లద్దిః కిట్టం కృష్ణమృత్స్నా సంయోజ్యా మూషికామృది॥





తా. మూష, క్రౌంచిక, కుముది, కర హాటిక, పాచని, వహ్నిమిత్ర అను పదములు మూషకు పర్యాయనామములు. రసాదివస్తుగతదోషములను బోగొట్టునదిగనుక మూష యనిపేరు. ఈమూషలను చేయుటకు మన్ను, లోహము ప్రధానములు. మూషలోనుంచి పాకముచేయబడిన ద్రవ్యము అత్యల్పమైనదైనను అధికఫలదాయకముగ నుండును. కాని దుర్జనుల నాశ్రయించిన లక్షద్రవ్యము గూడ శ్రేష్ఠము కాదు.

మూషకును దానిపై మూయు మూతకును సందులేకుండ మన్ను మొదలగునవి పూయుట సంధిబంధ మనబడును. దీనికే సంధిలేపము, అంధ్రిణము, రంధ్రిణము, సంశ్లిష్టము అనిపేళ్ళు. తెల్లగ స్థూలముగనుండు మృత్తికతోను యెరుపు తెలుపు వర్ణములుగల యిసుకతోను చేసినమూసలు ప్రశస్తములై చిరకాలము కొలిమిలో నూదబడినను చిమిడి పోకగట్టిగనుండును. అట్టిలక్షణములుగల మన్ను, యిసుకదొరకనిచో పుట్టమన్నుగాని కుమ్మరిమన్నుగాని యుపయోగించుకొనవలెను.

కాల్చినయిసుక, మేకపెంటికలు, బొగ్గులు, గుర్రపులద్దె, పుట్టమన్ను, వీనినిచేర్చి లోహదండముతో బాగుగ నలియగొట్టబడిన మన్ను సాధారణముగ మూసను కట్టుట కుపయుక్తముగ నుండును.

తెల్లనిపలుగురాళ్ళు, ఉముకకాల్చిన బూడిద, బొగ్గులు, మేకపెంటికలు. చిల్లపెంకు, గుర్రపులద్దె, యినుపచిట్టెము, నల్లమన్ను వీనిని మూసచేయు మన్నులోచేర్చుట కుపయుక్తములుగ నుండును.

### వజ్రమూస

మూ. మృద స్త్రిభాగా శ్శణాద్దిభాగా భాగశ్చ నిర్దగ్ధ తుషోపలాదేః
కిట్టార్ధభాగం పరిఖండ్య వజ్రమూషాం విదధ్యాత్ఖలు సత్త్వపాతే॥

తా॥ పుట్టమన్ను మూడు భాగములు, మేకపెంటికలు, గుర్రపులద్దె, ఉముకకాల్చిన బూడిద లేక పిడకబూడిద యివి ప్రత్యేకము ఒకభాగము, యినుపచిట్టెము అర్ధభాగము, వీనినన్నిటిని చేర్చి మెత్తగాదంచి వజ్రమూషను చేయవలెను. ఇది సత్త్వపాతనమం దుపయోగించును.

### యోగమూస

మూ. దగ్ధాంగార తుషోపేతా మృత్స్నావల్మీక మృత్తికా
తద్వద్విడసమాయుక్తా తద్వద్విడ విలేపితా॥

తయాయా విహితా మూషా యోగమూషేతి కథ్యతే
అనయాంసాధి తస్సూతః జాయతే వీర్యవత్తరః॥

తా॥ బొగ్గులు, ఉముకబూడిద, నల్లమన్ను, పుట్టమన్ను, బిడము, వీనిని మెత్తగా మర్దించి మూసచేసి దానికి బిడమును లేపము జేయవలెను. ఈయోగమూషచే సాధింపబడిన సూతము వీర్యవంతముగ నుండును.

## ——◆ వజ్రద్రావిణీమూస ◆——

మూ. గారభూనాగధౌతాభ్యాం శణైర్దగ్ధతుషైరపి
సమైస్సమాచ మూషా మృన్మాహిషీ దుగ్ధమర్దితా॥
క్రౌంచికాయంత్రమాత్రంహి బహుధా పరికీర్తితా
తయా విరచితా మూషా వజ్రద్రావిణికేరితా॥

తా. పలుగురాయి, భూనాగధౌతము, మేకపెంటికలు, ఉముకబూడిద ఒక్కొక భాగము అన్నిటికి సమము పుట్టమన్ను వీనినెల్ల బఱ్ఱెపాలతో మర్దించి మూసను చేయవలెను. దీనిని సాధారణ మూషాప్రమాణము ననుసరించి నిర్మించవలెను.

## ——◆ గారమూస ◆——

మూ. దుగ్ధం షడ్గుణగారాఢ్యా కిట్టాంగారశణాన్వితా
కృష్ణమృద్భిః కృతా మూషా గారమూషేత్యుదాహృతా॥
యామయుగ్మపరిధ్మానా న్నాసా ద్రవతి వహ్నినా॥

తా. ఇనుపచిట్టెము, బొగ్గులు, మేకపెంటికలు, నల్లమన్ను యివిప్రత్యేకము ఒక భాగము, పలుగురాయి(గార = అనగా నల్లమట్టితో కలసిన కంకర. దీనిని Black Earth mixed with Kankar or Modular అని ప్రఫుల్లచంద్రరాయిగారు వ్రాసియున్నారు.) ఆరుభాగములు, వీనిని బఱ్ఱెపాలతో మృదువుగ మర్దించి చేసినగారమూసను రెండుజాములు కొలిమిలోనుంచి యూదినను కరిగిపోదు.

## ——◆ వరమూస.◆——

మూ. వజ్రాంగార తుషా స్తుల్యా స్తచ్చతుర్గుణ మృత్తికా
గారశ్చమృత్తికాతుల్య స్సర్వైరేతై ర్వినిర్మితా
వరమూషేతి నిర్దిష్టా యామమగ్నిం సహేత సా॥



తా. వజ్రమృత్తిక, బొగ్గులు, ఉముక ఇవి సమభాగములు వీనికినాలుగురెట్లు పుట్టమన్ను, పుట్టమన్నుతో సమము పలుగురాయి వీనిని మెత్తగా నూరి చేసినవరమూష ఒక జాముపరకు అగ్నిని సహించియుండును.

## ——◆ వర్ణమూస ◆——

మూ. పాషాణరహితా రక్తా రక్తవర్గాంబుసాధితా
మృత్తయా సాధితా మూషా క్షితిఖేచరలేపితా
వర్ణమూషేతి సా ప్రోక్తా వర్ణోత్కర్షే నియుజ్యతే॥

తా. రాళ్ళులేకుండ వస్త్రగాలితముచేయబడిన యెఱ్ఱమన్ను (93 వ శ్లోకమందు చెప్పబోవు) రక్తవర్గకషాయముచే మర్దించి దానితో మూసచేసి పటికిని అన్నభేదిని నూరి లేపముచేసి యుంచుకొనవలెను. ఈమూసను వర్ణోత్కర్షకై కొలిమిలో నుంచి యూదబడు వస్తువులను కాల్చుటకు కరిగించుటకు ఉపయోగించుకొనునది.

(ఇది స్వర్ణవిద్యయం దుపయుక్తము. క్షితిః = తువరీ (పటికి,) ఖగః = కాసీసం. (అన్నభేది) అను అర్థములు రసహృదయమునందు 2 వ అధ్యాయము 11 శ్లోకవ్యాఖ్యయందు వివరింపబడినవి. జీవారామ్ కాళిదాసు తనరసరత్నసముచ్చయ ఘూర్జరవ్యాఖ్యయందు భూ ఖగశబ్దమునకు అర్థము తెలియక "ఆణిసియాం" అనగా వానపాములని యర్థము వ్రాసినాడు, మరియు పారదసంహితయందు గూడ "భూఖగ"శబ్దములు రెండును ఒక్కపదముగా గ్రహించి పటికియని యర్థము వ్రాసెను. ఇదియును పొరబాటే.)

## ——◆ రూప్యమూష ◆——

మూ. పాషాణ రహితా శ్వేతా శ్వేతవర్గాంబు సాధితా
మృత్తయా సాధితా మూసా క్షితిఖేచరలేపితా
రూప్యమూషేతి సాప్రోక్తా శ్వేతవర్ణాయ యుజ్యతే॥

తా. రాళ్ళులేకుండ వస్త్రగాలితము చేయబడిన తెల్లనిమన్నును (95 శ్లోకోక్త) శ్వేతవర్గకషాయముచే మర్దించి మూసజేసి పటికిని, అన్నభేదిని లేపముచేసి శ్వేతవర్ణమును కలిగించుటకై (రజతకర్మను చేయుటకై) యూదబడువస్తువుల నీరూప్యమూషలో నుంచి కరగించవలెను.

## ——◆ బిడమూస ◆——

మూ. తత్తద్బిడ సముద్భూతా తత్తద్బిడ విలేపితా
దేహలోహార్థ యోగార్థం బిడమూషేత్యుదాహృతా॥

తా. ఆయారోగములందు చెప్పబడినట్టియు లేక ఉపయుక్తములైనట్టియు బిడద్రవ్యములను చేర్చి చేయబడినమూసకు ఆయా బిడద్రవ్యములను లేపముచేసి దేహమును లోహతుల్యముగ జేయు రసాయనములను పాకముచేయుట కుపయోగించవలెను.

—♦ వజ్రద్రావణమూస ♦—

మూ. గారభూనాగ ధౌతాభ్యాం తుష మష్టగుణేన చ
సమైస్సమా చ మూషా మృన్మహిషీ దుగ్ధమర్దితా
క్రౌంచికాయంత్రమాత్రాపి బహుధా పరికీర్తితా
తయావిరచితా మూషా లిప్తామత్కుణశోణితైః
బాలాబ్ధధ్వనిమూలైశ్చ వజ్రద్రావణక్రౌంచికా
సహతేఽగ్నిం చతుర్యామం ద్రావేణా పూరితా సతీ॥

తా. పలుగురాయి, భూనాగసత్త్వము యివిసమభాగములు. ఈరెంటికి రెనిమిది రెట్లుఊముక అన్నిటికిసమముపుట్టమన్ను వీనిని బర్రెపాలతో మర్దించి మూసచేసి నల్లినెత్తురుతో లేతచిర్రివేళ్లను నూరి మూసకు లేపముచేసినచో యామూసద్రవముచే పూరింపబడి అగ్నియందు నాలుగుజాము లూదినను చిమిడిపోక నిలచియుండును. ఇది వజ్రమును కరిగించుట కుపకరించును.

—♦ వృంతాకమూస ♦—

మూ. వృంతాకాకారమూషాయాం నాళం ద్వాదశకాంగుళం।
దత్తూరపుష్పవచ్చోర్ధ్వం సుదృఢం శ్లిష్టపుష్పవత్॥
అష్టాంగుళంచ సచ్ఛిద్రం సా స్యాద్వృంతాకమూషికా॥
అనయా ఖర్పరాదీనాం మృదూనాంసత్త్వ మాహరేత్॥

తా. వంకాయవలె పండ్రెండంగుళములు పొడవుగను సన్నముగను చివరభాగమున విచ్చిన ఉమ్మెత్తపూవువలె రెనిమిదంగుళముల వెడల్పుగలుగునట్లుగను మధ్యఛిద్రము (అనగా బోలు) గల్గియుండునట్లును చేయబడిన మూస వృంతాకమూస యనంబడును. దీనియందు కఫరిమొదలగు మృదుపదార్థములనుండి సత్త్వము దీసికొనవలెను.

—♦ గోస్తనీమూస ♦—

మూ. మూషాయా గోస్తనాకారా శిఖాయుక్త పిధానకా।
సత్త్వానాం ద్రావణేశుద్ధా మూషా సా గోస్తనీశుభా॥



తా. ఆవుచనుకట్టుయొక్క ఆకృతిగలిగి కొనగలిగిన మూతతో గూడిన మూస గోస్తనీమూస యనబడును. సత్త్వములను ద్రవింపచేయుటకును రసాదులను శుద్ధిపరచుటకును గోస్తనీమూస పనికివచ్చును.

—♦ మల్లమూస ♦—

మూ. నిర్దిష్టా మల్లమూషా యా మల్లద్వితయసంపుటాత్।
పర్పట్యాది రసాదీనాం స్వేదనాయ ప్రకీర్తితా॥

తా. రెండుమూకుళ్లను తెచ్చి యొకదానిపై నొకటి బోర్లించిన నది మల్లమూస యనబడును. రసపర్పటిమున్నగు వానిని స్వేదనముచేయుట కీమూస పనికివచ్చును.

—♦ పక్వమూస ♦—

మూ. కులాల భాండరూపా యా దృఢాచ పరిపాచితా।
పక్వమూషేతి సా ప్రోక్తా పోటల్యాది విపాచనే॥

తా. కుమ్మరిచేయు కుండవలె నుండునదియు దృఢమైనదియు ఆమిలోవేసి కాల్చబడినదియు నగు మూస పోటలీఔషధములను పక్వముచేయుట కుపకరించును.

—♦ గోళమూస ♦—

మూ. నిర్వక్త్రగోళకాకారా పుటనద్రవ్యగర్భిణీ।
గోళమూషేతి సా ప్రోక్తా సత్త్వరం ద్రవ్యశోధనీ॥

తా. ముఖములేకుండ ఉండవలె మూసచేసి మధ్య పుటము వేయదగిన వస్తువులను బెట్టి రోగోక్తప్రకారము పాకముచేయవలెను. దీనియందు ద్రవ్యములు శీఘ్రముగ శుద్ధిబొందును.

—♦ మహామూస ♦—

మూ. తలే యా కూర్పరాకారా క్రమా దుపరి విస్తృతా
స్థూలవృంతాకవత్ స్థూలా మహామూషేత్యసౌ స్మృతా॥
సాచాయోభ్రక సత్త్వాదేః పుటాయ ద్రావణాయచ॥

తా. అడుగున మోచేతివలె సన్నముగనుండి పెద్దవంకాయవలె క్రమముగ వెడల్పుగలుగునట్లు చేయబడిన మహామూస అనుము, అభ్రకము మొదలగు కఠినసత్త్వములను పుటమువేయుటకును ద్రవింపజేయుటకును ఉపయోగించును.

### —♦ మండూకమూష ♦—

మూ. మండూకాకారమూషా యా నిమ్నతాయామవిస్తరా
షడంగుళప్రమాణేన మూషా మండూకసంజ్ఞికా
భూమౌ నిఖన్య తాం మూషాం దద్యాత్పుటమథోపరి॥

తా. ఆరంగుళముల పొడవు, వెడల్పు, లోతు కలిగి కప్పయొక్క అకృతిగలిగిన మండూకమూషయందు పుటద్రవ్యములను బెట్టి భూమిలో పాతిబెట్టి పైన పుటము వేయవలెను.

### —♦ ముసలమూష ♦—

మూ. మూషా యా చిపిటా మూలే వర్తులాష్టాంగుళోచ్ఛ్రయా
మూషా సా ముసలాఖ్యా స్యాచ్చక్రిబద్ధరసే హితా॥

తా. అడుగున చట్టుగలదై గుండ్రముగ యెనిమిదిఅంగుళముల యెత్తుగలదైన మూస ముసలమూస యనంబడును. ఇది చక్రిబద్ధరసపాకమం దుపయుక్తము.

### —♦ మూషాప్యాయనము ♦—

మూ. ద్రవే ద్రవ్యే భావముఖే మూషా యా ధ్మానయోగతః
క్షణముద్ధరణం యత్తన్మూషాప్యాయన ముచ్యతే॥

తా. మూసలోనుంచిన వస్తువులు కరుగుట కున్ముఖమై యున్నపుడు తిత్తితో నూదుచు పట్టుకారుతో మూసనుపట్టుకొని ఒకక్షణకాలము బొగ్గులలోనుండి పైకెత్తుట మూషాప్యాయన మనబడును.

రసార్ణవము:—

“ప్రకాశా చాంధమూషా చ మూషా తు ద్వివిధా స్మృతా
ద్రవ్యనిర్వాహణే సా చ వాదిభి స్సుప్రశస్యతే
అంధమూషా తు కర్తవ్యా గోస్తనాకారసన్నిభా
పిధానకసమాయుక్తా కించి దున్నతమస్తకా
పత్రలేపే తథా రంగే ద్వంద్వమేలాపకే తథా
సైవ ఛిద్రాన్వితా మందా గంభీరా సారణోచితా॥

(ప్రకటమూషయనియు అంధమూషయనియు మూస రెండువిధములు. మూసకుయొక్క అకృతిగల్గి యుండునది ప్రకటమూష. దీనిని ద్రవ్యనిర్వాహణమందు



రసవాదు లుపయోగింతురు. గోస్తనాకారము గలిగి కొంచె మెత్తుగలమూతతో గూడినది యంధమూష యనంబడు. ఇది పత్రలేపనమందును రంగమునందును ద్వంద్వమేలాపనము (రెండు వస్తువులను కలుపుట) యందును అంధమూష ఉపయోగించును. ఛిద్రము చేసి లోతుగా నుండునట్లు నిర్మించబడిన అంధమూష మందమూష యనంబడును. మఱియు,

“తిలభస్మ ద్విరంశం తు ఇష్టికాంశ సమన్వితం
భస్మమూషా తు విజ్ఞేయా తారసంశోధనే హితా॥”

(నువ్వుకట్టె బూడిద రెండుభాగములు ఇటుకచూర్ణము ఒకభాగము వీనినిచేర్చి చేసిన మూసను భస్మమూష యని పేరు. ఇది వెండిని శుద్ధిచేయుట కుపయోగించును. అని మూసలవిషయమై వ్రాయబడిన పై రసార్ణవవాక్యములు తెలియదగియున్నవి.)

### —♦ కోష్ఠి ♦—

మూ. సత్త్వానాం పాతనార్థాయ పాతితానాం విశుద్ధయే
కోష్ఠికా వివిధాకారా స్తాసాం లక్షణ ముచ్యతే॥

తా. సత్వములను తీయుటకును తీసిన సత్త్వములను శుద్ధిచేయుటకును యింకను ద్రావణాదిక్రియలకును ఉపయుక్తములుగ నుండు కొలిములు వివిధాకృతులు గల్గి యుండును. ఆయాకోష్ఠుల లక్షణములు చెప్పబడును.

### —♦ అంగారకోష్ఠి ♦—

మూ. రాజహస్తసముత్సేధా తదర్ధాయామవిస్తరా
చతురస్రా చ కుడ్యేన వేష్టితా మృణ్మయేన చ
ఏకభిత్తౌ చరేద్ద్వారం వితస్త్యా భాగసంయుతం
ద్వారం సార్ధవితస్త్యా చ సమ్మితం సుదృఢం శుభం
దేహల్యధో విధాతవ్యం ధమనాయ యథోచితం
ప్రాదేశప్రమితా భిత్తి రుత్తరంగస్య చోర్ధ్వతః
ద్వారం చోపరి కర్తవ్యం ప్రాదేశప్రమితం ఖలు
తతశ్చపిష్టికయా సంధిం ద్వారసంధిం విలిప్య చ
శిఖిత్రైస్తాం సమాపూర్య ధమేద్భస్త్రాద్వయేన చ
శిఖిత్రాన్ ధమనద్రవ్య మూర్ధ్వద్వారేణ నిక్షిపేత్
సత్త్వపాతనగోళాంశ్చ పంచపంచ పునః పునః
భవేదంగారకోష్ఠీయం ఖరాణాం సత్త్వపాతనీ॥

తా. * మూసంబాతికయెత్తును, అందు సగముప్రమాణము వెడల్పు పొడవులును గలుగులాగు మట్టితో నాలుగుపలకలుగ గోడపెట్టవలెను. అందొకవైపుగోడకు మొదట జానెడువైశాల్యముగల ద్వారమును, దానికిక్రింద జంటతిత్తులుంచి యూదుటకు తగునట్లు ఒకటిన్నరజానెడు ద్వారమును ఆగోడకుపైన అనగా చివరభాగమున జానెడు వైశాల్యముగల మరియొక ద్వారమును చేయవలెను. అనగా మొత్తము మూడుద్వారములు చేయవలెననుట. అన్నిటికంటె క్రిందిద్వారము తిత్తులను ప్రవేశపెట్టుటకును దానిపైనుండుద్వారము కాలిపోయిన బొగ్గులమసి మొదలైన పిట్టులను వెలికి దీసివేయుటకును, దానికి పైనుండు ద్వారము బొగ్గులు, ధమనద్రవ్యము అనగా సత్త్వపాతనార్థమై గ్రహింపబడిన అభ్రకాదులగోళములు (ఉండలు) వేయుటకును ఉపయోగించును. ఇది మిక్కిలి కఠినమైన ఉక్కు, యినుము మొదలగు కఠినలోహాదులనుండి సత్త్వము తీయుట కుపయోగించును. సత్త్వపాతనార్థమై గ్రహించబడిన గోళములనైదేసిచొప్పున కొలిమిలో వేయుచుండవలెను. ఇదియ అంగారకోష్ఠియనంబడును. (ప్రకృతమునందీయంగారకోష్ఠిని కర్మాగారములందు ఉక్కును, యినుమును కరిగించుట కుపయోగించుచున్నారు.)

## —♦ పాతాళకోష్ఠి ♦—

మూ. దృఢభూమౌ చరేద్గర్తం వితస్త్యా సమ్మితం శుభం
వర్తులం చాథ తన్మధ్యే గర్త మన్యం ప్రకల్పయేత్
చతురంగుళ విస్తారనిమ్నత్వేన సమన్వితం
గర్తా ద్ధరణిపర్యంతం తిర్యఙ్నాళ సమన్వితం
కించిత్సమున్నతం బాహ్యే గర్తాభిముఖ నిమ్నగం
మృచ్చక్రీం పంచరంధ్రాఢ్యాం గర్భగర్తోదరే క్షిపేత్
ఆపూర్య కోకిలైః కోష్ఠీం ప్రధమే దేకభస్త్రయా
పాతాళకోష్ఠికాహ్యేషా మృదూనాం సత్త్వపాతనీ
ధ్మానసాధ్య పదార్థానాం నందినా పరికీర్తితా॥

తా. గట్టిగానుండు భూమియందు లోడితెడు వెడల్పుగల గోయి త్రవ్వి ఆ గోతిలో నాలుగంగుళముల వెడల్పును, అంతయే లోతును గల మరియొకగోయి త్రవ్వి యీచిన్నగోతినుండి భూమివరకు ఒకగొట్టమును ఏటవాలుగా నమర్చి చిన్నగోతికి సరిపడునట్లు అయిదు రంధ్రములుగల మట్టిబిళ్ళను అమర్చి పైన బొగ్గులుపోసి ఒకతిత్తితో నూదవలెను. ఇది పాతాళకోష్ఠి యనబడును, మృదువైన రసాదులనుండి సత్త్వముల దీయుటకును కొలిమిలోనుంచి సాధారణముగ కాల్చదగిన వస్తువులను కాల్చుటకును యీకోష్ఠి అనుకూలముగ నుండును.

* రాజహస్తశబ్దమునకర్థము రెండవయధ్యాయమున అభ్రకప్రస్తావమున జూచునది.



## —♦ గారకోష్ఠి ♦—

మూ. ద్వాదశాంగుళ నిమ్నా యా ప్రాదేశప్రమితా తథా
చతురంగుళతశ్చోర్ధ్వం వలయేన సమన్వితా
భూరిచ్ఛిద్రవతీం కోష్ఠీం వలయోపరి నిక్షిపేత్
శిఖిత్రాం స్తత్ర నిక్షిప్య ప్రధమే ద్వంకనాళతః
గారకోష్ఠీయమాఖ్యాతా మృష్టలోహ వినాశనీ
మూషామృద్భి ర్విధాతవ్యం అరత్నిప్రమితం దృఢం
అధోముఖం చ తద్వక్త్రే నాళం పంచాంగుళం ఖలు
వంకనాళమితి ప్రోక్తం దృఢధ్మానాయకీర్తితం॥

తా. పండ్రెండు అంగుళములలోతును లోడితెడు వెడల్పును చుట్టు నాలుగంగుళముల యెత్తుగలగోడను గలిగియుండునట్లు కొలిమినిచేసి యాగోడపై అనేకఛిద్రములు (చిల్లులు) గల మట్టిబిళ్ళ నమర్చి దానిపై బొగ్గులుపోసి వంకనాళముతో నూదవలెను. ఈగారకోష్ఠి మిశ్రితలోహములో నొకలోహముమాత్రము మిగులునట్లును తక్కిన లోహములు విడిపోవునట్లును ఊదుట కుపయోగించును.

వంకనాళము:—మన్నుతో ఒకజానెడు ప్రమాణముగల మూసను చేసి దానికి అధోముఖముగ అయిదుఅంగుళముల పొడవుగల గొట్టమును అమర్చవలెను. దీనినే వంకనాళమందురు. దీనితో దృఢముగ నూదవచ్చును.

రసార్ణవము:—

"దగ్ధధాన్య తుషోపేతా మృత్తికా కోష్ఠికావిధౌ
వంకనాళకృతౌ చాపి శస్యతే సురసుందరి॥"

(కాల్చినయూకను జిడకమన్నుతో చేర్చి కోష్ఠిని చేయవలెను, వంకనాళమును చేయుటకుగూడ పైమృత్తు మిగులప్రశస్తము.)

## —♦ మూషాకోష్ఠి ♦—

మూ. కోష్ఠీ సిద్ధరసాదీనాం విధానాయ విధీయతే

ద్వాదశాంగుళకోత్సేధా సా బుధ్నే చతురంగుళా
తిర్యక్ప్రథమనా స్యాచ్చ మృదుద్రవ్య విశోధనీ॥

తా. పన్నెండంగుళములయెత్తును నాలుగంగుళముల వెడల్పును కలుగునట్లు మట్టితో కుంపటివలె తయారుచేసి దానిప్రక్కను రంధ్రముచేసి ఆరంధ్రమునందు తిత్తియొక్క నాళము(గొట్టము)ను చొప్పించి యూదవలెను. ఈమూషాకోష్ఠి మృదువైన ద్రవ్యములను శుద్ధిచేయుట కుపయోగించును.

## పుటము

మూ. రసాదిద్రవ్యపాకానాం ప్రమాణజ్ఞాపనం పుటం
నేష్టో న్యూనాధికః పాకః సుపాకం హితమౌషధం
లోహాదే రపునర్భావో గుణాధిక్యం తతోగ్రతా
అనప్సుమజ్జనం రేఖాపూర్ణతా పుటతోభవేత్
పుటాద్గ్రావ్ణో లఘుత్వంచ శీఘ్రవ్యాప్తిశ్చ దీపనం
జారితాదపి సూతేంద్రా ల్లోహానా మధికోగుణః
యథాశ్మని విశేద్వహ్నిః బహిస్థః పుటయోగతః
చూర్ణత్వాద్ధి గుణావాప్తి స్తథా లోహేషు నిశ్చితం॥

తా. రసాదిద్రవ్యములయొక్క యథోక్తపాకప్రమాణము పుటమువలననే తెలియదగును. అధికముగాగాని తక్కువగాగాని పాకమైన యౌషధములు శ్రేష్ఠములు గావు. కాన ఆయాయౌషధములను పాకముజేయుటకు ఆయాపుటములు నిర్ణయింపబడియుండునుగాన పుటముల విజ్ఞాన మావశ్యకము.

పుటమువలన లోహాదులు భస్మములై జీవలోహముగ మారక జఠరమందు జీర్ణించి ఆరోగ్యమును గలిగించును. నీటిపై తేలునంతటి లఘుత్వమును చేతివ్రేళ్ళతో నద్దినయెడల రేఖలు ముద్రపడునంతటి మృదుత్వమును లోహాదులందు గల్గించుటకు పుటము ముఖ్యసాధనము. పుటమువలన ఔషధోపయుక్తములగు వివిధములైన శిలలు మిక్కిలి తేలికనందినవై శరీరమునందు వ్యాపించి అగ్నిదీప్తిని గలిగించుటకు సమర్థములగును. మరియు గంధకాదిజారితమైన పారదమునకంటె మృతలోహములు మిక్కిలి వీర్యవంతములుగ నుండును. వెలుపలనుండు వహ్ని పుటయోగమువలన శిలయందు ప్రవేశించి చూర్ణీభూతము గావించి గుణకరమగునుగాన లోహములు గుణవత్తరములని నిశ్చయింపబడినది.



## మహాపుటము

మూ. నిమ్నే విస్తరతః కుండే ద్విహస్తే చతురస్రకే
వనోత్పల సహస్రేణ పూరితే పుటనౌషధం
క్రౌంచ్యాం రుద్ధం ప్రయత్నేన పిష్టికోపరి నిక్షిపేత్
వనోత్పల సహస్రార్ధం క్రౌంచికోపరి విన్యసేత్
వహ్నిం ప్రజ్వాలయే త్తత్ర మహాపుట మిదం స్మృతం॥

తా. రెండుమూరల వెడల్పును రెండుమూరలలోతును గలిగి చతురస్రముగ నుండుగోతిలో వేయిపిడకలనుపేర్చి ఔషధసహితమైన మూస నందుంచి పైన అయిదు వందల పిడకలను పేర్చి నిప్పుముట్టించవలెను. ఇది మహాపుటము.

## గజపుటము

మూ. రాజహస్తప్రమాణేన చతురస్రంచ నిమ్నకం
పూర్ణం చోపల సాటీభిః కంఠావధ్యథ విన్యసేత్
పూర్వాచ్ఛగణతోర్ధాని గిరీండాని వినిక్షిపేత్
ఏతద్గజపుటం ప్రోక్తం మహాగుణవిధాయకం॥

తా. మూరంబాతికలోతును గలిగి చతురస్రముగనుండు గోతిలో భూమి మట్టమువరకు పిడకలనుపేర్చి ఔషధపు మూసనుంచి క్రిందవేసిన పిడకలలో సగముపిడకలు పైన పేర్చి నిప్పుపెట్టవలెను. ఇది గజపుటము.

## వరాహపుటము

మూ. ఇత్థం చారత్నికే కుండే పుటం వారాహముచ్యతే॥

తా. ఒకజానెడు లోతు, వెడల్పుగలిగి చతురస్రముగ నుండుగోతిలో పైవిధముగ పిడకలనుపేర్చిన నది వరాహపుటమనబడును.

## కుక్కుటపుటము

మూ. పుటం భూమితలే యత్ర ద్వితస్తి ద్వితయోచ్ఛ్రయం
తావచ్చ తలవిస్తీర్ణం తత్స్యా త్కుక్కుటకం పుటం॥

తా. రెండుజానల వెడల్పును యెత్తును గలుగులాగుభూమిపై పైవిధముగ పిడకలనుపేర్చి వేసెడుపుటమునకు కుక్కుటపుటమని పేరు.

### కపోతపుటము

మూ. యత్పుటం దీయతే భూమా వష్టసంఖ్యై ర్వనోపలైః
బధ్వా సూతక భస్మార్థం కపోతపుట ముచ్యతే॥

తా. భూమిపై యెనిమిది యెరుపిడకలతో పుటము వేసిన నది కపోతపుట మనబడును. దీనిని సాధారణముగ రసభస్మప్రక్రియయందు వాడనగును.

### గోవరపుటము

మూ. గోష్ఠాంత ర్గోఖురక్షుణ్ణం శుష్కం చూర్ణితగోమయం
గోవరం తత్సమాదిష్టం వరిష్ఠం రససాధనే
గోవరైర్వా తుషైర్వాపి పుటం యత్రప్రదీయతే
తద్గోవరపుటం ప్రోక్తం సిద్ధయే రసభస్మనః॥

తా. పశువులసాలలో యెండి పశువులడెక్కలతో త్రొక్కబడి చూర్ణమైన పేడయొక్క దుమ్మునకు గోవరమనిపేరు. అట్టిగోవగమందుగాని యుముకయందుగాని వేసినపుటమునకు గోవరపుటమనిపేరు. (దీనిప్రమాణ మాయా యోగోక్తప్రకారము నిర్ణయించుకొనవలెను.)

### భాండపుటము

మూ. స్థూలభాండే తుషాపూర్ణే మధ్యే మూషాసమన్వితే
వహ్నినా విహితే పాకే త ద్భాండపుట ముచ్యతే॥

తా. పెద్దకుండయందు నిండుగ ఉముకపోసి అయుముకమధ్య ఔషధసహితమైన మూసనుంచి నిప్పుతగిలించవలెను. ఇది భాండపుటము.

### వాలుకాపుటము

మూ. అధస్తా దుపరిష్టాచ్చ క్రౌంచికాచ్ఛాద్యతే ఖలు
వాలుకాభిః ప్రతప్తాభిః యత్ర త ద్వాలుకాపుటం॥

తా. ఔషధపుమూసను పైన క్రింద యిసుకపోసి పిడకలతో పుటము వేసిన నది వాలుకాపుటమనబడును.

### భూధరపుటము

మూ. వహ్నిమిత్రాం క్షితౌ సమ్యఙ్నిఖన్యా ద్వ్యంగులా దధః
ఉపరిష్టా త్పుటం యత్ర పుటం త ద్భూధరాహ్వయం॥



తా. మూసను భూమిలో రెండంగుళములక్రిందపాతివేసి పైన యెరుపిడకలతో పుటము వేయవలెను. ఇది భూధరపుటము.

### లావకపుటము

మూ. ఊర్ధ్వం షోడశికామాత్రైః తుషైర్వా గోవరైః పుటం
యత్ర తల్లావకాఖ్యం స్యాత్ సుమృదుద్రవ్యసాధనే
అనుక్తపుటమానేతు సాధ్యద్రవ్య బలాబలాత్
పుటం విజ్ఞాయ దాతవ్య మూహాపోహ విచక్షణైః॥

తా. ఔషధపూర్ణమగు మూసను ఒకతులమునెత్తుగల గోవరములోగాని యుముకలోగాని పెట్టి పుటము వేసిన నది లావకపుట మనబడును. ఇది మిగుల మృదువులైన ద్రవ్యములను పుటము వేయుట కనువుగ నుండును.

పుటమందు వేయు పిడకల యొక్కయు గోయియొక్కయు ప్రమాణములను చెప్పనిస్థలమందు పుటనద్రవ్యముల బలాబలములను హెచ్చుతగ్గులను అనుసరించి వైద్యు డూహించి నిర్ణయించుకొనవలెను.

### పిష్టకనామములు

మూ. పిష్టకం ఛగణం ఛాణ ముత్పలం చోపలం తథా
గిరిండోపలసాటీచ వరాటీ ఛగణాభిధాః॥

తా. పిష్టకము, ఛగణము, ఛాణము, ఉత్పలము, ఉపలము, గిరిండము, ఉపలసాటి, వరాటిక అను నివి యెరుపిడకలకు పేళ్ళు.

### సహజ-కృత్రిమలోహములు

మూ. సువర్ణం రజతం తామ్రం త్రపు సీసక మాయసం
షడేతానిచ లోహాని కృత్రిమా కాంస్య పిత్తళే॥

తా. బంగారు, వెండి, రాగి, తగరము, సీసము, ఇనుము అను నీయారు లోహములను సహజములు. కంచు, యిత్తడి అను రెండును కృత్రిమములు.

### లవణములు-క్షారములు

మూ. లవణాని షడుచ్యంతే సాముద్రం సైంధవం బిడం
సౌవర్చలం రోమకంచ చూలికాలవణం తథా
క్షారత్రయం సమాఖ్యాతం యవసర్జిక టంకణం

పలాశ ముష్కకక్షారౌ యవక్షార స్సువర్చికా
తిలనాలోద్భవః క్షారః సంయుక్తం క్షారపంచకం॥

తా. సముద్రలవణము, సైంధవలవణము, బిడలవణము, సౌవర్చలలవణము రోమకలవణము, చూలికాలవణము అని లవణములు ఆరువిధములు.

"సౌవర్చలం సైంధవం చ బిడమాద్భిదమేవచ
సాముద్రేణ సహైతాని పంచస్యుర్లవణానిచ
ఏక ద్వి త్రి చతు ప్పంచ లవణాని క్రమా ద్విదుః"

(సౌవర్చలము, సైంధవము, బిడము, ఉద్భిదము, సాముద్రము అనునీయైదును చేరిన సముదాయము పంచలవణము అనియు మరియు వీనిలో నొకటి ఏకలవణమనియు రెండు ద్విలవణమనియు మూడు త్రిలవణమనియు నాలుగు చతుర్లవణమనియు చెప్పబడిన తంత్రాంతరవాక్యము గ్రాహ్యమై యున్నది.)

యవక్షారము, సర్జక్షారము, టంకణక్షారము అను మూడును చేరి క్షారత్రయ మన బడును. మోదుగ, నువ్వు, మొక్కపుచెట్ల క్షారములను యవక్షార సర్జక్షారములను కలిసి క్షారపంచక మనబడును.

రసార్ణవము:— "తిలాపామార్గ కదలీపలాశ శిగ్రుమోచకాః।
మూలకార్ద్రక చించాశ్చ వృక్షక్షారాః ప్రకీర్తితాః॥"

(నువ్వు, ఉత్తరేణు, అరటి, మోదుగు, మునగ, మోచవృక్షము, ముల్లంగి, అల్లము చింత, అనుచెట్లయొక్క క్షారములు వృక్షక్షారములని చెప్పబడినవి.)

మరియు, "కృష్ణ తిలజపలాశా పామార్గజ స్తథా।
కుటజో ముష్కజశ్చైవ క్షారషట్కం వినిర్దిశేత్॥"
"అపామార్గ పలాశార్క తిలముష్క యవాగ్రజం।
సర్జికాటంకణయుతం క్షారాష్టక ముదాహృతం॥"

(నల్లని నువ్వులచెట్టు, మోదుగు, నస, ఉత్తరేణి, కొడిసెపాల, మొక్కపుచెట్టు అను నీయారిటిక్షారములను కలిసి క్షారషట్కమనియు, ఉత్తరేణి, మోదుగు, జిల్లేడు, నువ్వుచెట్టు, మొక్కపుచెట్టు, యవక్షారము, సర్జక్షారము, టంకణక్షారము అను నీయెనిమిది క్షారములను చేరి క్షారాష్టకమనియు తంత్రాంతరమతమును తెలిసికొనవలెను.)

క్షారకల్పనము:—
"క్షారవృక్షస్య కాష్ఠాని శుష్కాణ్యగ్నౌ ప్రదీపయేత్॥
నీత్వా తద్భస్మ మృత్పాత్రే క్షిప్త్వా నీరే చతుర్గుణే



విమర్ద్య ధారయేద్రాత్రౌ ప్రాత రచ్ఛజలం నయేత్
తన్నీరం క్వాథయే ద్వహ్నౌ యావత్సర్వం విశుష్యతి॥
తతః పాత్రాత్సముల్లిఖ్య క్షారో గ్రాహ్య స్సితప్రభః॥
చూర్ణాభః ప్రతిసార్యస్స్యాత్ పేయస్స్యాత్ క్వథనత్ స్థితః
ఇతి క్షారద్వయం ధీమాన్ యుక్తకార్యేషు యోజయేత్"

(క్షారప్రధానములగు చిత్రమూలము, ఉత్తరేణి మున్నగువాని కాష్ఠముల నైనను, తీగెలనైనను కాల్చి బూడిదచేసి యాభస్మమునకు నాల్గురెట్లు నీరుబోసి పిసికి మట్టిపాత్రలో ఒకరాత్రి నిలవయుంచి యుదయమున పైతేటనీటిని యొకపాత్రలోనికి వంచి యానీళ్ళుఅన్నియు మరిగిపోవు వరకు కాచవలెను. పిదప పాత్రకు అంటియుండు తెల్లని క్షారమును గ్రహించునది. చూర్ణాకారమగు నీక్షారము ప్రతిసార్యమనంబడును. (అనగా వ్రణాదులం దుంచదగియుండును.) కషాయమువలె ద్రవరూపమైన క్షారము పేయమనందగును (అనగా త్రాగుటకర్హముగ నుండును). పైరెండు విధములగు క్షారములను ఆయాకార్యములం దుపయోగింప జనును.)

"స్వర్జికాయాశ్చ భాగైకం వింశద్భాగం జలస్యచ
తావత్క్వాథ్యం క్షిపేద్భాండే యావత్ఫేనం నివర్తతే
క్షణే క్షణే జలం దత్త్వా శ్వేతఫేనం చ గృహ్యతే
తదాతు ఢేకయంత్రేణ ద్రావయే దగ్నియోగతః
త్రిస్సప్తవారం కర్తవ్యం ద్రావణం మూత్రసంయుతం
సర్జికాక్షారనామాయం ద్రావణే పరమో మతః॥"

(సర్జక్షారమున కిరువది రెట్లు నీరుచేర్చి భాండమందుంచి తెల్లని నురుగువచ్చు వరకు కాచుచు ఆనురుగునుతీసి జాగ్రత పరచుకొనవలెను. నీరు హరించినకొలది మరల యుదకమును పోయుచు కాచుచు పూర్తిగా నురుగు నంతయు గ్రహించి యానురుగును గోమూత్రముతో జేర్చి యిరువది యొక్క సారులు ఢేకీయంత్రముతో వండిన యెడల స్వచ్ఛమైన సర్జక్షారమేర్పడును. ఇది ద్రావణయోగములం దత్యుత్తమముగ బనిచేయు నని సర్జక్షారకల్పనముం గూర్చిన తంత్రాంతర మందలి విశేషవిధానము గ్రాహ్యము.)

## మధురత్రయము

మూ. ఘృతం గుడో మాక్షికంచ విజ్ఞేయం మధురత్రయం॥

తా. నెయ్యి, బెల్లము తేనె అను నీమూడును కలసి మధురత్రయ మనబడును.

### —♦ తైలమును తీయదగిన బీజాదులు ♦—

మూ. కంగుణీ తుంబినీ ఘోషా కరీగ శ్రీఫలోద్భవం
కటువార్తాక సిద్ధార్థ సోమరాజీ విభీతజం
అతసీజం మహాకాళీ నింబజా తిలజం తథా
అపామార్గా ద్దేవదాళీ దంతీతుంబురు విగ్రిహాత్
అంకోలోన్మత్త భల్లాత పలాశేభ్యస్తథైవచ
ఏతేభ్యస్తైలమాదాయ రసకర్మణి యోజయేత్ ॥

తా. కొర్రలు, పెద్దపాపర, సోపు, వెణుతురు, మారేడు, కటువార్తాకము, తెల్లావాలు, బావంచాలు, తానికాయలు, అగసిగింజలు, దూసరితీగ, వేపగింజలు, నువ్వులు ఉత్తరేణి బియ్యము, డావరడంగి విత్తులు, నేపాలములు, తుంబురులు, విగ్రహము, ఊడుగుగింజలు, ఉమ్మెత్తగింజలు, జీడిగింజలు, మోదుగు అను నీయోషధులనుండి ప్రత్యేక ప్రత్యేకముగతీసిన తైలములు రసకర్మలయం దుపయుక్తములగును.

### —♦ వసాగణము ♦—

మూ. శంబూక మండూక వసా వసా కచ్ఛపసంభవా
కర్కటీ శింశుమారీ గోసూకర నరోద్భవా
అజోష్ట్రిఖరమేషాణాం మహిషస్యవసాతథా॥

తా. నత్తగుల్ల, కప్ప, తాబేలు, యెండ్రకాయ, శింశుమారమను మృగము, ఆవు, పంది, మేక, ఒంటె, గాడిద, గొర్రె, దున్నపోతు, మనుష్యుడు వీని వసలు రసకర్మయం దుపయుక్తములు.

### —♦ మూత్రవర్గము ♦—

మూ. మూత్రాణి హాస్తికరభ మహిషీఖరవాజినాం
గోజావీనాం స్త్రియః పుంసాం పుష్పం బీజంచ యోజయేత్ ॥

తా॥ ఏనుగు, ఒంటె, బర్రె, గాడిద, గుర్రము, ఆవు, మేక వీనిమూత్రములను, స్త్రీపురుషుల బుతురక్తమును, శుక్రమును రసకర్మయం దుపయోగించవలెను.

నరమూత్రమునకుగూడ నచ్చటచ్చట ఉపయోగము చెప్పబడియున్నను, ఇచ్చట స్త్రీలబుతురక్తమునకును పురుషులవీర్యమునకుమాత్రమే ఉపయోగము చెప్పబడినది. తంత్రాంతరమునందుగూడ "అవిమూత్ర మజామూత్రం గోమూత్రం మాహిషంచ యత్ హస్తిమూత్ర మథోష్ట్రస్య హయస్యచ ఖరస్యచ ఇతిప్రోక్తాని మూత్రాణి" అని మనుష్యమూత్రమును మూత్రగణమునందు వ్రాయబడలేదు. కావ స్త్రీపురుషుల బుతురక్త వీర్యములుమాత్రమే రసకర్మయం దుపయోగింపబడునని తెలియవలెను.



### —♦ పంచమాహిష - పంచఛాగలములు ♦—

మూ. మాహిషాంబు దధిక్షీరం సాభిఘారం శకృద్రసః
తత్పంచ మాహిషం జ్ఞేయం తద్వచ్ఛాగలపంచకం॥

తా॥ బర్రెయొక్క మూత్రము, పెరుగు, పాలు, నేయి, పేడరసము యివియైదును కలిసి పంచమాహిష మనబడును. ఇట్లే గొర్రెయొక్క మూత్ర దధి క్షీర ఘృత శకృద్రసములు కలసి పంచఛాగల మనబడును.

### —♦ ఆమ్లవర్గము ♦—

మూ. అమ్లవేతస జంబీర నింబుకం బీజపూరకం
చాంగేరీ చణకామ్లంచ అమ్లికం కోలదాడిమం॥
అంబష్ఠా తింతిడీకంచ నాగరం రసపత్రికా
కరమందం తథాచాన్య దమ్లవర్గః ప్రకీర్తితః॥

తా॥ అమ్లవేతసము (పుల్లప్రబ్బలి) నిమ్మపండు, గజనిమ్మపండు, మాదీఫలము, పులిచింత, సెనగపులుసు, చింతపండు, రేగుపండు, దానిమ్మపండు, అంబష్ఠ(పులిచింతలో భేదము) చింతచిగురు లేక ఆకు, నారింజపండు, చుక్కకూర, కలివెపండు మొదలగునవి అమ్లవర్గము.

### —♦ అమ్లవర్గమందు ప్రశస్తద్రవ్యములు ♦—

మూ. చణకామ్లశ్చ సర్వేషా మేకఏవ ప్రశస్యతే॥
అమ్లవేతసమేకంవా సర్వేషా ముత్తమోత్తమం॥
రసాదీనాం విశుద్ధ్యర్థం ద్రావణే జారణేహితం॥
కోలదాడిమ వృక్షామ్ల చుల్లికా చుక్రికారసం
పంచామ్లకం సముద్దిష్టం తచ్చోక్తం చామ్లపంచక ॥

తా॥ అమ్లవర్గమందు సెనగపులుసు ఒక్కటియేగాని అమ్లవేతసమొక్కటియో గాని రసాదిజారణమందును, ద్రావణమందును ఉత్తమోత్తమముగ పనిచేయును. మరియు రేగు, దానిమ్మ, చింతపండు, మాదీఫలము, పులిచింత అనునవి యైదును కలసి పంచామ్లము లేక అమ్లపంచకము అనబడును.

("వృక్షామ్లం మాతులుంగామ్లా బదరామ్లామ్ల వేతసా । చతురమ్లమిదం" అని చింతపండు, రేగుపండు, మాదీఫలము, పుల్లప్రిబ్బలి అను నీనాల్గుచుచేరి చతురమ్ల మన బరగునని తంత్రాంతరమునుండి తెలిసికొనదగియున్నది.)

## —♦ పంచమృత్తికలు ♦—

మూ. ఇష్టికా గైరికా లోణం భస్మ వల్మీకమృత్తికా
రసప్రయోగ కుశలైః కీర్తితాః పంచమృత్తికాః॥

తా॥ ఇటుకరాయి, కావిరాయి, చిల్లపెంకులు, బూడిద, పుట్టమన్ను అను నీ యైదును కలసి మృత్తికా పంచకమనబడును. (ఇవి మూసలు, కోష్ఠులు మొదలగువానిని చేయుట కుపయోగించవలెను.)

## —♦ విషవర్గము ♦—

మూ. శృంగికం కాలకూటంచ వత్సనాభం సకృత్రిమం
పీతంచ విషవర్గోయం సవరః పరికీర్తితః॥
రసకర్మాణి శస్తోయం తద్బంధ నవిధావపి
అయుక్త్యా సేవితశ్చాయం మారయత్యేవ నిశ్చితం॥

తా॥ శృంగికము, కాలకూటము, వత్సనాభము, కృత్రిమము (శంఖపాషాణము దొడ్డిపాషాణము, ఉల్లిపాషాణము మొదలగునవి) గౌరీపాషాణము అనునవి మహా విషములు. వీనిని సంప్రదాయానుసారముగ శోధనముచేసి యథాశాస్త్రీయముగ వాడవలెను. లేనిచో వికటించి చంపును. ఇవి రసకర్మయందును రసబంధనమందును ఉపయోగించును.

రసరత్నాకరము:— యోగ్యవిషములు-అయోగ్యవిషములు.

"సక్తుకం ముస్తకం శృంగీ వాలకం సర్షపాహ్వయం
వత్సనాభశ్చ కూర్మశ్చ శ్వేతశృంగీ తథాష్టమం॥
ఇత్యష్టౌ యోజయేద్యోగే కాలకూటాది వర్జయేత్
కాలకూటం మేషశృంగీ హాలహాలంచ దర్దురం॥
కర్కటం మర్కటం గ్రంధి హారిద్రం రక్తశృంగకం
కేశవం దశమంచేతి వర్జనీయం భిషగ్వరైః॥
సక్తుకాద్యాన్ ప్రయుంజీత సర్వరోగే రసాయనే॥



(సక్తుకము, ముస్తలు, శృంగి, వాలకము, ఆవాలు, వత్సనాభి, కూర్మము, శ్వేతశృంగికము అను యెనిమిదివిషములు యోగ్యములై రసాయనాదులందు వాడదగి యున్నవి. కాలకూటము, మేషశృంగి హాలాహలము, దర్దురము, కర్కటకము, మర్కటకము, గ్రంధి, పీతవిషము, రక్తశృంగి, కేశవము అను పదివిధములగు విషములును అయోగ్యములై యుండును గాన రసాదులందు వాడదగదు.

### బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య శూద్రవిషములు.

మరియు పైజెప్పబడిన పదునెనిమిదిరకముల విషములయందు "ఏతద్విషం జాతి చతుష్టంచ విచార్య యోజ్యం భిషగుత్తమేన" అని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రజాతిభేదములచే నాల్గువిధములు కలవనియు "విప్రో రక్షతి యౌవనం నరపతిస్తమ్యాభితే పాలతాం, వైశ్యః కుష్ఠవినాశనేచ కుశల, శ్శూద్రోహరే జ్జీవనం॥" అని బ్రాహ్మణజాతివిషము యౌవనమును నిలుపుటయందును, క్షత్రియజాతివిషము శరీర పోషణముజేసి పుష్టినిగల్గించుటయందును, వైశ్యజాతివిషము కుష్ఠమును హరించుటయందును, శూద్రజాతివిషము ప్రాణమునుహరించుటయందును సమర్థములని చతుర్విధవిషములయొక్క గుణములను:—

"శ్వేతా వా యదివా పింగా మధురా చోషరాపివా।
లోమశా బ్రహ్మజాతిస్స్యాత్ క్షత్రజాతిస్తు లోహితా॥
పీతా వా మధురాకించిత్ వైశ్యజాతిస్తు ధూసరా।
కృష్ణా శూద్రస్య ద్విశ్చైత ఏతేషాంచ భిషగ్వరైః॥"

శ్వేతవర్ణము లేక పింగళవర్ణము గలిగి మధురము లేక లవణము రుచిగలిగి లోమశమై (నూగుకలుగలిగి) యుండునది బ్రహ్మజాతివిషము. యెరుపులేక పచ్చనివర్ణము కొంచెము మధురరసమును గలది క్షత్రియజాతివిషము. ధూసరవర్ణముగలది వైశ్యజాతివిషము. కృష్ణవర్ణముగలది శూద్రజాతివిషము అని చతుర్విధవిషములయొక్క స్వరూపములను,

"క్షీరం సంపూర్య భాండేపి విషం దత్త్వా విచింతయేత్। జాయతేపి యథా వర్ణం తదాజాతిం వినిర్దిశేత్॥" ఒకభాండమందు పాలనుబోసి అందువిషమును నానబెట్టినచో కొంతసేపటికి ఆపాలయొక్క రంగుమారును. ఆరంగునుబట్టి విషముయొక్కజాతిని గుర్తించవలెనని విషముయొక్క పరీక్షయును, నింకను విషముయొక్క యోగ్యతాయోగ్యతలును, బ్రాహ్మణాదిజాతిభేదములును, వానిస్వరూపములును స్వరూపజ్ఞానమును రసరత్నాకరమున చెప్పబడినవి.

మఱియు "విషేషు జంగమాఖ్యేషు విషం నాగభవం హితం" అను తంత్రాంతరవాక్యముచే జంగమవిషము లన్నిటిలో గరళము (సర్పవిషము) ఉత్తమ మనువిషయము గ్రాహ్యమైయున్నది.

రసేంద్రచింతామణి: — విషశుద్ధి,

"నాగోద్భవం యథాప్రాప్తం విషం గోమూత్రసంయుతం।
ఆతపే త్రిదినం శుష్కం నిహితం వీర్యభృగ్భవేత్॥"

(గరళమును సర్పముఖమునుండి పిండినవెంటనే గోమూత్రమునందు వేసి యెండలో మూడుదినము లెండబెట్టినచో పరిశుద్ధమై వీర్యవంతమై యుండును.)

రససంకేతకలికయందు:—

"నదేయం క్రోధినే క్లీబే పిత్తార్తే రాజయక్ష్మణి।
క్షుత్తృష్ణా భ్రమఘర్మాధ్వసేవినే క్షీణరోగిణే॥
గర్భిణీ బాలవృద్ధేషు నవిషం రాజమందిరే॥
హితాశినే ఘృతక్షీర రసాయనరతే దదేత్॥"

(ముక్కోపికిని, నపుంసకునకు, పిత్తరోగికిని, క్షయరోగికిని, ఆకలి, దప్పిక, భ్రమగలవారికిని, యెండబడినవానికిని, మార్గాయాసముగలవానికిని, క్షీణరోగికిని, గర్భిణీస్త్రీలకును, బాలురకును, వృద్ధులకును, రాజకుటుంబమునకును, విషప్రయోగము చేయరాదు.

హితముగ ఘృతక్షీరాదులతో భుజించువారును, రసాయనాసక్తులును, విషప్రయోగమున కర్హులుగ నుందురు. అనగా రోగశాంతికై విషమిశ్రితమైన యౌషధములను వాడినచో భరించలేని వారలకట్టి విషమిశ్రౌషధముల ప్రయోగింపకూడదనియు భరించగలిగిన ధైర్యవంతులకు యివ్వవచ్చుననియు విషార్హా విషానర్హులను వివరించి చెప్పంబడెను.

## —♦ ఉపవిషవర్గము ♦—

మూ. లాంగలీ విషముష్టిశ్చ కరవీరోజయా తథా।
నీలకః కనకోర్కశ్చ వర్గోహ్యుపవిషాత్మకః॥

తా. పొత్తిదుంప ముషిణిగింజ, కరవీరము, గంజాయి, నీలకము, ఉన్మత్త, జిల్లేడు అను నివి యుపవిషములు.

మతాంతరమున మహావిషములు—ఉపవిషములు,

"శృంగీచ కాలకూటంచ ముస్తకో వత్సనాభకః।
సక్తుకశ్చేతి యోగోయం మహాపంచ విషాభిధః॥"



"అర్కక్షీరం స్నుహీక్షీరం లాంగలీ కరవీరకః।
గుంజాహిఫేనోధత్తూరః సప్తోపవిషజాతయః॥"
"స్నుహ్యర్కలాంగలీ గుంజా హయారిర్విషముష్టికా।
జేపాలోన్మత్తాహిఫేనం నవోప విషజాతయః॥"

(శృంగి, కాలకూటము ముస్తకము, వత్సనాభము, సక్తుకము అను నైదువిషములును మహావిషములనబడును. జిల్లేడుపాలు, జెముడుపాలు, పొత్తిగడ్డ, గన్నేరు,గురివెంతగింజ, నల్లమందు, ఉన్మత్త అను యేడును ఉపవిషములని యొకమతము. జెముడుపాలు, జిల్లేడుపాలు, పొత్తిగడ్డ, గురిగింజ, గన్నేరు, విషముష్టి, నేపాలము, ఉన్మత్త, నల్లమందు అను నీతొమ్మిది యుపవిషములని మరియొక మతము. ఇట్లె విషోపవిషనిర్ణయమందు పలువిధములగు అభిప్రాయము లాయాగ్రంథములందు వ్రాయబడినది.)

## —♦ దుగ్ధవర్గము ♦—

మూ. హస్త్యశ్వీ వనితా ధేను ర్గర్దభీ ఛాగికావికా
ఉష్ట్రీకో దుంబరాశ్వత్థ భాను న్యగ్రోధ తిల్వకం
దుగ్ధికా స్నుగ్గణం చైతత్ తద్ధై వోత్తమకర్ణికా
ఏషాం దుగ్ధై ర్వినిర్దిష్టో దుగ్ధవర్గో రసాదిషు॥

తా. ఏనుగు, గుఱ్ఱము, స్త్రీ, ఆవు, గాడిద, మేక, గొఱ్ఱె, ఒంటిపిట్ట, మేడిచెట్టు, రావిచెట్టు, జిల్లేడు, మఱ్ఱి, లొద్దుగు, చిరుపాల, జెముడు, దుష్టపుతీగ-వీనిపాలు దుగ్ధవర్గమనబడును.

## —♦ విడ్గణము ♦—

మూ. పారావతస్య చాషస్య కపోతస్య కలాపినః
గృధ్రస్య కుక్కుటస్యాపి వినిర్దిష్టో హి విడ్గణః
శోధనం సర్వలోహానాం పుటనా ల్లేపనా త్ఖలు॥

తా. పావురము, పాలపిట్ట, కపోతపక్షి, నెమలి, గ్రద్ద, కోడి వీనిమలములు విడ్గణ మనబడును. వీనిని లోహములకు లేపనముచేయుటచేతను పుటముపేయుటచేతను లోహములు శుద్ధిబొందును.

## —♦ రక్తవర్గము ♦—

మూ. కుసుంభం ఖదిరో లాక్షా మంజిష్ఠా రక్తచందనం
అక్షీచ బంధుజీవశ్చ తథా కర్పూరగంధినీ
మాక్షికం చేతి విజ్ఞేయో రక్తవర్గోతిరంజనః॥

తా. కుసుంబాచెట్టు, చండ్రి, లక్క, మంజిష్ఠ, రక్తచందనము, గొలిమిడి, మంకెన, గంధతృణము, తేనె యీవస్తువులు రక్త మనబడును. ఇది రసాది రంజనార్థ ముపయోగింపబడును.

—♦ పీతవర్గము ♦—

మూ. కింశుకః కర్ణికారశ్చ హరిద్రా ద్వితయం తథా
పీతవర్గోయమాదిష్టో రసరాజస్య కర్మణి॥

తా. మోదుగ, కొండగోగు, మానుపసుపు, పసుపు, ఇవి పీతవర్గ మనబడును.

—♦ శ్వేతవర్గము ♦—

మూ. తగరః కుటజః కుందః గుంజా జీవంతికా తథా
సితాంభోరుహకందశ్చ శ్వేతవర్గ ఉదాహృతః॥

తా. గ్రంథితగరము, కొడిశ, మల్లితీగ, తెల్లగురివెంద, పాల, తెల్లతామరదుంప యివి శ్వేతవర్గ మనబడును.

—♦ కృష్ణవర్గము ♦—

మూ. కదళీ కారవల్లీ చ త్రిఫలా నీలికానలః
పంకః కాసీస బాలామ్రం కృష్ణవర్గ ఉదాహృతః॥

తా. అరటి, కాకర, త్రిఫలములు, నీలిచెట్టు, చిత్రమూలము, బురద, అన్నభేది, లేతమామిడియాకు లేక కాయ అను నివి కృష్ణవర్గము.

—♦ రక్తవర్గాద్యుపయోగములు ♦—

మూ. రక్తవర్గాది వర్గైశ్చ ద్రవ్యం యజ్జారణాత్మకం
భావనీయం ప్రయత్నేన తాదృగ్రాగాప్తయే ఖలు॥

తా. పైజెప్పిన రక్త, శ్వేత, కృష్ణ, పీతవర్గవస్తువులచే నాయావర్ణములను గలిగించుటకయి గ్రహింపబడు జారణాత్మక ద్రవ్యములను భావనజేయుట కుపయోగించవలెను.

—♦ శోధనీయగణము ♦—

మూ. కాచటంకణ శిగ్రుభిః శోధనీయో గణో మతః
సత్త్వానాం బద్ధసూతస్య లోహానాం మలనాశనః
కాపాలికగణధ్వంసీ రసవాదిభి రీర్యతే॥



తా. గాజు, వెలిగారము, చిల్లపెంకు, యీవస్తువులు శోధనీయగణము. దీని వలన సత్వములయొక్కయు, బద్ధరసముయొక్కయు, లోహములయొక్కయు మాలిన్య మును పోగొట్టవచ్చును. ఈగణమును రసవాదులు "కాపాలికగణధ్వంసి" యందురు. అనగా లోహరసాదిగతదోషములు కాపాలికగణమనియు వానిని నశింపజేయునది కాపాలికగణధ్వంశియనియు తెలియదగియున్నది.

—♦ లోహకాఠిన్యనాశకగణము ♦—

మూ. మహిషీ మేఢ్రాండగర్భః కాళింగో ధవబిజయుక్
శశాస్థీనిచ వర్గోయం లోహకాఠిన్యనాశనః॥

తా. దున్నపోతుయొక్క మేఢ్ర వృషణమందలి తెల్లనిమాంసవిశేషము కొడిశగింజలు, మోదుగమాడలు, కుందేటియెముకలు అను నీవస్తువులు లోహములందలి కాఠిన్యమును నశింపజేసి మెత్తదనమును కలిగించునవియై యుండును.

ఇచ్చట "మహిషీమేఢ్రాండగర్భః" అనుచోటగేదకు మేఢ్రాండ్రములుండుట అసంభవమగుటచేతను "పంచమం లఘుసర్వత్ర" అనుఛందశ్శాస్త్రవాక్యముచే అనుష్టుప్"చందస్సునకుభంగకరముగ "ఢ్రాం"అనుగురువు ఉండుటచేతను పైపాఠము పారబాటుఅని గ్రాహ్యమగుచున్నందున "మహిషస్యాండగర్భాచ" అనిపాఠము దిద్దుబాటు చేయుట సమంజసమై యుండునని నాయభిప్రాయము.

—♦ ద్రావణగణము ♦—

మూ. గుడగుగ్గులు గుంజాజ్య సారఘైః టంకణాన్వితైః
దుర్ద్రావాఖిలలోహాదేః ద్రావణాయ గణో మతః॥

తా, బెల్లము, గుగ్గిలము, గురివెందగింజ, నేయి, తేనె, వెలిగారము అనునీవస్తువులు కష్టముగ ద్రవించులోహములను సులభముగ ద్రవింపజేయును.

—♦ క్షారాద్యుపయోగములు ♦—

మూ. క్షారా స్సర్వే మలం హన్యు రమ్లం శోధనజారణం
మాంద్యం విషాణి నిఘ్నంతి స్నైగ్ధ్యం స్నేహాః ప్రకుర్వతే॥

### మానపరిభాష

తా, క్షారములు రసాదిగతమలములను పోగొట్టును. అమ్లములు శోధనజారణములం జేయును. విషములు మాంద్యమును హరించును. స్నేహములు "సర్పిస్తైలంవసామజ్జా స్నేహోప్యుక్తశ్చతుర్విధః" అనుటచే నెయ్యి,నూనె, వస,మజ్జ(యెముకలలోని క్రొవ్వు) యివి స్నేహములు, స్నిగ్ధత్వమును గల్గించును.

శ్రీమత్కృష్ణా గోదావరీమధ్య విద్యోతమాన నూజవీడ్ణగిరిప్రభువర శ్రీమదుయ్యూరు,
మేడూరు, నిడదవోలు ప్రముఖసంస్థానాధీశ్వర ఆంధ్రకవితాధురంధర పండితకవి
పోషక శ్రీ శ్రీ రాజా వెంకటాద్ర్యప్పారాయప్రభుపుంగవాస్థాన
పండిత భారద్వాజసగోత్రపవిత్ర వేంకటసుబ్బావధాని సత్పుత్ర
సకలపండితకవి సద్విద్యవిధేయ సత్యనారాయణశాస్త్రి
నామధేయాంధ్రీకృత రసరత్న సముచ్చయమునందు
దశమాధ్యాయము సమాప్తము.

శ్రీశారదాంబార్పణమస్తు.

శ్రీరస్తు

# రసరత్నసముచ్చయము

## ఏకాదశాధ్యాయము

మూ. త్రుటి స్స్యా దణుభి ష్షడ్భి స్తైర్లిక్షా షడ్భి రీరితా
తాభి ష్షడ్భి ర్భవే ద్యూకః షడ్యూకా స్తద్రిజ స్మృతం
షడ్రిజ స్సర్షపః ప్రోక్తః తై ష్షడ్భి ర్యవ ఉచ్యతే
ఏకగుంజాయ వై ష్షడ్భి ర్నిష్పావస్తు ద్విగుంజకః
స్యాద్గుంజాత్రితయం వల్లః ద్వావలౌ మాష ఉచ్యతే
ద్వామాషౌ ధరణం తే ద్వే శాణనిష్కకలాస్మృతాః
నిష్కద్వయం తు వటకః సచకోల ఇతీరితః
స్యాత్కోల ద్వితయం తోలః కర్షో నిష్కచతుష్టయం
ఉదుంబరం పాణితలం సువర్ణం కబళగ్రహః
అక్షం బిడాలపదకం శుక్తిః పాణితల ద్వయం
శుక్తిద్వయం పలం కేచిత్ అన్యే శుక్తిత్రయం విదుః
తదేవ కథితం ముష్టిః ప్రకుంచో బిల్వ మిత్యపి
పలద్వయం తు ప్రసృతం తద్ద్వయం కుడవోంజలిః
కుడవౌ మానికా తౌ స్యాత్ ప్రస్థో ద్వేమానికే స్మృతః
ప్రస్థద్వయం శుభం తౌ ద్వా పాత్రికద్వయ మాఢకం
తైశ్చతుర్భి ర్ఘటోన్మాన నల్వణార్మణకుంభకాః
ద్రోణస్య శబ్దాః పర్యాయాః పలానాం శతకం తులా
చత్వారింశ త్పలశతం తులాభారః ప్రకీర్తితః

రసార్ణవాది శాస్త్రాణి నిరీక్ష్య కథితం మయా
రసోపయోగి యత్కించి ద్దిఙ్మాత్రం తత్ప్రదర్శితం॥

తా. ఆరు అణువులు ఒకత్రుటి. ఆరుత్రుటులు ఒకలిక్ష. ఆరులిక్ష లొకయూకము. ఆరుయూకము లొకరజస్సు. ఆరురజస్సు లొకసర్షపము. ఆరుసర్షపము లొకయవ. ఆరుయవ లొకగుంజ. రెండుగుంజ లొకనిష్పావము. మూడుగుంజ లొకవల్లము. రెండువల్లము లొకమాషము. రెండుమాషము లొకధరణము. రెండుధరణము లొకశాణము. దీనికి నిష్కమనియు, కళయనియు, నామాంతరములు. రెండునిష్కము లొకవటకము. దీనికి కోలమనిపేరు. రెండుకోలము లొకతోల. దీనికి కర్షమనిపేరు. (అనగా నాలుగునిష్కము లొకకర్షమనుట) ఉదుంబరము, పాణితలము, సువర్ణము, కబళగ్రహము, అక్షము, బిడాలపదకము శుక్తి, యనునవి కర్షమునకు పర్యాయనామములు. రెండు శుక్తు లొకపలము. కొందరు మూడుశుక్తు లొకపలమందురు. దీనికి ముష్టిప్రకుంచము, బిల్వము అని పర్యాయనామములు. రెండుపలము లొకప్రసృతి. రెండుప్రసృతు లొకకుడవము. దీనికంజలి యనిపేరు. రెండుకుడవము లొకమానిక, రెండుమానిక లొకప్రస్థము, రెండుప్రస్థము లొకశుభము, దీనికి పాత్రమనిపేరు. రెండుపాత్రము లొకఆఢకము. నాలుగు ఆఢకము లొకఘటము, దీనికి ఉన్మానము, నల్వణము. అర్మణము, కుంభకము, ద్రోణము అని పర్యాయనామములు, నూరుపలము లొకతుల, నాలుగువేలపలము లొకతులాభారము. రసార్ణవాది గ్రంథములను పరిశీలించి రసశాస్త్రమున కుపయోగించునట్టి మానపరిభాషలను మాత్రము సంగ్రహముగ నిరూపించితిమి.

(ఈ గ్రంథమునందు అత్యావశ్యకముగ దెలియదగిన మరికొన్ని పరిభాషలనుగూడ నీక్రింద నుదహరించుచున్నాము.)

## —♦ పాతవిగ గ్రహింపదగిన వస్తువులు ♦—

మూ. నవాన్యేవహి యోజ్యాని ద్రవ్యాణ్యఖిలకర్మసు
వినావిడంగ కృష్ణాభ్యాం గుడధాన్యాజ్య మాక్షికైః॥

తా. సమస్తౌషధములను నూతనవస్తువులనే చేర్చవలెను, వాయువిడంగములు పిప్పళ్ళు, బెల్లము, ధనియాలు, నెయ్యి, తేనె యివిమాత్రము ప్రాతవియగునేని ఉత్తమములుగ నుండును.

## —♦ పచ్చివిగనే గ్రహింపదగిన వస్తువులు ♦—

మూ. వాసాకుటజకూశ్మాండ శతావర్యమృతాలతా
కురంటైరండలశున ఖర్జూర బిసకత్రిణాః



పంచమూలం లఘుమహ త్తృణాఖ్యం మాంసమార్ద్రకం
శారిబాంబు ఘనోశీరకమలం కంద మౌషధం
నిత్యార్ద్రమేవ యోజ్యం స్యాత్ తథా శుష్కం సవీర్యదం॥

తా. అడ్డసరము, కొడిశపాల, గుమ్మడికాయ, పిల్లిపీచర, తిప్పతీగ, గోరింట, ఆముదము, ఉల్లిగడ్డ, ఖర్జూరపుపండు, తామరకాడలు, కామంచికసవు, లఘుపంచమూలములు (ముయ్యాకుపొన్న, కోలపొన్న, వాకుడు, పెద్దములక, పల్లేరు) మహాపంచమూలములు (మారేడు, దుండిగము, గుమ్మడి, కలిగొట్టు, తక్కిలి) తృణపంచమూలములు (కుశదర్భ, రెల్లుదర్భ, కాకివెదురు, దర్భ, చెరకు) మాంసము, అల్లము, సుగంధపాల, కురువేరు, తుంగగడ్డలు, వట్టివేళ్ళు, తామరగడ్డ వీనినన్నిటిని పచ్చివిగనున్నపుడే ఔషధములందు జేర్చవలెనుగాని యెండినచో నిర్వీర్యములై పనికిరావు. మరియు,

"గుడూచీ కుటజో వాసా కూశ్మాండశ్చ శతావరీ
అశ్వగంధా సహచరా శతపుష్పా ప్రసారిణీ
ప్రయోక్తవ్యా స్సదైవార్ద్రా ద్విగుణా నైవకారయేత్॥"

తిప్పతీగ, కొడిశపాల, అడ్డసరము, గుమ్మడుకాయ, పిల్లిపీచర, పెన్నేరుగడ్డములు గోరింట, సదాప, గొంతెమగోరు వీనిని పచ్చివిగనున్నపుడే యౌషధములం జేర్పవలెను. పైజెప్పిన పరిభాష ననుసరించి పచ్చివియైనను వీనినిమాత్రము ద్విగుణముగ జేర్పదగదు.

## —♦ పైపట్టుతీసియు - తీయకయు నుపయోగింపబడునవి ♦—

మూ. నిస్త్వక్కుంత్య మృతాభీరు లశుచం బిల్వపంచకం
శతావరీ హరిద్రాచ నిస్త్వచోహి ప్రశస్యతే
ముద్గాద్యా స్సత్వచోయాషే భక్ష్యాదౌ నిస్త్వచోహితాః
కుంకుణీ వేల్లతువర సర్షపాద్యాస్తు నిస్తుషాః॥

తా. శుంఠి, తిప్పతీగ, మహాపంచమూలములు, పిల్లిపీచర, పసుపు వీనిని పైతోలు తీసి యుపయోగించవలెను. పెసలు మున్నగువానిని కట్టుచేయునెడల పొట్టుతో గూడ జేర్చునది. భక్ష్యాదులందు పైపొట్టుతీసి యుపయోగించునది. నేపాలపుగింజలు, వాయువిడంగములు, నీరుడుగింజలు, ఆవాలు మొదలగు వానిని పొట్టుతీసి యుపయోగించవలెను,

### ఔషధవీర్యహీనకాలము

మూ. గుణహీనం భవేద్వర్షాత్ ఊర్ధ్వం తద్రూపమౌషధం
మాసద్వయాత్తథా చూర్ణం హీనవీర్యత్వమాప్నుయాత్
హీనత్వం ఘుటికాలేహ లభేతే వత్సరాత్పరం
హీనాస్స్యుర్ఘృత తైలాద్యాః చతుర్మాసాధికా స్తథా
ఓషధ్యోలఘుపాకాస్స్యుః నిర్వీర్యా వత్సరాత్పరం
పురాణాస్స్యుర్గుణై ర్యుక్తా ఆసవాధాతవో రసాః॥

తా. ఓషధులను తెచ్చినవి తెచ్చినటులనే యుంచిన సంవత్సరమువరకు గుణవంతములుగ నుండును. పిదప నిర్వీర్యములగును. చూర్ణములు రెండుమాసములును, గుటికలు, లేహ్యములు ఇవి సంవత్సరమును, ఘృతతైలములు నాల్గుమాసములును, నిల్వయుండును. ఆసవములు, భస్మములు, రసాయనములు ప్రాతవియగుకొలది గుణవంతములగును.

"న్యగ్రోధాదేస్త్వచో గ్రాహ్యాః సారం స్యాద్బీజకాదితః
తాళీసాదేశ్చపత్రాణి ఫలంస్యా త్రిఫలాదితః
ధాతక్యాదేశ్చపుష్పాణి స్నుహ్యాదేః క్షీర మాహరేత్॥"

మర్రి మున్నగువానినుండి పట్టను, చంద్రమున్నగువానినుండి చేవను, తాళీసాదుల నుండి ఆకులను, త్రిఫలములు మున్నగువానినుండి పండును, ఆరె, మోదుగు మున్నగువానినుండి పూవును, జిల్లేడు, జెముడు మున్నగువానినుండి పాలను గ్రహించవలెను.

### స్వరసకల్పన

మూ. అహతా త్తత్క్షణాకృష్టాద్ద్రవ్యాత్ క్షుణ్ణాత్ సముద్ధరేత్
వస్త్రనిష్పీడితోయ స్సరస స్వరస ఉచ్యతే
కుడవం చూర్ణితం ద్రవ్యం క్షిప్తంచ ద్విగుణే జలే
అహోరాత్రస్థితం తస్మాత్ భవేద్వారస ఉత్తమః
ఆదాయ శుష్కద్రవ్యంవా స్వరసానామసంభవే
జలేష్టగుణితే సాధ్యం పాదశిష్టంచ గృహ్యతే॥

తా. ఓషధిద్రవ్యమును పచ్చిగనుండునపుడే పురుగులు మున్నగునవి లేకుండ విదళించి మెత్తగా దంచి గుడ్డలోవేసి పిండినచో క్రిందస్రవించు రసమునకు స్వరసమని



పేరు. మరియు యెండిన యౌషధిచూర్ణమును ఒకకుడవప్రమాణము గ్రహించి అందు రెండురెట్లు ఉదకముపోసి యెనిమిదిజాములు నిల్వయుంచి పిదప ఆయుదకమును వడిపియగట్టవలెను. ఇదియు మతాంతరమున స్వరసమగును. మరియు పచ్చిగనుండు యౌషధిద్రవ్యము దొరకనపుడుగాని (స్వరసమురాని వావిలి మొదలగువానినుండి రసము దీయవలసినపుడుగాని) ద్రవ్యమున కెనిమిదిరెట్లు నీరుపోసి నాల్గవవంతు మిగులునట్లు కాచి వడియగట్టిన నదియు స్వరసమనబడునని మరియొక మతము.

### భావనావిధి

మూ. ద్రవేణ యావతా సమ్యక్ చూర్ణం సర్వం ప్లుతం భవేత్
భావనాయాః ప్రమాణంతు చూర్ణే ప్రోక్తం భిషగ్వరైః
భావ్య ద్రవ్యసమం క్వాథ్యం క్వాథ్యాదష్టగుణం జలం
అష్టాంశశేషితః క్వాథో భావ్యానాం తేనభావనా
దివాదివాతపే శుష్కం రాత్రౌ రాత్రౌ నివాసయేత్
శుష్కం చూర్ణీకృతం ద్రవ్యం సప్తాహం భావనావిధిః॥

తా॥ ద్రవపదార్థము నెంతమాత్రముచేర్చిన చూర్ణమంతయు తడియునో అంతపరిమితిగల ద్రవపదార్థమును భావనచేయదగిన చూర్ణాదులందు జేర్చవలెను. చూర్ణాదులను కషాయములచే భావనచేయునపుడు భావనచేయవలసిన ద్రవ్యమునకు సమభాగముగ కషాయద్రవ్యమునుచేర్చి దానికి యెనిదిమిరెట్లు ఉదకముజేర్చి యెనిమిదవవంతు మిగులునట్లు కషాయముకాచి దానిచే భావనచేయవలయును. రాత్రులందు కషాయాది ద్రవ్యములలో నూరబెట్టి పగళ్ళయందు యెండ నెండించి చూర్ణముచేయవలెను. ఇట్లు యేడుదినములు చేసిన ఔషధయోగ్యమగును.

### తండులోదకవిధి

మూ. తండులం కణశః కృత్వా పలం గ్రాహ్యం హి తండులాత్
చతుర్గుణం జలం దేయం తండులోదక కర్మణి॥
శీతకషాయమానేన తండులోదక కల్పనా॥

తా॥ బియ్యమును పలుకులుగా నుండులాగున చూర్ణించి అందొక పలప్రమాణము గ్రహించి అందు నాల్గురెట్లు నీరుపోసి శీతకషాయమునుబోలె నొకరాత్రి నిల్వయుంచిన నయ్యది తండులోదక మనబడును.

శీతకషాయకల్పః:—"క్షుణ్ణం ద్రవ్యపలం సమ్యక్ షడ్భి ర్నీరపలైః ప్లుతం
నిశోషితం హిమ స్స స్యాత్తథా శీతకషాయకః॥"

పలప్రమాణ ద్రవ్యమున ఆరుపలములనీరు చేర్చి ఒకరాత్రియంతయు మూసియుంచిన నది శీతకషాయమనియు హిమమనియు జెప్పబడును.

—♦ ఆరనాళవిధి ♦—

మూ. ఆరనాళం తు గోధూమైః ఆమై స్స్యా న్నిస్తుషీకృతైః
పక్వై ర్వాసంహితై స్తత్తు సౌవీరసదృశం గుణైః॥

తా॥ పచ్చిగోధుమలను పైపొట్టుతీసి నీరుబోసి యుడికించి నియమితకాలమువరకు కుండలోనుంచిన నయ్యది ఆరనాళమనబడును. ఇది సౌవీరముతో సమానగుణములుకలది.

—♦ ధాన్యామ్లము ♦—

మూ. ప్రస్థం షష్టిక ధాన్యస్య నీరప్రస్థద్వయే క్షిపేత్
ఆధారభాండం సంరుధ్య భూమేర్గర్భే నిధాపయేత్
పక్షా దథ సముద్ధృత్య వస్త్రపూతంచ కారయేత్॥
తతో జాతరసం యోజ్యం ధాన్యామ్లం సర్వకర్మసు
ధాన్యామ్లం శాలిచూర్ణాచ్చ కోద్రవాదికృతం భవేత్॥

తా॥ ఒకప్రస్థప్రమాణమగు అరువదినాళ్ళ సంబావుబియ్యమును రెండుప్రస్థముల నీళ్లలోబోసి ఒకపాత్రలోనుంచి ఆపాత్రకు మూతవేసి చీరజేసి భూమిలో పదునైదు దినములు పాతియుంచి పిదప బైటకుదీసి వడియగట్టిన నది ధాన్యామ్ల మనబడును. మరియు నీధాన్యామ్లము రాజనాలపిండిచేగాని, ఆరికబియ్యము మొదలగువానిచేగాని జేయవచ్చును. దీనిని సర్వౌషధములందు నుపయోగింపవలెను.

ఆనందకందము:—ధాన్యామ్లవిధి.

"యవ గోధూమ కలమ మాష ముద్గ చణాదిభిః
శ్యామాక కోద్రవాద్యై శ్చ నానాధాన్యైశ్చ నిస్తుషైః॥
ధాన్యా చ్చతుర్గుణం తోయం మృద్ఘటే నిక్షిపే త్ప్రియే।
ప్రాప్నోతి యావ దామ్లత్వం తావ ద్యత్నేన రక్షయేత్॥
తన్మధ్యే హంసపాదీంశ్చ మీనాక్షీం చ పునర్నవాం



ద్విచిత్రకం భృంగరాజం విష్ణుక్రాంతాం శతావరీం।
సర్పాక్షీం గిరికర్ణీం చ ముండీం చ సహదేవికాం॥
త్రిఫలాం ఖండశః కృత్వా సర్వా నేతాన్ వినిక్షిపేత్
ధాన్యస్య తు చతుర్థాంశం ధాన్యామ్ల మిద ముత్తమం।
స్వేదనాదిషు కార్యేషు పారదస్య విశిష్యతే॥"

యవలు, గోధుమలు, కలమ (వరి) ధాన్యములు, మినుములు, పెసలు, సెనగలు, చామలు, ఆళ్లు మొదలగు నానావిధధాన్యముల పైపొట్టు పోవునట్లు దంచి మన ముపయోగించు ధాన్యపరిమితికి నాలుగురెట్లు ఉదకముచేర్చి జలమునకు నాల్గవభాగము హంసపాది, పొన్నగంటి, గలిజేరు, రెండువిధములగు (యెరుపు, తెలుపుపూలుగల) చిత్రమూలము, గుంటగలగర, విష్ణుక్రాంత, పిల్లితేగలు, సర్పాక్షి, నల్లదింటెన, బోడతరము, సహదేవి, త్రిఫలములు వీనిని ముక్కలుగా నరికి దంచి పైధాన్యాదులును ఈముక్కలును భాండమునందుంచి పైనమూసి చీరజేసి పులియునంతవరకు భాండమును జాగ్రత్తబెట్టి పులిసినతరువాత తీయవలెను. అది ధాన్యామ్లమనబడును. స్వేదనాది రససంస్కారములం దిది మిగుల నుపయుక్తము.

—♦ కాంజికవిధి ♦—

మూ. తులామితం షష్టికతండులం చ ప్రగృహ్య చాన్నం విధివద్విధాయ ద్రోణేంభసి క్షిప్త మథత్రియామా స్తత్సప్తరక్షేత్పిహితం ప్రయత్నాత్ తత స్తు కల్కం సకలం నిరస్య త్తత్కాంజికం కథ్యత ఆరనాళం॥

తా. నూరుపలములు అరువదినాళ్ల సంబావుబియ్యమును అన్నముగావండి ఆ యన్నమును ద్రోణప్రమాణజలమందు వేసి కుండలోబోసి మూసి చీరజేసి యేడుదినములవరకునుంచి పిదప తీసి వడియగట్టిన నది కాంజికమనబడును. దీనికి ఆరనాళమనియు పేరు.

ప్రకారాంతరము:—

"ఆశుధాన్యం క్షోదితంచ బాలమూలంతు ఖండశః।
కృతం ప్రస్థమితం పాత్రే జలం తత్రాఢకం క్షిపేత్॥
తావ త్సంధీయ సంరక్షేత్ యావ దమ్లత్వ మాగతం।
కాంజికం తత్తు విజ్ఞేయం ఏత త్సర్వత్ర పూజితం॥

ఎర్రవరిధాన్యమును పిండిచేసి అందు లేతముల్లంగిముక్కలను ఒక ప్రస్థముజేర్చి ఆఢకప్రమాణోదకము కలిపి అన్నిటిని ఒకకుండలోబోసి చీరజేసి పులియునంతవరకు నుంచిన కాంజికమనబడును. ఇది అన్నిటికి మిగుల ప్రశస్తమైనది.

## మృద్భాండదృఢీకరణము

కం॥ సీసపు రేకులు ముందుగ
భాసురసంగతుల నూరుపలముల నిగుఱ్ఱ
వాసిగను గూర్చిగాచుట
చే సాంద్రిత గూన బలముజెంది దృఢంబౌ॥

## అష్టాదశసంస్కారము

మూ. స్యాత్స్వేదనం తదనుమర్దనమూర్ఛనంచ ఉత్థాపనం పతనరోధ నియామనాని,
సందీపనంగగనభక్షణమానమత్ర సంచారణా తదను గర్భగతా ద్రుతిశ్చ,
బాహ్యద్రుతి స్సూతకజారణా స్యా ద్గ్రాసస్తథాసారణకర్మ పశ్చాత్,
సంక్రామణం వేధవిధి శ్శరీరే యోగస్తథాష్టాదశధాత్రికర్మ॥

తా. స్వేదనము, మర్దనము, మూర్ఛనము, ఉత్థాపనము, పాతనము, రోధనము, నియమనము, దీపనము, అభ్రకభక్షణమానము, చారణము, గర్భద్రుతి, బాహ్యద్రుతి, జారణము,గ్రాసము, సారణము, క్రామణము, వేధనము, శరీరయోగము అనునివి పదునెనిమిది సంస్కారములు రసమునకు జెప్పబడినవి. శివతత్వరత్నాకరమున అభ్రకభక్షణమానమగు సంస్కారమునువిడచి "అనుసారణము"ను శరీరయోగమునువిడిచి "దేహవేధము" జెప్పబడినది.

## పారదదోషములు

మూ. సంయోజ్యో మర్మణిచ్ఛిన్నే నచ క్షారాగ్ని దగ్ధయోః
శుద్ధస్సమృద్వగ్నిసహో మూర్ఛితో వ్యాధినాశనః
నిష్కంపవేగ స్తీవ్రాగ్నౌ ఆయురారోగ్యదో మృతః
విషం వహ్నిర్మలశ్చేతి దోషా నైసర్గికాస్త్రయః
రసే మరణసంతాప మూర్ఛానాం హేతవః క్రమాత్
యౌగికౌ నాగవంగౌ ద్వౌ తౌ జాడ్యాధ్మాన కుష్ఠదౌ
ఔపాధికాః పునశ్చాన్యే కీర్తితా స్సప్తకంచుకాః



భూమిజా గిరిజా వార్జా ద్వేచ ద్వే నాగవంగజే
ద్వాదశైతే రసేదోషాః ప్రోక్తా రసవిశారదైః
భూమిజాః కుర్వతే కుష్ఠం గిరిజా జాడ్యమేవచ
వారిజా వాతసంఘాతం దోషాఢ్యం నాగవంగయోః
పర్పటీ పాటనీ భేదీ ద్రావీ మలకరీ తథా
అంధకారీ తథా ధ్వాంక్షీ విజ్ఞేయా స్సప్తకంచుకాః
తస్మాత్సూతవిధానార్థం సహాయైర్నిపుణైర్యుతః
సర్వోపస్కారమాదాయ రసకర్మ సమారభేత్
ద్వే సహస్రే పలానాంతు సహస్రం శతమేవవా
అష్టావింశత్పలాన్యేవ దశపంచైక మేవవా
పలార్థైనైవ కర్తవ్య స్సంస్కారస్సూతకస్యచ
సుదినే శుభనక్షత్రే రసశోధన మాచరేత్॥

తా. మర్మస్థానమందలి నరుకునందును, క్షారము, అగ్ని వీనిచే దహింపబడిన చోటను రసమును ప్రయోగించకూడదు. క్రమముగ శుద్ధిచేయబడి మృదువై యగ్నిని సహించునదిగ నున్నరసమునకు మూర్ఛనసంస్కారముజేసి సేవించినచో వ్యాధులను నశింపచేయును. కంపము, వేగములేకుండ సంస్కరించి మృతముగావింపబడిన రసమును సేవించినచో నాయురారోగ్యముల నిచ్చును.

రసమునందు విషము, అగ్ని,మలము అను దోషములు నైసర్గికముగ నుండును, అందు విషదోషమున మరణమును, అగ్నిదోషమువలన సంతాపమును, మలదోషమువలన మూర్ఛయును కలుగును. మరియు నాగదోషము వంగదోషము అను యౌగికదోషములు రెండును జడత్వము, ఆధ్మానము, కుష్ఠము అను రోగములను బుట్టించును.

భూమియందుగల దోషముల వ్యాప్తియు పర్వతములందలి దోషవ్యాప్తియు ఉదకమందలి దోషవ్యాప్తియు తగరము, సీసము అనులోహముల సంపర్కముచే గలుగు నాలుగుదోషములును కలసి యేడును రసమునందుండును. వీనికి సప్తకంచుక దోషములని పేరు. పైజెప్పిన నైసర్గికదోషములు మూడును, యౌగికదోషములు రెండును, కంచుకదోషములు యేడును కలిసి రసమందు మొత్తముమీద పండ్రెండు దోషములని యెరుంగవలెను.

"మృచ్ఛైలజల ఖల్వాద్రయో నాగవంగసముద్భవాః । పారదే కంచుకా స్సప్త తత స్తైశ్చ విషోపమః" అనగా మృత్తు, పర్వతము, జలము, రాగి, ఇనుము, నాగము, వంగము అనువాని సంపర్కముచే గల్గిన దోషములు సప్తకంచుకములని రసప్రకాశ సుధాకరమునందు యుక్తియుక్తముగ వ్రాయబడియెను.

భూతగతదోషము కుష్ఠువును, పర్వతదోషము జాడ్యమును, జలదోషము వాత రోగములను, నాగవంగదోషములు వివిధవికారములను గలిగించును గాన తద్దోషములు నివర్తించుటకై స్వేదనాదిసంస్కారముల నావశ్యకముగ జేయవలెను.

పర్పటి, పాటని, భేది, ద్రావి, మలకరి, అంధకారి, ధ్వాంక్షి అని కంచుకదోష ములకు వేరునామములు కల్పింపబడినవి.

"ఉండినంచాపి కౌటిల్యం అనవర్తంచ సంకరం
షండత్వం పంగుకారిత్వ మలసత్త్వంచగౌరవం
సవిషత్వంచ సూతస్య చాష్టదోషాః ప్రకీర్తితాః॥"

ఉండినము, కౌటిల్యము, అనవర్తము, సంకరము, షండత్వము పంగుత్వము, అల సత్వము, గురుత్వము అను నీయెనిమిదిదోషములను రసమందుండి రసమును విషసహిత ముగ జేయుచున్నవని సాధారణరసతంత్రములందు లేని విశేషము వైద్యచింతామణి యందు వ్రాయబడినది. మరియు,

రసేంద్రభాస్కరమున:—

"నాగో వంగోఽసహ్యతాధో మలంచశోచ్యః కేశే చంచలత్వంవిషంచ
ఏతేదోషాస్సప్తమోయంగిరిశ్చవైద్యైస్సమ్యగ్వర్జనీయాఃప్రయత్నాత్॥"

నాగము,వంగము, అసహ్యత, మలము,చాంచల్యము, విషము, గిరిజము అనియేడు దోషములను "పర్పటీ పాటలీ భేదీ ద్రావీ మలకరీ తథా। అంధకారీ తథాధ్వాంక్షీ విజ్ఞేయాస్సప్తకంచుకాః" అని యేడుకంచుకదోషములును నిరూపించబడెను.

శివతత్త్వరత్నాకరమున:—

"పార్థివశ్చ తథైవాప్యః ఆగ్నేయశ్చానిలస్తథా
నాభసో గజచర్మాఖ్యః సారంగో రక్తబిందుకః
అసహ్యాగ్నిశ్చ మండూకో మలానైసర్గికాస్మృతాః॥"

అని పదినైసర్గికదోషములును, "కాళికామలినీచైవ కపోతీ రక్తికాతథా। అలోమీ గిరిజాచైవ పింగలీ సప్తకంచుకాః" అని యేడు కంచుకదోషములును, "విషం



నాగశ్చవంగశ్చ యౌగికాస్త్రయస్మృతాః" అని మూడు యౌగికదోషములును వివ రింపబడినవి. మొత్తము దీనియందు యిరువదిదోషము లగపరుపబడినవి.

పైజెప్పిన దోషములను నశింపజేయుటకై రససంస్కారములం జేయబూను వైద్యుడు కుశలురైన మనుష్యులను సమస్తసాధనములను సిద్ధపరుచుకొని ప్రారంభించ వలెను.

ఇట్లు సంస్కారములం జేయుటకై రసము రెండువేలపలములైనను లేక వేయి లేక నూరుపలములైనను లేక యిరువదియెనిమిది పలములైనను పదిపలములైనను, లేక అయిదుపలములైనను, తుదకు ఒకపలమైనను అర్థపలమైనను పరిమాణమును గలిగియుండ వలెను. అంతకుతక్కువ యుండగూడదని భావము.

రససంకేతకలిక:—

"పలాదారభ్య పంచాశత్పలం యావచ్చ పారదః
తత ఊనోధికోవాపి నసంస్కార్యో రసో బుధైః॥"

(పలముమొదలు ఏబదిపలములవరకు మాత్రమే సంస్కారార్థమై గ్రహింపబడు రసముయొక్క పరిమాణముండవలెను. అంతకెక్కువగాని తక్కువగాని యుండగూడదు. రసము యెంతతక్కువగనున్నను హెచ్చుగనుండినను సంస్కారములకై వినియోగింపదగిన ద్రవ్యప్రయాసములు సమానములే యగుటచేత రసప్రమాణము పలముకన్న తక్కువ కూడదనియు, ఏబదిపలములకన్న నెక్కువగ గ్రహించునెడల సంస్కారముల జేయుట కనువుగ నుండదనియు సంకేతకలికాకారుడు వచించెనని గ్రహించవలెను.)

స్వేదనసంస్కారము:—

"త్ర్యూషణం లవణాసుర్యా చిత్ర కార్ద్రకమూలకం
క్షిప్త్వా సూతో ముహు స్స్వేద్యః కాంజికేన దినత్రయం॥"

శొంఠి, పిప్పలి, మిరియాలు, ఉప్పు, ఆవాలు, చిత్రమూలము, అల్లము, కురువేరు అను వీనిని నూరి ఆముద్దలో రసమునుంచి గుడ్డను మూటగట్టి డోలాయంత్రమున కాం జికముతో మూడుదినములు స్వేదనముచేయవలెను.

"త్రిదినం స్వేదనాశక్తౌ దినమేకం నిరంతరం । స్వేదయేద్రసరాజంతు నాతితీక్ష్ణేన వహ్నినా॥" మూడుదినములు స్వేదనముజేయుట కశక్తుడైనచో నొకదినము మందాగ్నిచే స్వేదనము చేయవచ్చును. (ఆ. ప్ర.)

"ఆయసే మృణ్మయేపాత్రే స్వేద స్తత్ర విధీయతే" అనుతంత్రాంతరవాక్య ముచే యినుపపాత్రలోగాని మట్టిపాత్రలోగాని స్వేదనము చేయవలెనని తెలియు చున్నది.

రసస్వేదనాదుల కుపయుక్తంబగు కాంజికము లేక ధాన్యామ్లము యొక్క నిర్మాణ విధి ఆయుర్వేదప్రకాశమునం దిట్లు చెప్పబడినది.

"నానాధాన్యై ర్యథాప్రాప్తై స్తుషవర్జై ర్జలాన్వితైః
మృద్భాండం పూరితం రక్షే ద్యావదమ్లత్వ మాప్నుయాత్
తన్మధ్యే ఘనవాఃకుష్మాండీ విష్ణుక్రాంతా పునర్నవాః
మీనాక్షీ చైవ సర్పాక్షీ సహదేవీ శతావరీ
త్రిఫలా గిరికర్ణీచ హంసపాదీచ చిత్రకః
సమూలకాండం పిష్ట్వాతు యథాలాభం వినిక్షిపేత్
పూర్వామ్లభాండమధ్యేతు ధాన్యామ్లక మిదంభవేత్
స్వేదనాదిషు సర్వత్ర రసరాజస్య యోజయేత్॥"

ధాన్యవర్గములో దొరికినంతవరకు సంపాదించి వాని పైపొట్టును తీసివైచి యొక భాండములో బోసి నీరుచేర్చి తుంగముస్తలు, మండూకబ్రహ్మి, బోడతరము, విష్ణుక్రాంత, గలిజేరు, పొన్నగంటి, సర్పాక్షి, సహదేవి, పిల్లిపీచర, త్రిఫలములు, నల్లగింటెన, హంసపాది, చిత్రమూలము అనువానిని గూడ దొరికినంతవరకు సమూలముగా గ్రహించి చిన్నముక్కలుగాకోసి యందు చేర్చి మూతమూసి పులియునంతవరకు నిలవయుంచి పిదప వడియగట్టుకొనునది. దీనికే ధాన్యామ్ల మనిపేరు. దీనిని రసస్వేదనాదికర్మములందు యథేష్టముగ వాడుకొనవచ్చును. ఇందు జెప్పబడిన మూలికలలో సగముకంటె నెక్కువగ సంపాదించవలెనని తన గురూపదిష్టవాక్యమును మాధవుడు వ్రాయుచున్నాడు

తంత్రాంతరములందు స్వేదనసంస్కారము లనేకరీతుల జెప్పంబడెను:

"దినం వ్యోషవరావహ్నికన్యా కల్కేషు కాంజికే
రసం చతుర్గుణే వస్త్రేబద్ధ్వా దోలాకృతం పచేత్॥"

(త్రికటుకములు, త్రిఫలములు, చిత్రమూలము, కలబంద వీనికల్కమును నాలుగు మడతలువేసిన వస్త్రమందుంచి దానిలో మధ్య రసమునుపెట్టి మూటగట్టి కాంజికముతో నొకదినము స్వేదనము చేయవలెను. ఇట్లే అనేకరీతులు గలవు. గ్రంథవిస్తరభీతిచే వ్రాయబడవు.)

## — మర్దనసంస్కారము —

మూ. గృహధూమేష్టికాచూర్ణం తథా దధిగుడాన్వితం
లవణాసురిసంయుక్తం క్షిప్త్వా సూతం విమర్దయేత్
షోడశాంశం ప్రతిద్రవ్యం సూతమానాన్ని యోజయేత్
సూతం క్షిప్త్వా సమం తేన దినాని త్రీణి మర్దయేత్



జీర్ణాభ్రకం తథాబీజ జీర్ణసూతం తథైవచ
నైర్మల్యార్థం హి సూతస్య ఖల్వేధృత్వా విమర్దయేత్
గృహ్ణాతి నిర్మలో రోగాన్ గ్రాసే గ్రాసే విమర్దితః
మర్దనాఖ్యంహి తత్కర్మ సూతస్య గుణకృద్భవేత్॥

తా. కరిధూపము, యిటుకపొడి, పెరుగు, బెల్లము, ఉప్పు, ఆవాలు అనువస్తువులను ఒక్కొక్కటిగ రసప్రమాణమునకు పదునారవవంతు చొప్పున జేర్చుచు మూడేసి దినములు మర్దన చేయవలెను. జీర్ణించిన అభ్రకము గల్గినట్టియు, లేక జీర్ణించిన బీజము గల్గినట్టియు రసము నిర్మలత్వము పొందుటకై ఖల్వమందువేసి మర్దించవలెను. ఇట్లు మర్దనసంస్కారము నందిన సూతము ప్రతిగ్రాసమునందును రోగములను హరించ దగిన శక్తిని పొందుచుండును. ఇది మర్దనసంస్కారవిధానము.

కొందరు మర్దనసంస్కారానంతరమున స్వేదనసంస్కారము చెప్పుచున్నారని యు నట్టివిధి అక్రమసంప్రదాయమనియు ఆయుర్వేదప్రకాశకారుడు ఆక్షేపించుచున్నాడు.

రసగారము:—

"ఏకవింశతివారాంశ్చ వాససో గాలయేద్రసం
నాగవంగాదయ స్సర్వే వస్త్రే తిష్ఠంతి ధాతవః
గృహధూమేష్టికాచూర్ణ దధ్యోర్ణా గుడకాంజికైః
మర్దయే ద్దినమేకంతు మలహీనో భవేద్రసః
దినానిసప్త సంపిష్టో వజ్రీక్షీరేణపారదః
స్వర్జికాక్షారయుక్తేన భూమిదోషో వినశ్యతి
టంకణక్షారసంయుక్త మర్కక్షీరేణ యోజయేత్
సప్తాహం మర్దయే త్సూతం అశ్మకంచుకనాశనం
చిత్రకద్రవ సంపిష్టం టంకణేన సమన్వితం
కపాలీవంగ సంభూతా నశ్యతే నాత్రసంశయః
వజ్రకందరసేనైవ నవసారయుతేనచ
వంగదోష సముద్భూతా కాళికా నశ్యతిధ్రువం
టంకణేన కలాంశేన కటుతుంబీరసేనచ
దినాని సప్తసంపిష్టో నాగదోషం విముంచతి
బీజక క్వాథసంపిష్టో రసేన నింబుజేనచ

కపాలీ నాగజా సూతా ద్గచ్ఛత్యేవ నసంశయః
నశ్యతే విషదోషస్తు చిత్రికేణాశ్వగంధయా
స్నుహీత్రిఫలయోః క్వాథా ద్దర్పదోషః ప్రణశ్యతి
మీనాక్ష్యం కోలధత్తూరా ఉన్మత్తవశకారకాః
త్రికటిక్వాథసంఘర్ష స్సూక్ష్మదోష వినాశకః
దుగ్ధద్వయేన సంఘృష్టో వ్యాపీ భవతి నిశ్చితం
కాకమాచీ రసేనైవ నిర్మలత్వ మవాప్నుయాత్
ఔషధస్యౌషధస్యాంతే క్షాళయే త్కాంజికేనతు॥
మర్దనాది సదా కర్మ కర్తవ్యం పండితై ర్ధియా॥"

అని మర్దనసంస్కారమునందు రసమందుండు మలదోష భూదోష వంగకపాలీ వంగకాళికా నాగదోష నాగకపాలీ విషదోష దర్పదోష ఉన్మత్తదోష సూక్ష్మదోష నివృత్తికై ప్రత్యేకప్రత్యేకముగ వస్తుసంమేళనముతో మర్దనమును రసమునకు వ్యాప్తిత్వకరణమును నిర్మలత్వకరణమును అనువిశేషవిధానములు రససారమున జెప్పంబడినవి. మరియు రసమందు కరిధూపము, యిటుకపొడి మున్నగువస్తువులను ప్రత్యేకముగ జేర్చి మర్దించుచు ప్రతివస్తువుయొక్క మర్దనాంతమందును కాంజికముతో రసమును కడుగుచుండవలెనని మరియొకవిశేషము చెప్పబడినది. రసమందుగల దోషములను రసతంత్రికారు లనేకవిధములుగ జెప్పిరి. దోషముల వివరణమందు నామములు, సంఖ్య అనువాని భేదములున్నను తన్నివారణార్థమై చేయుసంస్కారములను మాత్రమే గ్రహించదగియుండుటచే రససారమందలి మర్దనసంస్కార విశేషవిధానము పాఠకసౌకర్యార్థమిచట వ్రాయబడినది. ఇట్లే మరికొన్ని మతాంతరములునుగలవు.

## —♦ మూర్ఛనసంస్కారము ♦—

మూ. గృహకన్యామలం హన్యాత్ త్రిఫలా వహ్నినాశనీ
చిత్రమూలం విషం హంతి తస్మాదేభిః ప్రయత్నతః
మిశ్రితం సూతకం ద్రవ్యైః సప్తవారాణి మూర్ఛయేత్
ఇత్థం సంమూర్ఛిత స్సూతో దోషశూన్యః ప్రజాయతే॥

తా. మలము, అగ్ని, విషము అనురసమందుగల నైసర్గికదోషములు హరించుటకై క్రమముగ కలబంద, త్రిఫలములు, చిత్రమూలము అనువస్తువులతో సూతమునుకలిపి నూరవలెను. ఇట్లేడేసిపర్యాయములునూరిన మూర్ఛనసంస్కారమనబడును. ఇట్లుచేసినచో రసమునందలి చాంచల్యముపోయి మూర్ఛనందును.



ఆయుర్వేదప్రకాశము:—"సప్తవారాణి మూర్ఛయే దితి ధాతువాదే న రసేషు" యేడుసారులు మూర్ఛనము జేయవలెనను పాఠము ధాతువాదమునందేగాని రసములందు గాదు.

రసప్రకాశసుధాకరమునందు:—

"స్వర్జికా యావశూకాశ్చ తథాచ పటుపంచకం
అమ్లౌషధాని సర్వాణి సూతేన సహమర్దయేత్
ఖల్వే దినత్రయం తావద్యావ న్నష్టత్వ మాప్నుయాత్
స్వరూపస్య వినాశేన మూర్ఛనం తదిహోచ్యతే॥"

తా. అనగా సర్జక్షారము, యవక్షారము, పంచలవణములు, వీనితో రసమును జేర్చి అమ్లవర్గముతో రసము మృద్దయగువరకుగాని లేక మూడుదినములుగాని మర్దించుట మూర్ఛనసంస్కారమని చెప్పబడినది.

## —♦ ఉత్థాపనసంస్కారము ♦—

మూ అస్మాద్విరేకా త్సంశుద్ధః రసః పాత్య స్తతఃపరం
ఉద్ధృతః కాంజిక క్వాథా త్పూతిదోష నివృత్తయే॥

తా. పైజెప్పిన విధమున మూర్ఛజెందియుండు రసము మరల శక్తివంతమగుటకై ఉత్థాపనము జేసినపిదప వేడికాంజికముతో కడుగవలెను. ఇట్లుచేసిన రసమందలి పూతిదోషము నివర్తించును.

రసరత్నాకరమందు:—నిత్యనాథు డీయుత్థాపన క్లేశమును సహింపక "ప్రక్షాళ్య కాంజికై స్స్నైస్తమాదాయ విమర్దయేత్। ప్రక్షాళ్య కాంజికేనైవ తమాదాయ విమూర్ఛయేత్" అనియామ్లకాంజికముతో కడిగి దానితోడనే మర్దించి మరల దానితోనే కడుగవలెనని వ్రాసియున్నాడు. "జలైస్సోష్ణారనాళైర్వా క్షాళనా దుత్థితో భవేత్। అథవా పాతనాయంత్రే పాతనా దుత్థితో భవేత్"

అని తంత్రాంతరములందును నుడువబడినది. రసప్రకాశ సుధాకరమునందు "డోలాయాం త్రితత స్స్వేద్యః పూర్వవద్దివసత్రయం। సూర్యాతపే మర్దితోసౌ దినమేకం శిలాతలే ఉత్థాపనం భవేత్ ..." అనిపూర్వమువలె మూడుదినములు డోలాయంత్రమున స్వేదనముచేసి యొకదినము ఖల్వమందుంచి యెండలోమర్దించిన యుత్థాపనమగునని ప్రకారాంతమున నుడువంబడినది.

## —♦ పాతనసంస్కారము ♦—

మూ. తామ్రేణ పిష్టికాం కృత్వా పాతయే దూర్ధ్వభాజనే
నాగవంగౌ పరిత్యజ్య శుద్ధో భవతి సూతకః
శుల్బేన పాతయేత్పిష్టం త్రిధోర్ధ్వం సప్తధాప్యథః
త్రిఫలా శిగ్రుశిఖిభి ర్లవణాసురిసంయుతైః
నష్టపిష్టిం రసం కృత్వా లేపయే చ్చోర్ధ్వభాజనం
తతో దీప్తై రధఃపాత ముత్పలైః తత్రికారయేత్
హరిద్రాం కోల శమ్యాక కుమారీ త్రిఫలాగ్నిభిః
తండులీయక వర్షాభూ హింగు సైంధవ మాక్షికైః
పిష్టం రసం సలవణైః సర్పాక్ష్యాదిభి రేవవా
పాతయే దథవా దేవి! వ్రిణఘ్ని యత్నలోచనైః॥
ఇత్థం హ్యధోర్ధ్వపాతేన పాతితోసౌ యదా భవేత్
తదా రసాయనే యోగ్యో భవేద్ద్రివ్యవిశేషతః
అథవా దీపకయంత్రే నిపాతిత స్సర్వదోషనిర్ముక్తః
తిర్యక్ పాతనవిధినా నిపాతిత స్సూతరాజశ్చ
శ్లక్ష్ణీకృత మభ్రదళం రసేంద్రయుక్తం తథారనాళేన
ఖల్వే దత్త్వా మృదితం యావత్త న్నష్టపిష్టతామేతి
కుర్యాత్తిర్యక్పాతనపాతిత సూతం క్రమేణ దృఢవహ్నిం
సంస్వేద్యః పాత్యోసౌ నపతతి యావద్దృఢశ్చాగ్నౌ
తదాసౌ శుద్ధ్యతే సూతః కర్మకారీ భవేద్ధ్రువం
మర్దనై ర్మూర్ఛనైః పాతైః మందశ్శాంతో భవేద్రసః॥

తా. పాదరసముతో రాగినిచేర్చి మర్దించి పిష్టినిచేసి యాపిష్టిని పాతనాయంత్ర సాహాయ్యమున మూడుసార్లు ఊర్ధ్వముగను అధఃపాతనాయంత్రసాహాయ్యమున యేడు మారులు అధఃపాతమును చేసినయెడల రసమందుగల నాగవంగదోషములు నశించి రసము శుద్ధమగును. మరియు త్రిఫలములు, మునగచెక్క, చిత్రమూలము, ఉప్పు, ఆవాలు అనువస్తువులను రసముతో చేర్చి నూరి యానష్టపిష్టిని అధఃపాతనము జేయవలెను. లేక పసుపు, ఊడుగురేగ, కలబంద, త్రిఫలములు, చిత్రమూలము, చిర్రి, తెల్ల గలిజేరు, ఇంగువ, సైంధవలవణము, తేనె, ఉప్పు వీనినిగాని ముందుచెప్పబోవు సర్పా



క్ష్యాది రసమూలికావర్గమునుగాని వెలిగారము, గుగ్గిలము అను వానినిగాని రసముతో జేర్చి నూరి అధఃపాతన ఊర్ధ్వపాతనములం జేసిన రసము దోషరహితమై రసాయనోపయోగమగును. లేక దీపికాయంత్రసహాయమునగాని తిర్యక్పాతనయంత్రసహాయమునగాని పాతనసంస్కారముం జేయబడిన సూతముగూడ రసాయనోపయోగమగును.

ధాన్యాభ్రకమును రసముతో జేర్చి ఆరనాళముతో నూరి యానష్టపిష్టిని తిర్యక్పాతనము జేసి పిదప క్రమముగ దృఢాగ్నిచే స్వేదనము గావించినయెడల ఆసూతము రసాయనాదులం దుత్తమముగ పనిచేయును. ఇట్లు మర్దనము, మూర్ఛనము, పాతనము అను సంస్కారముల నందిన సూతము మందవేగముగలదియై శాంతముగ నుండును.

## —♦ నిరోధన సంస్కారము ♦—

మూ. సృష్ట్యంబుషు నిరోధేన తతో ముఖకరో రసః
స్వేదనాదివశా త్సూతః వీర్యం ప్రాప్నో త్యనుత్తమం॥

తా. స్వేదనమర్దనాదిసంస్కారవశమున మాంద్యముగనుండు రసము మరల వీర్యమును సృష్టిజలమున (శుక్రశోణిత మూత్రములందును) పొందుటకై రసమును పోసియుంచినయెడల రసమునకు ముఖమేర్పడును.

శక్త్యవతారమునందు:—

"గోజావినరనారీణాం మూత్రం శుక్రంచ శోణితం
సృష్టిరేషా సమాఖ్యాతా షండదోష వినాశనీ॥"

అని ఆవు, మేక, గొర్రె, స్త్రీ అనువాని మూత్రము, శోణితము, యెద్దు, మేకపోతు, పొట్టేలు, మనుష్యుడు అనువాని శుక్రము యివి "సృష్టి" అను పేరబరగునని చెప్పబడినది.

రసహృదయతంత్రమందు:—

"మర్దన మూర్ఛనపాతైః కదర్థితో భవతి మందవీర్యత్వాత్
సృష్ట్యంబుజైర్నిరోధా ల్లబ్ధాప్యాయో నషండస్స్యాత్॥"

అని చెప్పబడినందున "సృష్ట్యంబుజై ర్నిరోధేన" అను పాఠము అపపాఠమని తెలియదగియున్నది.

మరియు "అథవా కూపికామధ్యే సూతం సైంధవ సంయుతం। భూగర్తేచ తతఃస్థాప్యం ఏకవింశ ద్దినావధి॥ అయం నిరోధకో నామ్నా మహాముఖకరో రసే॥" అని తంత్రాంతరవాక్యమును బట్టి సూతముతో సైంధవలవణచూర్ణమును చేర్చి ఒక కుప్పె

లో బోసి చీరజేసి ఇరువదియొక్క దినములవరకు భూమిలో పాతియుంచినయెడల మర్దన మూర్ఛన పాతన సంస్కారముల వలన రసమున గలిగినమాంద్యము పోయి ఆప్యాయనమును బొంది సుఖవంతమై యుండునని తెలియబడుచున్నది. ఇది మతాంతరమున రోధనసంస్కారము.

ఆయుర్వేదప్రకాశము. 'విశ్వామిత్రకపాల' కాచకూప్యాలేవామధాపివా। సృష్ట్వాంబుజంవినిక్షిప్య తత్రితన్మజ్జనావధి। పూరయేత్త్రిదినంభూమ్యాం రాజహస్తప్రమాణతః'. (కొబ్బరి పెంకులోగాని గాజుసీసాలోగాని మూత్రిశుక్రి రజస్సులనుపోసి రసమునందు మునుగునట్లుంచి మూరంబాతికలోతున మూడుదినములు పాతిపెట్టవలెను.)

## —♦ నియామనసంస్కారము ♦—

మూ. నియామ్యోసౌ తతస్సమ్య క్చపలత్వనివృత్తయే
కర్కోటీ ఫణినేత్రాభ్యాం వృశ్చికాంబుజ మార్కవైః
సమం కృత్వారనాళేన స్వేదయేచ్చ దినత్రయం
మరిచై ర్భూఖగయుక్తై ర్లవణాసురి శిగ్రుటంకణోపేతైః
కాంజికయుక్తై స్త్రిదినం గ్రాసార్థీ జాయతే స్వేదాత్॥

తా. పై జెప్పబడిన స్వేదనాదిరోధనాంతసంస్కారములవలన రసము వీర్యవంతమై మిగుల చాంచల్యము గలిగియుండును. కాన చాంచల్యనివృత్తికై నియామన సంస్కారము నాచరించవలెను. గొడ్డుకాకరదుంప, సర్పాక్షి, తెల్లగలిజేరు, ఉప్పు, గుంటగలగర అను వస్తువులను రసమునకు సమభాగములుగ జేర్చి నూరి యాపిష్టమును కాంజికముతో మూడు దినములు స్వేదనముచేయవలెను. లేక మిరియాలు, అన్నభేది, ఉప్పు, ఆవాలు, మునగచెక్క, వెలిగారము అనువానిని రసముతో సమముగ జేర్చి నూరి యాపిష్టిని కాంజికముతో మూడుదినములు స్వేదనము చేయవలెను. ఇట్లు చేసినచో రసము గ్రాసగ్రహణశక్తిమంతమగును.

రసహృదయతంత్రమందు:—

"ఇతిలబ్ధవీర్య స్సమ్యక్ చపలోసౌ సన్నియమ్యతే తదను
ఫణిలశునాంబుజ మార్కవకర్కోటి చించికాస్వేదాత్॥"

అని తములపాకులు, వెల్లుల్లి, లవణము, గుంటగలగర, పోతుకాకరదుంప, చింతాకు అను వానితో స్వేదనము చేయుటచే రోధనసంస్కారవశమున రసమునకు గలిగిన చపలత్వము నివర్తించి నియమితమగునని చెప్పబడినది. మరియు,



"కాచకూపీం మృదాఽలిప్య రసో మధ్యే విముచ్యతే
కలాంశం టంకణం దత్త్వా మధ్యే కించిత్ప్రదీయతే
ద్వారముద్రా ప్రకర్తవ్యా వజ్రిమృత్తికయా దృఢా
భూగర్తే కూపికాం స్థాప్య సితయా గర్భపూరణం
కరీషాగ్నిః ప్రకర్తవ్యః ఏకవింశద్దినావధి
అయం నియామకోనామ వహ్నిప్రత్యంతకారకః॥"

అను తంత్రాంతరగతమైన నియామన సంస్కారవిధానము గ్రాహ్యము.

## —♦ దీపనసంస్కారము ♦—

మూ. త్రిక్షార సింధు ఖగ భూశిఖి శిగ్రురాజీ
తీక్ష్ణామ్ల వేతసముఖై ర్లవణోషణాద్యైః
నేపాలతామ్రదళశోషిత మారనాళే
సామ్లాసవామ్ల పుటితం రసదీపనం తత్
స్వేదయే దాసవామ్లేన వీర్యతేజః ప్రవృద్ధయే
యథోపయోగ స్స్వేద్యస్స్యాత్ మూలికానాం రసేషుచ॥

తా. యవక్షారము, సర్జక్షారము, టంకణక్షారము, సైంధవలవణము, కాసీసము పటికి, చిత్రమూలము, మునగవిత్తులు, యెర్రావాలు, తెల్లావాలు, అమ్లవేతసము, లవణములు, మిరియాలు వీనిని రసముతో జేర్చి అమ్లవర్గముతో నూరి నేపాలదేశపు రాగిరేకుపై బెట్టి యెండించి పిదప అమ్లవర్గముతోను ఆరనాళముతోను స్వేదనముచేసిన యెడల రసము అభ్రకాదిజారణమునకు సిద్ధమగును.

ఆసవామ్లముచేగాని ఉపయోగము ననుసరించి అనుకూలముగనుండు ఇతర మూలికల రసములచేగాని, రసమును స్వేదనము చేయవచ్చును.

"స్వేదనం రసరాజస్య క్షారామ్లవిషమద్యకైః
బీజపూరం సమాదాయ వృంతముత్సృజ్య కారయేత్
తస్యమధ్యే క్షిపే త్సూతం కలాంశక్షారసంయుతం
ద్వారం నిరుధ్య యత్నేన వస్త్రమధ్యే నిబంధయేత్
దోలాస్వేదః ప్రకర్తవ్య ఏకవింశ ద్దినావధి
దినే దినే ప్రకర్తవ్యం నూతనం బీజపూరకం
లేపితో నోహి ధాతూంశ్చ పీడ్యమానో బుభుక్షయా
అమునైవ ప్రకర్తవ్యం రసరాజస్య దీపనం

త్ర్యహం సప్తదినం వాథ చతుర్దశైకవింశతిం
సంస్కారస్సూతరాజేతు క్రమాత్క్రమతరం వరం॥”

అను తంత్రాంతరోక్తమైన దీపనసంస్కారవిధాన మావశ్యకముగ తెలియదగి యున్నది.

—♦ రసమూలికావర్గము ♦—

మూ. సర్పాక్షీ క్షీరిణీవంధ్యా మత్స్యాక్షీ శంఖపుష్పికా
కాకజంఘా శిఖిశిఖా బ్రహ్మదండ్యాఖుకర్ణికా
వర్షాభూః కంబుకీ దూర్వా శైర్యకోత్పలశింబికాః
శతావరీ వజ్రిలతా వజ్రకందాగ్నికర్ణికాః
శ్వేతార్క శిగ్రుధత్తూర మృగ దూర్వారసాంకుశాః
రంభారక్తాళు నిర్గుండీ లజ్జాలు స్సురదాళికాం
మండూకపర్ణీ పాతాళ చిత్రకం గ్రీష్మసుందరా
కాకమాచీ మహారాష్ట్రీ హరిద్రా తిలపర్ణికా
జాతీజయంతీ శ్రీదేవీ భూకదంబః కుసుంభకః
కోశాతకీ నీరకణా లాంగలీ కటుతుంబికా
చక్రమర్దో మృతాకందః సూర్యావర్తేషు పుంఖికా
వారాహీ హస్తిశుండీచ ప్రాయేణ రసమూలికాః
రసస్య భావనే స్వేదే మూషాలేపేచ పూజితాః
ఇత్యష్టౌ సూతసంస్కారాః సమాః ద్రవ్యైరసాయనే
కార్యాస్తే ప్రథమం శేషాః నోక్తా ద్రవ్యోపయోగినః॥

తా. సర్పాక్షీ, పాల, గొడ్డుకాకరదుంప, మత్స్యాక్షీ (పొన్నగంటి), శంఖపుష్పి, వెలమసంధి, మయూరశిఖి, బ్రహ్మదండి, యెలుకచెవిచెట్టు, గలిజేరు, పెన్నేరు, గరిక, నల్లములు గోరింట, నల్లకలువ, నల్ల పెసర, పిల్లిపీచర, నల్లేరు, అడవికంద, అగ్నికర్ణిక, తెల్లజిల్లేడు, మునగ, ఉమ్మెత్త, కస్తూరిసవు (గంధతృణము), రసాంకుశ, అరటి, యెర్రచేమదుంప, వావిలి, ముడుగుదామర, దేవదాళి, మండూక బ్రాహ్మి, పాతాళగరుడి, చిత్రమూలము, తుమ్మిచెట్టు, కామంచి, మరాటామొగ్గలు, పసపు, రక్తచందనము, జాజిలత, తక్కిలిచెట్టు, మారేడు, నేలకడిమిచెట్టు, కుసుంబాచెట్టు, చేదుబీర, నీరుపిప్పలి, హస్తిదుంప, చేదుసొర, తంగేడుచెట్టు లేక తగిరిసచెట్టు, సూర్యావర్తము,



ములు వెంపలి లేక పాచితీగ, హస్తి, శుండిచెట్టు అనునీ యోషధులు రసభావనకును, స్వేదనమునకును మూషాలేపనమునకును ఉపయోగించును.

పైజెప్పిన యెనిమిది సంస్కారములును రసాయనోపయోగములుగ నుండుటకై చెప్పబడినవి. తక్కిన పదిసంస్కారములును రసవాదమున కుపయోగించునవి గాన నిందు చెప్పబడలేదు.

ఆయుర్వేదప్రకాశమునందు:—

“దీపితం రసరాజంతు జంబీర రససంయుతం
దినైకం ధారయేద్ఘర్మే మృత్పాత్రేవా శిలోద్భవే॥”

అని పైజెప్పిన యష్టసంస్కారములును గాక తొమ్మిదవదియగు అనువాసన సంస్కారముగూడ చెప్పబడినది. రసమును నిమ్మపండురసములోనుంచి యొకదినము యెండలోనుంచిన నది అనువాసన మనబడును.

రసచింతామణి:—

“సహస్ర నింబూఫల తోయ ఘృష్టో రసోభవే ద్వహ్నిసమప్రభావః
సవ్యోషరాజీ లవణ స్సచిత్ర స్సరామఠో వింశతివాసరాణి॥”

రసముతో మిరియాలు, ఆవాలు, సైంధవలవణము, చిత్రమూలము, యింగువ వీనిని జేర్చి వేయినిమ్మపండ్లరసముతో యిరువదిదినములు మర్దించినయెడల అనువాసన సంస్కారమగును. ఇట్లుచేసినచో రసము అగ్నితో సమమగు ప్రభావము గలదియగును.

రసరత్నాకరము:—శుద్ధసూతపరీక్ష.

“స్వేదనాది నవకర్మసంస్కృతః సప్తకంచుక వివర్జితో భవేత్
అష్టమాంశ అవశిష్యతే తదా శుద్ధసూత ఇతి కథ్యతే బుధైః॥”

స్వేదన, మర్దన, ఉత్థాపన, మూర్ఛన, పాతన, శోధన, నియమన, దీపన, అనువాసన సంస్కారముల తొమ్మిదింటిని పొందిన రసరాజము సప్తకంచుకదోషములను నైసర్గిక యౌగిక దోషములను విడిచి నిర్మలమై మొదట సంస్కారార్థమై గ్రహింపబడిన రసముయొక్క మొత్తమునందు యెనిమిదవవంతు మిగిలిన యెడల అందుండు దోషములు నివర్తించి పరిశుద్ధమైనరసము మిగిలినదని గ్రహించవలెను అని స్వానుభవపూర్వకముగ నిత్యనాథుడు చేసిచూచిన విషయమును వెల్లడించెను.

వాదమంజరి:—సూతశోధనము.

“పారదాద్దశమాంశేన శ్వేతపాషాణమార్జకం
దత్త్వాంభసా సమాయోజ్య నింబమూలేన మర్దయేత్

ఉత్సృజ్య మలినం నీరం అన్యద్దత్వా పునః పునః
శుద్ధం మలవిహీనం తద్రసం యోగేషు యోజయేత్॥"

తా. శుద్ధికొరకై గ్రహింపబడిన రసమునకు పదియవవంతు సవీరమును చూర్ణించి రసమునందు కొంచెము కొంచెముగ వేయుచు మంచితీర్థమునుపోసి వేపవేరుతో మర్దించుచు నల్లనినీరును పారబోయుచు మరలమరల మంచినీటినిపోయుచు మర్దించుచు నల్లనీరం తయుపోయి తెల్లనీరు వెడలువరకుమర్దించి యారసమును భద్రపరచుకొని యోగములందు వాడుకొనునది. ఇట్లు చేయబడినరసమునందలిదోషములు నశించి యించుమించుగ అర్థ భాగము రసమే మిగులునను నాయనుభవమును చదువరులు గ్రహింతురుగాక!

రసహృదయమందు:—స్వేదన, మర్దన, మూర్ఛన, పాతన, శోధన, నియమన దీపనముల నానుపూర్వికఁ జెప్పబడెను.

మూ. పంచవింశతి సంఖ్యాకాన్ రసబంధాన్ ప్రచక్ష్మహే
యేన యేనహి చాంచల్యం దుర్గ్రాహత్వంచ నశ్యతి
రసరాజస్య సంప్రోక్తో బంధనార్థోహి వార్తికైః
హఠారోటా తథాభాసః క్రియాహీనశ్చ పిష్టికా
క్షారః కోటశ్చ పోటశ్చ కల్కబంధశ్చ కజ్జలిః
సజీవశ్చైవ నిర్జీవో నిర్జీవశ్చ సజీవకః
శృంఖలాద్రుతి బంధౌచ బాలకశ్చ కుమారకః
తరుణశ్చ తథావృద్ధో మూర్తిబంధ స్తథాపరః
జలబంధోగ్నిబంధశ్చ సుసంస్కృత కృతాభిధః
మహాబంధాభిధశ్చేతి పంచవింశతి రీరితాః
కేచిద్వదంతి షడ్వింశో జలూకాబంధసంజ్ఞకః
సతావన్నేష్యతే దేహే స్త్రీణాం ద్రావేతి శస్యతే॥

తా. జరామరణరాహిత్యమును, ఆకాశగమనాదిమహత్తరశక్తులను గలిగింప గల యిరువదియైదువిధములగు రసబంధయోగములను చెప్పుచున్నాము. రసబంధము వలన రసమందలి చాంచల్యము, దుర్గ్రాహత్వము (చేతికి దొరకకయుండుట) మొదలగు గుణములు నశించును. (1) హఠబంధము (2) ఆరోటము (3) ఆభాసము (4) క్రియాహీనము (5) పిష్టిక (6) క్షారము (7) కోటము (8) పోటము (9) కల్కము (10) కజ్జలి (11) సజీవము (12) నిర్జీవము (13) నిర్జీవము (14) సజీవము (15) శృంఖల (16) ద్రుతి (17) బాల (18) కుమార (19) తరుణ (20) వృద్ధ (21) మూర్తి (22) జల (23) అగ్ని (24) సుసంస్కృత (25) మహాబంధములు అనునవి యిరువదియైదుబంధముల పేర్లు. దేహారోగ్యాదులకై యుపయోగించు రసాయనాది యోగములకు నిరుపయోగమును, కేవల స్త్రీద్రావణమునకును ఉపయుక్తమగు జలూకా బంధమునుగూడ చేర్చి యిరువదియారు రసబంధములని కొందరందురు.



## —♦ హఠబంధము ♦—

మూ. హఠో రస స్స విజ్ఞేయ స్సమ్యక్శుద్ధివివర్జితః
స సేవితో నృణాం కుర్యా న్మృత్యుం వా వ్యాధిముద్ధతం॥

తా. రసమును చక్కగా సంస్కరించక దోషయుక్తముగ నుండుదానినే బద్ధముజేసిన నది హఠబంధమనబడును. దీనిని సేవించిన రోగములను పుట్టించి చంపును.

## —♦ ఆరోటబంధము ♦—

మూ. సుశోధితో రసస్సమ్యక్ ఆరోట ఇతికథ్యతే
స క్షేత్రీకరణే శ్రేష్ఠః శనై ర్వ్యాధివినాశనః॥

తా. శాస్త్రీయముగ స్వేదన దీపనాంతసంస్కారములను జేసి బంధింపబడిన రసమునకు ఆరోట మనిపేరు. ఆరోటబద్ధరసము క్షేత్రీకరణమందు శ్రేష్ఠము. మరియు దీనిని క్రమముగ సేవించిన సకలరోగములు శమించును.

## —♦ ఆభాసబంధము – క్రియాహీనబంధము ♦—

మూ. పుటితో యో రసో యాతి యోగం ముక్త్వా స్వభావతాం
భావితో ధాతుమూలాద్యై రాభాసో గుణవైకృతే
అసంశోధితలోహాద్యై స్సాధితో యో రసోత్తమః
క్రియం హీనస్సవిజ్ఞేయో వికృియాం యాత్యపథ్యతః॥

తా. పుటమువలన యౌగికములగు నాగవంగదోషములను నైసర్గికములగు విష వహ్ని గరళదోషములను విడిచి స్వచ్ఛమైన రసమును ధాతువులచేతను మూలికలచేతను భావనచేసి బద్ధమైనచో అది ఆభాసబంధ మనబడును.

శోధనముచేయబడని లోహాదులచే రసము బద్ధముచేయబడెనేని యది క్రియాహీనబంధము. ఈరసమును సేవించుచు అపథ్యమును చేసినచో అనేకవికారములను గల్గించును.

—♦ పిష్టికాబంధము ♦—

మూ. తీవ్రాతపే గాఢతరావమర్దాత్ పిష్టీభవేత్సా నవనీతరూపా॥
సరసః పిష్టికాబంధో దీపనః పాచనస్తరాం॥

తా. రసమును ఆయాయోగముల ననుసరించి తీవ్రమైన యెండలో గాఢముగ మర్దనము చేసినచో వెన్నవలె పిష్టమగును. ఇది పిష్టికాబంధ మనబడును. దీనిని సేవించిన దీపనపాచనములు కలుగును.

—♦ క్షారబంధము ♦—

మూ. శంఖశుక్తివరాటాద్యై ర్ద్రవ్యైస్సా సంశోధితో రసః
క్షారబంధః పరం దీప్తి పుష్టికృచ్ఛూలనాశనః॥

తా. శంఖము, ముత్యపుచిప్పలు, పచ్చగవ్వలు మొదలగు వానిచే బద్ధమైన శుద్ధపారదము క్షారబద్ధమనంబడు. దీనిని సేవించిన అగ్నిదీప్తియు పుష్టియు గల్గును. శూలరోగము హరించును.

—♦ ఖోటబంధము ♦—

మూ. బంధో యః ఖోటతాం యాతి ధ్మాతో ధ్మాతః క్షయం వ్రజేత్
ఖోటబంధ స్స విజ్ఞేయ శ్శీఘ్రం సర్వగదాపహః॥

తా. ఏ బంధవిశేషమువలన రసము ఖోటత్వమునుపొంది కొలిమిలోనుంచి యూదినకొలది క్షయమగునో అది ఖోటబంధ మనబడును. ఖోటబద్ధరసము సర్వరోగహరము.

—♦ పోటబంధము ♦—

మూ. ధృతకజ్జలికా మోచా పత్రికే చిపిటీకృతా
సపోటః పర్పటీ సైవ బాలాద్యఖిలరోగనుత్॥

తా. రసము నొకపాత్రయందుంచి పైన బూరుగుకొయ్యతో చేసిన పాత్రను బోర్లించి రసముగలపాత్రను పొయ్యిమీదనుంచి మంటబెట్టినయెడల రసము పొగరూపమునుబొంది బూరుగుపాత్రకు పట్టును. మృదువైన యాకజ్జలమును గ్రహించి బాలరోగాదులందు వాడునది. ఇది పోటబద్ధరసము.

—♦ కల్కబంధము ♦—

మూ. స్వేదాద్యై స్సాధితస్సూతః పంకత్వం సముపాగతః
కల్కబంధ స్స విజ్ఞేయో యోగోక్త ఫలదాయకః॥



తా. స్వేదాది సంస్కారణములచే సాధింపబడిన సూతముతో నాయా యోగోక్తవస్తువులను చేర్చి పంకము (బురద)వలె నుండునట్లు చేయబడిన నది కల్కబంధమన బడును. దీనిని సేవించిన నాయా యోగోక్త ఫలముల నిచ్చును.

—♦ కజ్జలీబంధము ♦—

మూ. కజ్జలీరసగంధోత్థా సుశ్లక్ష్ణా కజ్జలోపమా
తత్తద్యోగేన సంయుక్తా కజ్జలీబంధ ఉచ్యతే॥

తా. రసగంధకములను ఖల్వములోనుంచి కాటుకవలె మెత్తగనూరిన నది కజ్జలీబంధ మనబడును.

—♦ సజీవబంధము ♦—

మూ. భస్మీకృతో గచ్ఛతి వహ్నియోగా ద్రసస్సజీవః ఖలు సంప్రదిష్టః
సంసేవితోసౌ నకరోతి భస్మకార్యం జవా ద్రోగవినాశనంచ॥

తా. రసమును భస్మముగావించి నిప్పపైవేసినచో లేచిపోయినయెడల నది సజీవబంధమనబడును. ఈభస్మము రోగమును సంహరింపజాలక నిరర్థకమై యుండును.

—♦ నిర్జీవబంధము ♦—

మూ. జీర్ణాభ్రకో వా పరిజీర్ణగంధో భస్మీకృతశ్చాఖిలలోహమాళిః
నిర్జీవనామాహి సభస్మసూతో నిశ్శేషరోగా న్వినిహంతి సద్యః॥

తా. అభ్రకజీర్ణమైనట్టియు, జీర్ణగంధకమైనట్టియు, భస్మము చేయబడినట్టియు (అనగా జారితాభ్రక, జారితగంధక, మృతసూతము లనుట) సూతము నిర్జీవబద్ధమనబడి లోహములకన్న నుత్తమగుణములు కలదియై నిశ్శేషముగ రోగములను హరించునదిగ నుండును.

—♦ నిర్జీవబంధము ♦—

మూ. రసస్తు పాదాంశ సువర్ణజీర్ణః పిష్టీకృతో గంధకయోగతశ్చ
తుల్యాంశగంధైః పుటితః క్రమేణ నిర్జీవనామా సకలామయఘ్నః॥

తా. రసమునకు నాల్గవవంతు బంగారమును చేర్చి మర్దించి పిదప రసమునకు సమముగ గంధకమును చేర్చి పిష్టిజేసి పుటము వైచిన నదియొకవిధమగు నిర్జీవబంధము. ఇదియును సకలరోగములను హరించును.

—♦ సజీవబంధము ♦—

మూ. పిష్టీకృతై రభ్రకసత్వహేమ తారార్కకాంతైః పరిజారితో యః
హతస్తత ష్షడ్గుణగంధకేన సజీవబద్ధో విపులప్రభావః॥

తా. అభ్రకసత్వము, బంగారు, వెండి, రాగి, కాంతలోహము, వీనిని రసమందు జేర్చి నూరి జారణముగావించి పిదప రసమున కారురెట్లు గంధకము జేర్చి నూరి యా పిష్టిని మారణముజేసిన నది యొకవిధమైన సజీవబంధము. ఇది అమోఘప్రభావము గలది.

—♦ శృంఖలాబంధము ♦—

మూ. వజ్రాదినిహత స్సూతో హతస్సూత స్సమోపరః
శృంఖలాబద్ధసూతస్తు దేహలోహ విధాయకః
చిత్రప్రభావాం వేగేన వ్యాప్తిం జానాతిశంకరః॥

తా. వజ్రాదులచేత మారణముచేయబడినట్టియు, నితరయోగములచే మారణము చేయబడినట్టియు, సూతభస్మములను (రెండువిధములగు యోగములచే వేర్వేరుగా హతముగావింపబడిన సూతభస్మములను రెంటిని) సమభాగములుగ కలిపినచో నది శృంఖలాబంధ మనబడును. చిత్రప్రభావముగల శృంఖలాబద్ధసూతముయొక్క వ్యాప్తిని శంకరు డెరుంగును.

—♦ ద్రుతిబంధము ♦—

మూ. యుక్తోపి బాహ్యద్రుతిభిశ్చ సూతో బద్ధంగతో వాంభసి తత్వ
[రూపః
సరాజికాపాదమితో నిహంతి దుస్సాధ్యరోగాన్ ద్రుతిబద్ధ
[నామా॥

తా. బాహ్యద్రుతులచే బద్ధముచేయబడిన లేక భస్మముచేయబడిన రసము ద్రుతిబద్ధమనబడును. దీనిని ఆవగింజలో నాల్గవవంతు ప్రమాణముగ వాడినచో సకల రోగములు హరించును.

—♦ బాలబంధము ♦—

మూ. సమాభ్ర జీర్ణశ్శివజస్తుబాలః సంసేవితో యోగయుతో జవేన
రసాయనో భావిగదాపహశ్చ సోపద్రవారిష్టగదా న్నిహంతి॥



తా. రసమందు అభ్రకసత్వమును సమభాగముగ జీర్ణింపజేసిన నది బాలబంధ మనబడును. దీనిని రసాయనయోగములందు జేర్చి వాడినచో ఉపద్రవారిష్టసహితము లగు రోగములను నశింపజేయుటయేగాక రోగములను రాకుండ జేయును.

—♦ కుమారబంధము ♦—

మూ. హరోద్భవో యో ద్విగుణాభ్రజీర్ణ స్సస్యాత్కుమారో మిత
తండులోసౌ
త్రిసప్తరాత్రైఃఖలు పాపయోగసంఘాతఘాతీచ రసాయనంచ॥

తా. రసమందు రెండురెట్లు అభ్రకమును జీర్ణింపజేసిన నది కుమారబంధమన బడును. దీనిని యోగములలో జేర్చి సేవించిన పాపములను, పాపరూపరోగములను ఇరువదియొక్క దినములకు సంహరించును.

—♦ తరుణబంధము ♦—

మూ. చతుర్గుణవ్యోమకృతాశనోసౌ రసాయనాగ్ర్యస్తరుణాభిధానః
ససప్తరాత్రాత్సకలామయఘ్నః రసాయనోవీర్యబలప్రదాతా॥

తా. రసమందు నాలుగురెట్లు అభ్రకమును జీర్ణింపజేసినయెడల నది తరుణబంధ మనబడును. దీనిని యేడుదినములు సేవించిన జరామరణములను పోగొట్టి బలమును వీర్యమును గల్గించును.

—♦ వృద్ధబంధము ♦—

మూ. యస్యాభ్రకషడ్గుణితో హి జీర్ణః ప్రాప్తాగ్నిసంఖ్య స్సహిబద్ధ
[నామా
దేహేచ లోహేచ నియోజనీయః శివాదృతే కోస్యగుణా
[న్ప్రవక్తి॥

తా. రసమం దారురెట్లు అభ్రకమును జీర్ణింపజేసిన నది వృద్ధబంధమనబడును. దీనిని మూడుదినములు సేవించినచో దేహమును లోహతుల్యముగ జేయును. మరియు దీనిసుగుణముల నన్నటిని శంకరుడుతప్ప వేరొకడు చెప్పజాలడు.

రసార్ణవము:— జీర్ణాభ్రకరసలక్షణము.

"ధూమశ్చటి చిటిశ్చైవ మండూకప్లుతిరేవచ
సకంపశ్చ వికంపశ్చ పంచావస్థార రసస్యతు॥"

కపిలో౽థ నిరుద్గారి విప్లుషశ్చైవ ముంచతి
అగ్నౌ తిష్ఠతి నిష్కంపో వ్యోమజీర్ణస్య లక్షణం॥"

పొగలేచుట, చిటచిటమని ధ్వనిచేయుట, కప్పవలె దుముకులాడుట, కదలుట, విశేషముగ చలించుట అను పంచావస్థలను విడిచి కపిలవర్ణముగలదై, ఉద్గారరహితమై, చిందకుండునదై, యగ్నియందుంచినచో నిష్కంపముగ నిలిచియుండునేని యా రసము చక్కగా అభ్రకజారణము చేయబడినదని తెలియవలెను.

మరియు,

"అభావే చాభ్రసత్త్వస్య కాంతసత్త్వం ప్రదాపయేత్
కాంతస్య చాప్యభావేతు తీక్ష్ణలోహంతు దాపయేత్॥"

అభ్రకసత్వము లేనపుడు కాంతసత్త్వమును అదియును దొరకకుండిన తీక్ష్ణసత్త్వమును రసమందు జారణము చేయవచ్చునని యభావప్రతినిధులు రసార్ణవమునం జెప్పబడినవి.

రససారము:—జీర్ణాభ్రకరసమునకు హేమవిధ్యుపయోగము.

రససారమునందు జారితాభ్రకరసలక్షణకథనానంతరమున అట్టి రసమును వెండి రేకులకు రాచి పుటమువైచినచో పదివన్నెలుగల బంగారమగునని యిట్లు చెప్పబడినది.

"అభ్రకే ద్విగుణే జీర్ణే ధూమత్వం నైవగచ్ఛతి
జీర్ణే చ చతుర్గుణే గ్రాసే గతిస్తస్య నవిద్యతే
ఉత్ప్లుత్యోత్ప్లుత్య సూతేంద్రో మూషాయాం పతతే ధ్రువం
జీర్ణే చ షడ్గుణే గ్రాసే కంపతే చ ముహుర్ముహుః॥
బాహ్యే చోత్ప్లుత్య నాయాతి స్థితస్థానే స్థిరాయతే
జీర్ణే చాష్టగుణే వ్యోమ్ని ధ్మాతః క్షామ్యతి పారదః
శ్వేతాది బహుధా చ్ఛాయ వ్యోమ్ని జీర్ణే చ దృశ్యతే
నకంపో నగతిస్తస్య ధమనాజ్జీర్యతే రసః
అభ్రకేష్టగుణే వ్యోమ్ని మహాబల మవాప్నుయాత్
లేపేన తారపత్రాణి కరోతి దశవర్ణకం॥"

(రసమందు ద్విగుణాభ్రకసత్త్వమును జీర్ణింపజేసినచో రసము నిప్పుపైనుంచిన పొగ లేవకయుండును. నాల్గురెట్లు జీర్ణింపజేసిన రసము కదలదు. రసమెగిరి మూసలోనె పడునుగాని యెగిరిపోదు. ఆరురెట్లు జీర్ణింపజేసిన మాటిమాటికి రసము కంపించును. కాని మూసలోనుండి బయటకుపోదు. ఎనిమిదిరెట్లు జీర్ణింపజేసిన రసము శాంతినొంది యుండును. అష్టగుణాభ్రకసత్వజారితరసమందు తెలుపు మొదలగు వివిధచ్ఛాయలు కనబడును. కంపము, గతి మొదలగు పంచావస్థలును నశించును. దీనిని వెండి రేకులకు పట్టించి పుటము వేసినచో పదివన్నెల బంగారమగును.)



రసవాదులకును వైద్యులకునుగూడ అత్యావశ్యకముగ తెలియదగిన జారణాక్రమమును ప్రసంగవశముచే నిట నుదహరించెదను.

రసార్ణవము:—

"బీజచూర్ణాని తైలేన భావయిత్వా పునఃపునః
షోడశాంశేన తద్గ్రాస మంగుళ్యా మర్దయే చ్ఛనైః
ఆర్ద్రికాది తతో యోగాత్ దాతవ్యం షోడశాంశతః
భూర్జే దత్వా తతో దేయం దోలాయంత్రే వినిక్షిపేత్
అహోరాత్రేణ తద్బీజం సూతకో గ్రసతి ప్రియే!
తముద్ధృత్య రసం దేవి! ఖల్వే సంమర్దయే త్తతః
తతో యంత్రే వినిక్షిప్య దివారాత్రం బిడాగ్నినా
తప్తం సముద్ధృతం యంత్రాత్ తప్తఖల్వే విమర్దయేత్
మర్దయిత్వాభ్రకే పిండే క్షిప్త్వా తత్రపుటం దదేత్॥
తతో గర్భే పతత్యాశు జారయే త్తత్సుఖేనతు॥"

తా॥ గ్రాసార్థముగ్రహింపబడు బీజమునకు పదహారవభాగము తైలముతో బీజచూర్ణమును చేర్చి చేతివ్రేళ్ళతో మెల్లగామర్దించి దానిని యోగోక్తప్రకారము అల్లము మొదలగు వస్తువులలో షోడశాంశముగ రసముతో జేర్చి భుజపత్రితో చుట్టి డోలాయంత్రమునందు ఒక అహోరాత్రము వండిన నాగ్రాసమును రసము తినును. పిదప దానినితీసి ఖల్వమందు మర్దించి కచ్ఛపాదియంత్రములందు బిడమధ్యమునబెట్టి వండి పిదపతీసి తప్తఖల్వమున మరలమర్దించి అభ్రకపిండమందుంచి పుటమువేసినయెడల బీజము గర్భమందు పడును. దానిని జారణయంత్రసహాయమున సులభముగ రసమందు జారణ చేయవచ్చును.

సిద్ధలక్ష్మీశ్వరతంత్రమునందు:—

"మూలకార్ద్రి వహ్నీనాం క్షారం గోమూత్రగాలితం
వస్త్రపూతో ద్రవో గ్రాహ్యః గంధకం తేనభావయేత్
శతవారం ఖరే ఘర్మే బిడోయం హేమజారణే॥"

తా॥ ముల్లంగి, అల్లము, చిత్రమూలము అను మూడిటిక్షారములను గోమూత్రములో కలిపి వస్త్రగాలితము చేసి యాద్రవ్యము చేత గంధకమును భావన చేసి యెం

డించవలెను. ఇట్లు నూరుసారులు చేసిన నది హేమజారణమం దుపయోగింపజనునని చెప్పబడినది.

## —♦ మూర్తిబంధము ♦—

మూ. యో దివ్యమూలికాభిశ్చ కృతో త్యగ్నిసహో రసః
వినాభ్రజారణా త్సస్స్య న్మూర్తిబంధో మహారసః
యోజిత స్సర్వయోగేషు నిరౌపమ్య ఫలప్రదః॥

తా॥ అభ్రకజారణము లేకుండ దివ్యమూలికలచే రసమును నిప్పులలోనుంచిన నెగిరిపోకుండ నిలిచియుండునట్లు చేసిన నది మూర్తిబంధ మనబడును. దీనికి జారణాది సంస్కారములం జేయనపుడు క్షీణించక యోగములందుజేర్చి వాడినచో నిరుపమాన ఫలదాయకముగ నుండును.

ఉదాహరణము:—(ఆంధ్రరసప్రదీపిక)

సీ॥ "నూతెంబు బద్ధమౌరీతి నీకెరిగింతు నవని శ్వేతాఖ్యంబులైన గుంజ
దింటెన మోదుగ దేవదారిక్షు పునర్నవ జిల్లేడు నిర్గుణ్యముగ
అంకోలకంటకార్కములన పదిగల వీచెట్లపూవుల విత్తులమరి,
కేసరముల పరి జూచి వేర్వేరుగా బొడిచేసి తత్త్వగంబువులచేత
నూరించి మరి యజాక్షీరంబుచే నూరి యామద్ద సూర్యపుటాగ్నిచేత
తైలంబు తులమెత్తు తగదీసి సూతంబు పలమెత్తు మూసలోపలను బెట్టి
తైలంబు క్రిందమీదటనుంచి మానియై శుభముహూర్తమునందు శుద్ధిజేసి

గీ॥ ఒకముహూర్తము అగ్నిలోనునిచి వండ
పారదంబు నమోఘమై బద్ధమగును
వానిమహిమంబు లెన్నగా స్థాణుకైన
నలవిగాకుండు మానికులాగ్రగణ్య॥"

వాదమంజరి:—

"లవణా కాలచంద్రాభ్యాం మర్దనీయోహి పారదః
జాయతే నవనీతాభం కాంజికే స్థాపయేద్దినం
ఘనీభూత్వా చంచలత్వం విముంచతి........"

నల్లసోమింతాకు రసముచేత రసమును బాగుగామర్దించి గుడ్డలోవేసి పలుమారు వడియబోసినయెడల రసమందుగల దోషములనశించి నిర్మలముగనుండును. దానిని మరల నల్లపుప్పిఆకు రసముతో మర్దించినయెడల రసము బద్ధమగును.



## —♦ జలబంధము ♦—

మూ. శిలాతోయముఖై స్తోయైః బద్ధోయం జలబద్ధవత్
సజరారోగ మృత్యుఘ్నః కల్పోక్త ఫలదాయకః॥

తా. శిలోదకము మున్నగువానిచేత బద్ధముగావింపబడిన సూతము జలబద్ధమన బడును. దీనిని సేవించిన జరామరణములను లేకుండజేయును. ఆయా కల్పములందు జెప్పబడిన ఫలముల నిచ్చును.

రసార్ణవము:— శిలోదకకల్పనము.

"గంధకం తాళకంచైవ తోయపూర్ణే ఘటేక్షిపేత్
యదా తద్బుద్బుదాకారం తదా శైలోదకం భవేత్
అథవా వేష్టకం దేవి! తదాగ్రాహ్యం నిరర్థకం॥

(గంధకతాళకములను నీళ్ళతోనింపబడిన ఘటమునందుంచవలెను. కొంతసేపటికి బుడగలువచ్చును. అప్పుడయ్యుదకము శిలోదక మనబడును. అట్లు బుడగల యాకృతిని బొందకుండినచో నాయుదకమునకు వేష్టకమనిపేరు. ఇది నిరర్థకమైనది.

## —♦ అగ్నిబంధము ♦—

మూ. కేవలో యోగయుక్తోవా ధ్మాతస్స్యా ద్వటికాకృతిః
అక్షీణశ్చాగ్నిబద్ధోసౌ ఖేచరత్వాదికృత్సహి॥

తా. అగ్నియందుంచిన నెగిరిపోక క్షీణించక నిలిచియుండునట్లు రసమును ప్రత్యేకముగాగాని యోగములలోజేర్చిగాని కొలిమిలోబెట్టియూది గుటికాకారముగ బద్ధముగావింపబడిన రసము అగ్నిబద్ధమనబడును. ఇది ఖేచరత్వాదిసిద్ధుల నొసగును.

## —♦ సుసంస్కృతబంధము ♦—

మూ. విష్ణుక్రాంతా శశిలతా కుంభీ కనకమూలకైః
విశాలా నాగినీకంద వ్యాఘ్రిపాదీ కురంటకైః
వృశ్చికాళీభశుండీభ్యాం హంసపాద్యా సహోస్థిరైః॥
అప్రసూత గవాంమూత్రైః పిష్టం వాలుకకే పచేత్
పక్వమేవం మృతై ర్లోహై ర్మర్దితం విపచేద్రసం
యంత్రేషు మూర్చ్ఛా సూతానా మేషకల్ప స్సుసంస్కృతః॥

తా. విష్ణుక్రాంత, తిప్పతీగ, కాయఫలపుచెట్టు, ఉమ్మెత్త, కురువేరు, పాపర, నాగనీకందము, పులియడుగుచెట్టు, పచ్చముల్లుగోరింట, తెల్లమణిచెట్టు, హస్తికుండిచెట్టు, హంసపాది, బిడలవణము, ఆవుపెయ్యమూత్రము (ఈననియావునకు పెయ్యయని పేరు) వీనితో రసమును నూరి వాలుకాయంత్రమున పాకముజేసి యారసమును మృత లోహములతో కలిపి మర్దించి ఆయా యోగముల కనుకూలములగు యంత్రములందు పక్వము గావింపవలెను. ఇట్టి ప్రక్రియకు సుసంస్కృతబంధవిధానమని పేరు.

## మహాబంధము

మూ. హేమ్నా వా రజతేనవా సహచరో ధ్మాతో వ్రజత్యేకతా
మక్షీణో నిబిడో గురుశ్చ గుటికాకారశ్చ దీర్ఘోజ్వలః
చూర్ణత్వం పటువత్ప్రయాతి నిహతో ఘృష్టో న ముంచేన్మలం
నిర్గంధో ద్రవతి క్షణాత్సహి మహాబంధాభిధానో రసః॥

తా. బంగారు లేక వెండితో రసమును జేర్చి కొలిమిలోనుంచి యూదినచో ఏకీభవించి తరుగక నిబిడమై బరువై గుటికాకారమై మిగుల ప్రకాశమానమై మారక వర్గముతో జేర్చి మారణము జేయబడినదై ఉప్పువలె చూర్ణీభూతమై అరగదీసినపుడు మాలిన్యములేక వాసనలేక శీఘ్రముగ ద్రవించునదై యుండు రసము మహాబద్ధరస మనబడును.

ఇట్లే యిరువదియైదు రసబంధములను ఔషధముగ నుపయోగించుట కర్హమై శరీరమున కనేక సిద్ధులను గలిగించునవి యగుటచేత వివరింపబడినవి. ఇరువదియాగవది యగు జలూకాబంధము కేవలము స్త్రీద్రావణమందే ఉపయుక్తమగుటచేతను దేహారోగ్యమునకును రోగనాశనమునకును నిరుపయోగముగనుండునదగుటచేతను టీక వ్రాయక తదాసక్తులగువారల యుపయోగార్థమై చివర మూలము వ్రాయబడినది.

రససంకేతకలిక:—

"పాటః ఖోటో జలౌకాచ భస్మాఖ్యశ్చ చతుర్థకః
బంధశ్చతుర్విధ స్సూతే విజ్ఞేయో భిషగుత్తమైః
పాటః పర్పటికాబంధః పిష్టిబంధస్తు ఖోటకః
జలౌకా పక్వబంధస్స్యాత్ భస్మ భస్మనిభో భవేత్॥"

(పాటబంధము ఖోటబంధము జలౌకాబంధము భస్మబంధము అని రసబంధములు నాల్గు విధములనియు అందు పాటబంధము పర్పటికాకారముగను, ఖోటబంధము పిష్టిరూపముగను, జలౌకాబంధము పక్వముచేయబడినదిగను, భస్మబంధము భస్మరూపముగ నుండుననియును రససంకేతకలికయందు మతాంతర మగపడుచున్నది.)



## పారద భస్మము

మూ. పలాశీ బీజకం రక్తం జంబీరామ్లేనమర్దితం
సజీవం మర్దితం యంత్రే పాచితం మ్రియతేధ్రువం
ఖరమంజరి బీజాన్వితపుష్కరబీజైస్సుచూర్ణితైః కల్కం
కృత్వా సూతం పుటయేద్దృఢమూషాయాం భవేద్భస్మ
కాకోదుంబరికాయా దుగ్ధేన సుభావితో హింగుః
మర్దనపుటనవిధానాత్సూతం భస్మీకరోత్యేవ
దేవదాలీం హరిక్రాంతా మారనాళేన పేషయేత్
తద్రవైస్సప్తధాసూతం కుర్యాన్మర్దితమూర్ఛితం
తత్సూతం ఖర్పరే దద్యాద్దత్వా దత్వాతు తద్రసం
చుల్ల్యోపరి పచేచ్చాహ్ని భస్మస్యాల్లవణోపమం
అపామార్గస్య బీజాని తద్వైరండస్య చూర్ణయేత్
తచ్చూర్ణం పారదే దేయం మూషాయా మధరోత్తరం
రుద్ధ్వా లఘుపుటైః పశ్చాత్ చతుర్భిర్భస్మతాం నయేత్
కటుతుంబ్యుద్భవే కందే గర్భే నారీపయఃప్లుతే
సప్తధా స్వేదితస్సూతో మ్రియతే గోమయాగ్నినా
అంకోలస్య శిఫావారిపిష్టం ఖల్వే విమర్దయేత్
సూతం గంధకసంయుక్తం దినాంతే తం నిరోధయేత్
పుటయేద్భూధరే యంత్రే రాత్ర్యైకేన మృతోభవేత్
వటక్షీరేణ సూతాభ్రౌ మర్దయేత్ప్రహరత్రయం
పాచయేత్తేన కాష్ఠేన భస్మీభవతి తద్రసః
అథాతురో రసాచార్యం సాక్షాద్దేవం మహేశ్వరం
సాధితంచ రసం శంఖదంతవేణ్వాది ధారితం
అర్చయిత్వా యథాశక్తి దేవగోబ్రాహ్మణానపి
పర్ణఖండే ధృతం సూతమద్యాద్దోగ్యానుపానతః॥

తా. ఎఱ్ఱమోదుగగింజలను నిమ్మపండురసముతో నూరి యందు రసమును చేర్చి మరల మర్దించి సంప్రదాయానుసారముగ యంత్రమునందుంచి పాకము జేసినయెడల రసము భస్మమగును.

ఉత్తరేణువిత్తులు, తామరగింజలు వీనిని చూర్ణించి రసమునందు జేర్చి కల్కము చేసి యాకల్కమును దృఢమైన మూసయందుంచి పుటమువైచిన భస్మమగును.

బ్రహ్మమేడిపాలతో ఇంగువను చక్కగా భావనచేసి దానిని రసముతో జేర్చి మర్దించి పుటము వేసిన రసము భస్మమగును.

డావరడంగిని, విష్ణుక్రాంతను ఆరనాళముతో నూరి రసముతీసి యారసముతో యేడుసారులు భావనచేసినచో రసము మూర్ఛనొందును. పిదప మూర్ఛితసూతమును మూకుడులోనుంచి ప్రొయ్యిమీదబెట్టి మంటవేసి డావరడంగి విష్ణుక్రాంతల రసమును కొంచెముకొంచెముగ పోయుచుండినయెడల నాలుగు జాములకు ఉప్పువలె తెల్లగ భస్మమగును.

ఉత్తరేణువిత్తులను ఆముదపువిత్తులను చూర్ణించి యాచూర్ణమును రసమునకు పైన క్రింద పోసి శరావసంపుటమందుంచి లఘుపుటము వేయవలెను. ఇట్లు నాలుగు పుటములు వేసినచో చక్కని భస్మమగును.

చేదుపొట్లదుంపను నలియగొట్టి చనుపాలలోవేసి యాపాలతో యేడుసారులు స్వేదనము చేసినచో రసము భస్మమగును. ఆవుపేడతో చేసిన పిడకలనిప్పును యీ యోగమందుపయోగించవలెను.

రసగంధకములను ఊడుగువేళ్ళ కషాయముతో నొక పగలు (నాలుగు జాములు) మర్దించి శరావసంపుటమందుంచి భూధరపుటమున నొకరాత్రి పాకము చేసినచో భస్మమగును.

రసమును అభ్రకమునుకలిపి మర్రిపాలతో మూడుజాములు మర్దించి శరావసంపుటమందుంచి మర్రికర్రలతో మంటబెట్టినచో రసము భస్మమగును.

రసరత్నాకరము:—రసభస్మపరీక్ష.

"అథ సుతీవ్రాగ్నినా తప్తో హ్యక్షీణస్తిష్ఠతే యదా
తదా భస్మ విజానీయా చ్ఛుల్యాం యామం నిరీక్షయేత్
మూలికా మారితం సూతం సర్వయోగేషు యోజయేత్ ||"

(మూలికలచే సిద్ధపరచబడిన రసభస్మమును ఒక మూకుడులోనుంచి ప్రొయ్యి మీదబెట్టి క్రింద ఊకతో మంటబెట్టవలెను. ఇట్లు జామువరకు మంటబెట్టినను భస్మ మెగిరిపోక క్షీణించకయుండెనేని యది చక్కగ మృతమైనదని తెలియవలెను. ఇది సర్వయోగములందు వాడవచ్చును.)



రససంకేతకలిక:—

"అతేజా అగురు శ్శుద్ధో లోహహా చాచలో రసః
యదా నావర్తతే వహ్నౌ నోర్ధ్వం గచ్ఛేత్తదామృతః||"

(నైగనిగ్యము లేక చులకగను శుభ్రతగను, లోహమారణసమర్థముగను చలనరహితముగను అగ్నియందుంచినచో యెగిరిపోవక నిలచియుండునదిగను ఉండురసభస్మము యోగ్యమైనదిగ నెఱుంగునది.)

మరియు మూర్ఛనాది బంధనాంత సంస్కారములంజేయక మృతముగావింపబడిన సూతము దుర్గుణప్రదమని యీ క్రిందివాక్యములచే తెలియబడుచున్నది.

రసేంద్రమంగళమందు:—

"అబద్ధసూతంతు హతం ప్రమాదాత్
కరోతి కుష్ఠం ప్రబలం రసేంద్రః||"

రసమంజరి:—

"అజీర్ణం చాప్యబీజంచ సూతకం యస్తు ఘాతయేత్
బ్రహ్మహా స దురాచారీ మమద్రోహీ మహేశ్వరి||"

(పూర్వోక్త బంధవిధుల ననుసరించి బద్ధముగావింపబడక మృతముజేయబడిన రసమును ప్రమాదవశమున సేవించినచో ప్రబలమైనకుష్ఠము జనించును.)

అభ్రకసత్వ హేమాదులను జీర్ణింపజేయునట్టియు బీజరహితమైనట్టియు సూతమును యెవడు భస్మముగావించునో వాడు బ్రహ్మహత్యాపాతకుడును దురాచారుడును శివద్రోహియు నగుచున్నాడు.

ఇట్లు పరిశుద్ధముగ తయారుచేయబడిన రసభస్మమును శంఖ, దంత, వేణు (వెదురు) వులచే నిర్మింపబడిన పాత్రములలో భద్రపరచి దేవగోబ్రాహ్మణులను రసాచార్యుండగు పరమేశ్వరుని యథాశక్తిగ బూజించి ఆయారోగముల కనుకూలమగు అనుపానములతో దేశకాలబలరోగానుసారముగ ప్రమాణమునుకల్పించి ఆకునందు భస్మముంచుకొని భక్షించవలెను.

ఆయుర్వేదప్రకాశము:—రసకర్పూరవిధి.

"శుద్ధసూత సమంకుర్యా త్ప్రత్యేకం గైరికం సుధీః
ఇష్టికాం ఖటికాం తద్వత్ స్ఫటికాం సింధుజన్మచ
వల్మీకం క్షారలవణం భాండరంజనమృత్తికాం

సర్వాణ్యేతాని సంచూర్ణ్య వాససా పరిశోధయేత్
ఏభిః చూర్ణైర్యుతం సూతం యావద్యామం విమర్దయేత్
తచ్చూర్ణసహితం సూతం స్థాలీమధ్యే పరిక్షిపేత్
తస్యాస్థాల్యా ముఖే స్థాలీ మపరాంధారయే త్సమాం
సవస్త్రకుట్టిత మృదా ముద్రయే దుభయోర్ముఖం
సంశోష్య ముద్రయే ద్భూయో భూయస్సంశోష్య ముద్రయేత్
సమ్యగ్విశోష్య ముద్రాం తాం స్థాలీం చుల్ల్యాం నిరోధయేత్
అగ్నిం నిరంతరం దద్యా ద్యావద్దినచతుష్టయం
అంగారోపరి తద్యంత్రం రక్షేద్యత్నా దహర్నిశం
శనై రుద్ఘాటయేద్యంత్ర మూర్ధ్వస్థాలీగతం రసం
కర్పూరవత్సువిమలం గృహ్ణీయా ద్గుణవత్తరం
తం దేవకుసుమచందనకస్తూరీకుంకుమైర్యుక్తం
ఖాదన్ హరతి ఫిరంగం వ్యాధిం సోపద్రవం సపది
విందంతి వహ్నిదీప్తిం పుష్టిం వీర్యం బలం విపులం
రమయతి రమణీశతకం రసకర్పూరస్య సేవక స్సతతం||"

(కావిరాయి, ఇటుకరాయి, సుద్ద, పటికి, సైంధవలవణము, పుట్టమన్ను, సురాకాగము, కుమ్మరులు భాండరంజనార్థ ముపయోగించు మన్ను, వీనిని రసకర్పూరము చేయుటకై గ్రహింపబడు పాదరసమునకు ప్రత్యేక ప్రత్యేకముగ సమభాగముగ గ్రహించి చూర్ణించి వస్త్రగాలితముచేసి యాచూర్ణముతో పాదరసము కలిపి ఒక జాము మర్దించి, యాసముదితచూర్ణమును ఒక స్థాలియందుబోసి పైన మరియొక స్థాలిని మూసి ప్రాతగుడ్డలు మొదలగు వానిని చేర్చి మెత్తగా నలియగొట్టబడిన మన్నుతో రెంటికిని సంధిబంధముగావించి యెండించి మరల మన్నుపూసి యెండించి యిట్లు మూడు చీరలుచేసి నాలుగు దినములు ప్రొయ్యిమీద నుంచి వండవలెను. స్వాంగశీతలమైన వెనుక భద్రముగ సంధిని విప్పి పై మూసిన స్థాలియొక్క లోపలిభాగమున నంటియుండు కర్పూరమువంటి స్వచ్ఛమైన రసకర్పూరమును గ్రహించునది.

అనుపానము:—దేవకుసుమము, చందనము, కస్తూరి, కుంకుమపువ్వు మొదలగు వానితో జేర్చి బలానుసారముగ సేవించువెడల సుఖరోగములు కుదురును. అగ్నిదీప్తి, వీర్యవృద్ధి, సంభోగశక్తి, బలము, పుష్టి వృద్ధియగును.

విషూచికి—అనుభూతప్రక్రియ:—రసకర్పూరము, మిరియములు రెండును సమముగ గ్రహించి మర్దించి మాత్రయగుటకు తగినన్ని కరివేపాకులువేసి మెత్తగానూరి కుందుడు



గింజలంత మాత్రలుచేసి యొకమాత్రను పసపుకలిపిన ఆడు పిల్లలమూత్రము అనుపానముగా నిచ్చినయెడల వాంతిభేది లేక కలరా అను విషూచీవ్యాధి తప్పక నివారించును. ఒకరోగికి రెండు మూడు మాత్రలుచాలును. మూత్రబంధ ముపద్రవముగ నుండెనేని కొంచెము శుద్ధిచేసిన సురాకారమును గొర్రెమూత్రములో కలిపి అనుపానము చేయించవలెను. ఇది ప్రత్యక్షఫలప్రదము.

### —♦ పారదభస్మ సేవయందు పథ్యము ♦—

మూ. ఘృతసైంధవ ధాన్యాక జీరకార్ద్రక సంస్కృతం
తండులీయక ధాన్యాక పటోలాలంబుషాదికం
గోధూమజీర్ణశాల్యన్నం గవ్యం క్షీరం ఘృతం దధి
హంసోదకం ముద్గరసః పథ్యవర్గ స్సమాసతః||

తా. నేయి, సైంధవలవణము, ధనియాలు, జీలకర్ర, అల్లము, అనువానిచే సంస్కరింపబడిన (పోగుపులేక తాలింపు వేయబడిన), చిర్రి, ధనియాలు, పొట్లకాయ, పొట్లాకు, పొట్లపండు, బోడతరము మొదలగు కూరలు, గోధుమలు పాతవరిధాన్యము వీనియన్నము ఆవుపాలు, ఆవునెయ్యి, ఆవుపెరుగు, హంసోదకము (అనగా చెట్లు, మేఘములు మొదలగు వాని యావరణము లేకయుండు తటాకము మొదలగు వానియందు పగలు సూర్యకిరణములచే తప్తములై రాత్రులందు చంద్రకిరణములచే జల్లబడి అగస్త్యనక్షత్రముదయించుటచేత సాలెపురుగులు మొదలగువానిసంపర్కముచే కలిగిన విషముచే విడువబడి కలకబారక పరిశుద్ధమై యుండు జలమునకు హంసోదక మనిపేరు. "హంసోదక మితిఖ్యాతం శారదం విమలం జలం" అను చరకవాక్యమననుసరించి శరత్కాలము (ఆశ్వయుజ కార్తిక మాసములు) నందు పైలక్షణములుగల యుదకమునకు మాత్రమే హంసోదకమను పేరు చెల్లును గాని తదితర ఋతువులందలి యుదకమునకు హంసోదక సంజ్ఞలేదని యెరుంగునది:

"తప్తం తప్తాంశు కిరణైః శీతం శీతాంశురశ్మిభిః
సమన్తా దప్యహోరాత్ర మగస్త్యోదయనిర్విషం
శుచి హంసోదకం నామ నిర్మలం మలజిజ్జలం"

అను వాక్యము పైవ్యాఖ్యకుప్రమాణము.) ఏసరకట్టు అను నీవస్తువులు సంగ్రహముగ రససేవయందు పథ్యములుగ నుండును.

## —♦ రసభస్మ సేవయందు అపథ్యము ♦—

మూ. బృహతీబిల్వకూష్మాండం వేత్రాగ్రం కారవేల్లకం
మాషం మసూరం నిష్పావం కుళుత్థం సర్షపం తిలం
లఘనోద్వర్తనస్నాన తామ్రచూడ సురాసవాన్
అనూపమాంసం ధాన్యామ్లం భోజనం కదళీదళే
కాంస్యేచ గురువిష్టంభి తీక్ష్ణోష్ణంచ భృశం త్యజేత్॥
కంటారీ ఫలకాంజికంచ కమఠస్తైలం తథా రాజికాం
నింబూకం కతకం కళింగకఫలం కూష్మాండకం కర్కటీ
కేకీ కుక్కుట కారవేల్లకఫలం కర్కోటికాయాః ఫలం
వృంతాకంచ కపిత్థకం ఖలు గణః ప్రోక్తః కకారాదికః॥
దేవీశాస్త్రోదిత స్సోయం కకారాది గణోమతః
శాస్త్రాంతరవినిర్దిష్టః కథ్యతేన్యప్రకారతః॥
కంగుః కందుకకోల కుక్కుట కలకోడాః కుళుత్థా స్తథా
కంటారీ కటుతైల కృష్ణగళకః కూర్మః కలాయః కణా
కర్కారుంచ కటిల్లకంచ కతకం కర్కోటకం కర్కటీ
కాలీకాంజిక మేషకాదికగణః శ్రీకృష్ణదేవోదితః॥
యస్మిన్ రసేచ కంఠోక్త్యా కకారాదిర్నిషేధితః
తత్ర తత్ర నిషేద్ధవ్యం తదౌచిత్య మతోన్యతః॥

తా॥ నేలములక, మారేడు, గుమ్మడికాయ, పేపబెత్తపుచిగురు (వెదురు మొలకలని కొందరందురు), కాకర, మినుములు, పిల్లిపెసలు, అనుములు, ఉలవలు, నువ్వులు, ఆవాలు, లంఘనము, ఉద్వర్తనము (నలుగు పెట్టుట), స్నానము, కోడిమాంసము, సురాసవములు, అనూపమాంసము (జలమందు తిరుగు పిట్టలున్నగు వాని మాంసము), ధాన్యామ్లము, అరటియాకునందు భోజనము, కాంస్య (కంచు) పాత్రయందు భోజనము, గురువైనట్టియు, మలబద్ధకరమైనట్టియు, తీక్ష్ణమైనట్టియు, ఉష్ణమైనట్టియు పదార్థములు వీనిని త్యజించవలెను.

కకారాదిగణము:—వాకుడుపండు, కాంజికము, తాబేలు, నువ్వులనూనె, ఆవాలు, గజనిమ్మపండు, చిల్లగింజ, కొండికపండు, గుమ్మడికాయ, యెండ్రకాయ, నెమలిమాంసము, కోడిమాంసము, కాకిరకాయ, దోసకాయ, వెలగకాయ, ఇది కకారాదిగణము, ఇది దేవీశాస్త్రోక్తమైనది. దీనినికూడ వర్జించవలెను.



కకారాదిగణము:—కొర్రలు, చిట్టిరేగుపండ్లు, రేగు, కోడి, పంది, ఉలవలు వాకుడు, అవనూనె, ఊరపిచ్చుక, తాబేలు, బోడసెనగలు, పిప్పళ్ళు, గుమ్మడుకాయ, కాకర, చిల్లగింజ, దోసకాయ, యెండ్రకాయ (పీత), బచ్చలి, కాంజికము ఇది శ్రీకృష్ణదేవుడుచెప్పిన కకారాదిగణము.

ఏరోగమందు కకారాదిగణము కంఠోక్తిగ నిషేధమని వ్రాయబడునో అచ్చట తప్పక వర్జించవలెను. తక్కినరోగములందు అనుకూలముగా నుండునట్లు శరీరఆరోగ్యమునకు భంగముకలుగు వస్తువుల నాహారప్రకారము నిషేధించునది.

ఆయుర్వేదప్రకాశమందు:—"కూష్మాండం కర్కటీ కోలం కళింగం కరమర్దకం కరీరంచేతి షట్కాదీన్ వర్జయే ద్రససేవకః॥" అని మరియొక కకారాదిగణము చెప్పబడెను.

## —♦ పారదవికారహం దుపాయములు. ♦—

మూ. ఉద్గారేసతి దధ్యన్నం కృష్ణమీనం సజీరకం
అభ్యంగమనిలక్షోభే తైలై ర్నారాయణాదిభిః
అరతౌ శీతతోయేన మస్తకోపరి సేచనం
తృష్ణాయాం నారికేళాంబుముద్గయూషం సశర్కరం
ద్రాక్షాదాడిమ ఖర్జూర కదలీనాం ఫలం భజేత్
రసవీర్య వివృద్ధ్యర్థం దధిక్షీ రేక్షుశర్కరాః
శీతోపచార మన్యచ్చ రసత్యాగవిధౌ పునః
భక్షయే ద్బృహతీం బిల్వం సకృత్సాధారణోవిధిః॥

ఇతి శ్రీవాగ్భటాచార్యవిరచితే రసరత్నసముచ్చయే ఏకాదశోధ్యాయః

తా. పారదభస్మమును సేవించునపుడు అపథ్యాచారవిహారములచే గలిగిన వికారములకు సంగ్రహముగ నివారణోపాయములు చెప్పబడుచున్నది.

వాంతులుగలిగినయెడల పెరుగుకలిపినయన్నము, జీలకర్రకలిపిన నల్లచేపలమాంసము, వాతబాధగలిగినచో నారాయణతైలము మొదలగు తైలములచే నభ్యంగనము చేసికొనుటమంచిది. అరతియందు చన్నీళ్ళతో శిరసును తడపవలెను. దప్పికల్గిన కొబ్బరినీళ్ళలో గాని పెసరకట్టులోగాని పంచదారకలిపి త్రాగవలెను. మరియు ద్రాక్ష, ఖర్జూరము, దానిమ్మ, అరటి వీనిపండ్లను భుజింపవలెను. రససేవచేయునపుడు రసవీర్యవృద్ధినిమిత్తమై పెరుగు, పాలు, చెరుకురసము, పంచదార మున్నగువానిని భుజించుచు శీతోప

చారములను పొందుచుండవలెను. రససేవచేసి మానినపిదప నొకసారి నేలమునకపండు, మారేడుపండ్లు అనువానిని భుజించవలెను. ఇది సాధారణముగ రససేవయందు వికారమునకు ప్రతిక్రియ.

వైద్యచింతామణి:—

"ధాత్రీకుమారీ సర్పాక్షీ కూష్మాండం భృంగరాజకం
కాకమాచీ మేఘనాదౌ రంభాకందం సజీరకం
కార్పాసంచామృతాచైవ జంబుకా బింబతండులం
నవనీతే సమం లేప్యం చందనే రసతాపనుత్
జంబూత్వక్ త్రిఫలా బింబకుమారీచ సమం పిబేత్
రసతాపం మహాఘోరం నాశయేచ్చ సుఖీభవేత్
కుమారీ రససంయుక్తం జీరకం తండులీయకం
కార్పాసబీజకంచైవ నవనీతేన లేపయేత్
చందనేన సమంకృత్వా ప్యాలేపో రసతాపనుత్"

ఉశిరిగపప్పు, కలబంద, సర్పాక్షి, బూడిదగుమ్మడుకాయ, గుంటగలగర, కామంచి, చిర్రివేరు, అరటిదుంప, జీలకర్ర, పైడిప్రత్తియాకు, తిప్పతీగ, నేరేడుచెక్క, దొండాకు, వాయువిడంగాలు వీనిరసములను తీసి అందు సమముగ వెన్నను, మంచిగంధమును కలిపి శరీరమునకు పూసినయెడల రససేవయందు గల్గిన తాపము నివర్తించును.

నేరేడుచెక్క, త్రిఫలములు, దొండాకు, కలబంద వీనిని సమాంశముగ రసము తీసి పుచ్చుకొనినచో రసజనితతాపము నివర్తించును.

జీలకర్ర, చిర్రి, ప్రత్తిగింజలపప్పు, వెన్న, మంచిగంధము వీనిని సమముగ కలబంద రసముతో మర్దించి శరీరమునకు పూసినచో రసతాపము నివర్తించును. మరియు,

"రసజనితవిదాహే శీతతోయావగాహః
మలయజఘనసారైర్లేపనం మందవాతాః
తరుణదధిచ తక్రం నారికేళీఫలాంబు
శిశిర మధురసాన్నైర్వా శీతమన్నం ప్రశస్తం॥"

శీతోదకస్నానము, శ్రీగంధము, కర్పూరము, కలిపి శరీరమున లేపనము చేయుట, చల్లగాలిలో తిరుగుట తీయని పెరుగు మజ్జిగలను, కొబ్బరినీళ్ళను త్రాగుట, శీతలరసములు, మధురరసములు, చల్లారినయన్నము వీనిని తినుట యివి రసతాపమందు పథ్యముగ నుండును.



ఆయుర్వేదప్రకాశము:—అపరిశుద్ధ రసభస్మసేవోపద్రవశాంతి:

"యద్యజ్ఞానాత్కథమపి నాగాదికళంకితో రసోభుక్తః
తత్సాన్త్వనాయ విజ్ఞః పిబేచ్ఛిఫాం కారవేల్లభవాం॥"

(ప్రమాదవశమున నాగవంగాదిదోషసహితరసభస్మమును భక్షించినచో నా దోషము శమించుటకై కాకరవేరురసమును పానము జేయవలెను.)

రసభస్మమును సేవించువానికి జేయదగిన పూర్వక్రియలు రసతంత్రములందు వ్రాయబడినవి. అందావశ్యకమైనవాని నీక్రింద వ్రాయుదుము.

ఆయుర్వేదప్రకాశము:—పంచకర్మలు.

"పాచనం స్నేహనం స్వేదం వమనం రేచనం తథా। ఏతాని పంచకర్మాణి..."

(పాచనము, స్నేహము. స్వేదము, వమనము, విరేచనము అనునివి పంచకర్మలు)

"పంచకర్మ పురాకృత్వా పశ్చాత్సకలదేహినాం। యోజనీయో రసోదివ్య శ్శీఘ్రం సిద్ధిమవాప్నుయాత్॥ పంచకర్మభయాత్రస్తైస్సుకుమారైర్నరైరిహ। రేచనాంతే। ఇదం సేవ్యం సర్వదోషాపనుత్తయే॥ నవజ్వరేతిసారేచ గర్భిణ్యాం బాలవృద్ధయోః నకుర్యాత్పంచకర్మాణి......"

(పైజెప్పిన పంచకర్మలను ముందుగాచేసికొని పిదప రసభస్మసేవన మారంభించినచో శీఘ్రముగ ఆరోగ్యము కలుగును. పంచకర్మలను చేసికొనుటకు భయపడువారికి విరేచనశోధనముచేసి పిదప భస్మము నుపయోగించవలెను. నవజ్వరితునకును అతిసారరోగికిని గర్భిణీస్త్రీలకును బాలురకును వృద్ధులకును పంచకర్మల జేయంజనదు.

శ్రీమత్కృష్ణాగోదావరీమధ్యవిద్యోతమాన శ్రీమన్నూజవీణ్ణగరిపరిభువరశ్రీమదుయ్యూరు, మేడూరు, నిడదవోలు ప్రముఖసంస్థానాధీశ్వర ఆంధ్రకవితాధురంధర పండితకవిపోషక శ్రీ శ్రీ రాజా వెంకటాద్య్రప్పారాయప్రభుపుంగవాస్థాన
పండిత భారద్వాజసగోత్రపవిత్ర వేంకటసుబ్బావధాని సత్పుత్ర
సకలపండితకవి సద్వైద్యవిధేయ సత్యనారాయణశాస్త్రి
నామధేయాంధ్రీకృత రసరత్నసముచ్చయమునందు
ఏకాదశాధ్యాయము సమాప్తము.
శ్రీశారదాంబార్పణమస్తు.
సర్వము సంపూర్ణము.

# తప్పొప్పుల పట్టిక

| తప్పు. | ఒప్పు. | పు. | పం. |
|---|---|---|---|
| నూతాన్ | నూతాత్ | 5 | 20 |
| వ్మలానాధానా | న్మలాధానా | 9 | 22 |
| మృత్ప | మృత్యు | 11 | 23 |
| వారణా | వారిణా | 18 | 23 |
| కాందకము | కాంజికము | 23 | 5 |
| యందుశుద్ధ | యందును, గోమూత్రమందును శుద్ధ | 26 | 19 |
| మిర్యాలు | విడంగాలు | 27 | 23 |
| అనుపానముతో గుంజా | అనుపానముతో ఉదయము గుంజా | 27 | 27 |
| ల్లగను | పుల్లగను | 28 | 23 |
| పాకమును మది | పాకమును, లఘుగుణమును మది | 28 | 25 |
| వాలుకాయంత్రమున క్రమాగ్నులతో వండి స్వాంగశీతలమున దీసి | (అను వాక్యమును విడువవలెను) | 33 | 10 |
| నట్టి హిమవత్పర్వతపు | నట్టి | 34 | 1 |
| త్వద్గద | త్వగ్గద | 34 | 21 |
| పుటితంకా | పుటితం హ | 35 | 8 |
| నిమ్మపండ్లరసము | మాదీఫలరసము | 35 | 13 |
| పుటములు | పిడకలతో పుటము | 35 | 14 |
| వైక్రాంతభస్మము | కాంతవైక్రాంతభస్మములు | 35 | 22 |
| సంభవం | సన్నిభం | 36 | 4 |
| శాంతం | వాంతం | 36 | 20 |
| వేసి | వేసి యేడుసారులు | 39 | 24 |
| లోక | లోహ | 41 | 6 |
| హరితాళము | రాళ | 42 | 20 |
| దర్ప | దద్రు | 48 | 2 |
| గంధాశ్మపథ్యై | గంధాశ్మనాపథ్యై | 48 | 25 |
| అందు | అందు రెండు | 51 | 23 |
| క్షయ తప్పక | తప్పక | 51 | 27 |
| శరీరవృద్ధి | శరావ | 53 | 24 |
| నుండు | నుండునను | 56 | 20 |
| వీనిని సమభాగములుగా | దీనికి సమముతేనె | 58 | 13 |
| జామూలు | సారులు | 58 | 14 |

| తప్పు. | ఒప్పు. | పుట. | పం. |
|---|---|---|---|
| పదియేడు | పదియేను | 58 | 15 |
| మీద | మీద పేడముద్దను పెట్టి క్రమాగ్నులతో నొకజాముపండి | 60 | 23 |
| తాళకపత్రి | తాళకద్రుతి | 61 | 17 |
| స్థావం | స్థాలీం | 63 | 7 |
| వృద్ధి | అగ్నినివృద్ధి | 63 | 12 |
| వెడలును | వెడలును. రెండుబొగ్గులు చాలును. | 65 | 4 |
| కారిగను, | కారిగను ఉండును | 66 | 8 |
| మూకుడు వేసి | మూకుడులో వేసి | 72 | 12 |
| జాపితం | తాపితం | 74 | 20 |
| మాణిక్యము | మాణిక్యము మంచిది. | 82 | 3 |
| కార్ణశి | కాష్ణ్యే | 91 | 6 |
| మూసలోనుంచి చీరజేసి పుటము వేసిన | 7 దినము లమ్లవర్గమున స్వేదనము చేసిన | 95 | 20 |
| పుష్టి | పుష్పి | 96 | 5 |
| బులం | బలం | 100 | 22 |
| స్వర్ణముతో | కరిగిన స్వర్ణములో | 101 | 4 |
| రసభస్మమును | రసమునుపోసి చూర్ణించి యాచూర్ణమును | 101 | 4 |
| లైనట్లు యుండునని | లైనట్లు | 101 | 23 |
| నేతితో | నేతితోను, త్రికటుకలతోను | 101 | 25 |
| రొముకలు | రొముకలు, వస, | 102 | 6 |
| భవేత్ | భవే | 103 | 22 |
| క్రమముగ చల్లార్చిన | క్రమముగా నేడేసిసార్లు చల్లార్చిన | 103 | 28 |
| నందు | నందు 21 సారులు | 123 | 12 |

దేవదాళీరసమందు 7 దినములు గంధకమును భావనచేసి దానిని లోహము కరుగుచుండగా ప్రతీవాపము చేసినచో లోహము ద్రవించును.

పైవాక్యమును 123 పేజీ 17 పంక్తి చివర జేర్చికొనవలె.

| తప్పు. | ఒప్పు. | పుట. | పం. |
|---|---|---|---|
| కలిగించు న | కలిగించు నని | 126 | 4 |
| అభ్రకభస్మము | అభ్రకసత్త్వభస్మము | 132 | 22 |
| దినము | నిమ్మపండ్లరసముతో నొకదినము | 137 | 4 |
| (276 తులములు) | (256 తులములు) | 137 | 16 |
| గింజలను, | గింజలనుగాని, కాకిదొండగింజలనుగాని | 139 | 25 |
| రసాంకుశాయ | రసాంకుశాయై | 145 | 19 |



| తప్పు. | ఒప్పు. | పుట. | పం. |
|---|---|---|---|
| నుచ్చరించవలెను | అర్చించవలెను | 149 | 26 |
| అసడుగు | అడుగున స | 203 | 6 |
| సత్త్వము | ధాతము | 208 | 11 |
| మేక | మేక, గొర్రె | 220 | 23 |
| నాగరం | నారంగం | 221 | 13 |
| గుమ్మడుకాయ | నేలగుమ్మడు | 231 | 14 |
| ఊడుగురేగ | ఊడుగు, రేగు | 244 | 27 |
| కపాక | కపాలేవా | 246 | 5 |
| కూప్యాలేవా | కూప్యా | 246 | 5 |
| మిరియాలు | మిరియాలు, పటికి | 246 | 19 |
| తగిరిసచెట్టు | తగిరిసచెట్టు, తిప్పదుంప | 248 | 28 |
| పాచితీగ, | పాచితీగ, నేలతాడి, | 249 | 1 |
| క్రియం | క్రియా | 251 | 21 |
| ఛాయ | ఛాయా | 256 | 22 |
| మూషాయం | మూసాయాం | 261 | 5 |
| సుభాసతో | సుభావితో | 261 | 6 |
| దిష్టంభి | విష్టంభి | 266 | 6 |
| దోసకాయ | దోసకాయ, వంకాయ | 266 | 28 |
| శ్లీత | శీత | 268 | 22 |

END OF
TITLE